భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

సెప్టెంబరు 1964

సంపుటము 41 : : సంచిక 9

విడిప్రతి వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1964

కారికలు

శ్రీ సి. నారాయణరెడ్డి

జీవిత సంగ్రామంలో చితికిన భూమికలు
చిగుళ్లు తొడుక్కోవాలి.

మధ్యలో పుటుక్కుని తెగిపడ్డ ఆశలకు
మళ్లీ రెక్కలు మొలవాలి.

వరుసతప్పిన తాగుబోతు ఆలాపనల్లో
సరిగమ లేరుకోవాలి.

పొరపాటున తావుదప్పిన అక్షరాలకు
పునరావాసం కావాలి.

పంజరాలకు అంజలిపట్టే రోజులు
సంకెళ్లకు సలాము చేసే రోజులు
పాతగోరీల్లాంటి రాతియుగాలకు
వైతాళికత్వం జరిపే రివాజులు
క్రీనీడల్లా మాసిపోయినవని
కెరటంలా విరుచుకపడి చెప్పాలి.

గడచిన 'క్రీస్తుపూర్వం' గదికి
విడిపోని తాళం వేయాలి.

నడుస్తున్న గాంధీశకానికి
పడుతున్న తాళం తీయాలి.

పల్చని అంగీలో దాగివున్న పచ్చని వ్రణాలను
పదుగురికి చూపేముందు
ప్రతిమనిషీ తనలోకి తొంగి చూసుకోవాలి.

భారతి

పడ్డపాట్లూ పొరపడ్డచోట్లూ
పదిలంగా నెమరువేసుకోవాలి.

విషాదాల కషాయం తాగితాగి
ఆనందంలాంటి ఆరోగ్యం పెంచుకోవాలి.

మల్లెలా జీవించే మహాయోగం లేకున్నా
ముల్లులా బతకడం పోవాలి.

పల్లానికి జారేనీరులా ప్రవహించే నెత్తురు పాయ
పతనాని కోమార్గమైనా ఎదురు ఉరకాలి.

చప్పుడు లేకుండా చప్పగా మోగే గుండెకాయ
అప్పుడప్పుడు డప్పులా డమరువులా పలకాలి.

గొంగళీ పురుగులా ప్రాకడం మానేసి
కురంగంలా దూకడం నేర్వాలి.

ద్వేషంలాంటి చీకటిని కాల్చేసి
దివ్వెటీలా చూడడం నేర్చాలి.

‘ఎత్తైన నింగి నల్లనిది; లోతైన నీరధి నల్లనిది
ఎదుట వున్న హృదయం తెల్లనిది’
ఈ సత్యం నిత్యం చదువుకోవాలి.
ఎవని నీడను వాడే ఎదుర్కోవాలి

కిటికీ రెక్కల సందుల్లో నలిగి
కీచుమంటున్న బుడతగాలి;
దారికడ్డమైన కొండరాళ్లకు
తలబాదుకుంటున్న తరంగాళి;
చెక్కిటి బురదను కడిగేయలేక
చిక్కిపోతున్న శీతాంశుమౌళి;
కర్మను నిందించడం మానుకోవాలి
కర్తవ్యం ముప్పురిగా పేనుకోవాలి.
సన్నని ఆశల పల్లవి పల్లవించాలి
నున్నని పాటల దళాలు పరిమళించాలి.

నవ్యాంధ్ర సాహిత్యంలో దృక్పథాలు : 2

వేయిపడగలు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

'వేయి పడగలు' నవల చదవటం ఒక అపూర్వమైన అనుభవం. మరపురానిది. ఆందులో ఎంత సంతృప్తి ఉన్నదో అంత అసంతృప్తి కూడా ఉన్నది. ఆ అనుభవ స్వరూపం ఎలాంటిది? అందంగా విశాలంగా కనిపించే దేవాలయం. అందులో ప్రవేశించగానే దాని నిర్మాణ పథకం మనల్ని ఆకట్టుతోంది. నాలుగడుగులు ముందుకువేసి నడుస్తూవుంటే రెండు వైపులా వైవిధ్యంతో బహు ఆకర్షణీయంగా కనిపించే శిల్పాలు. ఒక్కొక్కటి దగ్గరగా నిదానించి చూస్తే ఆశౌభంగానికి కారణమౌతున్నాయి: మందిర వైశాల్యము మనస్సుకు కలిగించవలసిన నైర్మల్య భావమూ, ప్రశాంతి మాధుర్యమూ కలుగకపోగా ఏమిటో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. నడచినంత మేర ఒక వ్యక్తి మనల్ని వెంబడిస్తూ ఉండటం గుర్తిస్తాము. "ఈ ఆలయంలో పూజారిని నేను. ఇది నాది. ఇది నా పూర్వీకుల ఆస్తి. దీన్ని ఎవరూ పంచుకోటానికి వీల్లేదు. శిథిలమౌతోందా? కాలమహిమ! పునర్నిర్మించటానికీ బాగు చెయ్యటానికి ఎవరికీ అర్హతలేదు. హక్కులేదు. ఆ అర్హతగల వాళ్లెప్పుడో మరణించారు." అంటూ గొణుగుతున్నా డా వ్యక్తి. కుపితుడూ, అనాశ్వాసిత దుఃఖపూరితుడూ అయిన ఆ బ్రాహ్మణునితో దైవ దర్శనార్థం గర్భ గుడి దాకా వెళ్లితే అక్కడ దీపంలేదు. పూజ లేదు. "అదిగో స్వామి! కనిపించటం లేదా మీకు? విశ్వాసంలేని మీ కెలా కనిపిస్తాడులే! ఎందుకు వచ్చినట్లు? వెళ్లండి. వెళ్లండి". అంటూ తరుముతాడు ఆ వ్యక్తి. మనం వచ్చేస్తూంటే "అంతా నశించింది. ఏమి మిగిలింది?" అంటూ వాపోతాడు. ఆలయం వెలుపలికివచ్చి చివరిసారిగా వెనక్కి తిరిగిచూస్తే అంతపెద్ద ఆలయమూ, అందులో ఆ విచిత్రవ్యక్తి అతనిప్రక్కన ఒక చిన్న అమ్మాయీ పొడగట్టుతారు!.....ఈ అనుభవం మనస్సుకు నిండు దనాన్నీ హాయినీ యివ్వకపోయినా మనం దాన్ని ఎప్పుడూ మరచిపోలేము. మళ్లీ మళ్లీ జ్ఞాపకం వస్తూనే ఉంటుంది. దానితోపాటు ఎన్నో ఊహలు. ఆ ఆలయం పునరుద్ధరించి ఉంటే! ఆ విచిత్ర వ్యక్తి శాంతుడూ, గంభీరుడూ, మృదు వచస్కుడూ అయి మనతో హృదయం విప్పి మాట్లాడిఉంటే, ఆ గర్భ గుడిలో దీపం వెలిగించి హారతి యిచ్చిఉంటే.....పఠనానుభవంలో లోపించిన వాటిని గూర్చి యిలా ఎన్నో ఆకాంక్షలు! అవీ ఆ అనుభవంయొక్క వైశిష్ట్యాన్నే నిరూపిస్తాయి.

".....వాఙ్మయ మనగా నేమి? మతమును, సంఘమును, నాచారమును, మనోహరముగా జెప్పునదియే వాఙ్మయము. సంఘమతాచారములు తజ్జాతియొక్క యాంతర జీవితమును, దద్భావములును నాచరణకు వచ్చిన స్వరూపము. ఈ సంఘమతాచారములను నీవు కాదనుటకుముందా మహర్షుల సిద్ధాంతములను దర్క రీతిగా నిరాకరించవలయును. ఆ సంగతి యట్లుంచి యిప్పుడు వాఙ్మయ మనగా నేమి? సంఘ మతాచారముల మనోహరమైన శబ్ద మయ ప్రకటనము. ఇంతియేకాక, శీల పోషణము, ఒకా నొక ప్రత్యేక వ్యక్తియొక్క ప్రత్యేక మానసిక పరిణామము, కావ్యము పాఠకునికి హృదయ రంజకముగా నుండుటకు గవి చేయు కొన్ని చమత్కారములు నివియు వాఙ్మయమునందు స్థితి కల్గవియే.....కావ్యాత్మయే కాక కావ్య శరీరము కూడ కావ్య స్వరూపము గూడ నీజాతి సిద్ధాంతముల మీద నాధారపడియుండును........." (వే. ప. 17 ఆ.) 'వేయి పడగలు' వ్రాయుటలో విశ్వనాథ వారి ఆదర్శమేదో పై వాక్యములు స్పష్టం చేస్తున్నాయి. ఆ నవల చదవటంలో కలిగే అనుభూతి స్వరూపాన్ని పై ఆదర్శం దృష్ట్యా వివక్షించటమే సహృదయుడైన పాఠకుడు చేయదగింది.

విశ్వనాథ 'మనోహరముగా జెప్ప బూనుకొన్నది' హిందూ సంఘ మతాచారములు, తజ్జాతియొక్క ఆంతర జీవితము

తద్భావముల ఆచరణము' అనేది నిర్వివాదాంశము. పోతే కావ్య శరీరము, కావ్యాత్మ, 'వేయి పడగలు'లో ఏవిధంగా అనుసంధింపబడినవో పరిశీలించవలసిన విషయం—మొదట కావ్యాత్మను గూర్చి జిజ్ఞాస.

నవలలో హిందూ వ్యవస్థా ధర్మమునకు ప్రతీక వేయి పడగల పాము! సుబ్రహ్మణ్యేశ్వరుడు. కాని వ్యవస్థా ధర్మమునకు అతీతమైనదీ, మౌలికమైనదీ—సనాతన ధర్మము. దానికి ప్రతీక శివలింగము. రచయిత ఈ రెండింటి విభేదాన్ని కథా ప్రారంభంలో మరచి పోలేదు. "జమీందారు కట్టించిన ఆలయము సుబ్రహ్మణ్యేశ్వరునిదా? నాగేశ్వరస్వామిదా? బ్రాహ్మణుడు సుబ్రహ్మణ్యేశ్వరునకు చిన్న ఆలయము కట్టించెను. కాశినుండి గొప్ప మహత్తుకల శివలింగము తెచ్చి నాగేశ్వర స్వామి యన్న పేరుతో దానికి ప్రతిష్ఠ చేసెను. ఈ దేవాలయములో నొక మూల నీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయమున్నది. ...." కాని అటు తర్వాత పుటలో యిలా ఉంది. "ఈ మూడు వందల ఏండ్లలో వేయి పడగలతో భాసించిన నాగేశ్వరస్వామి సుబ్బన్నపేటమీద తన సహస్ర ఫణామండలి ఛత్రముగా జాచి యా చల్లని నీడలో నా యూరి ప్రజల జోకొట్టెను". ఇది మొదలు కథలో వ్యవస్థా ధర్మానికీ, సనాతన ధర్మానికీ అభేదమే పాటింపబడింది. ఇది కేవలం జన సామాన్యం దృష్ట్యా జరిగిందని రచయిత అక్కడక్కడ చెప్పటంకాదు. ఈ రెండింటికీ అభేదమే అన్న ధీమాతో దృక్పథంతో రచయితే వ్యవహరించారు. 'ఏకవీర' లో గల తాత్త్వికమైన స్పష్టతకూ 'వేయి పడగల'లోని అస్పష్టతకూ ఎంత దవ్వు! అనిపిస్తుంది.

ధర్మానికి ప్రతినిధి ధర్మారావు. ఏ ధర్మానికి? వ్యక్తి ధర్మానికా? వ్యవస్థా ధర్మానికా? సనాతన ధర్మానికా? ధర్మారావు ఏక వీర వలె సాధకుడుగా కనిపించడు. అతనికి సందేహాలూ, సంఘర్షణలూ రావు. కాని సనాతన ధర్మాన్ని (పూర్వ జన్మ సుకృతం వల్ల కాబోలు) దర్శించిన జ్ఞాని అని రచయిత అభిప్రాయం. అతను వ్యవస్థా ధర్మానికి సాధికార వ్యాఖ్యాత, లోక వ్యవహారానికి సాక్షీభూతుడు, అని రచయిత ఉద్దేశం. అతనిది ఆ జన్మ సిద్ధమైన జ్ఞాన మార్గం. భక్తిమార్గంలో గిరికకూ, కర్మమార్గంలో హరప్పకూ గురువట. కాని రచయిత ఉద్దేశాలు నవలలో ఎంతవరకు నెరవేరాయో పరీక్షిస్తే తెలుస్తుంది. లోక వ్యవహారానికి కేవలం సాక్షీభూతుడు అయేందుకు నిర్లిప్తత ధర్మారావు మనస్తత్వంలో లేదు. దాన్ని సాధించే పరిస్థితులూ అతని జీవితంలో లేవు. అతనిలో వ్యక్తమయ్యేది లోక విమర్శ తప్ప ఆత్మ విమర్శకాదు. పైగా స్వోత్కర్ష కావలసినంత. నవలలో చిత్రింపబడిన అతని ఇరవై ఏళ్ల జీవిత చరిత్రలో వ్యక్తిగతంగా 'జ్ఞాన మార్గం'లో అతను పొందిన పరిణామం ఏమిటో అదేమీ చెప్పబడలేదు. హిందూ వ్యవస్థా ధర్మానికి వ్యాఖ్యాతా, సొంతదారూ అనుకోవటంతో దానితో తాదాత్మ్యత చెందిన అతని అహంకారము గోరంతలు కొండంతలుగా ప్రస్ఫుటమైంది.

సనాతన ధర్మము, వ్యవస్థా ధర్మము, వ్యక్తిధర్మము ఒకటికావు, వేర్వేరు. ఈ విభేదాన్ని స్పష్టంగా లక్షిస్తూ, ఆ మూడింటి మధ్యా గల సంబంధాన్ని నిరూపించే తాత్త్విక దృష్టిని వస్తు విన్యాసంలో రచయిత పాటించక పోవడం వల్ల నవల కావ్యాత్మ సనాతన ధర్మ నిరూపణముకాదు అని తెలుస్తున్నది.

అయితే 'వేయి పడగలు' నవల కావ్యాత్మ వ్యవస్థా ధర్మ నిరూపణమా? నవలలో ఆ వ్యవస్థ స్వరూపం ఎలా వ్యక్తమైంది? "భూమ్యాకాశముల మధ్య, స్వర్గ మర్త్య లోకముల మధ్య, ప్రత్యక్షా ప్రత్యక్షముల మధ్య నొక స్థిరమైన సంబంధ మేర్పడెను.........పైని భగవంతుడు, క్రింద రాజును బ్రాహ్మణుడును, ఈ రెండు మహా సంస్థలకు మధ్య గణాచారి త్రెంచరాని లంకె". భగవంతుడు కూడ ఒక 'సంస్థ' గానే పేర్కొనబడుట గమనింపదగినది......" "ఇది నాల్గు స్తంభముల ధర్మ మంటపము: స్వామి, జమీందారు, బ్రాహ్మణుడు, గణాచారి—వీరు నల్గురు స్తంభములు." (వే. ప. 1 ఆ) "ఒక ధర్మముమీద వేయి సంస్థలు వెలసినట్లు స్వామి ఏక శరీరముపై సహస్ర శిరస్సులు ప్రకాశించెను........ధర్మము తదాచరణ ప్రచారములు మూడును నొక్కటిగా నైయభేద తాదాత్మ్యము పొందునటులు స్వామియు, ప్రభువును, ధర్మారావును, నేక దేశగతులై ప్రకాశించిరి......" (వే. ప. 2 ఆ.) రాజు ధర్మాచరణకూ, బ్రాహ్మణుడు ధర్మ ప్రచారమునకూ ఉద్దేశింపబడినట్లు చెప్పుట గమనింపదగినది. ధర్మారావు తండ్రి రామేశ్వరశాస్త్రి. "......వర్ణాశ్రమ ధర్మము లన్నియు ముద్ద కట్టిన మూర్తి. ఆయన భారతదేశము యొక్క యాత్మ. ఆయన త్రయీ విద్య కొక వ్యాఖ్యానము." (వే. ప. 3 ఆ.) పసరిక పైరుపచ్చ. దేవదాసి. శృంగార యుతమైన భక్తి మార్గము. హరప్ప వైదిక కర్మానుష్ఠానము. గోపన్న సేవావృత్తి. ఇట్లు వ్యవస్థయొక్క అవయవ విభాగము. ఈ వ్యవస్థకు కేంద్రంలో ధర్మారావు పాత్ర. ఇదీ పథకం.

వ్యవస్థ అంటే ఏమిటి? సంఘ మతాచారములు' వ్యవస్థా ధర్మము వాని నిర్దిష్టమైన ఆదర్శ స్వరూపము.....

వేయిపడగలు

"వేయి పడగల పాము విప్పారుకొనివచ్చి కాటందుకొన్నది కలలోన రాజును" అంటూ గణాచారి (కాలము) సూచిస్తూండగా ప్రారంభమౌతుంది నవల. రాజు అనగా ధర్మాచరణ. ధర్మాచరణలో జరిగిన లోపం ఏమిటి? అన్ని ప్రశ్నిస్తే నవలలో ఆసందర్భంలో అందుకు ఉదాహృతమైన విషయం—కృష్ణమనాయుడు రామేశ్వరశాస్త్రి మాసికముపట్ల నిర్లక్ష్యము వహించుట, ధర్మారావు వెళ్లి అడగ్గా చివరకు ఆరు రూపాయలు ఇవ్వబడుట, ధర్మారావు ఋణగ్రస్థుడైన సంగతి గోపన్న చెప్పగా విన్న తర్వాతకాని రాజు సాహాయ్యము చేయక పోవుట. తర్వాత ధర్మారావును జమీందారు ఆదరించినా తప్పు తప్పే! ఈవిధంగా ధర్మాచరణలో లోపము జరిగినది. రాజును పాము కాటందుకొన్నది. అని ధ్వని. ఇందులో ధర్మాచరణ యొక్క సమ్యక్ స్వరూపము మనకు ఏమి తెలిసినట్లు! అలాగే రామేశ్వరశాస్త్రి 'వర్ణాశ్రమ ధర్మములు ముద్దకట్టిన మూర్తి, భారతదేశముయొక్క ఆత్మ. త్రయీ ధర్మ విద్య కొక వ్యాఖ్యానము' అను మాటలకు సమర్థన ఎటువంటిది? రామేశ్వరశాస్త్రి అందగాడు. రసికుడు, దేశము నాలుగు మూలలా తిరిగి వచ్చినవాడు. నాలుగు వర్ణాల ఆడబడుచుల్ని పెండ్లాడి ఒక భోగాంగనను చేరదీసిన ఆయన భోగి కాని యోగి కాడు. ఆయన వితరణ బుద్ధి హద్దులేనిది. ఆయన జమీందారు తర్వాత జమీందారు. ఆయన పాటించిన నాలుగు ఆశ్రమ ధర్మములు ఏమిటి? గృహస్థుగానే మరణించాడే! ఏవిధంగా చూచినా రామేశ్వరశాస్త్రి ఒక విశిష్ట వ్యక్తియేకాని 'బ్రాహ్మణుడు' అన్న ఆదర్శానికి పూర్తి నిరూపణకాదు. ఆయన చేసుకున్న వర్ణాంతర వివాహాలు, వర్ణ ధర్మాన్ని సమర్థించేవి కావు. అందుకు భిన్నమే! వర్ణాంతర వివాహాలు నేటి వర్ణ విభేద సమస్యకు పరిష్కారం సూచిస్తున్నాయంటారా మన్వ ధర్మశాస్త్రం ఆధారంగా? ఆ పరిష్కారం ఎంతమందికి నచ్చుతుంది. దాని యొక్క యధార్థ స్వరూప మెటువంటిది? అని ప్రశ్న రావటమేకాదు, వ్యవస్థ నిరూపణ 'ఆదర్శం' నుంచీ 'యాథార్థ్యం'లోకి దిగి వస్తుంది. పోతే ధర్మారావు కూడా 'బ్రాహ్మణత్వం' అన్న ఆదర్శానికి ఎటువంటి సమర్థన? బ్రాహ్మణత్వం అంటే కేవలం 'ధర్మ ప్రచారమే'నా? ఈ విధంగా తర్కిస్తే నవలలో వ్యవస్థా ధర్మ నిరూపణము అసంతృప్తినే కలిగిస్తోంది. అంటే 'ఆకృతి' (Form) కి తగిన 'పుష్టి' (Substance) జరుగలేదు అనిపిస్తుంది.

నవలలో రచయిత సమర్థించబూనుకున్న వ్యవస్థకు ఉనికిలేదు. రామేశ్వరశాస్త్రి వర్ణాశ్రమ ధర్మములు ముద కట్టిన మూర్తి కాకపోయినా ఉత్తముడైన మానవుడే. ధర్మారావు ఇంగ్లీషు చదువుకున్నా సంప్రదాయ మెరిగినవాడు. కాని వీరెంతవరకు సమకాలీన బ్రాహ్మణ్యమునకు ప్రతినిధులు? బ్రాహ్మణ్యము సామాన్యముగా సంఘంలో ఏ స్థితిలో ఉన్నది? అందుకు సమాధానం అరుంధతి పుట్టింటివారి సంస్కారమూ ప్రవర్తనా! "దేశములో బ్రాహ్మణేతరోద్యమమునకు నీ బ్రాహ్మణుల దుర్వృత్తియే సగము హేతువు. ధర్మశాస్త్రము పోవునది యొక మార్గమున, ఈ బ్రాహ్మణులు పోవునది మరి యొక మార్గమున. వీరియందు దయాతితిక్షాదులు లేనేలేవు. బైబిలులో చెప్పినట్లు వీరు 'మేమను'—అనగా ధనాధిదేవత—వానిని బూజింతురు......... పెట్టినచో పెండ్లి పెట్టకున్న శ్రాద్ధము. ఇది ఈ బ్రాహ్మణ బ్రువుల నడత. ఏబది యేండ్లు వచ్చి పెండ్లి చేసుకొనువారు, స్త్రీలయందును దమయందును గల దుర్నీతి గోప్యముగా దాచుకొనువారు—తమయందు బ్రాహ్మణ గుణములేదు.........బ్రాహ్మణజాతి యంతయు నశించి పోయినది" (వే. ప. 17 ఆ.) అని ధర్మారావు వారి స్థితిని గూర్చి అంటాడు. ఇక్కడ వేయవలసిన ప్రశ్న రామేశ్వరశాస్త్రి, ధర్మారావు దేనికి ప్రతినిధులు? అని. వారిలోని మానవత్వానికీ దాని విశిష్టతకూ ప్రతినిధులే తప్ప సమాజంలో బ్రాహ్మణ వర్గానికి వారు ఏ విధంగానూ ప్రతినిధులు కారు. అలాగే దేవదాసి వ్యవస్థకూ ఆ వర్గం మనుష్యులకూ రత్నగిరి, గిరికా ఏ విధంగానూ ప్రతినిధులు కారు.[1] వారిలో ప్రకాశితమౌతున్నది వ్యక్తిగతమైన విశిష్టతే! ఇటువంటి వ్యక్తుల ద్వారా సమకాలీన సమాజంలోని వర్ణ విభేదాలను, వర్గీకరణను సమంజసమని సమర్థించటం ఎట్లా? నవలలో ధర్మారావు ద్వారా జరిగే వ్యాఖ్యానానికి, సమర్థనకూ ఈ దోషం సర్వత్ర ఉంది. అందువల్ల నవలలో వాచ్యముగా జరిగినంతమేర వ్యవస్థ నిరూపణము యాథార్థ్యం దృష్ట్యా జరుగలేదు అని చెప్పాలి.

సామాన్యంగా ఒక కాలంలో ఆచరణ లోపించినంత మాత్రాన ఆదర్శం అనేది శాశ్వతంగా విస్మృతింపబడదు.

---

1. "భోగమువాండ్రు వేఱు, వారాంగనలు వేఱు. భోగము వాండ్రు భగవంతుని సన్నిధానమున నృత్యగానములు చేయుటకేర్పడినవారు. వారాంగనలు వారిలో గులము చెడినవారు ... ప్రపంచమున కామక్రోధాదులు బలిసి దేవునికై ప్రత్యేకింపబడిన యీ స్త్రీలు దుర్వృత్తిలోనికి దిగిరి. ధనవంతులు వారిని దించిరి." (వే. ప. 6 ఆ) ఇది ధర్మారావు వ్యాఖ్యానము. ఈ వాఖ్యానము దృష్ట్యా రత్నగిరిని రామేశ్వరశాస్త్రి చేరదీయుటను గూర్చి ఏమనుకోవలెను? రత్నగిరి కులము చెడినదా? రామేశ్వరశాస్త్రి కాపాడిన వర్ణాశ్రమ ధర్మ మిదేనా? వీరు వ్యవస్థకు ఎటువంటి ప్రతినిధులు?

కాలంతో పరిస్థితులతో ప్రమేయం లేకుండా మళ్లీ మళ్లీ ఏ వ్యక్తిలోనో ఎక్కడో ప్రత్యక్షం కావచ్చు. జమీందారు రంగారావులోని విశ్వాసం అతని కొడుకు హరప్పలో కనిపించింది కాదా! దీనికి కాలనిర్ణయమేమీ లేదు. కాని 'వేయి పడగలు' నవల నడచిన తీరు ఈ నమ్మకాన్ని అర్థాన్ని స్ఫురింపజేయటం లేదు. 'గత కాలము మేలు వచ్చు కాలముకంటెన్, అన్నట్లుగా ఆచరణ పోవటంతో ఆదర్శం శాశ్వతంగా పోయింది' మళ్లీ రాదు అనే గాఢమైన స్ఫూర్తినే కలిగిస్తోంది. పడగలు నశించినవి. స్వామి వెళ్లి పోయినాడు. 'ఇంకనేమి మిగిలినది?' ఇది ప్రళయం అంటున్నది.

ఏతావాతా తేలేదేమిటంటే: హిందూ వ్యవస్థయొక్క ఆదర్శాన్నీ దాని పటుత్వాన్ని నిరూపించే ఉద్దేశమే 'వేయి పడగల' కావ్యాత్మ అనటానికి, పాత్ర చిత్రణమూ, కథాగమనమూ దాని స్ఫూర్తి అందుకు భిన్నంగా ఉన్నాయి. మారుతున్న పరిస్థితుల్లోకూడా హిందూ ధర్మం సృజనాత్మకమైన శక్తే అని నిరూపణ చేసే ఉద్దేశమే నవలకు ఉన్నట్లయితే ధర్మారావు సృష్టి మరోక విధంగా జరిగి ఉండును—అతను పాత కొత్తలకు మేలు కలయికగా, సంగమస్థానంగాఉండియుండును. (ఉదాహరణకు 'మాలపల్లి' నవలలో సంగదాసు లేక రామదాసు పాత్రలన్న చూడవచ్చును.) కాదు ధర్మారావు కర్మయోగి కాడు, జ్ఞానయోగి అంటేనూ ధర్మారావులో కొత్త పద్ధతులమీదా కొత్త జీవిత విధానాలమీదా అంత ద్వేషభావం దేనికి? అది జిజ్ఞాసువు లక్షణం కాదు. ధర్మారావు సిద్ధాంతంరీత్యా ప్రతిపాదించిన కొత్త మార్గంలో సమన్వయ పథం ఏమీ లేదు. అతనికి కొత్త ఒక రోత, పాత ఒక నీతి!

'వేయి పడగలు' నవల ధర్మారావు జీవిత చరిత్ర. అది అతనిమనస్థితికీ, ఆ మన స్థితికి కారణములైన సాంఘిక పరిస్థితులుకూ దర్పణం. నవల కావ్యాత్మ ధర్మారావు వ్యక్తిత్వమే! ఈ దృష్టిలో నవలను ఉపలక్షిస్తే తప్ప మనకు నవల స్వరూపం అవగాహన కాదు, దానిలోని గుణం అందదు. సనాతన ధర్మం గాని, హిందూ వ్యవస్థా ధర్మంగాని 'వేయి పడగల' కావ్యాత్మ అనుకోవటం వల్ల పై విమర్శ బయలుదేరుతున్నది, నిజానికి కావ్యంలో ఆ రెండు గౌణమే అని చెప్పాలి. ధర్మారావు వ్యక్తిత్వమే కావ్యాత్మ అని మిగతా విషయాలన్ని దానికి సంబంధించినవేననీ అంగీకరింపక తప్పదు. (అతని అభిప్రాయాలు మనకు నచ్చటం నచ్చక పోవటం అనేది వేరువిషయం) ఇలా దృష్టి మార్చుకుని చూస్తే చప్పున బోధపడుతుంది హిందూ వ్యవస్థ, సనాతన ధర్మం—వీటి నిరూపణముకలిగిస్తున్న అసంతృప్తికి ముఖ్య కారణం ఏమిటో? అవి ధర్మారావు అనే వ్యక్తి మనస్తత్వం ద్వారా మనకు దృశ్యమౌతున్నాయి. ఆ మనస్తత్త్వంలోని వక్రత, సంకుచితత్వము, వాటిలోనూ దృశ్యమాన మౌతున్నాయి. కావ్యం ధర్మారావు అదే వ్యక్తిత్వాన్ని మనస్తత్వాన్ని ప్రతిపాదిస్తున్నది. ఇందులో విప్రతిపత్తి ఏమీ లేదు.

"వేయి పడగలు" గొప్పదనం అది ఏక పాత్ర చిత్రణం కావటం. ఆ చిత్రణం వేయి పుటలదాకా విస్తరించినా, వేయి పుటలూ తప్పక చదివిస్తాయి. అందులో ధర్మారావు వ్యక్తిత్వం స్పృశించని, వ్యాఖ్యానించని అంశంలేదు. ధర్మారావు గురుత్వం వహించని, సలహా యివ్వని, అతనితో సంబంధంలేని పాత్రలేదు. ఏ విధంగానైనా ధర్మారావుకు సమఉజ్జీయో, అధికుడో అయ్యే పాత్ర కనిపిస్తే, అతనికి నవలలో చరిత్రలేదు. ఉదాహరణ రామచంద్రరాజు, కేశవరావు, శివరావు పాత్రలు. ధర్మారావు వాదంలో ఓడించని ప్రతి ద్వంద్వి లేనేలేడు! (తన గొప్పదనం గుర్తించని వారిమీద [2]రౌడీలను పురికొల్పేందుకైనా వెనుదీయడు. తెలుగుల జీవితాన్ని కూలంకషంగా స్పృశిస్తూ, దాన్ని ఒక ప్రత్యేక దృక్పథంనుంచీ వ్యాఖ్యానిస్తూ వచ్చే ధర్మారావు నిస్సందేహంగా మేధావి, కవి. అతని తాదాత్మ్యం ఆదర్శంతోకాదు. వర్తమానంతోకాదు, భూతకాలంతో. దాని ప్రభావం అస్తమిత సూర్యబింబంలా అతనిలో కోపారుణ కాంతుల్ని విరజిమ్ముతూ, చివరకు దుఃఖంలో చీకట్లో అంతరిస్తుంది. వెంటనే చంద్రోదయం, ఆ చంద్రుణ్ణి దర్శించటంతో కథ ముగుస్తుంది. వ్యక్తిగా ధర్మారావును మనం ప్రేమించలేకపోవచ్చు. అతని అభిప్రాయాలను అంగీకరించకపోవచ్చు. అతని అహంభావము మనకు ఎబ్బెట్టుగా వుండవచ్చు. అతనియుక్తులూ, సమయానుకూల ప్రవర్తనా, దాపరికాలు ఆదర్శప్రాయం కాకపోవచ్చు. కాని ధర్మారావు రాగ ద్వేషాలూ, రక్తమాంసాలూ, కష్ట సుఖాలూ కలిగిన మనిషి. అచ్చమైన తెలుగువాడు. వ్యవస్థా ధర్మానికీ, యోగ మార్గానికీ ప్రతినిధిగా తృప్తి కలిగించకపోయినా, తెలుగుదనం ముద్ద కట్టిన మూర్తి ధర్మారావు. అతని మనస్సు

---

2. వే. ప. 19 వ అధ్యాయంలో ధర్మారావు సారంగధర నాటకము జూడబోవును. పెద్దగా నాటకమును విమర్శించుచుండగా ప్రక్కనున్న మనిషి ఒకరు అభ్యంతరము తెలుపుతాడు: 'గోల ఏమిటని'. ధర్మారావు వెంకటేశం అనే రౌడీని, అతనిమీదికి పురికొల్పుతాడు. ఈ సంఘటన గమనించదగింది ధర్మారావు ధర్మదృష్టి ఎటువంటిదో తెలుసుకోవటానికి. ధర్మదృష్టి ఎలా ఉన్నా, ధర్మారావు 'తెలుగుదనం' నిరూపణ అవుతున్నది.

ద్వారా మారుతూ వచ్చిన తెలుగు దేశాన్నీ, గతించిన వ్యవస్థనూ దర్శించే అవకాశం 'వేయి పడగలు' కల్పిస్తోంది.

నవలలో తెలుగుదేశమంటే సుబ్బన్నపేట: సుబ్బన్నపేట అంటే ధర్మారావు. ఇది కావ్య శరీరం. ధర్మారావు, పాత్ర సమర్థించినది క్రమంగా అదృశ్యమౌతున్న గ్రామీణమైన తెలుగుదనాన్ని. ఆంగ్ల భాషా, పాశ్చాత్య నాగరకతా సోకని తెలుగుదనం నిలబడలేదనే అతని ఆవేదన. అందులో లోటుపాట్లు అతనికి కనిపించవు. అదంతా హిందూ ధర్మ స్వరూపమేనన్న భ్రమా దాని సమర్థనకోసం తను అహం భావం పెంచుకున్నా ఫరవాలేదనుకోవటం తరచు భావానికంటే అహంభావమే అతనిలో ముందుకు వచ్చే పరిస్థితి కల్పిస్తోంది.3 అయినప్పటికీ పాశ్చాత్య నాగరకతా ప్రభావం ముప్పై ఏళ్లలో ఏ విధంగా తెలుగువారి జీవన విధానంలో ఒడిదుడుకులకు, అవక తవకలకు, హేతువైందో విపులంగా విమర్శనా దృష్టితో వర్ణింపబడటం కావ్యాన్ని అపురూపవస్తువైనదిగా చేస్తోంది. అలా చేస్తే 'వేయిపడగలు' ఒక చిన్న సైజు 'విజ్ఞాన సర్వస్వం' అనిపిస్తుంది. నాగరకతా చిహ్నాలు:—రైలు మార్గం ఏర్పాటు కావడం, మునిసిపాలిటీ, జాతీయ కళాశాల, క్రైస్తవుల కాలేజి, సినిమా, తాలూకాబోర్డు, నాటక సమాజాలు, నిర్బంధ ప్రాథమిక విద్య, కొళాయిలు, ఎలెక్ట్రిసిటీ, మహిళా సమాజం, పత్రికలు. కొత్త మతాలు, కేషబ్జీమతం, దివ్యజ్ఞాన సమాజం, విడి ప్రేమ, ఆర్థిక వ్యవస్థలో మార్పులు:—మెరక పొలాలు మాగాణి కావటం, పొగాకు ఫ్యాక్టరీ ఏర్పడటం, డబ్బు చలామణీ, వీటి అన్నింటిమీద ధర్మారావు వ్యాఖ్యానం వినవచ్చు. అన్నింటికీ ధర్మారావు ప్రతికూలుడే. దివ్య జ్ఞాన సమాజం అతణ్ణి ఆకర్షిస్తుంది. కాని దానికి పాశ్చాత్యులైన లెడ్‌బీటరు, బెసెంటు అధినేతలు కావటం, శివరావు తను కృష్ణావతారం అని చెప్పుకోవటం, ధర్మారావుకు నచ్చని విషయాలు. ధర్మారావు శారదా చట్టానికీ, వితంతు వివాహాలకూ, హరిజనుల ఆలయ ప్రవేశానికీ కూడా వ్యతిరేకి. ఆంగ్ల సారస్వతం చదువుకున్నా, దానిపై అతనికి ద్వేషమేనట. ఇంగ్లీషు నవలలు చదివి "తెలుగు వాని కన్న నవి చాల బాగున్నవని యతడూహించెను. స్కాటు, డికెన్సు, థాకరీ.......చదివి వారే పరమోత్తములని యూహించుచుండెను........షెల్లీ, కీట్సు, కవిత్వము, చదువును. కాని వారి శయ్యా పాకాదులెట్టివో బుద్ధి కందుటలేదు". కాని యిది తనలో అనుకోవటమే! వాదించటంలో సంకోచము లేకుండా షేక్స్‌పియర్ మొదలు అందరి కవులమీదా తీర్పు లిస్తాడు. ధర్మారావు శ్రీనాథుని సీస పద్యాలమీద వెలిబుచ్చిన అభిప్రాయాన్ని వివరింతుటానికి నిరాకరిస్తాడు. తెలుగు కావ్యాలమీదా, హిందూస్థానీ సంగీతంమీదా, నృత్య నాట్యాలమీదా ధర్మారావుకు అభిప్రాయాలున్నాయి.

ఇక్కడ గుర్తించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే వ్యక్తి వ్యాఖ్యానాలూ, అభిప్రాయాలూ ఒక ఎత్తు, అతని ప్రవర్తన మరొక ఎత్తు అని4. కీలకమైన పరిస్థితుల్లో వ్యక్తి ప్రవర్తన ఆ వ్యక్తి ఎటువంటివాడో తెలిపినట్లు, మిగతా విషయా లేవీ తెలియజెయ్యవు. ధర్మారావు జమీందారీ వ్యవస్థపై మమకారం వదిలించుకోలేని వ్యక్తి. ఇది సహజమే అతని పరిస్థితుల్నిబట్టి. కాని అతని మనో వైఖరి ఎటువంటిదో చూడండి : జమీందారు కృష్ణమనాయుడు ధర్మారావు తండ్రి కర్మకు డబ్బు యిచ్చినా, మాసికం విషయం మాట్లాడడు. ఎదురుచూచి చివరకు విధిలేక ధర్మారావు కోటలోనికి వెళ్తాడు. అతణ్ణి చూచి నాయడు "పనియేమిటి?" అని యడిగెను. ధర్మారావు "రేపు నాయనగారి మాసికము" అనెను. నాయడు డబ్బిప్పించెను.......దీనినిగూర్చి ధర్మారావు తర్వాత ఊహించునది : "ఆయనయే యిచ్చెను. నేను యాచించలేదు. మాసికమునకు యాచించితినా? లేదు. పోయి యూరకే చెప్పితిని. ఆయనయే యిచ్చెను." భంగపడిన అహంభావానికి సమర్థన చెప్పుకో చూస్తాడు ధర్మారావు. అతనిలో స్వాభిమానము మెండు. దానికి బాధాకరమైన సత్యాన్ని దర్శించే చొరవ, సాహసం అతనిలోలేదు. ఆ పరిస్థితిలో యుక్తులతో, ఆలోచనతో సత్య స్వరూపాన్ని భిన్నంగా తనకు అనుకూలంగా దర్శించే ప్రయత్నం చేస్తాడు. అందువల్లే అతని ప్రవర్తన కూడా సమయానుకూలంగా ఉంటుంది. కార్యమునాడు నవరసు భార్య కొంగున కట్టలేదు. అత్తవారు, బంధువులు ప్రశ్నించగా 'నిజమే కట్టితి'నని బుకాయిస్తాడు. అత డబద్ధమాడడని అందరి నమ్మకమట! ఆ నమ్మకాన్ని అలా ఉపయోగించుకుంటాడు. ధర్మము, భగవంతుడు ధర్మా

---

3. Those who love their sects more than truth end by loving themselves more than their sects.

—S. Radhakrishnan : The Hindu View of life.

4. After all, what counts is not creed but conduct.... Religion is not correct belief but righteous living.

—S. Radhakrishnan : The Hindu View of life.

రావు నాశ్రయించినవారేగాని, ధర్మారావు వాని నాశ్రయించి నట్లు తోచదు. "ఆ ప్రభువు దీన దయాపరుడు. ఒక కాలు విరిగి కూడ నింకను నన్నే పట్టుకు వ్రేలాడుచున్నాడు..... ఎప్పుడు నా కిదివరకు గనిపించలేదు. ఇదే మొదటిసారి. ఆయన నా మనసులోనే యుండెను. వేరే కనిపించుట ఎందులకు?" అంటాడు భార్యతో. ఆమె ప్రశ్నిస్తుంది : "మా నాన్నయు, నమ్మయు, మామగారి నప్పు డప్పుడేమైన నను చుందురు. వారి కెప్పుడును (పాము) కనబడలేదేమి?" దీనికి వ్యవస్థా ధర్మ వ్యాఖ్యాతయైన ధర్మారావు సమాధానము : "మన పిల్లవాండ్రు తప్పు చేసిననే మనము కోపపడుదుము. కొట్టి బుద్ధి చెప్పెదము. ఎదుటివారి పిల్లలు తప్పు చేసినచో మనము కొట్టుదుమా? కొట్టినచో వారి తలి దండ్రులతో తగాదాకాదా?" ఈ పాము హిందూ వ్యవస్థ స్వరూపము కాదు, కేవలం ధర్మారావు కుటుంబానికి చెందినది, ప్రత్యేకము (Private) అని తెలియుటంలేదా? అరుంధతి నవ్వువల్ల భంగపడిన వంశ గౌరవాన్ని, స్వాభిమానాన్ని పాము ద్వారా ధర్మారావు నిలబెట్టుకోగలిగాడు! ఈవిధంగా పాము ఉపయోగం కథలో ధర్మారావుకు ఎంతోఉంది!

ధర్మారావు యింగ్లీషును ద్వేషించినా, దాన్ని నేర్చుకోవటం, బి. ఏ చదవటం మానలేదు. అతను చదివే కళాశాలలో రెండు సందర్భాలలో సమ్మె జరుగుతుంది. మొదటిసారి ఉపాధ్యాయుడు తిట్టినందుకు. ఇక్కడ ఉపాధ్యాయునికి ప్రిన్సిపాలు మద్దతులేదు. ధర్మారావు సమ్మెలో చేరుతాడు. విద్యార్థులు గెలుస్తారు. రెండోసారి హిందూ మతాన్ని అవమానిస్తూ క్రైస్తవ విద్యార్థులు ప్రవర్తించినందుకు, హిందువులైన విద్యార్థులు సమ్మె చేస్తారు. ప్రిన్సిపాలు జరిమానా వేస్తాడు. సమ్మె కొనసాగించాలా? వద్దా? అనే ప్రశ్న వస్తుంది. ధర్మారావు సమ్మెలో చేరడు. "జరిమానాలిచ్చి కళాశాలలకు నడుపుడు........ఎదిరించి నీవేమైన జేయుగలవా?" అంటూ కర్తవ్యం ఉపదేశిస్తాడు. ఇక్కడ ధర్మరక్షణకంటె ఆత్మ రక్షణ ప్రధానమైనది! ధర్మారావునక్కు హిందూధర్మముతో తాదాత్మ్యము అది తనకుపయోగపడు నంతవరకే. దానికి తను ఉపయోగపడవలసి వచ్చినప్పుడు వాగ్వాదము, వ్యాఖ్యానము కావలసినంత! ఇక్కడ అసలు విషయం, జమీ లేకపోయినా ధర్మారావు జమీందారుబిడ్డ. కష్టముల నెదుర్కోవటంకంటె వాటిని తప్పించుకోవటమే అతని స్వభావం!

ధర్మారావు కవి, భావుకుడు. అతని పద్యాలేవీ ఉదాహరింప బడకపోయినా అతని భావనా శక్తి, ఆలోచనా శక్తి వ్యాఖ్యానములో సమర్థనలో వ్యక్తమవుతూనే ఉంటుంది ఆ భావనా శక్తివల్లే అతనికి తను జ్ఞానయోగిననే భ్రమ. ధర్మావతార మెత్తిన భగవచ్ఛక్తిననే గర్వము. అతను గిరికతో అంటాడు : "నాదారి (జ్ఞానం) తేలిక, నీదారి (భక్తి) కష్టము. నిజానికి యోగమార్గంలో ఏ దారి కష్టం దానిదే. వ్యక్తి స్వభావాన్నిబట్టి దారి. ధర్మారావుకు తను కష్టపడి సాధించదగినదేమీ మిగిలినట్లే తోచదు! ధర్మార్థ కామమోక్షములను పురుషార్థాలలో ధర్మారావు యిటు అర్థంకోసం కాని అటు మోక్షం కోసంకాని ప్రయత్నం చెయ్యడు. తను ధర్మావతారము. పెళ్ళి చిన్నతనంలోనే జరగటంవల్ల కామానికి యిబ్బంది లేదు. ఇక సాధించవలసినదేమి? లోకానికి గురువు కావటం. అందువల్లే నవలలో చాల భాగం ధర్మారావు సుబ్బన్నపేట వీధిలో నడుస్తూ, వెంట హరప్ప, గిరిక, గణాచారి, కుమారస్వామి, కిరీటి, ఎవరితోనో ఒకరితో కనిపిస్తూ దేవాలయానికి వెళ్ళి వస్తూ ఉంటాడు. స్వామికి ఉత్సవాలు జరిపించటం తప్ప అతను చేసిందేమీలేదు. కుమారస్వామికి వివాహం కావటానికి చేసిన సాహాయ్యము అది సగము ప్రత్యర్థులపై సమరోత్సాహమే. పోతే ధనికురాలైన 'పతిత' మంగమ్మను గూర్చి కుతూహలం కూడా ఒక కారణం.

ధర్మారావు చరిత్రలో అర్థంకాని విషయం అతని భార్య ఆరోగ్యంపట్ల చూపిన అశ్రద్ధ. పదేళ్ల ముందుగా ఈ 'జ్ఞానికి' గణాచారి 'హెచ్చరిక' యిచ్చినా ఆ విషయమై ధర్మారావు పట్టించుకోడు. ఇది నవలలో 'కర్మ' సిద్ధాంతానికి వ్యాఖ్యానముకాదు గదా! ధర్మారావు దారిద్ర్యము అతని అశ్రద్ధకు కారణం అనుకోవచ్చు. కాని కొన్ని సందర్భాల్లో ధర్మారావు చూపిన నిర్లక్ష్యము సమర్థనీయంగా తోచదు భార్యకు స్వస్థత చెడిన కాలంలోనే ధర్మారావు యింటికి ఆల స్యంగా రావటం జరుగుతూ ఉంటుంది....ధర్మారావు మంగమ్మతో నలుగురి ఎదుట మాట్లాడడు. కాని మంగమ్మ చివరకు కుమారస్వామితో 'రహస్యము' చెబుతుంది : "ప్రతిదిన మర్థ రాత్రమున నేను ధర్మారావుగారి శిష్యురాలను మూడవ కంటికి దెలియదు." (వే. ప. 24 ఆ.) ధర్మారావు ప్రవర్తనలో ఈ భాగము ఎలా అర్థం చేసుకోవాలి?

పై పరామర్శ ధర్మారావు వ్యక్తిత్వంయొక్క స్వరూపం ఏమిటో క్లుప్తంగా ప్రవర్తననుబట్టి తెలుపుతోంది. ధర్మారావు ఆదర్శ మానవుడు కాకపోవచ్చు. కాని అతని వ్యక్తిత్వమూ అస్తిత్వమూ, సిద్ధాంతాలనూ, అభిప్రాయాలనూ అధిగమించిన సత్యం అని నవలలో బుజువౌతున్నది. ధర్మారావు ధర్మ దృష్టికి స్పష్టత లేకపోతేనేం? అతని మూర్తి మన కన్నుల యెదుట స్పష్టంగానే ఉంది. కావ్యానికిది చాలు.

వేయి పడగలు

ధర్మారావుతోబాటు విశ్వనాథ సృష్టించిన పాత్రలు చాలవరకు సజీవమైనవి. హరప్ప, గిరిక పాత్రలకంటె అరుంధతి, రామేశ్వరం, మంగమ్మ, కుమారస్వామి ఎక్కువ నిండుదనం గలిగిన పాత్రలు. హరప్ప గిరికలు సిద్ధాంతాల దృష్ట్యే తీర్చి దిద్దబడటంవల్లే బొమ్మల్లా ఉన్నారు. పసరిక విశ్వనాథవారి ప్రత్యేక సృష్టి. మెచ్చుకోదగింది. షేక్స్పియర్ 'టెంపెస్ట్' నాటకంలో చేసిన ప్రత్యేక సృష్టి 'కాలిబన్'ను జ్ఞాపకం తెస్తుంది. 'ఏకవీర' లో గుర్రపు వాళ్లపిల్ల అమృతాన్ని ప్రవేశ పెట్టినట్లు మంగమ్మతో 'వాలి'ని ప్రవేశ పెట్టడం, దాని ద్వారా మంగమ్మ 'మనస్సు'ను అభివ్యక్తం చేస్తూ ధ్వని పూర్వకంగా కవి చేసిన రచన నవలలో ఉత్తమమైనది. చెంగల్రావు పాత్రలోని విశిష్టతా, అతణ్ణి తృతీయాప్రకృతి అంటూ ధనికురాలైన స్త్రీ వ్యవహార దక్షత సంపాదించటంతో ఆమెలో తోచే పురుషత్వాన్ని గూర్చి వ్యాఖ్యానించిన తీరూ, అందుకు తగినట్లే చెంగల్రావు చేతిలో మంగమ్మ మరణం, విశ్వనాథవారి ప్రతిభకూ, ఔచిత్య పోషణకూ తార్కాణం. నవలలో ఋతువులూ, వెన్నెలా, ఎండా, రాత్రీ, పగలూ వర్ణింపబడిన తీరును గూర్చి ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు. మనిషికీ ప్రకృతికీ రాను రాను నాగరకతవల్ల ఎంతటి దూరం ఏర్పడుతోందో పసరిక మరణం వల్లేకాదు, వర్ణనల వల్ల కూడా నాగరకతా వ్యామోహితమైన పాఠకుని మనస్సుకు తట్టుతున్నది.

''వేయి పడగలు' కాల్పనికోద్యమ కాలంలో వెలువడిన ఆత్మాశ్రయ కవిత్వ **(Subjective Poetry)** శాఖలో ఒక అపురూపమైన కావ్యం. దాని వైశిష్ట్యం అది వేయి పుటల నవలగా రూపొందటమే. తెలుగు దేశంలో శిథిలమై అదృశ్యమౌతున్న పూర్వ నాగరకత చివరి మెరుగుల్ని చూచిన విశ్వనాథ హృదయం సంక్షోభించి వెలువడిన సుదీర్ఘ నిశ్శ్వాసమే 'వేయి పడగలు'. ఆ నిశ్శ్వాసంలో తోక త్రొక్కిన త్రాచు కస్సు మనటమూ, ఆశ వదలుకొన్న ప్రేమికుడి నిర్వేదమూ అనుభూతమౌతున్నవి. కావ్యంలో ఎంత నిస్పృహ ఉన్నా, కావ్యాంతంలో 'ఒక మహానంద రేఖ' కాదుగాని ఒక ఆశా రేఖ ఉండనే ఉన్నది. కాని అది సమాజానికి సంబంధించినది కాదు. వైయక్తికమైన దన్న విషయం గుర్తించాలి. 'వేయి పడగలు' నవలకు ఆలంబనము ఒక తాత్త్వక దృక్పథముకాదు. ఒక వైయక్తిక హృదయోద్వేగము. కాని ఎటువంటి హృదయోద్వేగము! దాని లయ, సంగీతము మహా సముద్రానివి, మృత్యు ఝంఝం ప్రసరిస్తున్న మహా సముద్రానివి! రామేశ్వరశాస్త్రి, కృష్ణమనాయుడు, రంగాజమ్మ, రుక్మిణమ్మారావు, సరోజినీదేవి పూర్వ యుగపువారు : వారి మృతి తర్వాత గుండేరు వరద—దేవదాసి, గోపన్న, అరుంధతి, హరప్ప, పసరిక, గణాచారి కొత్త యుగములో పాత యుగపు చివరి మెరుపులు : వారి మృతి తర్వాత గుండేరు వరద—మిగిలినది ధర్మారావు, చిన్న అరుంధతి. మొదటి వరద నాటికి రంగారావు పాశ్చాత్య యువతిని భార్యగా దెచ్చుటతో వచ్చిన కొత్త పోకడలు క్రమంగా ప్రబలమై రెండవ వరద నాటికి క్షీణించి తగ్గుముఖము పట్టినవి. రెండు గుండేరు వరదలూ విభజన బిందువులుగా ఆది మధ్యాంతాలు విస్పష్టమౌతున్న కథలో ఆదిలో పెద్ద అరుంధతి కార్యము, అంతములో చిన్న అరుంధతి కార్యము· కాలము మొదలూతుదా అలా ధర్మారావులో సమీకరించినవి· ధర్మారావు ఆదిమధ్యాంతాలలో మార్పు లేని 'పురుషుడు. అరుంధతి 'ప్రకృతి'. మార్పు ప్రకృతి లక్షణము.5 పెద్ద అరుంధతి పునరావృత్తి చిన్న అరుంధతి. ఇది 'వేయి పడగలు' గా వెలువడ్డ విశ్వనాథవారి హృదయోద్వేగ తరంగరేఖ.6 ఇదే కావ్య స్వరూపం.

తులనాత్మక విమర్శ దృష్ట్యా ధర్మారావు పాత్రకు సాటి రవీంద్రుని గోరా. ''అయ్యా! ఒక్క వ్యక్తికే మర్యాదోల్లం

---

5. ''నేను మంచమున మృత్యు దేవతకు సన్నిహితురాలనై యున్నాను. అనార్తవమైన పుష్పమువలె నిత్య వికాసము చెడని మీ రిచట నున్నారు. ఎన్నటి కైన ప్రకృతి చెడునుగాని, పురుషుడు చెడడుకదా!'' (వే. ప. 32 అ) అరుంధతి మరణశయ్యపై ధర్మారావుతో అను మాటలు.

6. "Rhythm, for the Hindu, is the essence of life itself. There is the rhythm of the seasons, so markedly overpovering in most of India. There is the rhythm of reincarnation with recurring birth and death. And then there is the cosmic rhythm of creation and dissolution. Human life is Completely dominated by this pulsating rhythm in micro - and macrocosmos. It is a pulsating movement. continually repeating itself, and propelling itself along a circular route that brings one always back to the point of departure...Human life and love seen from this rhythmic stand - point can be pathetic and poignent, but never really tragic." (Joseph Jordens : Shakuntala - Rhythm, fluidity, Harmony. pub. in OUEST. July - Sept 1964.)

ఘనము జరిగినదని మీ రింత కష్టపడుచున్నారే! మీ భావముల వలన, మీ ప్రవర్తనలవలన నొక మహా దివ్య సంఘమునక్కు నాపత్తు కలుగుచున్నది. మీరు సంఘ మర్యాదోల్లంఘనము చేయుట తప్పులేదుకాని, నేను వ్యక్తి మర్యాదోల్లంఘనము చేసితినని మీకు గోపము......" అను ధర్మారావు మాటలు బ్రాహ్మసమాజమువారిపై కాలు దువ్వు గోరా మాటలవలెనే ఉన్నాయి. కాని యిద్దరి వ్యక్తిత్వాలూ భిన్నము. ధర్మారావెంత తెలుగువాడో గోరా అంత వంగీయుడు. గోరా చేరుకున్న గమ్యస్థానము : "సర్వ ధర్మాన్ పరిత్యజ్య......". ధర్మారావునకు సర్వ ధర్మములు తనే నన్న భావము. ధర్మారావు పయనించనేలేదు. ఇక గమ్యస్థానము చేరుకోవడ మెక్కడ? "సర్వథాచ్యుతమైన మొగిలు కొండ కొమ్మనుండి జారి జారి ఝరిణీరూపమున గాలు నిలువ ద్రొక్కుకొన లేకుండ నూరకే ప్రవహించుటకే ప్రవహించినట్లు" స్రవించి పోవుట ధర్మారావు స్వభావము. ఈ భేదమే రవీంద్రుని విశ్వకవిని చేసినది: ఆయనకంటె ప్రతిభావంతుడైన విశ్వనాథను తెలుగు కవి సామ్రాట్‌గానే నిలిపినది. 'నౌకాభంగము" నుండి 'గోరా' వరకు రవీంద్రు డెన్ని మెట్లు పైకెక్కెనో, 'ఏకవీర' నుండి 'వేయి పడగల' వరకు విశ్వనాథ అన్ని మెట్లు క్రిందికి దిగెను.

నవ్యాంగ్ల నవలా రచయితలలో ప్రముఖుడైన డి. హెచ్. లారెన్స్ వ్రాసిన "The Rainbow" (ఇంద్ర ధనుస్సు) నవల కూడా ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తుంది. స్వర్గ మర్త్యలమధ్యా, ప్రకృతి మానవుల మధ్యా ఏర్పడి ఉండిన మహైక్యము మూడు తరములలో ఎట్లా పారిశ్రామికమూ, మేధా ప్రధానమూ అయిన నాగరకతా ప్రభావంవల్ల విచ్ఛిత్తి చెందిందో చిత్రించే కావ్యం "ది రెయిన్ బో". అందులో మొదటి అధ్యాయంలోని వాక్యాలు: "They knew the intercourse between heaven and earth, sunshine drawn into the breast and bowels, the rain sucked up in the day time, nakedness that comes under the wind in autumn....Their life and interrelations were such..." "వేయి పడగల'లో మొదటి అధ్యాయములోని వాక్యాలు : "ఈ రీతిగా భూమ్యాకాశముల మధ్య స్వర్గ మర్త్యలోకముల మధ్య ప్రత్యక్షా ప్రత్యక్షముల మధ్య నొక స్థిరమైన సంబంధ మేర్పడెను. "లారెన్స్ వ్రాసిన నవలలో కేంద్రస్థమైన ప్రతీక కేథీడ్రల్ (చర్చి). విశ్వనాథవారి నవలలో కేంద్రస్థమైనది దేవాలయము. ఇంగ్లీషు నవలలోనూ 'లయ' ఉన్నది. ఆ నవల ముగింపూ ఆశారేఖ (ఇంద్రధనుస్సు) దృశ్యం కావటంతోనే. రెండు నవలల చివరి వాక్యాలూ ఆశాభావాన్ని వ్యక్తం చేసేవే: "She saw in the rainbow the earths new architecture, the old, brittle corruption of houses and factories swept away, the world built up in a living fabric of Truth, fitting to the over-reaching heaven." (The Rainbow). "అరుంధతి యతని కన్నులలో గన్నులుంచి 'నేను మిగిలితిని' అనెను. ధర్మారావు—అవును నీవు మిగిలితివి. ఇది నా జాతి శక్తి. నా యదృష్టము. నీవు మిగిలితివి.' రెండు నవలల తుది విశ్వాసమూ, వివాహ వ్యవస్థయే. 1915 లో ప్రకటింపబడిన 'ది రెయిన్‌బో' మొన్నటి (1955) దాకా సరియైన విమర్శకోసం వేచియుండవలసి వచ్చింది. నవలకు కవిత్వ గుణమబ్బుట 20 శతాబ్ది సాహిత్యములో ఒక మహత్పరిణామము. తెలుగు సాహిత్యములో స్వతంత్రముగ ఈ పరిణామం తెచ్చిన ఖ్యాతి విశ్వనాథవారిది.

[స శే షం]



షేక్స్పియర్ కవితా జగతి

శ్రీ బుచ్చిబాబు

"విశ్వంలో తిరుగాడుతున్న భూగోళం గురించీ, మానవ జాతిని గురించీ చర్చించడం ఎట్లాంటిదో ఈనాడు షేక్స్పియర్‌ను గురించి చర్చించడం అట్లాంటిది". ఇవి షేక్స్పియర్ 400వ జన్మదినోత్సవ సందర్భంలో బి. బి. సి. లో ప్రసంగిస్తూ, విమర్శకుడు వి.ఎస్. ప్రిచెట్ చెప్పిన మాటలు. ఒక్క పాశ్చాత్య దేశాలేకాకుండా ప్రపంచంలో అన్నిదేశాలూ ఈ జన్మదినోత్సవం జరుపుకుంటున్నాయి. ఇంతటి ఖ్యాతి మరే కవికీ సమకూరలేదు. షేక్స్పియర్‌ని గురించి వ్రాసినన్ని పుస్తకాలు మరే కవిని గురించీ వ్రాయబడలేదు. ప్రతినెలా షేక్స్పియర్‌నిగురించి ఒక వ్యాసమో, ఒక పుస్తకమో వెలువడుతూనే ఉంది. ప్రతిరోజూ ఎవరో ఒకరు ఆయన్ని గురించి వ్రాయడంలో నిమగ్నులై ఉన్నారనడం అతిశయోక్తి కాదు. షేక్స్పియర్‌ని గురించి వ్రాయడం నాగరక ప్రపంచానికి ఒక తీరిక సమయపు వ్యాపకం అయిపోయిందన్నారెవరో.

ఎడతెగని ఈ సాహితీ కల్లోలానికి, ఇన్ని పుస్తకాలు వెలువడడానికీ కారణం ఏమిటి? మానవుడి అంతరంలో వికాసానికి దోహదమిచ్చే దృక్పథం, ప్రక్రియలు షేక్స్పియర్ నాటకాలలో ఇమిడి ఉండడం ఒక కారణం. మన నిజస్వరూపాన్ని మనం చూసుకునేటందుకు తోడ్పడుతాయి ఆయన విషాదాంత నాటకాలు. బాహ్య ప్రపంచానికి తెలియకుండా, మనం ఏకాంతంగా, రహస్యంగా, సాగించే ఆలోచనలు, ఆశలు, ఊహలు, ఈ నాటకాలలో ప్రధాన పాత్రలు బహిర్గతం చేస్తాయి. మన ఆలోచనలు మన వాంఛలూ, మన నిజస్వరూపాలు వాటిద్వారా తెలుసుకుని ఆశ్చర్యపడతాం; భయపడతాం; అంతా ముగిసిన తర్వాత 'అమ్మయ్య' అని నిట్టూరుస్తాం. 'ఇట్లాంటివాటి జోలికి మనం పోకూడదు' అని తీర్మానించుకుని, మానసిక వైరాగ్యాన్ని అలవరచుకుంటాం. విశ్వంలో గోళాలు ఢీకొంటున్నాయి. సూర్యగోళం గతితప్పి అనంతంలోకి పోతోంది. భూగోళం వెలుగులేక గడ్డకట్టి పోతోంది. మానవజాతి చరిత్ర రేపటితో సమాప్తమవుతుంది. కాన, మానవులు తమ వీలునామా సిద్ధపరచాలిఅని అశరీరవాణి శాసిస్తే, 'షేక్స్పియర్ నాటకాలే మానవుడి వీలునామా' అనేటంత పలుకుబడి తెచ్చుకున్నాయి, ఈ నాటకాలు.

ఇట్లాంటి నాటకాలు వ్రాసినాయన ఎవరు? ఎట్లాంటివాడు? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవడం కోసం ఇన్ని పుస్తకాలు వెలువడడానికి మరో కారణం. షేక్స్పియర్ గురించి నిక్కచ్చిగా పరిశోధించి తెలుసుకున్న విషయాలు ఎన్నోలేవు. ఆయన 1564 సంవత్సరం, ఏప్రిల్ 23వ తేదీని స్ట్రాట్‌ఫర్డ్ గ్రామంలో జన్మించాడు. స్కూల్లో చదువుకున్నాడు. ఏన్‌హతావే అనే ఆమెను— తనకంటే వయస్సులో ఏడు సంవత్సరాలు ఆమె పెద్ద—1582 నవంబర్‌లో పెండ్లి చేసుకున్నాడు. 1583 లో వీరికి 'సుసన్న' అను కుమార్తె కలిగింది. రెండేళ్ల తరువాత, జుడిత్, హామ్నెట్—అను కవలలు జనించారు. లండన్ పట్నంవచ్చి నాటకం కంపెనీలో చిన్న చిన్న పనులుచేస్తూ, కొన్ని నాటకాలు వ్రాశాడు. కొంత డబ్బు సంపాదించాడు. స్వగ్రామం వెళ్లి, వీలు వ్రాసి,— అందులో ఆస్తిని పెద్ద కుమార్తెకీ తన రెండో మంచాన్నీ మరి కొన్ని సామానులనీ భార్య పేర వ్రాసి— 52 వ ఏట పరమపదించాడు. పండితులు తమ పరిశోధనా ఫలితాలను, నొక్కి వక్కాణించక, ఇదమిత్థమని నిర్వచించక, అస్పష్టమైన ధోరణిలో తమ గ్రంథాలలో పొందుపరచిన విధానాన్ని హేళనచేస్తూ స్టీఫెన్‌లీకాక్ అనే హాస్య రచయిత ఇలా అన్నాడు : "షేక్స్పియర్ బహుశః ఫలానా సంవత్సరంలో, ఫలానా చోట జన్మించి ఉంటాడు. బహుశః చనిపోయి ఉంటాడు." ఈ శతాబ్దంలో పరిశోధనల ఫలితంగా షేక్స్పియర్ జీవిత విశేషాలను మరి కొన్ని తెలుసుకోగలిగారు. నిజమే. 'అయినా' అసలు ఈ నాట

కాలు వ్రాసింది షేక్స్‌పియర్‌కాదు, ఆయన పేరుతో ఫలానా వారు వ్రాశారు.' అన్న వాదాన్ని బలపరుస్తూ ఈనాటికీ ఎవరో ఒకరు వ్రాస్తూనే వున్నారు.

షేక్స్‌పియర్ ఎట్లాంటి మనిషి? ఆయన మనస్తత్వం ఎట్టిది? ఆయనకోతత్వం అంటూ ఉందా? ఉంటే దాని స్వరూపం ఏమిటి? ప్రధానమైన జీవితపు సమస్యలపట్ల ఆయన అలవరచుకున్న దృక్పథం ఏది? ఈ ప్రశ్నలకు సమాధానాలుగా ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయి. వీటిల్లో చాలా భాగం ఊహాగానాలే. కొందరు,— కోల్‌రిడ్జ్, మిడిల్‌టన్ మ్ర్రీ, విండ్‌హామ్‌లెవీ లాంటివారు— తమ మనస్తత్వాన్నీ, దృక్పథాన్ని షేక్స్‌పియర్‌కి ఆపాదించి, షేక్స్‌పియర్‌ని తమరుగానే చిత్రించి చూపడం జరిగింది. ఇన్ని పుస్తకాలుండడం వల్లే, మనం షేక్స్‌పియర్‌ని ఎరుగున్నంత బాగా మరే ఇతర వ్యక్తినీ ఎరగం అన్నాడు జె.బి.ప్రీస్ట్లీ.

షేక్స్‌పియర్ ఎట్లాంటివాడు? అన్నదానికి విమర్శకులు చెప్పే సమాధానం, 'షేక్స్‌పియర్ హామ్‌లెట్‌లాంటి మనిషి' అని. కోల్‌రిడ్జ్, గెథేలు హామ్‌లెట్ పాత్రని గూర్చి వ్రాసిన నాటినుండీ, ఇదొక సమస్యతో కూడుకున్న నాటకంగా పరిణమించింది. ఈ నాటకంపై వచ్చినన్ని విమర్శలు, పుస్తకాలు మరే నాటకంపైనా రాలేదు. హామ్‌లెట్ నాటకంలో సమస్య ఏమిటి? అతని తల్లి, తన తండ్రిని చంపిన వ్యక్తితో వ్యభిచరించి, వివాహమాడుతుంది. అతని తండ్రి దయ్యం రూపంలో కనపడి, రాజ్యంకోసం తనేవిధంగా హత్యగావింపబడిందీ చెప్పి, వారిపై పగ సాధించమంటాడు.

హామ్‌లెట్ సరేనంటాడు. కాని ఆపని చెయ్యలేదు. వారినీ వీరినీ,— అనవసరమైన వారిని— చంపుతూ, అసలు పనికి ఉపక్రమించక జాప్యంచేస్తాడు. తుదకు అందరూ చనిపోతారు. ఎందుకు జాప్యం చేస్తాడు? అన్నది సమస్య. ఈ సమస్య గూర్చే గ్రంథాలు, వ్యాసాలు వెలువడ్డాయి. హామ్‌లెట్ ఆదర్శజీవి; తత్వజ్ఞుడు; ఆలోచిస్తాడు. ఊహలో జీవిస్తాడు, సృష్టిని తిలకిస్తాడు, సమాధిలో పడతాడు, సత్‌చిత్ ఆనందాన్ని ఆరాధిస్తూ, తన విధిని విసర్జిస్తాడు. కార్యశూరుడు కాదన్నమాట. స్థూల జగత్తు మాయ అనీ అనిత్యమనీ, సమాధానం చెప్పుకుని, తన పనిని, 'కర్మని' విడిచేసి' ప్రత్యేకమైన 'అహం'ని జీవాత్మలో కరిపివేసే యత్నంలో నిమగ్నుడవుతాడు. ఈ రకం స్వార్థరాహిత్యం,— పట్టించుకోకపోవడం— హిందూ తత్వానికి నిన్నిహితమైన దృక్పథం. ఫలా పేక్షలేకాకుండా, తనపని సర్వర్తించక పోవడమేకాదు,— అసలు పనే నిర్వర్తించడు హామ్‌లెట్. దీనికి కారణం ఏమిటి?, ఈ కారణాలన్నీ పొందుపరచడానికి నేనిప్పుడు పూనుకోడంలేదు. జీవితపు సమస్యలపట్ల ఒక నిర్ణయానికి రాలేకపోవడం హామ్‌లెట్ లక్షణం. అదే షేక్స్‌పియర్ లక్షణంకూడా అని బుజువు చేసేటందుకు ఇన్ని గ్రంథాలు వెలువడుతున్నాయనుకుంటాను. అసలు నిర్ణయానికి రాలేకపోవడం— షేక్స్‌పియర్ విషాదాంత నాటకం సారాంశం. నాయకుడు ఒక సందర్భంలో రెండింటిలో ఏదో ఒకదాన్ని ఎన్నుకుని ఆ పని చెయ్యాల్సివస్తుంది. "ఇదేనా చెయ్యి, లేకపోతే అదేనా చెయ్యి, మరి మార్గంలేదు." అని స్థూల జగత్తు శాసిస్తుంది. ఆ పరిస్థితుల్లో అతను నిర్ణయానికి రాలేడు. ఏ నిర్ణయమూ సాధ్యం కాకపోవడమే, మానవుడి విధి నిర్వహణలో విషాదం. "తెలివిహీనులు బల్లగుద్ది చెప్తారు. తెలివైనవారు నోరు మెదపరు. ఇదే ప్రపంచానికి అరిష్టం" అన్నది, తత్వజ్ఞుడైన బెర్ట్రండ్‌రసెల్ నిర్వచనం. హామ్‌లెట్ నాటకం ఈ నిర్వచనాన్ని సోదాహరణంగా విశదీకరిస్తుంది. షేక్స్‌పియర్ ఎట్లాంటివాడు? పంచేంద్రియాలలో, ఏ ఒక ఇంద్రియాన్ని విడిచెయ్యకుండా, అన్ని అవయవాలనీ సమంగా వాడుకుని, సుఖంగా ఉండగలిగిన వ్యక్తి ధన్యుడు. ప్రతివాడు సంతోషంగా జీవించాలి— ఆ సంతోషాన్ని ఏ విధంగా సాధించినా ఫరవాలేదు. మనిషి ఉద్రేకాన్ని తగుమాత్రం వాడుకోవాలి కాని, దానికి బానిస కాకూడదు. నిండు జీవితం, సమగ్రమైన ప్రవర్తన, ఆనందాన్ని వ్యక్తంచేసే శీలం— ఇవి ఉన్నవాడు షేక్స్‌పియర్‌కి ఇష్టమైన వ్యక్తి. షేక్స్‌పియోర్ ఏ మతాన్ని, ఏ తత్వాన్ని బోధించాడు? ఎన్నో రకాలుగా వ్రాస్తారు విమర్శకులు. కాని వాల్టర్‌రాలే చెప్పిన సంగతే నాకు సబబుగా తోస్తుంది. "నిప్పు కాలుస్తుంది, వాన తడుపుతుంది— అవడంలో ఏ తత్వం ఉందో, అంతకుమించిన మరో పెద్ద తత్వం షేక్స్‌పియర్ బోధించాడనుకోను." అన్నాడు రాలె.

షేక్స్‌పియర్ కళ ద్వారా బహిర్గతం చెయ్యలేని, కొంత 'రహస్యం' చీకటి ఉదంతం ఉన్నాయి. వాటిని హామ్‌లెట్ ద్వారా బైటపెట్టి ముక్తి సాధించే యత్నంలో నాటకకర్త విఫలుడయ్యాడు—అందుచేత కళాదృష్ట్యా 'హామ్‌లెట్' నాటకం అసంతృప్తికరమైనది. అని, టి. వి. ఎస్. ఎలియట్ వాదం. తల్లి వ్యభిచారం నాటకానికి వస్తువుకాదు. అది చెప్పివేస్తేగాని, తన బాధ తీరదు. హామ్‌లెట్ ద్వారా చెప్పడానికి 'యత్నించాడు. కాని, తనలో ఉన్న ప్రమాదకరమైన ఉద్రేకం, నాటకం వస్తువులో ఉన్న నమూనాను మించింది కావున, ఆ ఉద్రేకం పూర్తిగా వస్తువులో లీనమవలేదు—అన్నది ఎలియట్ వాదం.

మానవుడు ఒక వ్యవస్థలో ఇరుక్కుంటాడు. ఆ స్థితికి హామ్‌లెట్ ప్రాతిపదిక. అందులో షేక్స్‌పియర్ దర్శన మను

షేక్స్‌పియర్ కవితా జగతి

తుంది. ఇంతటి కల్లోలానికీ, ఇంత ఖ్యాతికీ ఈ కారణాలు సరిపోతాయా ? కళాకారుడుగా, షేక్స్‌పియర్ చేసిన అత్యాచారాలను, దారుణాలను ఎంద రెందరో ఎత్తి చూపారు. షేక్స్‌పియర్ తత్వాన్నీ, నాటకాలలోని చెడుగునీ తీవ్రంగా ఖండించిన రచయిత టాల్‌స్టాయ్. క్రైస్తవ మత సూత్రాలను ఆరాధించిన టాల్‌స్టాయ్, షేక్‌స్పియర్‌లోని మానవతా వాదాన్ని రసదృష్టిని అవగాహన చేసుకోలేకపోవడం, ఆయన దురదృష్టమని, టాల్‌స్టాయ్ విమర్శనాన్ని ఖండిస్తూ ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. షేక్‌స్పియర్ నాటకంలో హితబోధ లోపించిందనీ, తనవాటిల్లో అది ఉంది గావున, తనే షేక్‌స్పియర్ కంటె ఘనుణ్ణి అనీ బెర్నార్డ్‌షా పదేపదే చెప్పుకున్నాడు. షేక్‌స్పియర్ నాటకాలలోని రసవిహీనమైన లక్షణాల జాబితా నొకటి తయారుచేశాడు. లోగన్ పెరాల్‌స్మిత్ అనే ఆయన. ఆ చిట్టాలో కొన్నింటిని వివరిస్తాను.

గొప్ప రచయితలు మనని విసిగిస్తారు. మన జీవితం అంతా వారి రచనలే చదువుతూ కూర్చోవాలిట. దర్బారు దుస్తులు ధరించి వారి సమక్షాన నిలబడాలిట. షేక్స్‌పియర్ ఒక జాతీయ సంస్థగా మన నెత్తిన రుద్దడంచూస్తే, మనకి అనుమానం తగుల్తుంది.— 'పో, పో,' అన బుద్ధేస్తుంది' వేదికపై నిలబెట్టిన ఈ శిలాప్రతిమని కదిపి చూడాలనిపిస్తుంది. ఇదంతా పెద్దదగా— మోసంలాగుండే అనుకుంటాం. తీరా షేక్స్‌పియర్ నాటకాలు చదవడం మొదలుపెడితే, ఏం కనిపిస్తుంది.? విసుగుపుట్టించే ఛలోక్తులు, చెత్త కబుర్లు, అవే సన్నివేశాలు, వికట కవనం, మాటలపై గారడీ, ఒళ్లు బలిసిన పదజాలం, హత్యలు, యుద్ధాలు, కొట్లాటలు, చివరికి ఒక అరడజను శవాలను బైటకు ఈడ్చివెయ్యడం—'' అంటాడు పెర్సాల్ స్మిత్. అంతా రోదన, ఏడ్పు, ఖేదం, శోకం, ఇంతేనా? మనిషిపట్ల అసహ్యం పుట్టించే ఈ స్వగతాలేనా ఉత్తమ కావ్యం? మొదటి ప్రపంచయుద్ధానంతరం యూరప్‌లో షేక్స్‌పియర్ నాటకం 'రోమియో, జ్యూలియెట్ చదివి కొందరు యువతీయువకులు, ప్రేమ పేరిట ఆత్మహత్య చేసుకున్నారుట. రోడ్డుమీద నడిచే కన్యల్ని అల్లరిపెట్టే యువకుల్ని రోడ్డురోమియోలని వ్యవహరిస్తున్నాం. షేక్స్‌పియర్ నాటకంలో కొన్ని భాగాలను చదవలేక, మొహం త్రిప్పేసుకునేవాడుట ప్రసిద్ధ విమర్శకుడు డాక్టర్ జాన్సన్. షేక్స్‌పియర్ పాత్రచిత్రణలో లోపాలున్నాయి, వస్తువుని మలచడంలో దోషాలున్నాయి, కొన్ని సందర్భాలలో కళాదృష్టి కుంటుపడుతుంది. కొన్ని ప్రదర్శనయోగ్యంకావు. ఇల్లా వెదికితే ఎన్నెన్నో చెప్పుకుపోవచ్చు. మరెందుకు షేక్స్‌పియర్ అంటే ఇంత ఆరాధన, ఇన్ని స్తోత్రాలు?

ఇందుకు కారణం షేక్స్‌పియర్ కవిత. ఆయన వాడిన భాష, అలవరచుకున్న శైలి, ప్రదర్శించే ఊహాబలం, ప్రతిభ, ఈ కవితా స్వరూపం ఎట్టిదో, ఈ శైలి లక్షణాలేవో, భావన వైశాల్యం ఎంతటిదో, పరామర్శించి చూపాలనే ఈ వ్యాస రచనకు పూనుకున్నాను.

ఆంగ్లభాషతో గాఢమైన పరిచయంలేక, షేక్‌పియర్ కవిత ఎట్లా ఉంటుందో తెలుసుకోవాలని కుతూహలపడేవారందెరో ఉన్నారు. వారిని ఉద్దేశించి వ్రాసిందే ఈ వ్యాసం. ఆంగ్లభాషతో పరిచయం ఉన్నవారిలోకూడా చాలామంది షేక్స్‌పియర్ కవితలో అందచందాలని ఆస్వాదించలేకపోతున్నారు. ఇందుకు కారణం, షేక్స్‌పియర్ నాటకాలు, పాఠ్యగ్రంథాలు కావడమే. ఈ నాటకం రచన ఎప్పుడు జరిగింది? షేక్స్‌పియర్ వ్రాతప్రతికీ, తరువాత అచ్చయిన ప్రతులకీ తేడాలేవి? నాటకంలో వస్తువుకి ఆధారాలేవి? సమకాలిక విశేషాలు ఎందుకు ఎల్లాగ వాడుకున్నాడు నాటకకర్త? రంగస్థల ప్రదర్శనలో చిక్కులేవి? ఒక పదానికి ఆ నాడున్న అర్థం ఏమిటి? ఇప్పటి అర్థం ఏమిటి? విద్యార్థుల దృష్టి ఈసమస్యపై మరలి, నాటకంలో కవితావిశిష్టతని గ్రహించే వకాశాలు ఉండకపోవడం, మనదేశంలోనేకాక, ఇతర దేశాలలోకూడా జరుగుతున్నదే.

చాలా చోట్ల వచనం వున్నా, షేక్స్‌పియర్ నాటకాలు కావ్యాలగా రచించబడ్డాయి.

ఆ రోజుల్లో, కర్టెన్లు, తదితర రంగస్థల పరికరాలు లేనందున, ఎక్కడ, ఎప్పుడు, ఏం జరుగుతున్నదీ, పాత్రలే చెప్పుకుని, తగు వాతావరణాన్ని సృష్టించుకునే సంప్రదాయం వల్ల స్వగతాలు వెలువడ్డాయి. ఈ స్వగతాలు ప్రకృతివర్ణన కోసమే కాకుండా, జీవితం కొన్ని నిర్వచనాలు చేసుకోడానికీ, అంతరంగ వైక్లబ్యాన్ని బైటపెట్టడానికీ ఎక్కువగా ఉపయోగపడతాయి. ఛలోక్తులు విసరడంలోనూ, జీవితంపై అద్భుతమైన నిర్వచనాలు చెయ్యడంలోనూ షేక్స్‌పియర్ అద్వితీయుడు. ఆయన వ్రాసిన నాటకాలన్నింటిలోనూ ఉన్న మంచి సూక్తులని ఏరి పుస్తకంగా వెలువరించారు. ఉపన్యాసాలలోనూ, వ్యాసాలలోనూ, వీటిని వాడుతూ ఉండడం పరిపాటైపోయింది. అసలు షేక్స్‌పియర్ నాటకాలు చదవడంలో ఉన్న ఆనందం, మనం తరచు వింటూవున్న సూక్తులను పోల్చి పసిగట్టడంలోనే ఉంది— అని ఎవరో అన్నారుకూడా. ఇప్పుడు నేను, ఆ సూక్తుల జోలికి పోను.

వాటిని ఉదహరించడం మొదలిడితే, ఆగడం కష్టంట. ఈ నిర్వచనాలు జాబితాలు తయారుచేసి, ఏ నాటకంలో ఏయే ఉపమానాలు, విశేషాలు, సమాసాలు, ప్రధానంగా తోస్తాయో విపులీకరించి, కారొలైన్‌స్పర్జిన్ అనే ఆమె పెద్ద గ్రంథం వ్రాసింది.

గడియారం విప్పి అందులో భాగాలన్నీ విడగొట్టి చూపడమే చెయ్యదల్చుకున్నది. షేక్స్‌పియర్ శైలిలో ఉన్న ప్రత్యేకతను, పాడిమాటల్లో చటుక్కున అర్థమయ్యేలాగు చెప్పడం నా ఉద్దేశ్యం. సంస్కృత పదాలు, ఘాటైన సమాసాలు బరువైన మాటలు వాడి, ఇంతకంటే, గంభీరంగా షేక్స్‌పియర్ భాషను అనువదించవచ్చు. తెలుగులో కొచ్చిన కొన్ని షేక్స్‌పియర్ నాటకాలలో ఈ రకం భాషవాడి, అనువాదకులు కృతార్థులయ్యారు. ఒక వాక్యాన్ని విప్పి, మాటల పొందికప్తై, పాడి మాటల్లో వ్యాఖ్యానించడంతో తృప్తిపడతాను.

షేక్స్‌పియర్‌ది చాలా కఠినమైన భాష. కృత్రిమమైంది. తికమకలతో కూడుకున్నదీ. ఇతర భాషలలోకి అనువదించడం సాధ్యంకానప్పుడే గొప్ప కవిత అన్నాడుకూడా ఒక విమర్శకుడు. దానికితోడు మరో ఇబ్బందికూడా ఉంది. షేక్స్‌పియర్ వాడిన నాడు ఉన్న అర్థం, కొన్ని మాటలకు ఇప్పుడు లేదు. కాలంతో, అవి కొత్త అర్థాలు తెచ్చుకున్నాయి. షేక్స్‌పియర్‌ది వ్యక్తిగతమైన శైలి. కొన్ని మాటలకు తాను వేరే అర్థం కల్పించినట్లు తోస్తుంది. కొన్ని సందర్భాలలో, కొన్నిటిని సృష్టిస్తాడు, పదాలను పీడించి సాగేస్తాడు, కృత్రిమ కవి సమాఖ్యాలను కల్పిస్తాడు. కవిత ప్రబలి శైలి ప్రజ్వరిల్లిన కొన్ని భాగాలను పదిమంది అనువదించడానికి పూనుకుంటే, పదిమందీ పది రకాలుగా అనువదిస్తారనడంలో సందేహంలేదు. శైలి లక్షణాలను ఉదహరించడమే నా ఉద్దేశంగావున, మూలంలో ఉన్న ఆంగ్ల పదాలను వాడకూడదనుకున్నా: అయినా, షేక్స్‌పియర్ శైలి ప్రత్యేకతని అనువాదంలో తీసుకురావడం ఎంత కష్టమో చూపడంకోసం, ఒక్క వాక్యాన్ని మాత్రం ఉదహరిస్తాను. షేక్స్‌పియర్ శైలిలో విశిష్టతను పూర్తిగా చూపే ఒక్క వాక్యం ఉదహరించగలవా అనిఅడిగితే,—ఈ వాక్యం ఉదహరిస్తాను.

In the dark and backward abysm of Time. కవివ్యక్తిత్వం అంతా ఉంది ఈ వాక్యంలో. తెనుగులో దీని అర్థం ఏమిటి? స్థూలంగా 'కాలగర్భంలో' అనొచ్చు. అసలు 'కాలగర్భంలో' అన్నది ఎంతో మంచి సమాసం. అద్భుతమైనది. కాని మనం తరుచు వాడటంలో ఇది పాత చింతకాయ పచ్చడైపోయింది. కాబట్టి 'కాలగర్భంలో' అని అనువదిస్తే, అర్థం సరైంది అయినా, కవి ... శైలీ ప్రత్యేకతా అందులో లేవు. ఆ వాక్యంలో మాటలకు విడివిడి అర్థాలు చూద్దాం. 'డార్క్' అంటే చీకటి, నలుపు. 'బేక్‌వర్డ్' అంటే— వెనక్కు తిరిగిన, వెనకవైపు. 'ఎబిసీమ్'— అనేది వెనకటి కవులు వాడిన పదం. ఇప్పుడు 'ఎబిస్'గా మారింది. 'ఎబిస్' అన్న దానికి రెండుమూడు అర్థాలున్నాయి. అంతులేని అఖాతం, భూనభోంతరాళం, ఆదిప్రళయం, అడుగుభాగం లేనిది. ఇవన్నీ కలిపితే— చీకటి, వెనక్కి తిరిగింది, అంతులేని అఘాతం... అదీ కాలాన్నిగూర్చిన షేక్స్‌పియర్ భావన. బరువైన పదాలు వాడి ఇల్లా అనువదించవచ్చు :

అంధకార విలోమమనైక

కాలగర్భ భీకరాఖాతమ్ము !

కాని ఇది ఎంతమందికి అర్థమౌతుందో నాకు తెలియదు. అంతేకాదు. షేక్స్‌పియర్ మూలంలో 'గర్భం' అన్న ధ్వనిలేదు. అది తీసివేస్తే, తెనుగులో అర్థంరాదు.

అనుభవాలను, వ్యక్తులనూ, కొత్త దృక్పథంతో చూస్తాడు షేక్స్‌పియర్. అవి వర్ణించడంలో, చమత్కారమైన భాష వాడతాడు. కృత్రిమ ప్రయోగాలు చేస్తాడు. మనల్ని నిలిపి లేవదీసి, కూర్చోబెట్టి, మరోసారి ఆలోచించి, ఊహించేటట్లుంటాయి కొన్ని ప్రయోగాలు. ఒక్క వాక్యంలో, ఒక్క సమాసంలో ఇమిడిన కవితా రీతుల్ని కొన్నిటిని ఉదహరిస్తాను.

నాయకుడు ఏవో కొత్త విషయాలు ప్రేయసితో చెప్తుంటే ఆమె ఆశ్చర్యపడిన సందర్భంలో

''రక్తం ఆమె బుగ్గల పైకొచ్చి తొంగిచూసింది.''

వెన్న మీగడల రాణి ఆమె''

మరొక నాయికను గూర్చి.

''ఆమె శరీరంలోని అతుకులూ, ఆవేశాలూ.....''

స్త్రీచూపే ఆవేశంలో ప్రత్యేకత ఆ 'అతుకులు' అన్నదాంట్లో ఉంది.

''ఆకుపచ్చ కళ్ల రాకాసి— అసూయ.''

ఆ రంగుకీ అసూయకీ ఉన్న స్నేహం ఎట్లాంటిదో మనమెరుగుదుం.

''నిశిధి చాచిన ఇనప నాలుక'' ఆ రాత్రుళ్ళ ... మనమెరుగుదుం. ఈ ఉపమానంతో ఆ చీకటిని ఎదుర్కొగలం.

''సమానమైన చేతులుగల న్యాయం''. న్యాయం ముందర అందరూ సమానులే అవి.— చేతులు ఒకటి పొడుగూ, ఒకటి కాస్త పొట్టీ ఉండకూడదు.

మనిషి మెదడు ఎట్లాంటిది?

''అటుకులు, సాగెయ్యడాలూ, త్వరితంగా జరిగే కర్మాగారం''. ఆ 'త్వరితం'గా అన్నది గమనించాలి.

ఒకచోట 'శాంతిచేసే బలహీనమైన గానం' అంటాడు షేక్స్‌పియర్. 'శాంతి'లో కాస్తంత చప్పదనం ఉంది.— బలహీనమైంది. కాని అందరూ కోరదగింది— కాబట్టి గానం.

'తడిసిన కళ్లతో ధర్మం మూతిబిగించి చేసిన గొడవ.'' తడిసిన కళ్ళు, బిగిసిన మూతి,— రెండు విశేషణాలు వాడడం, ఆయన శైలిలో ప్రత్యేకత.

'వీధి నడుమ నృత వైశాల్యం.'' ఆ 'వైశాల్యం' నడుమ ఉండాలంటే ఆ వీధి ఎంతటిదో!

ఇక్కడ 'నృత' అన్నది షేక్స్‌పియర్ కంఠం.

''అతని దోషాలు, మృదువుగా అతనిమీద పడ్డాయి.'' మృదువుగా అంటే? అల్పమైన దోషాలనా? అవి ఎంతటివైనా అతడు భరించగలడనా? ఆ దోషాలు అతనిలో లేవు— ఎవరో మీదవడేశారనా? పడేసినవారు, పేడ కలిపి గట్టిగాక, మృదువుగా ఎందుకు పడేశారు?

పాపం మంచివాడు, ఈ నిందలు మృదువుగా వే ద్దాం' అనుకున్నారా?

యుద్ధం ముగిసింతర్వాత, ఎట్లావున్నదీ, వర్ణన.

'రక్తపాతమైన యుద్ధం దిగవిడచిన వీలునామా.

''దగ్ధమైన పగటి వెలుగు.'' ఈ ఎండ నుండిపోవడం మనమూ ఎరుగుదుం.

'కోపగించిన కోతివలె చిమిడిన అతని అంతరంగం' నా కర్థంకాదు, కోపగించిన కోతికి చిమడ్డానికీ ఉన్న సంబంధం ఏమిటో నాకు తెలీదు. వింత ఉపమానం.

''ధనంతో వంకరతిరిగిన జాతిప్రియులు''. ధనం ఉన్నవారు త్రాగి తంపన్నాలు తొక్కికూడా దేశానికి ప్రియులు కాబోలు.

''ప్రశాంతతను పిల్చే నేత్రం'' ఆ కన్నెత్తితే చాలు కనకాభిషేకాలు.

ఒక్క విశేషణంతో తారక మినుక్కుమంటుంది— తేమగా ఉన్న తారక'' తడిసినట్లు, తేమగా కనబడే నక్షత్రాన్ని శీతాకాలంలో చూస్తాం. దీనితో సమమైంది వాల్మీకి చందమామ— 'శ్వాసతో మసకైన అద్దంలాంటి చందమామ'.

అధికారంకోసం అత్యాచారాలుచేసి పతనంచెందిన వ్యక్తులను, సన్నివేశాలను వర్ణించేటప్పుడు, షేక్స్‌పియర్ శైలిలోని ఉదాత్తత, శిఖరాన్నందుకుంటుంది. ఆ ధోరణిని 'కవిత్వం' అనొచ్చు.

''కళ్లు తెరుచుకున్న గూడు పుర్రాణి'— ట కూలదోయడానికి కుట్రలు సల్పేవారు.

''వెళ్లిన రోజుల్లో వెలిగిన వెర్రివారున్నారు.''

''పంగల కర్రలా రెండుగా వీడిన మనిషి'' అన్నది చాలా చిత్రమైన వర్ణన— ఆధునిక చిత్రకళలో,— ముఖ్యంగా పికాసో, పాల్‌క్లీ చిత్రాలలో ఇట్లాంటి మనిషి స్వరూపం చూస్తాం.

''పిచ్చుక క్రింద పడటంలో ఒక ప్రత్యేక కర్మవుంది.'' విద్యుత్ తీగపైనుండి పడ్డ పిచ్చుకను చూసినప్పుడు నాకీ వాక్యం బాగా అర్థమైంది.

''చమట్ల వేగిరపాటువల్ల రాత్రి, పగటికి తోటి పని వాడవుతుంది.'' చలి దేశాల్లోవారికి చమట వేగిరపాటు అంత సులువుగా బోధపడదు.

''సంధ్య దిగవిడచిన కిరణంవలె పతనమౌతాను.''

చెట్ల ఆకుల మధ్య, కొండ శిఖరం వెనక, కిరణంజారిపోవడం చూసినవాళ్లు, వెలుగు దిగజారడంలో ఉన్న న్యాన్ని బాగా గ్రహిస్తారు.

స్త్రీకోసం సామ్రాజ్యాన్ని వదులుకున్నవారి ప్రగల్భం— ''సామ్రాజ్యాలని ముద్దుతో తుడిచివేశాము''.

''జమకొచ్చిన ప్రేమలో యాచన ఉంది''.

—లెక్క, జమలో జమ— ఇందులో జమ.

రక్తనాళాలు పచ్చగా ఉంటాయి— కాని కోపం వచ్చిన వారిని ఇల్లా వర్ణిస్తాడు షేక్స్‌పియర్.

'రక్తనాళాలలోంచి ఎర్రప్రవాహాలు......'

'జీవితం ఒక నడిచే నీడ.' ఊహిస్తే భయమేసే ఈ ఉపమానంలో షేక్స్‌పియర్‌ని దర్శిస్తాం.

ఇప్పుడు కొంచెం దీర్ఘమైన భాగాలని పరిశీలిద్దాం. షేక్స్‌పియర్ నాటకాలలో వారి దేశ చరిత్రకు సంబంధించిన గాథలే కాకుండా, ప్రాచీన గ్రీసు, రోమ్‌దేశాల పౌరాణిక గాథలకు సంబంధించిన విశేషాలు, వ్యక్తులు ఉదాహరణలుగా దొర్లుతాయి. ఆ గాథలతో పరిచయంలేనివారికి వ్యాఖ్యానం లేనిదే ఆ భాగాలు అర్థంకావు. అట్లాంటివి విడిచేస్తాను. అందరికి అందుబాటులో ఉన్న కొన్ని అనుభూతులను షేక్స్‌పియర్ ఏ విధంగా కవితద్వారా ప్రేక్షకులతో పంచుకున్నాడో చూపే నిమిత్తమై ఆ అనుభూతులను శీర్షికల క్రింద విడమరచి స్వేచ్ఛానువాదం సాగిస్తాను.

సౌందర్యం - ప్రేమ

ఆమె 'కాగడాలకి ...డం నేర్పుతుంది.

'రాత్రి చెంపపై ప్రేళ్లాడుతుంది' ప్రతి రచయితకీ, ధ్వనినిబట్టి, అర్థంబట్టీ, తాను కల్పించిన ఊహబట్టీ, కొన్ని అభిమానమైన పదాలుంటాయి. 'ప్రేళ్లాడడం.', 'కదపడం' 'వూపడం', 'మెరుగైన', 'ముంచడం', 'తాకిడి', 'తొంగిచూడటం', మొదలైనవి షేక్స్‌పియర్‌కి ఇష్టమైన మాటలు. 'ఆర్' అన్న అక్షరం,గల పదాలంటే ఆయనకి ఎంతో ప్రీతి.

'అశుభమైన తారకల కాడిని కదిపేసి ఇక్కడ శాశ్వతమైన విశ్రాంతి తీసుకుంటాను అంటాడు ఒక పాత్ర. ఒకామె సౌందర్యం ఇలా వర్ణిస్తాడు.

''ఆమె శ్వాసని గదంతా పరిమళం. చేస్తుంది. శెమ్మాలో దీపం వెలుగు ఆమెమీదికి ఒరిగి, కనురెప్పల వెనకదాగిన కాంతులను తొంగిచూస్తుంది''— గొప్ప వర్ణన.

మరొకచోట —

'ఉప్పు ప్రవాహంతో తడిసిన సముద్రపుటొడ్డున శాశ్వత భవనాన్ని నిర్మించుకున్నాడు,

రోజుకొకసారి భీకరంగా పొంగే కెరటాలను తన గుతో కప్పివేస్తూ.'

'రోజుకొకసారి' ఎందుకో నా కర్థంకాలేదు. ఉపమానాన్ని పీడించి అస్పష్టమైన అందాన్ని సమకూరుస్తాడు షేక్స్‌పియర్.

''గాలిలోంచి చూస్తుంటే స్వర్గంలో ఆమెకళ్లు మెరుస్తాయి, పగలనుకుని పక్షులు పాడతాయి''. ఆమె ''దుఃఖానికి మాటలు నేర్పుతుంది. బాధతో కొట్టుకునే గుండెకి గుసగుసచెప్తూ పగలమని శాసిస్తుంది.'' దైన్యం ఆ గుసగుసలో ఉంది.

'నీ తల్లిపాలిటి అద్దానివి నువ్వు.

ఆమె యవ్వనపు సొగసు నీలో చూసుకుని మురిసిపోతుంది.'

అమాయకురాలి వర్ణన.

''ఆమెకి ధైర్యంలేదు. నెమ్మదైంది. తన కదలికకి తనే సిగ్గుపడుతుంధి''.

వాల్మీకి ఊహించిన 'సిగ్గుపడిన కన్యలు' మరీ బాగుంటారు.

''వస్త్రములవలె నదిలో నీరు ఒడ్డున చేరుతోంది; సిగ్గుపడిన కన్యల తొడలవలె ఇసుక ఒడ్డు మెరుస్తోంది'' అని వాల్మీకి.

''శూన్యం ఏర్పడుతుందన్న భయంలేకపోతే ఆమెని చూడ్డానికి గాలికూడా వెళ్లును, ప్రకృతిలో ఖాళీ కనపరుస్తూ''.

'సిగ్గుబిడియాలుగల కన్యగూడా, తనపేరు సౌందర్యాన్ని చందమామ ముందు బైటపెట్టినప్పుడు తన దుబారాతనాన్ని బాగా చూపెడుతుంది'

ప్రేమని పైకి చెప్పుకోలేని స్త్రీని ఇలా వర్ణిస్తాడు.

'పుష్పంలో పురుగులా, దాపరికం ఆమె ఎర్రటి చెక్కిలిని తింటూవుంది— ఆకుపచ్చ, పసుపురంగు దైన్యంతో. శిలాఫలకంపై 'సహనం' అనే ప్రతిమవలె దుఃఖాన్ని చూసి నవ్వుతూ కూర్చుంది'.

పుష్పంలోని మృదుత్వం, శిలాప్రతిమలోని నునుపు,— వీటి కలయికతో దైన్యం రంగుల్నికూడా తెచ్చుకున్నట్లుంది; లోపలున్నప్పుడు ఆకుపచ్చ (కంఠంలో నాళాలు). నవ్వు రూపంలో బైటకొచ్చినప్పుడు పసుపు. ఇదొక అపూర్వమైన భావన.

ప్రకృతి

ప్రకృతి వర్ణనలో కవి పరిశీలనాశక్తి వ్యక్తమవుతుంది. పరిశీలన రెండువిధాలుగా ఉంటుంది. ఎదురుగా ఉన్నదాన్ని, ఉన్నది ఉన్నట్లుగా వర్ణించడం 'ఆ చెట్టుకీ ఇరవైనాలుగు కొమ్మలున్నై'. ఇట్లాంటి వాక్యాన్ని గమనించం. 'ఇరవైనాలుగు అంకెలా కొమ్మలు పెనవేసుకున్నాయి'. అనగానే మనకొక బొమ్మ చిత్రితమౌతుంది. ఇట్లాంటి వర్ణనలో వాల్మీకి అద్వితీయుడు. ఇది చూడండి. 'గాలికి చెట్లు కదులుతున్నా, వాటి వెనకవున్న కొండలు నృత్యం చేస్తున్నట్లుగా ఉంది'. షేక్స్‌పియర్ నాటకాలలో ఇట్లాంటివెన్నో ఉన్నాయి. అందమైన ఉపమానమని తోస్తే, దాన్ని ప్రేమిస్తాడు. సందర్భాన్ని మరచి, దాన్ని వెంటాడుతాడు. నిద్రిస్తున్న పసికందులను హత్యచెయ్యడానికి వచ్చిన ఒక దుండగీడుచేత ఆ పిల్లలు, రెమ్మమీద ఉన్న రెండు గులాబీలు'లా ఉన్నారని పిస్తాడు. గాయపడిన ప్రియుణ్ణిచూసి ప్రేయసి భయంతో ఎలా వెనక్కి తగ్గుతుంది.? ''మెత్తటి మెదడు గాయపడిన నత్తగుల్ల బాధతో తన గుహలోకి వెనక్కి తగ్గి ఆ నీడలో, మొత్తంగా ముడుచుకుపోయి చాలా సేపటివరకూ, బైటికి రావడానికి జంకినట్లు......' ఇందులో చివరి వాక్యం—అంటే చాలా సేపటివరకూ బైటకి రాదన్నది— అనవసరం.

''రాత్రి వెలిగించిన కొవ్వు ఒత్తులు ఆరిపోయాయి. మసక కొండ శిఖరంమీద ప్రభాతం కాలిబాటన ప్రేళ్లమీద నిలబడింది , మహదానందంతో.''

షేక్స్‌పియర్ కవితా జగతి

మరో రకం వర్ణనలో, వెనక తాను చూసిన వాటిల్లో అందమైనవాటిని జ్ఞప్తికి తెచ్చుకుని, వాటిని తన ఎదురుగా ఉన్న వస్తువుతో జతపరచి, కొత్త అందాన్ని వెదకడం జరుగుతుంది. ప్రస్తుతంలో గతాన్ని స్మరించగలగడమే ప్రతిభ అన్నారెవరో.

పైనుంచి చూస్తుంటే భూమి ఎలావుందో వాల్మీకి ఇలా వర్ణిస్తాడు.

''మహా నగరాలలో భూమి రథచక్రంలా ఉంది. కొండలు ఒడ్డున గులకరాళ్లలాగున్నాయి. నదులు దారంలాగా ఉన్నాయి. పెద్ద పర్వతాలు, చెరువులో నీళ్లు త్రాగుతున్న ఏనుగులవలె ఉన్నాయి.

'కన్యలాంటి ముల్లుమీద వాడిన గులాబి' అన్న షేక్స్‌పియర్ వర్ణన ఈ రకందే. కన్యలో కాఠిన్యం ఆయ నెరుగును— అది ముల్లులాంటిది. ఇట్లాందే మరొకటి.

'మృత్యువు కొట్టిన దెబ్బ, ప్రియుడు బుగ్గ గిల్లడం లాంటిది. నెప్పిగా ఉన్నా, కావాలంటాం.'

మరొకటి.

'ప్రభాతం దగ్గరపడుతోందని చెబుతుంది. మెరుగు పురుగు— దాని నిరుపయోగమైన వెలుగు సన్నగిలుతుంది. ఇందు నిరుపయోగమైన వెలుగు అన్నది అనవసరం. రెండు విశేషణాలుంటేకాని తృప్తిపడడు షేక్స్‌పియర్, ఒకటి కాక పోతే ఒకటేనా నిలబడకపోతుందా— అనుకున్నట్లు. అతని దృష్టి అట్లాంటిది. ఆ దృష్టినుండి జనించిన శైలి పోకడకూడా అట్లాంటిదే. ఉపమానాన్ని కామించడం విరమించి, ఉద్వేగంలో కూడా ఏకాగ్రత సాధించినప్పుడు, ఆయన వర్ణనలు చాలా శక్తివంతంగా ఉంటాయి.

ఆనందంతో వారు తమ టోపీలను పైకి ఎగరవేశారు— చందమామ కొమ్ములమీద వ్రేళాడవేసినట్లు.'' ఇది అద్భుతమైన ఉత్ప్రేక్ష. 'అతి సర్వత్రవర్జయేత్' అన్న నానుడిని పరామర్శిస్తూ, 'అతి' అంటే ఏమిటో ఇట్లా ఉదహరిస్తాడు.

''పొదిగిన బంగారానికి మెరుగెట్టడం, మల్లెపూవుకి తెల్లరంగు పూయడం, పరిమళించే పుష్పంపై అత్తరు చల్లడం. మంచుని చదును చెయ్యడం, ఇంద్ర ధనుస్సుకి మరో రంగు అమర్చడం, ఆకాశంయొక్క అందమైన కంటికి కొవ్వొత్తి వెలుగు చూపడం.''

జీవితం - మానవ ప్రకృతి

ప్రపంచంలో ఉత్తమ నాటక కర్తగా ఖ్యాతి గడించుకున్నాడు. మానవ ప్రకృతిని బాగా పరిశీలించి తరచి చూశాడు, పైకి ఎలా కనబడినా వారిలో ప్రాకృతిక శక్తుల విజృంభణ' కామము, రహస్యమైన వాంఛలు ఉంటాయనీ, వాటికి లొంగిపోయినప్పుడు మానవుడు పతనమౌతాడనీ గ్రహించాడు. విషాదాంత నాటకాలు వ్రాసిన కాలంలో మానవుడిపట్ల అతనికి రోత పుట్టిందనడానికి నాటకాలలో ఎన్నో నిదర్శనాలున్నాయి. ఉద్రేకానికి లొంగిపోయి, అధికారంకోసం ఘోర అపచారాలు చేసిన వ్యక్తులని ప్రత్యేకమైన కసితో వర్ణిస్తాడు. ''మనుషులు మనుషుల్ని ఎలా నమ్ముతారో నా కర్థంకాదు.'' అంటాడు ఒక షేక్స్‌పియర్ నాయకుడు. పాపాలు చేసినవారి మొహాలు 'కరుడుగట్టిన బురదనీటి గుంటపై పరచిన పరదాలవలె ఉంటాయంటాడు. పాపాత్ములు వారొక్కరే నాశనంకాక, తోటివారైన మంచివారినికూడా నాశనం చేస్తారు. జీవితం పైనా, మనుషులపైనా రోతపుట్టించే భావాలు, నిర్వచనాలు ఎన్నో ఉన్నా, మానవత్వంపట్ల అతని విశ్వాసం సడలిందనలేము. ఘోరాలుచేసిన వారినిచూసి విస్తుపోతాం. ముక్కుమీద వేలేసుకుంటాం. కాని అట్టివారిని ద్వేషించడు, వారిని చూసి జాలిపడతాడు. జాలిపడేటట్లుచేస్తాడు. కొన్ని ఇక్కట్లు, పోటీలు, పెనుగులాటలు బలవంతులు—బలహీనులు మధ్య రేగే వైరం— ఇవన్నీ మానవ సమాజాల కూర్పులో కేంద్ర స్థానాలు. మనమూ అందులోనివారమే గనక, మరెవ్వరికీ వారిపై తీర్పు చెప్పే అధికారం లేదంటాడు షేక్స్‌పియర్. మంచి చెడ్డలను సమంగాచూసి, చెడుగుని చూసి జాలిపడటం— అదే షేక్స్‌పియర్ జీవిత దృక్పథంలోని ప్రత్యేకత. ''దుష్టుడికి బంగారు తొడుగు తొడగండి— ధర్మశాస్త్రం ఇచ్చిన గునపంతో ఆ తొడుగుని పొడిస్తే గునపం ముక్కలవుతుంది— ఆ దుష్టుడికే చినిగిన బట్టలు కట్టండి— ఒక పొట్టివాడు గడ్డిపోచతో ఆ దుస్తుల్ని ఛేదిస్తాడు.'' ఈ జీవితం అంతా మాయ— కాలం కదిలిపోతుంది. ఏదీ శాశ్వతంగాదు. దీని కోసం ఎందుకీ పెనుగులాట? ''పిల్లలు ఆటకోసం పురుగులను హింసించి చంపినట్లు భగవంతుడు తన ఆటకోసం, మనల్ని చంపుతాడు'' అంటాడు. అంతమాత్రంచేత, అన్నీ వదులుకుని, తన విధిని నిర్వర్తించకుండా, కార్యరంగంనుండి పారిపోయిన వ్యక్తిని షేక్స్‌పియర్ క్షమించడు. విధి నిర్వర్తించు, ఫలం పొందలేకపోతే గుండె బాదుకోవద్దు. మానవప్రకృతి చిత్రణలో శైలి ఎట్లా ప్రజ్వరిల్లిందీ చూపాలంటే, ఆ సందర్భం ఏమిటో చెప్పాల్సి ఉంటుంది. ఈ వ్యాసానికి సందర్భంతోనూ, పాత్రలతోనూ, నాటకీయతతోనూ నిమిత్తంలేదు గావున, అట్టివాటిని విడిచేసి, కేవలం భావాన్ని ప్రదర్శించి కొన్ని భాగాలను మాత్రం ఉదహరిస్తాను.

"ఈనాటి పోకిళ్లకి నువ్వు తగవు నాయనా !
ప్రొమోషన్ కోసం తప్పు ఎవ్వరూ చమట కార్చరు."

"నీ భావాలు అనబడే పల్చటి దురదని రుద్దిరుద్ది
ఎందుకు పుండు చేసుకొంటావు ?"

'పల్చటి దురద' గమనించతగ్గది

నేను స్త్రీనని మరిచావా ? అనుకున్న వెంటనే మాట్లాడితీరాలి.

'కంచు, రాయి, భూమి, అనంతసముద్రం, వీటిశక్తి పరిమిత ప్రాణిని ముంచివేస్తుంది. ఈ బీభత్సంతో, పువ్వు కున్న బలంతో సౌందర్యం ఏ సంప్రదింపులు చెయ్యగలదు ?'

క్షుద్రజగత్తు తాకిడికి సౌందర్యం తట్టుకోలేదని దీని తాత్పర్యం. 'సంప్రదింపులు' అన్నదాంట్లో ఉంది కవి ప్రతిభ.

'ఈ కొవ్వొత్తి వెలుగు, నీడని ఎంతదూరం ప్రసరిస్తుందో మంచిపని ఈ కపట ప్రపంచంలో అంతగా ప్రసరిస్తుంది.'

'ఈ జీవితం, ఒక శుంఠ చెప్పిన కథనం— ధ్వని, కసి తప్ప వేరే అర్థంలేదు.'

కూతుళ్లు, అల్లుళ్లు ఆదుకోక విడిచేసినప్పుడు వృద్ధుడైన తండ్రి వాపోతాడు.

'నిప్పు చక్రానికి కట్టేశారు నన్ను,
కరిగిన సీసంలా నా కన్నీటి బిందువులే
నన్ను కాలుస్తున్నాయి.'

'బలహీనుల్ని లేవదీయడం ఒక్కటే చాలదు, నుంచో బెట్టగలగాలి.'

ప్రాణాలు విడిచేముందు, హామ్లెట్ స్నేహితుడుతో తనని గూర్చిన యదార్థాన్ని ప్రపంచానికి చాటవల్సిందిగా కోరుతూ అన్న మాటలు—

"నన్ను నీ మనస్సులో ఎప్పుడేనా తల్చుకుంటే,
ఒక్క క్షణం వినోదాన్ని మరిచిపో."

నాలాగే నువ్వుకూడా బాధపడు—అంటే, నా కథ చెప్పేటప్పుడైనా, నాలోని దిగులుని పంచుకో—అని.

ఒక చక్రవర్తి సాధించిం దేమిటి ?

'గాలి చొరనీయకుండా ఒక రంధ్రాన్ని
పూడ్చేటందుకే ఆ చక్రవర్తి మన్నయ్యాడు.'

'అతడు మరణించాడు—తలదగ్గర పచ్చగడ్డి కుప్ప,
కాళ్ళ దగ్గర ఒక రాతిబండ.'

'గంట గంటకీ పండిపోతూంటాము,
మళ్లా గంటగంటకీ కుళ్లిపోతూంటాము
అందు ప్రేళ్లాడుతూంది మన కథ.'

ప్రేళ్లాడ్డం యిక్కడ కూడా ప్రత్యక్షమైంది.

'అదృష్టదేవత దా నిష్టమొచ్చినట్లుగా మ్రోగించుకునే వాద్యం కానివారు, రక్తము, విచక్షణ సమంగా కలిసిన వారూ, ధన్యులు.'

'కామానికి బానిసకాని వాణ్ణివ్వు—
నా హృదయాంతరాళాల్లో ధరిస్తాను.'

'ధరించడం' షేక్స్‌పియర్ వింత ప్రయోగం.

'మంచంతటి పవిత్రత నీలోవున్నా నింద తప్పదు.' వేడి, ఉత్సాహం, వేగిరపాటులేని శీలం—మంచు లాంటిది, పవిత్రమైనదే కాని ఆకర్షించదు.

'నడివయస్సులో రక్తంలో తృష్ణ మచ్చికైంది,
విచక్షణ తీర్పులకి లొంగిపోతుందిలే !'

నా దోషాలు స్వర్గంలో కూడా వాసనేస్తున్నాయి.

'వారు, కాలం కూర్చిన సంక్షిప్త సారాంశం.'

సైన్యాధిపతి తన అనుచరులను సంతోషపెట్టే నిమిత్తం, వినోదాలు కల్పిస్తూ అంటాడు.

"ఈ రాత్రి వారి గాయాలనుండి, మధువు తొంగి చూడాల్సిందే." అని.'

మరిరెండు సుదీరమైన భావాలను ఉదహరిస్తాను.

ఆ ప్రధాన పాత్ర సద్గుణుడు. అట్లాంటి వ్యక్తిని హత్య చెయ్యడం న్యాయంకాదు. ఎంత మంచివాడు ?

'అతను సద్గుణుడు, నమ్రత గలవాడు. తన పని చెయ్యడంలో, తిన్నగా వ్యవహరిస్తాడు. దేవకన్యలు, అతని మంచి గుణాలను తమ నాలుకలకు బాకాలు కటుకుని ప్రచారం చేస్తారు, జాలి అనేది—అప్పుడే నగ్నంగా పుట్టిన పసివానికిమల్లే, గాలిలో స్వారిచేస్తూ కనబడిన రాజాశ్రితుల కంట్లో ముందు, ఇతడు చేసిన అన్యాయకృత్యాన్ని ప్రదర్శిస్తుంది.'

జాలిని పసివానితో పోల్చిన విధం గొప్పగాఉంది. ఆ పసివాడు గాలిలో ఎందుకు స్వారీ చెయ్యాలి ? మత గ్రంథాలలో దేవబాలురు ఆకాశంలో తిరుగాడుతున్న దృశ్యం జ్ఞప్తికొచ్చి ఉండాలి. పసివాడు—నగ్నంగా ఉన్న పసివాడుట—రెకమకలతో కూడినా ఇదొక అద్భుతమైన వరన.

షేక్స్‌పియర్ కవితా జగతి

హామ్లెట్ స్వగతంలో భాగాలు. తల్లి వ్యభిచరిస్తుంది. పినతండ్రి, తన తండ్రిని హత్యచేసి, తన తల్లిని వివాహ మాడతాడు. తన ఆస్తిని కూడా స్వంతం చేసుకుంటాడు. వారిమీద పగతీర్చుకోమని కోరతాడు తండ్రి. తానీపని చెయ్య వలసి వచ్చినందుకు బాధపడతాడు. ఆత్మహత్య చేసుకొంటే మంచిదనుకుంటాడు. కాని, ధైర్యం చాలదు. చచ్చి మరో చోటికి పోతే, అక్కడ ఇంతకంటె బాగుంటుందని ఎవరు చెప్పగలరు ? ఇక్కడ, ఈ లోకంలో బాధలుపడటం మంచిదా? చచ్చి, మరోచోట బాధలుపడటం మంచిదా ? ఆ స్వగతంలో కొన్ని భాగాలు.

"చావంటే భయం. ఆ భయంవల్లనే మనిషి ఎన్నో కష్టాలకు ఓర్చుకుని జీవిస్తున్నాడు. ఒక్క కత్తిపోటుతో ప్రశాంతతని పొందే మార్గం తన చేతిలో ఉండి కూడా— ఎన్నో కష్టాలు భరిస్తున్నాడు. కాలం కొరడాలు, క్రౌర్యం, నిరంకుశుల దుండగాలు, గర్విష్ఠుల అహంభావం, తృణీకరింపబడిన ప్రేమ, న్యాయస్థానాల కాలయాపనలు, అధికారుల నిరసన, శీలం కలిగి తెలివైనవారి పట్ల జ్ఞానహీనులు చూపే తృణీకారభావం,—వాటిని ఎవరు భరిస్తారు ?

కాలాన్ని గూర్చిన భావనతో ప్రారంభించిన ఈ పరామర్శని కాలం గూర్చిన మరో భావనతో ముగిస్తాను. కాలం ఎట్లాంటిది ?

దర్జాగా విందులుచేసే గృహస్థు. వెళ్లే అతిథుల్ని మృదువుగా కరస్పర్శచేసి, వారు వెళ్లగానే వచ్చే అతిథిని, చేతులుజాచి నవ్వుతో ఆహ్వానించి—వెళ్లేటప్పుడు నిట్టూర్పుతో వీడ్కోలిచ్చే విందుల గృహస్థు. శీలం తన ఘనత చెప్పుకుని ప్రతిఫలం కోరకూడదుస్మా !

ఎందుకు కోరకూడదు ?

కారణం ఏమిటంటే, సౌందర్యం, తెలివి, కుటుంబ గౌరవం, ఎముకల పటిమ, పనిలో నేర్పరితనం, స్నేహం, దానధర్మం—అన్నీ పరిసమాప్తం చేసే కాలం అసూయకి లొంగి పోతాయి.'

ఇట్లాంటివి చదివిన తర్వాత, మూడో నేత్రం తెరుచుకున్నట్లు, మరో కొత్త దృష్టి అలవరుచుకున్నట్లు, మహదానందం మనస్సులో వ్యాపిస్తుంది.

కళాశాలల్లో విద్యాభ్యాసంచేసి, ఇంగ్లభాషలో పరిచయం ఉన్న ప్రతి వ్యక్తిపైనా, కాస్తోకూస్తో షేక్స్‌పియర్ ప్రభావం పడితీరింది. ఆ ప్రభావం ఎట్లాంటిదో చెప్పడం కష్టం. వ్యక్తుల వింత చేష్టల్ని పరిశీలించి తమలో తాము నవ్వుకొనడంలో ఉండొచ్చు ఆ ప్రభావం. మనలో ఎన్ని మంచి గుణాలున్నా, శీలంలో ఏదోఒక పెద్ద లోటుంటే, ఆ లోటు పరిస్థితుల ననుసరించి పెరిగి, చివరికి మన పతనానికి కారణం అవుతుందని నమ్మి తమ శీలాన్ని ఎవరికి వారు పరిశీలించుకొనడంలో ఉండొచ్చు. మనిషి పైకెన్ని మాటలుచెప్పి, ఎన్ని వేషాలేసినా, స్వవిషయం వచ్చినప్పుడు, స్వార్థంచేసిన కసరత్తు ఫలితంగా ఉబికిన ఉద్రేకానికే లొంగిపోతాడు,— అల్లా జరక్కుండా దాన్ని అదుపులో ఉంచుకోవడం ప్రధానమని నమ్మి, అల్లా తమ ప్రవర్తనని మలుచుకోవడంలో ఉండొచ్చు, లౌకికమైన ప్రయోజనంతో నిమిత్తంలేని సౌందర్యంలేని ఆరాధించే స్వభావంలో ఉండొచ్చు. మాటల్లో, ఉపన్యాసాల్లో షేక్స్‌పియర్ సూక్తులను పొందుపరచడంలో ఉండొచ్చు. హాస్య రచయిత ఎస్.వి.వి. అన్నట్లు అప్పులవాడు డబ్బు అడగటానికి వచ్చినప్పుడు— "జీవితం నడిచే నీడ"— "క్షణం గెంతి, ప్రశమించి తెర వెనక్కి కుంటుకుంటూ వెళ్లే అప్రయోజక రంగస్థల నటులం నువ్వూ, నేనూ." అంటే అప్పు తీరదని తెలుసుకోవడంలో ఉండొచ్చు.

రచయితల్లో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనబడవచ్చు. షేక్స్‌పియర్ నాటకాలు బాగా చదివి, విద్యార్థుల మనస్సుకు పట్టేలాగా పాఠాలు చెప్పిన ప్రముఖ ఆచార్యులు తెలుగువారిలో ఎందరో ఉండేవారు, ఉన్నారు. షేక్స్‌పియర్ నాటకాలపై వ్యాఖ్యలు వ్రాసిన వారూ వున్నారు. గురజాడ నాటకంలో గిరీశం "ఏమిటోయ్, షేక్స్‌పియర్‌లా మొహం వేలవేశావ్ !" అనడంలో మానవునిలోని దౌర్బల్యాన్ని తిలకిస్తూ ఆలోచనా నిపుణుడైన షేక్స్‌పియర్‌ని అప్పారావు గారు ఎంత బాగా ఎరుగుదురో చూపుతుంది. నేటి కవితలో, గద్య రచనలో షేక్స్‌పియర్ ప్రయోగాల నీడలు, ధోరణులు ప్రతిధ్వనులూ అక్కడక్కడ దొరుకుతాయి. నుడికారం జాతీయం, సంప్రదాయం చెడనంతవరకూ ఈ పోకడలు హర్షించతగ్గవే. భాషకి, భావ ప్రకర్షకీ, కొత్త బిగినీ, లయనీ, ఊపునీ ఇస్తోందా? మానవ ప్రకృతి చిత్రణలో ఇదివరకు వెలుగు సోకని చోట్ల కాంతి ప్రసరింప చేసేటందుకు ఇది తోడ్పడుతోందా? అన్న ప్రశ్నలు వేసుకోవాలి. ఇంగ్లభాష గొప్పది. దానికున్న పలుకుబడి, దక్షతా, ప్రపంచ భాషలో మరే ఇతర భాషకీ లేదంటున్నారు. అట్టి భాషలో వ్రాసి గొప్ప కవిగా పేరుగాంచిన షేక్స్‌పియర్ ప్రభావం, అంతర్జాతీయ భావం పెంపొందాలంటున్న ఈ రోజుల్లో, ఇతర భాషల్లో కాస్తో కూస్తో కనబడ్డం హర్షించదగినదనుకుంటా.

పన్నెండేళ్లక్రితం ప్రచురింపబడిన నా 'చివరికి మిగిలేది'లో 'చీకటి రహస్యం' అన్న ఒక అధ్యాయంలో, షేక్స్‌పియర్ నాటకంలో

హామ్లెట్ మనస్తత్వాన్ని తర్కించడం జరిగింది. అందులోనూ నాయకుణ్ణి, హామ్లెట్ సమస్య ఎదుర్కొంటుంది. తల్లి చేసిన అపచారంవల్ల సమాజానికి దూరమౌతాడు. హామ్లెట్ తన తల్లిని ద్వేషిస్తాడు. ఇందులోనూ నాయకుడు తన తల్లిని ద్వేషించలేడు, ప్రేమిస్తాడు. హామ్లెట్‌ను గూర్చి వ్యాసం వ్రాస్తాడు. హామ్లెట్ తల్లిని పైకి ద్వేషించినా, లోలోన ప్రేమిస్తాడు. కావుననే, ఆమెను వెంటనే చంపడానికి సిద్ధం కాడని వ్రాసిన ఈ వ్యాసాన్ని ప్రచురించే ధైర్యంలేక, చించివేస్తాడు.

ఆ నవలలో కొన్ని మాటలు, వాక్యాలు చూడండి : ''ఆకాశం విశాలంగా నవ్వి, సూర్యుణ్ణి అరచేతి మేఘంతో కప్పింది.''.

''నిశీధిలో సృష్టించేసుకున్న మంటలో పడిజ్వాల'.

''ఎర్రటి శక్తి'' ''మానె జ్వాలల మసక చప్పుడు''.

''చీకటి సమస్య''. ''ఇసుక కాళ్లకింద చలితో ఒణికిపోతోంది'' ''రాత్రంతా మంచు పీల్చి వికసించలేని పుష్పంలాంటి ''— ఆమె చక్కదనం. ''యుగాల్లాగా కొండ శిఖరాలపై మంచు కురిపించి మత్తెక్కిన చంద్రబింబాలు— 'ఆ నేత్రాలు'' ''ఎర్రపూలను బంధించిన గడ్డిపోచలు'' ''ఆద్యంతాలున్నది కన్నీటొక్కటే.''

వీటి మూలాలు షేక్స్పియర్ రచనలలో ఉన్నాయో లేవో నేనెరగనుకాని, షేక్స్పియర్ నాటకాలు చదవక పోతే ఇల్లా వ్రాసి ఉండేవాణ్ణి కానని మాత్రం చెప్పగలను. కేంద్ర సాహిత్య అకాడమీవారు, షేక్స్పియర్ నాటకాలని, యునెస్కో సంస్థ ప్రోద్బలంతో, దేశభాష లన్నింటిలోకీ అనువదించే యత్నంచేస్తున్నారు. తెలుగులో కొన్ని మంచి అనువాదాలు వెలువడ్డాయికూడాను. ఇవిగాక, షేక్స్పియర్‌ని గురించిన ఒకటి రెండు పుస్తకాలను తెలుగులో,— వ్యవహారికంలో— అనువదించడానికి మరెవరన్నా పూనుకోవాలి. వాల్టర్ రాలె, ఇవర్ బ్రౌన్, వ్రాసినవి రెండు మంచి పుస్తకాలు. వీటిల్లో షేక్స్పియర్ జీవిత విశేషాలు, నాటకాల చరిత్ర, ఇతివృత్తం పాత్రల విమర్శ, తాత్విక చింతన సమగ్రంగా, గంభీరమైన భాషలో, కూర్చబడ్డాయి.



శత్రుఘ్న విజయ ప్రబంధము

శ్రీ కేతవరపు వేంకటరామకోటిశాస్త్రి

కార్వేటినగర సంస్థానమున పుట్టిన గ్రంథమిది. దీనిని రచించినది సుబ్రహ్మణ్య కవి. ఇంటిపేరు గరుడాద్రి వారు. కవియే స్వయముగా తన ఈ కృతికి "భావార్థ పేటిక" అనియొక వ్యాఖ్యానమును (టీక) వ్రాసి పెట్టినాడు: ఇందు మొత్తము ఐదాశ్వాసములు—పది వందల తొంబదియారు గద్య పద్యములు.[1]

సుబ్రహ్మణ్యకవి మరికినాటి బ్రాహ్మణుడు. వారాపస్తంబ సూత్రులు. శ్రీవత్స గోత్రజులు. భాగమాంబా సుబ్బావధానులకు నలుగురు కొడుకులు, ఒక్క కూతురు. కొడుకులలో సుబ్రహ్మణ్య కవి మూడోవాడు. ఈయన తన తాతగారినిగూడ పేర్కొనెను. ఆయనపేరు నరసింహావధాని. నరసమాంబ ఆయన భార్య. ఈ యొక్క శత్రుఘ్న విజయమునేకాక "దక్షిణామూర్తి స్తవము" అను శతకమునుగూడ తాను వ్రాసినట్లుగా సుబ్రహ్మణ్య కవి చెప్పికొనినాడు. శత్రుఘ్న విజయ ప్రబంధము వ్రాయబడి ఈ సంవత్సరమునకు సరిగా నూరేండ్లు.

> రస కరి ముని శశి సంఖ్యన్
> వసుధపంయున్ శాలివాహ వరశకగత వ
> ర్షసమితి వెలయున్ ప్రభవా
> ఖ్యసమన్ శత్రుఘ్న విజయమయ్యె శివుకృపన్.

రస=6, కరి = 8, ముని = 7, శశి=1. అనగా శాలివాహన శకము 1786వ సంవత్సరము. అది క్రీ.శ. 1864వ సంవత్సరము కనుక నీ సుబ్రహ్మణ్య కవి పందొమ్మిదవ శతాబ్దము ఉత్తరార్ధమునను బ్రతికినవాడు. తిరుమలరాజు నకాశ్రితుడు. ఈ విషయమును విశేషముగా గద్యలో చెప్పుకొనినాడు. "ఇది శ్రీ దక్షిణామూర్తి కృపాకటాక్ష వీక్షణానుక్షణ వర్ధమానాన వద్యే విద్యా నైపుణ్యాశరణశరణ్య సకలకలాకలాప ప్రభృత ప్రావృషేణ్య ఘనాఘనాతన భోజరాజ కవికల్పభూజ మాకరాజకుల కలశాంబుధి రాకాసుధాకర నిరుపమ గుణకీర్తి పరిమల తిరుమల రాజాఖ్య ప్రఖ్యాత మహారాజా శ్రితాగ్రగణ్య సుబ్రహ్మణ్య సుధీమణి ప్రణీతంబైన శత్రుఘ్న విజయంబను మహా ప్రబంధంబు నందు సర్వంబును పంచమాశ్వాసము" తిరుమల మహారాజు గారి యాశ్రితులలో తానగ్రగణ్యుడై నప్పటికిని సుబ్రహ్మణ్య కవి తన శత్రుఘ్న విజయ మహా ప్రబంధము నా ప్రభువున కంకితమీయలేదు.[2] అంకితమీయక పోవుటకు తిరుమల రాజుగారి చిత్తవృత్తమే హేతువుగా కనిపించుచున్నది. సుబ్రహ్మణ్య కవి ప్రథమాశ్వాసమున మొదటి 128 పద్యములలో పీఠికగా ననేక విషయముల చెప్పినాడు. అందీ గ్రంథమవతరించుటకైన సన్నివేశము చిత్రముగా చెప్పబడినది. కవి వ్యాఖ్యానముగూడ తానే వ్రాసికొనుటకు పూనుకొనినాడు గనుకనే తత్సన్నివేశమును మరియు విస్పష్టము చేయుటకు వీలైనది.

---

1. కాగితపు వ్రాతప్రతి రూపమున నీ ప్రబంధము కాకివాడ ఆంధ్రసాహిత్య పరిషత్తున కలదు. ప్రతి మంచి స్థితిలో నున్నది. వ్రాత కూడ విస్పష్టముగా నున్నది. 346 ఫుల్‌స్కేపు కాగితములు. అనగా 692 పుటలు. ఈ వ్రాత ప్రతిని చూచుకొనుటకు వీలు కల్పించిన పరిషత్కార్యదర్శి శ్రీ దంటు భాస్కరరావుగారికీ వ్యాసకర్త కృతజ్ఞుడు.

2. జూన్ 21 ఆదివారము ఆంధ్రప్రభలో "తిరుమల రాజున కీ గ్రంథము (శత్రుఘ్న విజయము) అంకితము చేయబడినది." అని శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాసినది పొరపాటు.

సుబ్రహ్మణ్య కవి తానొక కావ్యముచే చేయవలయునని నుంచి చెడ్డలాలోచించి నిశ్చయించుకొనినాడు. తన నిశ్చయమును 'రసజ్ఞ శిరోమణి' అయిన తిరుమలరాజ రాజేంద్రున కెరిగింపవలయుననిపించినది. అందుకాయన దర్శనము చేసుకొనవలయును. 'నోపేయాద్రిక్తహస్తేన రాజానం దైవతం గురుం'మ్మని న్యాయమున్నది కదా: అందువలన నొక పది పద్యములు వ్రాసి తీసుకుని పోయినాడు. అందు మొదటి పద్యమిది :

శ్రీ వాణీధవుఁ డిందిరా రమణియు న్సృష్టిస్థితుల్ సేయఁగా.—
భావంబుంగని చక్రపుద్ధతులనొంపన్సొంపు పెంపొంద సం
భావింపందగు భోగియోగ నిరతిన్భాసిల్లుచున్నిత్యఁ
క్షేమవర్ధిష్ణుఁడు కృష్ణుఁడీ తిరుమల శ్రీ భూపతిన్బ్రోవుతన్.

ఇక మిగిలినవి వరుసగా హరుని, భూపుత్రీ రఘునాధ్యహులను, శ్రీ నృసింహుని, బ్రహ్మను, పద్మాదేవిని, శీతగాత్మజను, వాగ్దేవిని, గణపతిని, కుమారస్వామిని, పై పద్యమునందువలెనే ప్రార్థించుచు వ్రాసినవి. ఈ విధముగా తాను వ్రాసి తీసికొని పోయిన పది పద్యములను రాజుగారికి వినిపింపగా నాయన "సమంచిత స్ఫురద్ఘన కనకాంబరాభరణ గాఢమ్ముడాకృతుల నాదరించి" ఇట్లనినాడట.

బ్రహ్మాధి గమ్య సమ్య
గ్బ్రహ్మాత్మైక్యానుభూతి పరుడవగుటను
బ్రహ్మణ్యుఁ డంద్రు నినుస
ద్బ్రాహ్మణులు కవిత్వ సరణి పారీణమతీ !
కావున నీవాగ్విభవము
పావన మికదానన్నైన భగవద్గుణ సం
సేవనము సర్వ పురుషా
ర్థావనచణ మనరె సభ్యులాడిన సరణిన్.

వ........................ వృథాభిమాన భరితులగు పురాతన ధరాపతులు చతురులమని తమపేర నంకితంబుగా శంకింపక ప్రబంధంబులు విబంధింప నియమించిరే మనవచ్చు నచ్చెరు వొయ్యెడి ...... నీయెడ జగన్మంగళ మంగళంబు రఘువీరోదార గుణోత్తరోత్తర చరిత్రంబు నందటి చిత్రంబగు శత్రుఘ్న విజయం బగ్రజయశో నికషంబగుఁ గాన దాని సర్వరస ధూర్వహ పూర్వోత్తరకాండ మండిత కథా సుధానుబంధ బంధురాపూర్వ సుందరంబుగా విరచించి సముంచితోక్తి నీశ్వర చరణ సరోజ పూజ యొనరింప నింపు జనింపుచున్నది ...... అదియునుంగాక నీ కవితా పాక.మేకశ్లోక వ్యాఖ్యా ప్రఖ్యాత లక్షణ దక్షిణ్యాన్యస్తవాదులు దిలకించినాడ గాన నవీనకృతి విధా మనస్కుండనైతి." ఇట్లని మరియు నారాజు కవిని ప్రశంసించినాడు. కావ్యరచనకు ప్రేరేపించినాడు. అట్లు ప్రేరేపింపబడి సుబ్రహ్మణ్యకవి శత్రుఘ్న విజయ ప్రబంధమును రచించినాడు.

తిరుమలరాజు పురాతన ధరాపతులు తమపేర కృతులను రచింపించుటను నిరసించి పలుకుట ఆయన వైశిష్ట్యమునకు నిదర్శనముగా నున్నది. తన నాశ్రయించుకొని యున్న కవి కావ్యము వ్రాయుదు ననగా దానిని భగవదర్పితముగా చేయుమని చెప్పగలిగిన ప్రభువుయొక్క పరమోదాత్తత యూహింపవలసి యున్నది. ఏతాదృగ్లక్షణ లక్షితుడైన ప్రభువు వంశమును వర్ణించి సుబ్రహ్మణ్యకవి తన పడిన ఋణము నొక విధముగా తీర్చుకొనినాడు. కవి వర్ణించిన క్రమమున తిరుమలరాజుగారి వంశపురుషులను గూర్చి రేఖామాత్రముగా వ్రాయుటవలని ప్రయోజన మాశించి వ్రాయబడుచున్నది.

సూర్యుడు కలడు. ఆయనకు వైవస్వత మనువు పుట్టెను. ఆమీద తద్వంశమున సగరాది మహాచక్రవర్తులు జన్మించిరి. వారి పిమ్మట మాకరాజు, వానికి బమ్మరాజు కలిగిరి. బమ్మరాజుకు భార్యలు నలుగురు. గంగాంబ పెద్ద భార్య. ఆమెకు కావేరరాజు, వేంకటపెరుమాళ్ నృపాలుడు— అని ఇద్దరు కొడుకులు. తిరుమల కొండాంబ చివరి భార్య. ఆమె కొడుకు తిరుమలాధీశుడు. బమ్మరాజు భార్యలలో మిగిలినవారు తిరుమల కొండాంబ — మాకాంబ — వేంకట పెరుమాళ్ నృపాలుడు వేంకటాంబను పరిణయించెను. వారికి బమ్మరాజు పుట్టెను. ఆయన విజయలక్ష్మమ్మగారిని, తిరుమల కొండమ్మగారిని, కామాక్షి తాయారమ్మగారిని వివాహము చేసికొనెను. విజయలక్ష్మమ్మగారికి కుమార వేంకట పెరుమాళ్ రాజు పుట్టెను. మరియు నొక కూతురు కూడ కలిగెను. కుమార వేంకట పెరుమాళ్ రాజు రాజయ్యెను. ఆయన కిద్దరు భార్యలు. కోనమాంబ పెద్దది. గంగమక్క చిన్నది. కోనమాంబకు ముగ్గు రాడపిల్లల తరువాత కుమార విజయ వీరరాఘవరాజు పుట్టెను. గంగమక్కగారికి బమ్మరాజు, కావేరరాజు, శింగరిరాజు అని ముగ్గురు కొడుకులు పుట్టిరి. బమ్మరాజు రెండవ భార్యయైన తిరుమల కొండాంబ గారి కొడుకు తిరుమలరాజు. ఈ తిరుమలరాజుగారి ప్రేరణము వల్లనే శివాంకితముగా సుబ్రహ్మణ్యకవి ఈ శత్రుఘ్న విజయమును రచించినాడు.

ఏ రాజశేఖరు నా రాము దర్శకా
మములతో ధర్మంబు నమర బ్రోచు

నే రాజరాజుతో నా రాజు పోరన
మారాడ వెరచి సన్మార్గ మొందు
నే రాజవర్యు పన్నీరజ యుగళంబు
రాజాళిమౌళి నీరాజితంబొ
యే రాజ మందార మీ మాకరాజాన్వ
యాబ్ధి బుట్టి ధరా మరార్తి నణచె
నతడు కుపిత రిపు క్షోణిపతి కిరీట
తట సముద్భట భటకోటి పటుకరోటి
పాట నవ్యాగ్ర జాగ్రత్కృపాణ కేళి
రమ్య గుణశాలి తిరుమల రాజమౌళి. 1—113

2

శత్రుఘ్న విజయమని పేరు మాత్రమే కాని రామా కథ యంతయును సంగ్రహముగా నిందు కలదు. లయిదాశ్వాసములలోను పరుచుకొనియున్న యితివృత్తమును సూచించిన చో నా విషయము తెలియును—అయోధ్యాపుర వర్ణనముతో కథ మొదలైనది. దశరథుడు పుత్రకామేష్టి చేయుట—బ్రహ్మాదులు శ్రీ మహావిష్ణువును ప్రార్థించుట—కౌసల్యాదులకు శ్రీరామాదులు జన్మించుటతో ప్రథమాశ్వాసము ముగిసినది. ద్వితీయాశ్వాసము శ్రీ రామాదుల శైశవ వర్ణనముతో మొదలై విశ్వామిత్రాగమనము, తాటకా సంహారము, యాగ సంరక్షణము, మిథిలాగమనము, గంగావతరణము, సీతాకల్యాణము, పరశురామ సంహారము, అయోధ్యా ప్రవేశము, శ్రీరామ పట్టాభిషేక ప్రయత్నము, శ్రీరామ వనవాసము, దశరథ మరణము, పాదుకా పట్టాభిషేకము, ఖరదూషణ సంహారము, సీతాపహరణము, శ్రీరామ విలాపము, సుగ్రీవ సమాగమము, వాలి వధ, సీతాన్వేషణము, హనుమంతుడు లంకకు పోవుట—చేరుట, యుద్ధము, ఇంద్రజిద్వధ, రావణ సంహారము, ఇత్యాది ప్రధాన ఘట్టముల నిముడ్చుకొని శ్రీరామ పట్టాభిషేకముతో పూర్తియైనది. మూడవ యాశ్వాసమునుండి ఉత్తరకాండ కథ. అగస్త్యాదులు వచ్చి రాక్షస వంశ కథలను చెప్పుటతో మొదలై సీతా పరిత్యాగము తదుపరి శ్రీరాముని విరహదుఃఖము నుపశమింపచేయుటకు చెప్పబడిన నృగు చరిత్ర—కుక్క కథలతో మూడవ యాశ్వాసము ముగిసినది. చ్యవనాదులు కొలువు దీర్చిన శ్రీరాముని దర్శింపవచ్చి మధుని గూర్చిన విరములను పలికి లవణుని దుర్ణయములను పేర్కొనుటతో చతుర్థాశ్వాసము ప్రారంభింప బడినది. లవణుని బలపరాక్రమములు చ్యవనాదులు చెప్పగా శ్రీరాముడు భరత శత్రుఘ్నులను జూచి మీలో లవణు నెవరు వధింతు రనినాడు. భరతుడే తానని చెప్పునంతలో శత్రుఘ్నుడు లేచి తాను పోవుటలో గల యౌచిత్యమును చెప్పి అన్నగారిని తనకు సుముఖుడుగా చేసికొనెను. శ్రీరాముడు లవణుని గూర్చి చెప్పి, వానిని వధించి వాని రాజ్యమును సక్రమముగా పాలింపవలెనని చెప్పుచు మధురా రాజ్యమునకు రాజుగా శత్రుఘ్నుని యభిషేకించినాడు. శత్రుఘ్నుడు శ్రీరాముని స్తుతించి లవణుని మీదకు బయలుదేరినాడు. మార్గ మధ్యమున వాల్మీకి దర్శనము—ఆయన సుదాసుని కథ చెప్పుట—కుశలవుల జన్మము ఇత్యాదులు జరిగినవి. వాల్మీకి యాశీర్వచనముతో బయలుదేరిన శత్రుఘ్నుడు చ్యవనుని దర్శించినాడు. లవణుని గూర్చి యింకను తెలుప గోరినాడు. మాంధాతృ చరిత్రము విని యమున దాటి మధుర చేరినాడు. లవణు డంతకు మునుపే వేటకు పోయినాడు. మధ్యాహ్న మగుసరికి లవణుడు తిరిగి వచ్చినాడు. లవణ శత్రుఘ్నులకు సంవాదము జరిగినది. లవణు నింటికి పోనీయక శత్రుఘ్ను డెదుర్కొనినాడు. యుద్ధము జరిగినది. శత్రుఘ్నుడు శ్రుతిని పఠించి ఘోరాస్త్రములను పొంది లవణుని వధించినాడు. దేవతలచేత కీర్తింపబడుచు శత్రుఘ్నుడు మధురను ప్రవేశించి రాజ్యమును స్వీకరించి 12 సంవత్సరములు పాలించి శ్రీరాముని దర్శించుటకుగా నయోధ్యకు బయలుదేరినాడు. చ్యవనుని, వాల్మీకిని దర్శించి వారి ప్రశంసల నందుకొని అయోధ్యకు చేరినాడు. శ్రీరాముడు శత్రుఘ్నుని ప్రేమగా నాదరించి, రాజ్యము విడిచియుండరాదని చెప్పి తిరిగి మధురకు వానిని పంపినాడు. ఇంతటితో చతుర్థాశ్వాసము సమాప్తమైనది. 3

శత్రుఘ్న విజయ మిచ్చున్
శాత్రవ జయ మెవడు వినినం జదివిన లక్ష్మీ
ధాత్రీ పతి నిజకరుణా
పాత్రత సంపద లొసంగు బ్రబలున తడిలన్.

అను ఫల శ్రుతితో నీ యాశ్వాసము ముగింపబడినది.

శ్రీరాముడు బ్రాహ్మణ శిశువును బ్రతికించుటతో పంచమాశ్వాసము మొదలైనది. దండకారణ్యో నామహేతు కథనము, అశ్వమేధ ప్రశంస—ఇలోపాఖ్యానము ఇత్యాదులయిన తరువాత శ్రీరామాశ్వమేధము చెప్పబడినది. బంగారు సీతా ప్రతిమను పెట్టుకొని రాముడు యజ్ఞమును ప్రారంభించినాడు. వాల్మీకి యాగమునకు వచ్చినాడు. దినమున కిరువది సర్గలు రామాయణమును వినిపింపుడని కుశలవుల కానతిచ్చి

---

3. వ్రాతప్రతిలో నీ చతుర్థాశ్వాసమున 54 వ పద్యము లేదు. అందుకుగాను కొంత జాగా వదలబడి యున్నది.

యానతిచ్చినాడు. వారు ''జతయ్యై'' వీణలుగొని పాడిరి. శ్రీరాముడు కుశలవులను గుర్తించెను. సీతను పిలిపింపగా నామె వాల్మీకి వెంట వచ్చినది. శపథము చేసినది. ఆమె భూమిలో ప్రవేశించినది. శ్రీరాముడు భూదేవిపై ఆగ్రహించినాడు. ఆపిమ్మట శమనుడు శ్రీరాముని యొద్దకు వచ్చినాడు. వారేకాంతమున నుండగా దుర్వాసుడు వచ్చుట— లక్ష్మణ నిర్యాణము—కుశలవులను దక్షిణోత్తర కోసలముల కభిషేకించి శ్రీరాముడు సరయూనదిని ప్రవేశించి స్వస్థానము చేరి నిజమూర్తిని ధరించుట, బ్రహ్మాదులా మూర్తిని నుతించుటతో పంచమాశ్వాస మైనది. ఇట్లితివృత్తము పరిసమాప్తమగుటతోడనే కవి దీనికొక ఫలశ్రుతి చెప్పినాడు.

ఈ రామాయణము నరులు
దారమతిన్ విన చదువ హితాయుర్లక్ష్మీ ౘ
భూరమణీసుత మోద భ
రారోగ్యములన్ బ్రసన్ను లగుదురు పుడమిన్. 5.131

మరియు రామాయణమును గాయత్రీ సంపుటితమయ శ్రుతి గేయ దివ్య మృదు మధుర వచశ్శ్రీ యోజితముగా ప్రశంసించి చివరకు

శత్రుఘ్న విజయ సంజ్ఞన్
ధాత్రిన్మత్కృతిత తత్ప్రధానత రసిక
శ్రోత్ర సుఖావహ కృతులన్
జైత్రంబై వెలయు గాత శంకరు కరుణన్. 5.135

అని ముగించినాడు సుబ్రహ్మణ్యకవి. రామాయణ కథ యంతయును సంగ్రహముగా నిందెట్లు గలదో ఇప్పుడు స్పష్టముగా తెలియుచున్నది.

3

సుబ్రహ్మణ్యకవి కవితాశక్తి కలవాడే కాని కావ్య నిర్మాణ దక్షుడు కాడు. ప్రబంధ రచనా పటిష్ఠమతియు కాదు. అయినచో శత్రుఘ్న విజయమును సంగ్రహ రామాయణముగా తయారుచేసి యుండడు. అగ్రజ యశోనికషమైన శత్రుఘ్న విజయమును పూర్వోత్తరకాండ మండిత కథా సుధానుబంధ బంధురాపూర్వ సుందరంబుగా రచించుటను గదా తిరుమలరాజాగారు కోరినది !—అందువలన సుబ్రహ్మణ్య కవి పూర్వోత్తర కాండముల కథను నిబంధించినాడన వచ్చును. కాని, శత్రుఘ్న విజయము ప్రధానము. పూర్వోత్తర కాండముల కథ గ్రహింపబడినంతవరకు ప్రధాన విషయ దీప్తికి తోడ్పడవలయునే కాని దాని నణచివేయరాదు. సుబ్రహ్మణ్యకవి వ్రాసిన మహా ప్రబంధమున చతుర్థాశ్వాసము మొత్తము శత్రుఘ్న విజయేతి వృత్తము క్రింద జమకట్టుకొన్నను మొత్తము గ్రంథములో నది మూడవ వంతు కంటెను తక్కువ. అప్రధాన విషయము రెండు వంతులును ప్రధాన విషయ మొక వంతునుగా రచించిన కవికి నిస్సందేహముగా నితివృత్త నిర్వహణమునందౌచిత్య విచారజ్ఞానము లేదనియే చెప్పవలయును, ఇట్టి కవు లాంధ్ర వాఙ్మయమున చాలమంది కలరు. మంది బలముమీద తప్పు ఒప్పుకాదు. కాకూడదు. పోనీ ప్రబంధ మనినాడు కదా యని, విచారించినను, ప్రాబంధికమైన వర్ణనా వైశారద్యమును నిండా లెస్సగా లేదు. ఆ లేకపోవుటకు హేతువు విస్తారమైన కథను సంగ్రహించుకొనుటయందే కవి దృష్టిని కే రింపవలసి వచ్చుట. అదియునుగాక ప్రబంధములయ కథ కవకాశములేదు. అవకాశములేని దాని కవకాశము వలసి వచ్చుట వలన, అవకాశ ముండవలసిన వర్ణనమ కాశము కల్పింపలేకపోయినాడు. కాని, సుబ్రహ్మణ్య మాత్రము తన గ్రంథమున శత్రుఘ్న విజయమునకె ప్రాధాన్య ముండవలయునన్న ఇచ్ఛమాత్ర మున్నది. ఆ యిచ్ఛ నాయన నిర్వహించుకొనలేక పోయినాడు. ''శత్రుఘ్న విజయ సంజ్ఞన్ ధాత్రిన్మత్కృతిత తత్ప్రధానత'' ఇత్యాదిగా చెప్పుకొనుట, దానికి ప్రాధాన్యము లోపించుచున్నదనియే కావచ్చును. చతుర్థాశ్వాసాంతమున శత్రుఘ్న విజయమునకు ఫలశ్రుతిని చెప్పుట, పంచమాశ్వాసాంతమున రామాయణమునకు ఫలశ్రుతిని చెప్పుట మొదలైనవి కూడ కావ్యప్రబంధ రచనానుగుణములు కావు. ఈ పరిస్థితులలో దీనిని శత్రుఘ్న విజయ ప్రబంధ మనుటకంటె సంగ్రహ రామాయణ మనుట లెస్స. కాని, కవి యట్లనలేదు.

4

సుబ్రహ్మణ్యకవి మంచి పండితుడు. బహు విషయము లెరిగినవాడు. శాస్త్ర విషయములతోపాటు వేదాంత విషయమునను గట్టి ప్రవేశము గలవాడు. ఆయన తన కృతికి తానే వ్యాఖ్యానము గూడ వ్రాసికొనినాడు గనుక పై విషయములు స్పష్టముగా తెలియుచున్నవి. ప్రతిపదార్థ విశేషార్థములు సప్రమాణముగా నిరూపించుచు, అవసరమునుబట్టి తాత్త్వికవిషయ విచారణము చేయుచు వ్యాఖ్యానమును కొనసాగించినాడు.

మామూలు వృత్తములతోపాటు సుబ్రహ్మణ్యకవిపృథ్వి, మత్తకోకిల, తరలము, భుజంగ ప్రయాతము, మందాక్రాంతము, లయ విభాతి, క్రౌంచపదము, కమల విలసితము,

లాటీవిటము, సరసిజము, శిఖరిణి, భాస్కర విలసితము, సుగంధి, కవిరాజ విరాజితము, మానిని, మాలిని—ఈ మొదలైన విశేష వృత్తములను యత్ర తత్ర రచించినాడు. పద్య రచనయందు కవి బాగుగా చేయి తిరిగినవాడు. బంధ కవిత్వమునందును నీయన గట్టివాడు. షోడశదళ కమలబంధ సీసము, పుష్కరిణీబంధ కందము, మత్తేభ గర్భిత సీసమ్ము వ్రాసినాడు. ఈయన కవితాశక్తి—పద్య రచనా సామర్థ్యమ్ము తెలియుట కయిదారు పద్యములుదాహరింపబడుచున్నవి.

అయోధ్యాపుర వర్ణన :

ఇందిరా మందిరా మందసుందర పృథు
ప్రాసాద కాసార భాసురంబు
జాలాంతరోద్వాంత కాలాగురు ప్రేక్ష
ణా లోల బర్హ భృన్నీలకంఠ
ముద్యాన హృద్యాన వద్యానతా నేక
సద్విజా(శయు శాఖ శాఖిచయము
గీతామృత ద్రవ చ్ఛీతాంశవాశ్మ వా
ర్జాతాదర భ్రమ చ్చాతకంబు
సతతవాద్రిత సచ్ఛ(స్త్ర సర్వశా(స్త్ర
వాద మోదానుమోద ప్రమేదుర ప్ర
సన్న సన్నిహితా మరాచార్య వాళి
చాలనంబుల నొప్పు నేవేళ బురము. 1—140.

ధనుర్భంగ సన్నివేశము:

ఆకృష్ట(తుటిత ప్రకృష్టధనురుద్దాపార ధారాళఘో
రా కారారవ ధావదామర గిరీంద్ర క్షోభకుష్యద్దరి
త్కోణ కట్య ప్రబల ద్దరిత్కరి భవన్నాడైక్య నంపత్తిన
షోత్కాజాండ కరండ భేదమగునం చూహించి రాలో
జనుల్. 2—64

శ్రీరాముని సీతా వియోగ దుఃఖము:

నిధి గోల్పోయిన పేదవోలెనపు డున్నిద్రానురాగంబుచే
శిథిలీభూత రసాంతరుం డగుచు హాసీతే దయాశీతలే
క్వధి గత్యంత చిరాయితం హససి కింకాంతం ముఖం తేధునా
విధు జైత్రం మధురం ప్రదర్శయ యనున్ వేమారు
దిక్కుల్ గనున్. 2—133.

సీతను జూచిన తరువాతి హనుమంతుని వీరావతారము.

అట పిదప్ పుట భేదనం బదర బాహాస్ఫాల నోల్లాసియై
త్రుటితో త్పాటిత వృక్షవాట చటులో ద్భూతధ్వని ప్రస్ఫుర
త్రుటిమోద్య త్కుటిల భ్రమ ద్భృకుటి విభ్రామ్య ద్భటౌ ఘస్ఫుటో
త్కట కోటీర కుటీని పాతన మహా దత్యంబు
జూపెన్ పడిన్. 2—173.

వసంతము :

కలకంఠ స్ఫుట కంఠఘోష శుకకంఖాణౌ ఘ హెూషార్భటుల్
విల సత్ప్రస్వరస భ్రమద్రమర వహ్వీటంక్రియాలం కృతుల్
వెలయన్ స్వారి మరుం డరుంతుద శరా విద్ధాధ్వగ స్వాంతుడై
బలు శీవిన్ వెడలెన్ హుటాహుటి పటు ప్రత్యగ శీలోద్ధతిన్.3—135.

సీతారాముల వన విహారము :

చవి వని చూచి పూచెనిది జానకి దీనికిఁ గానగా సమం
బని యొక వస్తువంటే, గను మంచున నించుక వంచి వంచితేం
దు నిజ ముఖాబ్జ వీక్షణ మధువ్రత పాతనజాత నవ్య రా
గ నిరుపమాత్మ వక్త్రరుచి గంచు ధరాసుత వాద రింపుచున్. 3—144.

5

సుబ్రహ్మణ్యకవి తన విద్వత్తుచేత ప్రబంధ యుగానంతరపు ప్రౌఢ కవులలో నొకడుగా కనిపించుచున్నాడు. శత్రుఘ్న విజయము తెనుగులో గల భాషా కావ్యములలో గణింప దగినది గనే యున్నది. కవికృతము వ్యాఖ్యానము కూడ గలదు కావున దీని కదియొక విశిష్ట లక్షణము. ఈ ప్రబంధ రచనక్కు ప్రేరకుడైన తిరుమలరాజు దీనిని శివాంకితముగా వెలయింపించుట ఆయన చిత్తౌన్నత్యమును నిరూపించుచున్నది. కార్వేటి నగర సంస్థానమున వెలసిన ఈ ప్రబంధము వ్రాత(పతి రూపమున నింక కొంతకాలముండి జీర్ణమగుటకు ముద్దుగ ముద్రింపబడుట్లు మంచిది. దీని ప్రచురణము వలన ఆంధ్ర వాఙ్మయమునకు భాషా పాండిత్యముల రూపమున లాభమే గాని నష్టములేదు. మరియు కార్వేటి నగర సంస్థాన చరిత్ర విషయ పరిజ్ఞానమునకును దీని ప్రచురణము దోహదకారి కాగలదు.

వీక్షణాప్రభ

శ్రీ రమణారెడ్డి

పల్లబడుతున్న పడమటిని పుల్లగిలుతున్న తూర్పుతో ముడిబెట్టింది రేబవళ్ళ కోమలసంధి
తక్కువ వన్నె బంగారం మంచు గూడారంలో వెండికడ్డీగా మెదులుతూంది మెరుపు
వాలబడిన నెలను నాగరంగా రాలుతున్న చుక్కల్ని రవనగలు చేసుకున్నతనువు గగన
సంబంధి

తూలివలితో సోకేగాలి కౌగిలిలో దాగుంది సౌరభాల సంగీతాల సుతారపు కూర్పు
మొగ్గలో మొనసూపి తెలుగుమీరిన పరువాన్ని మిసిపసిమిబుగ్గకు నిగ్గుగాపూవుమార్చుకొంది
కనుజీకటి వదలబారగా తేకువను కంటికీ తేలికను ఒంటికీ తెచ్చుకొంది ప్రభాతశాంతి
మొగాన రేయెండ సోకగా రోజారేకు తెలుపుకింద పైకుబికే నును ఎర్రన సందర్శనీయంగా
ఉంది

కంచెరలాడుతున్న వెలుగుపోరలలో జిలుగునాగుల తళమిల కలిగిస్తోంది దృగ్భ్రాంతి.

★

ఆకులనే ముంజేతి కంకణాలలో కిరణాల మగటిమిచూచి మైమరచిన కన్నె ఘొట్టులోని బెట్టు
పొద్దుపొడుపు మొగమై కూర్చున్న ముతక చక్కదనాల కుప్ప కవళిక
ఎక్కడివక్కడే నిలిచీ జరీజాలరీలుగా అల్లిబిల్లిగా కదిలే చివుళ్ళ చిందు రట్టులోని గుట్టు
పోతుటీగల చురుకుమీసల పోకిళ్ళనే గమనించని పిల్లపూవు అమాయిక
మోకాలిపై చుబుకం మోపి చూపులతడిని ముంగురుల వడితో కలగలిపిన భావస్వాచ్ఛందత
మమతా రహితపు ఊహాల దారంపోసి గాలిలో విహారించే తేలిక దినుసు
ఏకాంతాలోచనా సమాధిలో కలకనులరదెరిచి సగంతమకాన జగంసోయగం చూస్తున్న
అర్భకత
మగకళ్ళు తేళ్ళై కోర్కెల కొండెలు దించే పోట్లకు చెక్కుచెదరనంత ఎదబిరుసు.

★

తెలవారకముందే మొదలైన వేణు నికుంజాల ప్రాణవాయువులు అలసాగించే పురాణ
రాగాలు
బీదపడిన బీటిపొలపు బీటలను తడపకనే తనిపే వేనవేల వానశాల్లు

వీక్షణ ప్రభ

గెలలో మోఁవులో మెదిలే సారంగలపసరు తరువు తనువంతటా కెరలిస్తున్న పునర్నవ భోగాలు

ఎదగోరి గూటిలో కొడిగట్టిన జాగృతిని జ్యోతిగావిస్తున్న గాలివేళ్లు.
సర్వసన్నుతమైన స్త్రీత్వసమక్షాన పురుషాహంకారం కుంగివంగి అద్భుతాక్రాంతమైన పసిగందు

ప్రాణం వింజామరమై నయనం నీరాజనమై దేహాన దేవాలయ ప్రతిష్ఠ
స్వాధిక్యజ్ఞాన స్ఫురణైనా లేని సౌందర్య సాధుత్వం సమకూర్చదు భోగేచ్ఛకు బకాసురుని విందు

ప్రణయం మిథునాన్ని అధఃకరించి పొందగలదు అనధీనతా పరాకాష్ఠ.

★

కళతళలాడే సన్నటినున్నటి రేకులుగా విప్పివేసుకొంటున్నది పచ్చగన్నేరు తనలోని సోకు
తరగలు నురగలు చెంగలువలు చిరుచేపలు చేరిన నీరవ స్వరమేళ కోనేరు
నీలబాలగగనం ఉలికి కులికేంతగా ఆకుల కితకితలతో కవుంగలించుకొంటున్నది పోకమాకు
జ్వరపడుతున్న శిలాహృదయాలలోనుండి సాలీడై ఎండ వణుకుతున్నది కాంతిజల్తారు
నిండుగా దండిగా పరిసరాలు ధరించిన పచ్చటిచీర కదిలితే తరంగిణి కదలక శాద్వలభూమి
పండి పసిడిఉయ్యాల జంపాలలై పరవశాన ఊగి జోగుతూంది వరిచేను
నిత్యానిత్యాలను సమాధానపరిచే భావనైంద్రజాలంలో రామణీయకమే కావ్య ప్రాణనేమి
బుద్బుదాలు బింబించే ఇంద్రధనస్సుల మీదికి వర్షాకాశమే శీర్షం వంచేను.

★

అందరివలెనే నేనూ కను భ్రమిశాను బొంగరమై భ్రమించాను జలసలాడూరింది వెచ్చటి వెన్నెల
కాని అహం సర్పమై కాటందలేదు ఊహను మోహాగ్నికి శలభం కాలేదు మేను
మందగించి మోడు బారివుండిన నా చైతన్యానికి చిగురు గగుర్పాటు సమకూర్చింది అందపు హేల
కంఠమెత్తి సౌందర్యానుభూతి పికీగీతియై జీవనచష కాన మధుగానం నింపేను
గంధమై ముకుపుటాల కెగదన్ని మెదటిని దున్ని మోటుదనపు కలుపుల నుత్తరించింది నాగలిలీల
ఉపస్నాక్త కారుడైన ఆర్ష కవి ఆవేశించా డప్పుడీ అభ్యుదయకవిని
అందీ అందని పలచని వెలుగై నగిషీ జిలుగై నిలకడ పొందిన జాగ్రత్స్వప్నమే కావ్యగతకళ
ఉప్పెనవంటి ఆగభోగసంగీతం ఊపున కాలిపట్టు తప్పిన దుర్బలజీవిని."

ఉప్పరిసి పెళ్ళలు పెచ్చులై రాలుతున్న కావ్యభాషా బంధాగారంలో నిర్బంధించక
తప్పలేదు

పడమటి పూలసిగలో మొగిలిరేకైన నెలబాలుడి అపరంజి సోగని
ఉన్నరూపాలను ఉండవలసినట్లుగా చూపెట్టజాలని పాతకీత అద్దం దాచిపెట్టనే పెట్టలేదు
పచ్చిరంగురంకులాడి వగలమారి చూపులాడి ప్రకృతి నాణ్యాలపోగని
కునుకులో వలెగాలి వేలితో తాకి నీడజాడతో పాకి చిక్కీ చిక్కక హృదయైక వేద్యం అను
భూతి

పాటలో పదంలో చిట్టడివి చిక్కును ఉద్యానంగా చక్కజేయలేను

మిణుగురుబూచిని పట్టిదాని చిరుదీపంలోని చోద్యాలను వెలిదీయడం శుష్కశాస్త్రరీతి
పుటకలో మట్టిపురుగైన మనిషికి రెక్కలు మొలిచినా అందదుమిన్ను.

★

వెలికంటికి కానరాక చంద్రగుడి వెనకదాగి వన్నెచిన్నెల వీణాతంత్రుల మోగించే కిన్నెర
పాడక పాడేదేమిటో తెలిసింది: దర్శనం క్షణికం భావనం సార్వకాలికం
వేలుపు చేతికే చిక్కే ఎండమావుల జలతరంగిణీ వాదనలో వీనులకెక్కని సుస్వరధార
పలకక పలికేదేమిటో తెలిసింది: తృష్ణపాశవికం తృప్తి మానుషికం
సాదా మెదటిగూటిలో ఇమడని ఊహావిహంగమం తీరైన పట్టురెక్కలో గల ఉక్కు
చాటక చాటింపు వేసే సందేశం ఇదీ: నేలవైపుబరువు నింగివైపు సులువు
పాతబడిన అభిప్రాయాల నేలపాతరలనుండి బయల్పడిన మనస్సు చెప్పే నవీన్యరుక్కు
సారాంశం సమస్తం ఇంతే: కవికి యథార్థం నడక కల్పనం లగువు.

★

వేసవిలో చిటికెనవేలే మిగిలినంతగా సన్నగిల్లిన వాగును అపలక్షించా నింతకుమునుపు
అందుబాటైన అంబరాన్ని అలలగోళ్ళతో చీల్చే నృసింహహస్తాన్ని ఊహించలేదు
వింతలకు వెలిబడిన నా పేదకళ్లు ఉన్నదానిని ఉండవలసినట్లుగా కట్టుకోలేదు రూపు
అంతరంగాన్ని బట్టి నఖశిఖపర్యంతాన్ని వాసననుబట్టి పుష్పాన్ని దర్శించలేదు
వస్తువును నిర్జీవిగాగాక పరిణామసంబుద్ధిగా నిరంతరవృద్ధిగా ఇప్పుడు గ్రహించుకొంటున్నా
ఫలంనుండి బీజానికీ ఫలితం నుండి కారణానికీ తిరోగమనం సాగిస్తున్నా నిపుడు
వృక్షవిశేషం నుండి విరాడ్వ్యాపినాన్ని వర్షబిందువునుండి మహాసింధువునీ సాధిస్తున్నాను
ప్రభక్షణికం కావచ్చుగాక సౌదామినీ ప్రభావాన్ని కాలుడైనా చెరపడు.

నేపాలీకవి భానుభక్త

శ్రీ ఏ. ఎస్. రామారావు

ప్రపంచ పర్వత శిఖరాలలోకెల్లా మహోన్నతమైన కైలాస (ఎవరెస్టు) గిరి శిఖరాన్ని శిరోభూషణంగా ధరించిన నేపాలు దేశాన్ని తెలియనివా రుండరు. రణరంగాలలో ధైర్య సాహసాలను ప్రదర్శించడంలో నేపాలు దేశస్థులైన గూర్ఖా వీరులకు సాటి వేరొకరు లేరని అందరికీ తెలిసిందే. అయితే, ఆ జాతి జీవభాషయైన నేపాలీలో, ప్రజల భాషలో—తన రచనల ద్వారా, ఆ దేశ ప్రజ లందరినీ సమైక్యపరుస్తూ, సుసంఘటితమైన పరిపాలనా వ్యవస్థకు బలం చేకూర్చడంలో నేమి, జీవభాషయైన మాతృభాషకు గౌరవప్రపత్తులను సంతరింపజేయడంలో నేమి, దేశీయ భాషయైన నేపాలీలో సాహిత్య సృష్టికి ఒకటిన్నర శతాబ్దాల క్రితమే గట్టి పునాదులు వేయడంలో నేమి—తన జీవితాన్నే అర్పించిన మహాకవి భానుభక్తను తెలిసినవారు అరుదుగా ఉండవచ్చు.

నేపాలీ భాషను అంధకారం ఆవరించుకున్న కాలంలో, సాహిత్యసృష్టికి ఆ భాష అర్హతని పొందని తరుణంలో భానుభక్త అవతరించాడు. ఆతని అవతరణతో నేపాలీ భాషా సాహిత్యాలను అలుముకున్న చీకట్లు పటాపంచ లైనాయి. భానుభక్త అవతరణ నేపాలీ జాతికీ, భాషా సాహిత్యాలకూ అపూర్వమైన వెలుగును, జీవాన్నీ, ఉజ్వలమైన ప్రగతినీ ప్రసాదించింది.

మహాకవి భానుభక్తను పరిచయం చేసుకునే ముందు నాటి నేపాలు దేశపు రాజకీయ, భాషాసాహిత్యాల పరిస్థితులను పరిశీలించడం అవసరం.

భారత ఉపఖండంలో నేపాలు దేశం విస్తీర్ణం అతి స్వల్పమే అయినా, క్రీ. శ. 16 వ శతాబ్దం వరకూ పలు రాజ్యాల పరిపాలనలో ఉండేది. ఆయా రాజ్యాధినేతలు పల్లు జాతులకూ, వివిధ భాషా వర్గాలకు చెందినవారు. ఆ రాజ్యపాలకులు ఏ భాషావర్గానికి చెందినవారైతే, వారి రాజ్యంలో వారి భాషకే ప్రాధాన్యత ఉంటూ ఉండేది. అయితే ఏ ఒక్క భాష సాహిత్యసృష్టికి అర్హతను సంపాదించలేకపోయింది.

పైగా, భారతదేశంలో వలెనే ప్రాచీన నేపాలు దేశంలో కూడా సంస్కృతభాషకే రాజాస్థానాలలో గౌరవం లభించేది. సంస్కృతభాషా సాహిత్యాలపై అపారమైన అభిమానంవల్లనైతేనేమి, ప్రభువుల ప్రాపకాన్ని సంపాదించడాని కైతేనేమి—నాటి నేపాలీ కవి పండితులంతా తమ సాహిత్య సృష్టిని సంస్కృతభాషలోనే చేసేవారు. కాని, ఏ ఒక్కరూ ప్రాంతీయ భాషలైన మగధి, సౌరసేని, సర్బాతే, నేవారీ మున్నగు భాషలలో సాహిత్యాన్ని సృష్టించేటందుకు ప్రయత్నించలేదు. ఆ కారణంగా ప్రాచీన నేపాలు దేశంలో సాహిత్యసృష్టి యంతా సంస్కృతభాషలోనే రూపొంది—మహామహులైన సంస్కృత విద్వత్కవులనూ, అపూర్వమైన సంస్కృత సాహిత్యాన్నీ సాహిత్య ప్రపంచానికి సమర్పించింది.

క్రీ. శ. 1559 లో నాటి వరకూ బల సంపన్నమైన రాజ్యంగా ఉంటూ వచ్చిన ఖర్గా సంస్థానాధీశ్వరులను 'ఖాస్ వంశస్థుడైన ద్రవ్యషా ఓడించి గూర్ఖా రాజ్యాన్ని వశపర్చుకున్నాడు. ఈ విజయం నేపాలు చరిత్రలో నవశకానికి నాందిగా పేర్కొనవచ్చును

ఈ వంశజుడైన మహారాజా పృథ్వీనారాయణ్ షా తన రాజ్యకాలంలో దేశంలోని సంస్థానా లన్నిటినీ వశపరుచుకుని, అఖండ నేపాలులో ప్రప్రథమంగా హిందూ సామ్రాజ్యాన్ని నెలకొల్పి ఏకఛత్రాధిపత్యం వహించాడు.'

పందొమ్మిదవ శతాబ్దం నాటికి షా వంశస్థుల రాజ్యం తూర్పున తీష్టానది నుంచి పడమట పంజాబు వరకూ విస్తరిల్లింది.

మహారాజా పృథ్వీనారాయణ్ షా పలు సంస్థానాలను ఒకే పతాకం క్రిందికి తీసుకురాగలిగినా, విభిన్న జాతులను సమైక్యపరచగలిగినా, ఆయా జాతులు విభిన్న భాషావర్గాలకు చెందినవారు కావడంచేత ప్రజలమధ్య భావ సమైక్యతకు అవరోధం కల్గింది. పైగా, పరిపాలనా సౌలభ్యానికై రాజ్యంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండగలిగే అర్హతను ప్రాంతీయ

నేపాలీకవి భానుభక్త

భాషలలో ఏ ఒక్కటీ సంపాదించుకొనకపోవడంతో రాజ్యాధినేతలు అనేకమైన చిక్కులను ఎదుర్కొనవల్సి వచ్చింది.

నాడు సంస్కృతం రాజాస్థానంలో గౌరవాన్ని పొంది ఉన్నా, ఆ భాష పండితుల వరకే పరిమితం కావడంచేతనూ, సామాన్య ప్రజలకు అందుబాటులో లేకపోవడంచేతనూ పరిపాలనా భాషగా గుర్తింపబడే అర్హతను సంపాదించలేకపోయింది. షా వంశస్థుల మాతృభాషయైన ప్రాకృతభాషా స్వరూపం "పర్బాతే" (వ్యవహారిక నేపాలీ) భాషకు రాజాస్థానంలోనూ నిత్య పరిపాలనా వ్యవహారాలలోనూ పలుకుబడి హెచ్చినా ఆ భాష మాట్లాడే ప్రజలు పరిమితంగా ఉండడంవల్లనూ, ఆ భాష స్వరూపం సంపూర్ణతను పొందిఉండకపోవడం వల్లనూ అధికార భాషగా వ్యవహరింపజాలకపోయింది. వీటికి తోడు నాటి పండితులు వాడుకలో నున్న ఏ ఒక్క ప్రాంతీయ భాషను ఉద్ధరించకపోవడంతో దేశ పురోగతికి ఆటంకం కలగడంతోపాటు, స్థానిక భాషల ప్రగతికి అవరోధం ఏర్పడింది. అంతేకాదు—స్థానిక భాషలలో సాహిత్యమే కరువైంది.

ఇట్టి విషమ పరిస్థితులలో మహాకవి భానుభక్త అవతరించాడు. మహారాజా పృథ్వీనారాయణ్ షా దేశంలో రాజకీయ సమైక్యతను సాధించినట్లుగా, మహాకవి భానుభక్త ప్రజల భాషలో సాహిత్యాన్ని సృష్టించడం ద్వారా నేపాలీ భాషా సాహిత్యాలలో మహత్తరమైన విప్లవాన్ని సాధించాడు. తద్వారా సాహిత్యాన్ని ప్రజలందరికీ సన్నిహితపరచడమే కాకుండా, విభిన్న భాషా వర్గాల మధ్య భావ సమైక్యతను సాధించాడు. ప్రజల భాషయైన నేపాలీ భాషకు గౌరవాన్ని సంతరింపజేస్తూ, ఆ భాషలో సాహిత్యానికి నాడే బలమైన పునాదులు వేశాడు.

భానుభక్త నేపాలులో తానాహు జిల్లాలోని రాంఘా గ్రామంలో 1814 లో జన్మించాడు. భానుభక్త తండ్రి ధనంజయ ఆచార్య ప్రభుత్వోద్యోగిగా ఉండేవారు. రాజ్యకార్య నిర్వహణలో తనకు తరచూ స్థానచలనాలు కలిగే అవకాశం ఉండడంవల్ల, ఆయన భానుభక్త సంరక్షణ భారాన్ని తండ్రి శ్రీ కృష్ణ ఆచార్యకు అప్పగించారు. తాతగారి సంరక్షణలోనే భానుభక్త బాల్యం విద్యార్థిదశలు గడిచాయి. శ్రీకృష్ణ ఆచార్య నాడు దేశంలో పేరెన్నికగన్న సంస్కృత విద్వాంసులలో నొకరు. ఆయన తన మనుమని విద్యాభివృద్ధికై విశేషంగా పరిశ్రమించారు. ఆ కారణంగా, భానుభక్త చిన్నవయస్సుననే సంస్కృతభాషా సాహిత్యాలలో అపారమైన పాండిత్యాన్ని గడించుకున్నాడు. అటుపిమ్మట ఉన్నత విద్యాభ్యాసానికై సరస్వతీ నిలయమైన కాశీ విద్యాపీఠానికి వెళ్ళాడు. కాని, తన తండ్రికి అస్వస్థత కారణంగా భానుభక్త తన విద్యాభ్యాసాన్ని నగరంలోనే చాలించవల్సి వచ్చింది.

అప్పటికే సంస్కృత సాహిత్యాన్ని విశేషంగా జీర్ణించుకోవడంతో భానుభక్తకు ప్రకృతంతా ఎంతో వింతగా అగుపించింది. "అతనిలోని కవి" సృష్టిలోని విచిత్రాలను చూసి పరవశించసాగాడు. భానుభక్త వీలైనంతవరకూ నగరంలోని కృతక వాతావరణపు పొలిమేరలు దాటిపోయి పచ్చని పొలాలనూ, పల్లెప్రజల జీవితాలనూ పరిశీలిస్తూ వారి సంభాషణలలోని మాధుర్యాన్ని అనుభవిస్తూ ఉండేవాడు. ఆ స్థితిలో—సౌందర్యోపాసన, సాధువర్తన, ఆధ్యాత్మిక చింతనా ప్రవృత్తి కలయికలతో మూర్తీభవించిన భానుభక్త హృదయంలోని కవనశక్తి ఒక్కమారుగా విజృంభించింది. ఆ కవి హృదయతంత్రులు రామనామాన్ని స్పందింపచేయి. అంతటితో ఆదికవి వాల్మీకి విరచితమైన శ్రీమద్రామాయణ మహాకావ్యాన్ని అసాధారణ ప్రతిభా సంపత్తితో, అంతవరకూ సాహిత్యభావగా అర్హతకు నోచుకొనని మాతృభాషయైన నేపాలీ భాషలో అనువదించ పూనుకొని నేపాలీ భాషా సాహిత్యాలలో అపూర్వమైన విప్లవానికి నాయకత్వం వహించాడు. భానుభక్త రచన కుద్యమించినకొలది దినాలకే (1841) 'బాలకాండ' అనువాదం పూర్తిగావించాడు.

కాని, తండ్రి అస్వస్థతతో, తానొక్కడే సంతతి కావడంవల్ల కుటుంబ వ్యవహారాలన్నీ చూసే బాధ్యత స్వీకరించవలసి వచ్చింది. తత్కారణంగా రామాయణానువాదం నిల్చిపోయింది. మరికొంతకాలానికి తన తండ్రి మరణంతో భానుభక్త మరిన్ని విపత్కర పరిస్థితులు నెదుర్కొనవలసి వచ్చింది. ముఖ్యంగా ఆర్థిక సంబంధమైన రాజ్య వ్యవహారాలతో తన తండ్రి చేసిన అవకతవక పను లన్నిటికీ భానుభక్త బాధ్యుడైనాడు. ఈ కారణంగా భానుభక్త రాజధానీ నగరమైన ఖాట్మండూకు కొనిపోబడి ఐదు మాసాలపాటు నిర్బంధంతో ఉంచబడ్డారు. "ఏ కీడైనా మేలునే చేకూరుస్తుంది" అన్న నానుడి భానుభక్త విషయంలో యదార్థమైంది. ఈ నిర్బంధం భానుభక్తకు విలువైన కాలాన్ని, నేపాలీ భాషా సాహిత్యాలకు అపూర్వమైన, అమూల్యమైన, అత్యావశ్యకమైన అవకాశాన్ని ప్రసాదించింది. ఈ ఐదు మాసాలలో ఆయన రామాయణ మహాకావ్యంలో మరొక నాలుగు కాండల్ని అనువదించాడు.

ప్రజల భాషయైన నేపాలీలో కావ్యరూపంలో అంతవరకూ వచ్చిన భానుభక్త రామాయణానువాదం అతి స్వల్ప కాలంలో అతి ఎక్కువ ప్రచారాన్ని పొందింది. ప్రప్రథమంగా సాహిత్యం సామాన్య ప్రజల హృదయాలను చేరింది. హర్ష ప్రఫుల్లమైన హృదయాలతో ప్రజలంతా రామకథను అన్ని

వలా గానం చేయసాగారు. ఇట్టి మహత్తరమైన కావ్యాన్ని పఠించిన తతిమ్మా భాషా వర్గాలకు చెందిన ప్రజలు తాము కూడా రామాయణ గానసుధాపానం చేయ సుత్సుకతతో నేపాలీ భాషను అభ్యసించసాగారు. ఆ ఉత్సాహం—అచిరకాలంలో దేశంలోని ప్రజ లందరినీ ఒకే భాషా సూత్రంతో సమైక్యం చేసింది.

సలక్షణమైన, నిర్దుష్టమైన పదజాలాన్ని భానుభక్త తన రామాయణ రచనకు సమకూర్చుకొనడంతో—ప్రాకృత భాషా స్వరూపమైన "పర్బాతే" (నేపాలీ) భాషపై విశేషంగా సంస్కృతభాషా ప్రభావం పడి, ఆ భాష ప్రత్యేక స్వరూపాన్నీ సంపూర్ణతనూ సిద్ధింపజేసుకున్నది. సుస్థిరమైన పరిపాలనా వ్యవహారాలకు రాజ్యమంతటా ఒకే భాష లేకపోవడంతో నాటి వరకూ సంకట పరిస్థితుల నెదుర్కొంటున్న రాజాధినేతలకు ఒక గడ్డు సమస్యను పరిష్కరించడమే గాక, నేపాలీ భాష అధికార భాషగా గుర్తింపబడింది. అంతేకాక, అంతవరకూ సాహిత్యకారుల దృష్టి నాకర్షించని మాతృభాషయైన నేపాలీ భాష నాటినుంచి సాహిత్యభాషగా అర్హత నార్జించుకొన్నది. నాడు భానుభక్త నిర్మించిన సుగమమైన బాటలలో అనంతరం వచ్చిన సాహిత్యకారులంతా పయనిస్తూ, నేపాలీ భాషలో సాహిత్యాన్ని ఉత్పత్తి చేస్తూ, తతిమ్మా ప్రపంచ భాషా సాహిత్యాలకు వలె ప్రగతిపథాన నేపాలీ సాహిత్యాన్ని నడిపించడానికి వీలును కల్పించింది.

మహాకవి భానుభక్తను నేపాలు రాజ్యాధిపతులు 1850 లో ఒక ఉన్నతమైన పదవిలో నియమించారు. కాని, ఆ కవి హృదయానికీ, యాంత్రికమైన ప్రభుత్వ కార్యకలాపాలకూ సయోధ్య కుదరకపోవటంవల్ల భానుభక్త అచిరకాలంలోనే ఉద్యోగాన్ని విరమించాడు.

భానుభక్త 1853 నాటికి రామాయణ కావ్యంలో మిగిలిన కాండల్ని అనువదించాడు. అదే సంవత్సరంలో "భక్తమాల" అను సృజనాత్మకమైన నేపాలీ కావ్యాన్ని రచించాడు. ఆ్మట ఈ కావ్యం మరొక విద్వాంసునిచే సంస్కృతభాషలోనికి అనువదించబడింది. భానుభక్త విరచితమైన మరొక సృజనాత్మక నేపాలీ కావ్యం "వధుశిక్ష". ఇది గృహిణులకు హితబోధ గావించే ముప్పది కూడు కవితలుగల చక్కని కావ్యం. 1862 లో భానుభక్త తన స్నేహితుడైన తారాపతి యింట అతిథిగా ఉంటూ ఒకే రాత్రితో రచించాడు. "ప్రశ్నోత్తరి" అను మరొక మహా కావ్యాన్ని కూడా నేపాలీ భాషలోనికి అనువదించి సామాన్య ప్రజలందరికీ అందించాడు. ఇవి కాక, వివిధ కథావస్తువులను తీసుకుని పలు కవితలను రచించాడు. భానుభక్తలో మరొక ప్రత్యేకత ఏమంటే— మిత్రులకు లేఖలు వ్రాసినా, ప్రభుత్వానికి మహజర్లు పంపినా, ప్రజలకు హితం చెప్పినా కవితల్లోనే చెప్పేవాడు. సాహిత్య దృష్ట్యా ఇవన్నీ అమూల్యమైన రచనలు. భానుభక్త రచనలలో సరసమైన, సున్నితమైన హాస్యం లభిస్తుంది.

భానుభక్త సాహిత్యరచన కుపక్రమించినది మొదలు జీవితాన్ని భారతికే అంకితం చేశాడు. అస్వస్థుడుగా ఉన్నప్పటికీ ఏకైక కుమారుడైన రామనాథ్ ను సరసన కూర్చుండబెట్టుకుని తాను కవిత్వం చెబుతూ కుమారునిచేత వ్రాయించేవాడు. కడకు అవసానదశలో కూడా "రామగీత" ను తను చెబుతూ, కుమారునిచే వ్రాయింపించి, శ్రీమద్రామాయణం అనువాదం సంపూర్ణం చేయగలిగానన్న సంతృప్తి హృదయం నిండగా 1868 లో కడపటి శ్వాసను విడిచాడు.

మహాకవి భానుభక్త పండితవంశంలో జన్మించినా, తను కూడా సంస్కృతభాషలో మహా విద్వాంసుడైనా, తన పూర్వులవలె సంస్కృతభాషలో సాహిత్యాన్ని సృష్టించడానికి పూనుకొనలేదు. జీవభాష యైన మాతృభాష నేపాలీలో కావ్య రచన కుద్యమించి, నేపాలీ భాషా సాహిత్యాలలో అపూర్వమైన శిల్పనాన్ని సాధించాడు. మాతృభాషలో సాహిత్యమే కొరవడిన దుస్థితి నుంచి నేపాలీ భాషాసాహిత్యాలను సంరక్షించి, నాడే నేపాలీ సాహిత్యానికి గట్టి పునాదులు వేశాడు. నేపాలీ జాతికి చైతన్యాన్నీ, నేపాలీ భాషా సాహిత్యాలకు ఉజ్వలమైన ప్రగతినీ ప్రసాదించి—అమరకవిగా, ఆధునిక నేపాలీ సాహిత్య యుగ పురుషుడుగా చిరస్మరణీయు డైనాడు మహాకవి భానుభక్త.

తేజోరేఖలు

శ్రీ సంజీవదేవ్

వర్షం, ఎండా, ధూళీ, మంచూ, చంద్రుడూ, చెట్లూ మొదలైనవి సుకుమార హృదయాల్లో రసానందపు ప్రకంపన లను సృష్టించే కొన్ని విశేష దృశ్యాలు.

వేసవిలో వర్షం, చలికాలంలో ఎండా, ఉదయాన మంచూ, సాయంత్రం ధూళీ, శరత్‌లో చంద్రుడూ, వసంతంలో చెట్లూ చూడటానికి ఆనందమయంగా ఉంటవి. ఎండలో వర్షం మనోహరంగా కనుపిస్తుంది. దగ్గరలోని ధూళిగుండా దూరపు మంచు రమ్యంగా గోచరిస్తుంది. చెట్ల ఆకురాలిన కొమ్మలగుండా చంద్రుడు లావణ్యంగా కనుపిస్తాడు. అందుకే ఒక కవి గానం చేశాడు :

> "Now I hung the moon
> On the pine
> Now I took it off the tree."

> చంద్రుని ఇప్పుడే
> చెట్టున వేశా
> మళ్లీ ఇపుడే తీసివేశా.

ప్రకృతి శోభను ఆనందించటం అనేది ఒక పవిత్రమైన సౌందర్యతత్వం. వర్షం, ఎండా, ధూళీ, మంచూ, చంద్రుడూ, చెట్లూ, వీటి వెలుగు వెలిగిస్తుంది ద్రష్ట హృదయంలోని దీపాన్ని.

* * * *

కొందరి కోరికలు ఎక్కువ ప్రయత్నం లేకుండానే నెరవేరుతవి, ఎంతో ప్రయత్నం ఉన్నాకూడా కొందరివి నెరవేరవు. ఎక్కువ తెలివిగలవాళ్లు శ్రమపడికూడ పరీక్షల్లో తప్పటం, తక్కువ తెలివికలవాళ్లు తక్కువ శ్రమపడి ఉత్తీర్ణులు కావటం కనుపిస్తూంటుంది. ఇటువంటి ఘటనలు ఒకోసారి హేతు వాదానికి అందనట్లు కనుపిస్తవి. కాని హేతువాదానికి అతీతం, అనుకునే వాటి కెన్నిటి మూలంలోనో హేతువాదమే ఉంటుంది. మన కార్యసిద్ధికి మన ప్రయత్నాలు మాత్రమే చాలవు. కార్యసిద్ధికి తోడ్పడటానికి ఇంకెన్నో ప్రాముఖ్యమైన విషయాలున్నవి. పరిసరాలు, ముఖ్య స్థానాలలో ఉండాలసిన ప్రత్యేక వ్యక్తులు, కార్యాన్ని సాగించతగిన తరుణం మొదలైన వాటన్నిటిమీదా కార్యసిద్ధి ఆధారపడి ఉంటుంది. ఇవన్నీ కలసివచ్చినప్పుడు మామూలుకంటే తక్కువైన మనిషి కూడ కొద్ది ప్రయత్నంతోనే సఫలతచెందగలడు. ఇవన్నీ సమకూడనప్పుడు మామూలుకంటే మించిన మనిషికూడా ఎంత ప్రయత్నించినప్పటికీ విఫలత చెందుతాడు !

కాని ఈ అనుకూలతల ప్రతికూలతల విషయం ఏమిటి? ఒకళ్ల ఎడల అనుకూలత ఎందుకని, మరొకళ్ల యెడల ప్రతికూలత ఎందుకని ? అది కాకతాళీయమా ? దీన్ని విశదీకరించటంలో 'అదృష్టం' అనే పదాన్ని సహాయంగా తీసుకుంటారు తరచుగా. అదృష్టవాదం అనేది పునర్జన్మ సిద్ధాంతంతో ముడిపడి ఉంటుంది. పునర్జన్మ సిద్ధాంతం ఆత్మయొక్క అమరత్వంతో అతికి ఉంటుంది.

ఏమైనప్పటికీ, అదృష్ట సిద్ధాంతంలోని కొంత భాగం సహేతుకమేమో అనిపిస్తుంది. అదృష్టం అనేది కార్య కారణ సంబంధంతో సంబద్ధమై ఉంటుంది. కారణంలేంది కార్యమేలేదు. క్రియలన్నీ ప్రతిక్రియలుగా రూపొందుతవి. ఈ అనంత బ్రహ్మాండ గోళమంతాకూడ కార్యకారణాల అనంత చక్రం. మానవుడు తాను చేసిన కార్యానికి ఫలితమే తాను. కనుక తన భాగ్యానికి తానే కర్త. ఏదీకూడా ముందుగా నిర్ణీతమై వుండదు. అంతా స్వేచ్ఛాపూరిత నిర్ణీతమే. ఈ అర్థంలో అదృష్టవాదం అనేది మానవుణ్ణి స్వేచ్ఛామానవుణ్ణిగా స్వేచ్ఛాపూర్ణ ఆలోచకునిగా తయారుచేస్తుంది. తన స్వేచ్ఛా జీవనపు స్వేచ్ఛాసౌధాన్ని నిర్మించుకోటానికి !

* * * *

కాబోయే పౌరునకు శారీరక మానసిక వికాసాల్ని కలిగించటంలో విద్యయొక్క లక్ష్యం కేవలం ప్రజ్ఞానాన్నివ్వటమేకాదు. లాలిత్యాన్నివ్వటంకూడ.

కాని ఎక్కువమంది— విద్యావంతులలో భోగట్టా మాత్రమే ఎక్కువ కనిపించి ప్రజ్ఞానమూ లాలిత్యమూ లోపించి ఉంటూన్నవి. వారిలో మేధకు సంబంధించిన జాగృతికాని

హృదయానికి సంబంధించిన మాధుర్యంకాని, సమీక్షాత్మక హేతువుకాని, సృజనాత్మక చేతనకాని అంతగా వికసించినట్లు కనుపించవు. మానవునికి సంస్కృతి ప్రసాదించటం విద్య యొక్క ఒక ముఖ్య లక్ష్యమైనప్పటికీ విశ్వవిద్యాలయాలనుంచి వారు తగినంతగా సంస్కృతి లేకుండానే బయటికి వస్తున్నారు.

ఇందుకు వ్యతిరేకంగా, సగం చదివినవారిలోనూ, అసలు చదవనివారిలోనూ కొందరిలో, చదివినవారిలోలేని సంస్కృతి కనుపిస్తుంటుంది. ఈ సగం చదివినప్పటికీ అసలు చదవనట్టి వారిలో పదునైన మేధా, రసమయ అభిరుచీ, మధురమైన పర్తనా, లలితమైన జీవనం గోచరిస్తవి. విద్యకూ సంస్కృతికీ మధ్య దూరం ఏర్పడుతుంది.

*　　*　　*　　*

భయం అనేది మానవుడు జయించాల్సిన అన్నిటికంటే గొప్ప శత్రువు. స్మరణాతీత కాలంలోని ఆదిమ మానవుల్లో ఉండి ఉన్న భయతత్త్వం ఆధునిక మానవునిలోకూడ నశించక అదే విధంగా ఉండిఉంది.

రాజనైతిక భయం, ఆర్థికభయం, సాంఘిక భయం, కౌటుంబిక భయం, వ్యక్తిగత భయం, ఇవన్నీ ఆధునిక మానవుణ్ణి నిరంతరం బాధిస్తూ, మానసికంగా అశాంతి కలిగిస్తూ ఒకవిధమైన మానసిక రోగిగా తయారుచేస్తున్నవి. పగలూ రాత్రీకూడా ఆర్థిక విషయాల గురించీ, వ్యాధులా వ్యధలా గురించీ, జీవన మరణాల గురించీ మానవుడు భయభీతుడై పోతున్నాడు.

లోకంలోని దుఃఖాలూ బాధలూ అన్నిటికీ భయం అనేదే మూలం ప్రధానంగా. మానవుణ్ణి చుట్టివున్న చీకటి కంతా భయం అనేదే జన్మస్థానం. భయాన్ని జయించటమే శాంతికీ, సౌఖ్యానికీ, ఆనందానికీ రాచబాట.

పరిశీలన, వివేకం, అంతర్దృష్టి ఉంటే మానవజీవితంలోని ఈ మిథ్యాభయం సమూలంగా రూపుమాసి పోతుంది. భయం అంతరించటమే ఆనందం ఆవిర్భవించటం.

*　　*　　*　　*

ఈ సూర్యుని క్రింద ఏదీ క్రొత్తదికాదు. అయినా ప్రతిదీ క్రొత్తదే. సూర్యుడు క్రొత్తవాడేమీకాదు. సృష్టి ప్రారంభంనుంచీ సూర్యుడు నిత్యం ఉదయిస్తూనే ఉన్నాడు. అస్తమిస్తూనే ఉన్నాడు. అయినా, నిత్యం క్రొత్తవాడే సూర్యుడు. నిన్నటి సూర్యుడు నేటి సూర్యుడుకాదు. ఆకారం పాతదే అయినా అంతర్యం మాత్రం క్రొత్తదే. నిత్యం సూర్యుని బరువులోనూ, తాపమానంలోనూ మార్పు ఉంటూనే ఉంటుంది.

అందుకే సూర్యుడు క్రొత్తవాడు కానప్పటికీ క్రొత్తవాడే.

నది ఎప్పటి పాతదే, అయినా అది ప్రతి క్షణమూ నిరంతర నూతనమే. ప్రతి క్షణమూ సరిక్రొత్త నీరే అందులో ప్రవహిస్తూంటుంది కనుక నిత్య నూతనమే. అయినా అది పాతదిగానే కనుపిస్తుంది.

మనం క్రొత్తదిగా తలచి అభివ్యక్తపరచే భావం ఏదీకూడా క్రొత్తదికాదట. ఎప్పుడో, ఎక్కడో, ఎవరిచేతనో అది ఇదివరకే అభివ్యక్తపరచబడి ఉంటుందట. అందుకే డాక్టర్ సి.జి.యూంగ్ అంటాడు. "మనం భావాలను సృష్టించం, భావాలే మనను సృష్టిస్తవి." అని.

అయినా, మనం అభివ్యక్తపరచే భావం అభివ్యక్తపరచే రీతినిబట్టీ, వాడిన శబ్దాలనుబట్టీ, నూతనంగానే గోచరిస్తుంది. అందుకే నిజంగా ఈ సూర్యుని క్రింద ఏదీ క్రొత్తదికాదు. అయినా అంతా క్రొత్తదే!


*　　*　　*　　*

కొందరు తమలో ఉన్న సృజనాత్మక ప్రతిభనో, లేక సమీక్షాత్మక ప్రతిభనో, లేక ఉభయ ప్రతిభలనో చూచుకు గర్విస్తే మరికొందరు తమలో అటువంటివి లేనందుకు అదే విధంగా గర్విస్తారు! మొదటివారు తాము కవులమనో, గాయకులమనో, చిత్రకారులమనో, భౌతిక శాస్త్రజ్ఞులమనో, రసాయన శాస్త్రజ్ఞులమనో, జీవశాస్త్రజ్ఞులమనో, భూగర్భ శాస్త్రజ్ఞులమనో గర్విస్తూంటే, ఇక రెండవవారు తాము అటువంటివారమేమీ కామనీ, అటువంటి విషయాలు తమకేవీ తెలియవనీ, అటువంటి వాటన్నిటికీ తాము దూరంగా ఉంటామనీ ఇంకా ఎక్కువగా గర్విస్తారు.

కొందరు తమలో జ్ఞానమున్నదని, గర్విస్తే మరి కొందరు తమలో అజ్ఞానమున్నదని గర్విస్తారు. బహుశా రెండవ వారిలో ఉన్న అల్పత్వానుభూతి (inferiority complex) కి తల్లక్రిందుల ప్రతిబింబమై ఉంటుంది. వారిది అభావ విరక్తియేమో?

*　　*　　*　　*

కొందరి ప్రతిభలు బహుముఖంగా ఉంటవి. సాహిత్యంలో, సంగీతంలో, చిత్ర రచనలో, అన్నిటిలో అభిరుచిని మాత్రమేకాక ప్రగాఢ పరిజ్ఞానాన్నే కలిగివుంటారు. ఇటువంటివారు తమ ప్రత్యేకతను నిలుపుకోటానికి చేసే పనులు ప్రత్యేకంగానే ఉంటవి. కవుల సమ్మేళనంలో వీరు చిత్రకళను గురించీ, చిత్రకారుల సమావేశాలలో కవిత్వాన్ని గురించీ ప్రసంగిస్తారు. ఇంగ్లీషు రచయితలతో వీరు తెలుగు సాహిత్యాన్ని గురించీ, తెలుగు రచయితలలో ఇంగ్లీషు సాహిత్యాన్ని గురించీ ముచ్చటిస్తారు. అనుమతి కనక లభిస్తే వీరు మహిళా సభల్లో పురుషుల గొప్పదనాన్ని గురించి ప్రసంగిస్తారు!



హృదయకంటకము

శ్రీ దేవరెడ్డి వెంకటరెడ్డి

విశ్వ మానవుల వ్యథలకు
వెక్కి యేడ్చు మనసు, కాని
ఆర్తుల నోదార్చు రచన
కై ఒప్పదు నా లేఖిని.

వ్యథిత మానవాళి గూర్చి
బలిమి చేసి వ్రాయబోదు
కాని - కలము సిరా రాల్చు
కన్నీ రొలికించునట్లు.

ఔను! కలము దుఃఖించును!
అహర్నిశలు నన్ను చూచి
ఎంత వ్యథను బిగపట్టెనో?
ఇంత నల్లనయ్యె సిరా!

ఎదలో భావమ్ము పొంగి
కుదియించును నన్నెప్పుడు
వ్రాయుమంచు అరచు, కాని
ప్రత్యుత్తర మేమిత్తును?!

గంటము వినదయ్యె, హృదయ
గత భావము నిలువదయ్యె
రెంటిని ఓదార్చ లేక
కంటకమైపోయె బ్రతుకు.

ఆర్త పామరాళి కింత
అండ యాచు నిలుతునేమొ?
కాని - కవికి దారిద్ర్యము
కలకాలము నిల్చుగదా!

సాయమింత చేయలేక
సానుభూతి నాపుకోక
ఎద రగిలే వ్యథావహ్ని
ఎప్పుడు చల్లార్చు ప్రభూ?

కుంభరాశి

శ్రీ దివాకరుని వెంకటసుబ్బారావు

జ్యోతిషశాస్త్ర ప్రాముఖ్యత —

స్వయం స్వయంభువా సృష్టం చక్షుర్భూతం ద్విజన్మనాం।
వేదాంగ జ్యోతిషం బ్రహ్మపరం యక్ష హితావహం॥
మయా స్వయంభువః ప్రాప్తం క్రియాకాలా ప్రసాదనమ్।
వేదానా ముత్తమం శాస్త్రం త్రైలోక్యాహితకారకం॥

గార్గి మహర్షి పై శ్లోకరీత్యా జ్యోతిషము వేదాంగమని తనకు బ్రహ్మవలన ప్రాప్తించినదని చెప్పియున్నాడు.

వేదస్య చక్షుః కిలశాస్త్రమేతత్
ప్రధాన తాంగేఽపుతతో గజాతో।
అంగైర్యుతోఽన్యై పరిపూర్ణమూర్తిః
చక్షుర్విహీనః పురుషో న కించిత్॥

ఇది వసిష్ఠ వచనము :

యథాశిఖా మయూరాణాం, నాగానాం మణయో యథా।
తద్వద్వేదాంగ శాస్త్రాణాం జ్యోతిషం మూర్ధనిస్థితం॥

మయూరములకు పింఛమువలె నాగులకు మణివలె వేదమునకు జ్యోతిషమని భావము.

విధాత్రా లిఖితా యాసౌ లలాటేక్షరమాలికా।
దైవజ్ఞస్తాం పఠే ద్వ్యక్తం హోరా నిర్మలచక్షుషా॥

బ్రహ్మ వ్రాసిన నొసలి వ్రాతను దైవజ్ఞులు స్పష్టముగా హోరాశాస్త్రమునే నేత్రముతో పఠింపగలరని కళ్యాణ వర్మ వచనము.

పై అంశముల పరిశీలించిన జ్యోతిశ్శాస్త్ర ప్రాముఖ్యత స్పష్టమగుచున్నది.

కళ్యాణవర్మ ''దైవజ్ఞస్తాం పఠే ద్వ్యక్తం'' అన్నారు గాన దైవజ్ఞ లెట్టివారను విషయము విచారింపవలెను.

భృగు మహర్షి దైవజ్ఞుల గూర్చి ఈవిధముగా చెప్పియున్నాడు :

''తత్ర సాంవత్సరోఽభిజాతః, ప్రియదర్శనో, వినీతవేషః, సత్యవాగన సూయకః, సమః, సుసంహితోపచితగాత్ర సంధి రవి కలశ్చరు కరచరణ, నఖనయ వాచ, బుకదశన, శ్రోణ లలాట ర్భ్రూత్రమాంగో, వపుష్మాన్, గంభీరోదాత్త ఘోషః, ప్రాయః, శరీరాకారానువర్తినో హి గుణదోషాశ్చభవన్తి.''

జ్యోతిష్కులు ఉత్తమ వర్గ జాతులై, రూపము గలిగి, ఉత్తమ స్వభావము, న్యాయవాక్కు, కార్పణ్యము లేక, నిష్పక్షపాత బుద్ధి కలిగి, అంగపౌష్టవము, ఆరోగ్యము, ఖంగుమను వాక్కు గలిగి యుండవలెను.

తత్రగుణః

''శుచిర్దక్షః ప్రగల్భో వాగ్మీ, ప్రతిభావాన్,
దేశకాలవిత్ సాత్త్వికో న పర్షదిభీరుః।
సహాధ్యాయి భిరనాభి భవనీయః
కుశలోఽ వ్యసనా, శాంతి కపౌష్టి।
కాభిచార స్నాన విద్యాభిజ్ఞో, విబుధార్చన
వ్రతోపవాస నిరతః, స్వతంత్ర శ్చ।
ర్యోత్పాదిత ప్రభావః పృష్టాభిధా
య్యన్యత్ర దైవాచ్యయాత్, గ్రహగణిత
సంహితో హోరా గ్రంథార్థవేత్తేతి॥

జ్యోతిష్కుడు శుచియై, ఉత్సాహవంతుడై యుండవలెను. ధైర్యము, ధారాళముగు వాగ్ధాటి, సమయస్ఫూర్తి కాలమాన స్థానముల నెరిగి, శ్రద్ధగలిగి యుండవలెను. సభా పిరికితనముండరాదు. జ్ఞానవంతుడై యుండవలెను. ఇతరుల నర్థము జేసికొనుశక్తి గలిగి పాపకర్మలకు దూరుడై, దైవభక్తుడై వ్రత నియమాదు లాచరించుచు, ఇతరులకు తగు సమాధాన మీయగల శక్తి గలిగి గ్రహగణిత, సంహిత, హోరాశాస్త్ర పాండిత్యము గలిగియుండవలెను. ఇవిగాక అనేక లక్షణముల భృగు మహర్షి చెప్పియున్నాడు.

'సంహితా పారగశ్చ దైవచింతకో భవతి' యని పూర్తి చేసినాడు.

సంపూర్ణ సంహితాజ్ఞానముగలవారే దైవజ్ఞుడని భావము.

ఇట్టి సుగుణసంపత్తిగల దైవజ్ఞులు కలియుగమం

దున్నారా యను ప్రశ్నకు స్థాన మున్నది. ఈ సందేహ నివృత్తికి పాడుపడుట పరీక్ష యగును. జ్యోతిషశాస్త్రము వేదాంగమని ఎరిగి ఉత్తమ పురుషులవలన ఫలముల నెరుగుటకన్న వేరొక మార్గము గానరాదు. జ్యోతిషము వేదాంగమని, దైవజ్ఞులు ఈ శాస్త్ర రహస్యముల నెరుగగలరని తెలియనగును.

కాళిదాసు 'పుణ్యంవో వ్యథ పాపరూప మపివో కర్మార్జితం ప్రాగ్భవే' యని చెప్పియున్నారు.

జన్మాంతరమందు పుణ్య పాప రూపకంబగు నెట్టి కర్మ సంపాదింపబడెనో దాని యనుభవ మీ జన్మమందు కలుగుననుట విశదము.

> అర్థార్జనే సహాయః పురుషాణాం నాప దర్ణవే పోతః
> యాత్రాసమయే మంత్రీ జాతక మపహాయ నాస్త్యపరః
> కళ్యాణవర్మ.

జ్యోతిషశాస్త్రమువలన వర్తకము, వ్యవసాయము, ఉద్యోగము మొదలగు వృత్తులందును జీవితమందు ప్రాప్తించు భాగ్య భోగములను, ఆపదలలో నున్న లట్టి ఆపద లెపుడు తొలగునను విషయములను, జీవిత సంబంధమగు సర్వ విషయములను గ్రహ దశాంతర్దశలలో ఎట్లు, ఎపుడు ప్రాప్తించునో తెలియ నగును.

జ్యోతిషశాస్త్ర మభ్యసించి, కాలస్వరూపము నెరిగిన ఈశ్వరుని తెలిసికొనినవా రగుదురు. మహర్షు లందరూ కట్టి దివ్యజ్ఞానమును పొందియుండిరి. కాన, వేదాంతభాగమగు జ్యోతిషశాస్త్ర జ్ఞానము పరబ్రహ్మ స్వరూపము నెరుగుటకు మార్గము.

ప్రత్యక్షం జ్యోతిషం శాస్త్రం, చంద్రార్కౌయత్ర సాక్షిణౌ—యని ప్రమాణము.

జ్యోతిషశాస్త్ర రహస్యముల నెరుగుటకు ప్రస్తుతము విక్రయశాలలందు లభించు పుస్తక పరిచయము చాలదు. ఈ మహత్తర శాస్త్ర రహస్యముల నెరుగవలెనన్న జ్యోతిష శాస్త్రముతోబాటు, మంత్రశాస్త్రము, గ్రహ గణితశాస్త్రము (Astronomy) విజ్ఞానశాస్త్రము (Scence) ఖగోళ శాస్త్రము (Geography) మొదలుగాగల సూక్ష్మవిద్యల కొంతవరకు యభ్యసింపవలెను. ఈ శాస్త్రజ్ఞానము గలవారే జ్యోతిషశాస్త్ర మెరిగినవా రగుదురు (దైవజ్ఞులు). జ్యోతిష్కులమని, సాముద్రిక శాస్త్రవేత్తలమని, సంఖ్యా శాస్త్రవేత్తలమని పేర్లు పెట్టుకొన్నంత మాత్రమున యథార్థ దృష్టిలో శాస్త్రవేత్తలు కాజాలరని నా యభిప్రాయము. గాన అట్టివారలచే చెప్పబడు ఫలముల నపేక్షించి మోసగింపబడ కుందురని విశ్వసించుచున్నాను.

ఈ వ్యాసమందు ద్వాదశ రాసులలో ఏకాదశరాశియగు కుంభరాశిని గూర్చి దెలుపుచున్నాను. ఈ రాశియందు జనన మొందువా రనుభవించు ఫలముల విషయములో లనేక భిన్నాభిప్రాయము లున్నందున ఈ రాశి నిజస్వభావము నెరుగుట ప్రధానము గదా !

కుంభము ధనిష్ఠ 3, 4 పాదములు, శతభిషము, పూర్వాభాద్ర 1, 2, 3 పాదములచే నేర్పడుచున్నది.

"శ్రవిష్ఠా శీర్షత్రయం" యని వరరుచి శ్రవణా నక్షత్రమును వర్ణించియున్నాడు. మద్దెలవంటి ఎనిమిది చుక్కలు గల నక్షత్రము. దానికి అధిదేవతలు భీష్మాది వసువులు. (భీష్ముడు శాపవశాత్తు జననమొందిన వసువు)

"మండలాచ శతతారకాకులైః" కాళిదాసు వర్ణన. ఈ నక్షత్రాధి దేవత వరుణుడు.

"పూర్వేప్రోష్ఠపదా" తైత్తరీయ సంహిత ప్రమాణము. ఈ నక్షత్రాధిదేవత అజైకపాదుడు.

నీచీనచారం వరుణః కబంధః ప్రససర్జ రోదసీ అంతరిక్షం। తేన విశ్వస్య భువనాస్యరాజో యవన్న వృష్టి ర్వ్యునత్తి భూమా॥" ఋగ్వేదము. ఈరాసిని వరుణుడు జలప్రపూర్ణమైన కుంభమును దిగువకువంచి భూమికి జలప్రదానముచేయుచున్నట్లు ఋగ్వేదము వర్ణించుచున్నది. వరాహమిహిరులు ఈ రాసిని "రిక్తకుంభ స్కంధధారీ" యన్నారు. నీరులేని ఘటమును అంశఫలకమందు ధరించిన పురుషరూపమని భావము. ఇందుకు హేతువు గానరాదు. మంచి వర్షము కురిసినపుడు కుంభపోత యనుట సామాన్యవచనము గదా! పూర్ణకుంభమును రిక్త కుంభ మనుట న్యాయమా ?

ఈ రాసియందున్న నక్షత్ర విచారణ చేయగా భీష్మాది వసువులు, లోకోపకారియగు వరుణుడు, తేజోవంతుడగు అజైకపాదుడు నక్షత్రాధిపతులై యున్నారు. రామాయణమున వాల్మీకి బాలకాండలో రామలక్ష్మణ భరత శత్రుఘ్నులను "రుచ్యా ప్రోష్ఠ పదోపమా" యని భాద్రపద నక్షత్రములకు పోల్చి వర్ణించియున్నాడు. గాన పూర్వాభాద్ర నక్షత్రము ఎంత తేజోవంతమైనదో తెలియుచున్నది. కుంభరాసి ఈ ఉత్తమ నక్షత్రములచే నేర్పడియుండుట గమనింపవలెను.

> "నీలాంజన సమాభాసం, రవిపుత్రం, యమాగ్రజం
> చ్ఛాయా మార్తాండ సంభూతం నమామి శనైశ్వరం."

కుంభాధిపతియగు శని ఈశ్వరుడని పై శ్లోకమువలన దెలియుచున్నది. శని రుద్రాత్మక గ్రహమని ప్రమాణము లున్నవి. శని తమోగుణ ప్రధానుడని, ఈతని అధిదేవత—

శివశక్తి. శని లయశక్తికి కారకుడు. వ్యోమవ్యాపకత్వము (మాయాధిపతి) శని. ఏ యితర గ్రహములకు ఈశ్వర శబ్దము వర్తింపదు. ఈశ్వరుడై, రుద్రాత్మకుడై, శివశక్తి నధిదేవతగా గలిగి, లయశక్తి కారకుడగు శని ప్రభావము వర్ణించుట యలవి గాదు. మోక్షాధిపత్యము శనికి గలదు. ఇట్టి ప్రతిభావంతుడగు శని కుంభమును తన మూలత్రికోణ స్థానముగా నేర్పరచుకొని యున్నాడు.

"న కుంభలగ్నః శుభమాహ సత్యో న భాగభేద త్యవనా వదంతి
కస్యాంశ భేదోన తతస్థిరాశే రతి ప్రసంగ స్థితి విష్ణుగుప్తః."

సత్యాచార్యులు కుంభలగ్న మశుభ మన్నారు. యవనులు ఇందులకు సమ్మతింపలేదు. వీరు కుంభ ద్వాదశాంశ మాత్రమే అశుభ మన్నారు. విష్ణుగుప్తుడు కుంభ ద్వాదశాంశ ఏ రాశి యందు లేదని ప్రశ్నించి యవనుల అభిప్రాయము అధిక ప్రసంగ మన్నారు. ఈ హంశముల జెప్పిన వరాహమిహిరులు తమ యభిప్రాయమును వెల్లడింపలేదు.

సత్యాచార్యులు :—

జన్మని చంద్రశ్రేష్ఠ ప్రవదే ద్వారారిని ధనవర్జిస్యా
హోరాచ భావేరిష్ట ద్విపాదేశ్విహ కుంభవర్జ్యం హి,
కుంభః లగ్నే జాతోభవతి దుఃఖ శోకసంతప్తః॥

ఇందుమూలకముగా నవరాసులందు కుంభము పాపరాశి యని విశదమగుచున్నది. ఇందు జనన మొందినవారు సామాన్య ముగా దుఃఖముల కష్టముల ననుభవింతురు. ఇందుకు భిన్నాభి ప్రాయముల దెల్పిన యవనులను, శృతకీర్తి సమర్థించుట గమ నింపవలెను.

సర్వస్మి లగ్నతే కుంభ ద్విరాంశం శకో యథాభవతి।
రాశౌన తదసుఖితః పరాన్నభోజీ భవేత్ పురుషః॥

ఏ రాసియందైననూ కుంభ ద్వాదశాంశయందు జన్మిం చిన జాతకులు దుఃఖముల నొందుచూ పరులమీద వారి నిత్య జీవనమునకు గూడ యాధారపడి యుందురు.

ఇది సరిగాదన్న విష్ణుగుప్తుడు :—

కుంభ ద్వాదశభాగో లగ్నవతే న ప్రశస్తే యవనైః
యద్యేవం సర్వేషం లగ్నగత నమనిష్ట ఫలజాస్యత్
ఘటయోగ ద్రాసీనం నమతం తత్ సర్వశాస్త్ర కారణం
తస్మాత్ కుంభవిలగ్నే జన్మస్య శుభోనవద్భాగః.

కుంభ ద్వాదశాంశ సర్వరాసుల యందున్నందున ఈ ద్వాదశాంశ జననము పాపహేతువనుట సమంజసముగాదు. గాన కుంభరాశియే పాపరాశి యనుట న్యాయము.

గుణకర్ణుడు:—

కుంభోదయో నశుభదో వదంతీతి సత్యః
సూటోతత మంశ కథిదయవనో బభాషే
యేవం గ్రహస్య సకలేషు మహత్ ప్రసంగే
వాత్స్యాయనో వదతి కేష న భాగసంజ్ఞః.

సత్యాచార్యులు కుంభలగ్న మశుభ మన్నారు. యవనులు కుంభ ద్వాదశాంశ యశుభ మన్నారు. గాని వాత్స్యాయనులు ఇట్టివి అసందర్భవచనము అన్నారు.

కళ్యాణవర్మ :—

కుంభోదయో న సప్తో లగ్నవిధో సర్వత్యేవ సత్యమతే
యవనైః వర్గాపి తథ చాణక్యో వదతి నోవర్గం.

చాణక్యుల కుంభరాశినే అశుభ మన్నారు.

కుంభలగ్నమునకు ప్రాప్తించు రాజయోగముల విషయ మున వరాహమిహిరులు :—

స్వక్షేత్రే శుక్రే పాతోలస్థే ధర్మస్థానం ప్రాప్తే చంద్రే
దుశ్చిక్యేన్ ప్రాప్తి ప్రాప్తైః శేషైర్జాతః స్వమీభూమిః.

శుక్రుడు స్వక్షేత్రమగు చతుర్థగతుడై, చంద్రుడు భాగ్యమందు, ఇతర గ్రహములగు రవి, బుధ, గురు, కుజ, శనులు 1, 3, 11 స్థానములందుండ రాజజన్మ గలుగును. ఈ విషయమందు గుణకరుడు, కళ్యాణవర్మ ఏకీభవించినారు.

గుణకరుడు :—

స్వార్థంబుగో భృగుసుతో గురోగు మృతన్కః
శేషై స్తృతీయ తను లాభగతైః నృపః స యత్॥

కళ్యాణవర్మ :—

ధనుజప గురుర్బంధుమాస్యేతి స్వవేశ్మగతో యదా
తుహినకిరణః సంపూర్ణాంగ సప్తః సమవస్థితః
త్రితనుభవభః ప్రాప్తశేషగ్రహ యాది భూపైః
భవతి ధృతిమాన్ స్విత్రస్త్రీకస్తః బహువాహనః.

కుంభలగ్న విచారణ :

'కుంభే మీనేచ సింహలీ చత్వారో రవిరాశయః.'

కుంభము రవి రాశి యని భావము. కుంభమందు జనన మొందిన పురాణ పురుషులు—అగస్త్యుడు' వసిష్ఠుడు, ద్రోణుడు, కుంభమునకు ప్రాణాయామ భేదమని, వేయి ఫలములని, కడవ యని, పరిమాణ విశేషమని యర్థములున్నవి. భాండము, పాత్రము, భాజనము, అమత్రము, కలశము, శరీరము, ఘటము, కడవ.

కర్కమము, కుటము, పనటి, కుండ యనునవి పర్యాయపదములు. కుంభము బేసిరాసి. పగటియందు బలము గలది. పురుషరూపము. వాయు తత్వరాసి. శూద్రక్షేత్రము. ద్విపాదనరరాసి. స్థిరతామస రాసి. శీర్షోదయము. జలచలరాసి. జీవసంజ్ఞ గలది. బభ్రువర్ణము. స్వర్ణాదులకు, అమూల్య వస్తువులకు నిలయము. శనిఈరాశి కధిపతి. ఈతని మూలత్రికోణమందు 1 నుండి 20 భాగం పరకున్నది. 21 నుండి 30 భాగం వరకు శనికి స్వక్షేత్రము. రాహువకు మూలత్రికోణమని చెప్పబడియున్నది. కాలపురుషునకు ఏకాదశ స్థానము గాన ఉపాంత్యము, భవము, ఆయము, లాభమను పేర్లు గలది. శరీరపటుత్వ విషయమున వాయుతత్వరాసులలో రెండవది. కాలపురుషావయవములలో పిక్కలను సూచించును. పాపరాసి. సోమరితనమును సూచించును. పడమటిదిక్కున కాధిపత్యము గలది. ఇందు ప్రథమహోరకు రవి, రెండవ హోరకు చంద్రుడు అధిపతులు. కుంభ పూర్వహోరయందు జనన మొందినవారు స్త్రీసౌఖ్యము మొదలైనవి గలవారు. ద్వితీయ హోరయందు జననము గలిగినవారు అంతట ఎర్రనైనట్టియు విడనట్టియు నేత్రములు మొదలైనవి గలవారు. యవనేశ్వరుడు కుంభమును గూర్చి :—

'స్కంధేతు రిక్తః పురుషస్య కుంభో
జంఘేతమేకాదశ మాహురార్యాః
తస్యోదకాధార కుసస్యపక్షే
స్త్రీ శౌండిక ద్యూత నివాసభూమిః.'

యని చెప్పినాడు. కుంభ ద్రేక్కాణముల విషయమున వరాహమిహిరులు :—

''స్నేహమధ్య జల భోజనాగ మత్యాకులీ కృతమనాస్స కంబళః
కోశకార వసనోఽజినాన్వితో గృధ్రతుల్య వదనో ఘటాదినః॥

దగ్ధే శకటే సశాల్మలే లోహాన్యాహరతేఽంగనావనే।
మలినేన పటేన సంవృతోభాండై ర్మూర్ధగతైశ్చ మధ్యమః॥

శ్యామస్యరోమ శ్రవణః కిరీటీ త్వక్పత్ర నిర్యాస ఫలైర్బిభర్తి।
భాండాని లోహవ్యతి మిశ్రితాని సంచార యత్యంత్య గతో ఘటస్య॥

ఘృతము, తైలము, కల్లు, ఉదకము, భోజనము వీని ప్రాప్తిచే గలతపడు మనస్సుగల కంబళధారి, కౌశేయ వస్త్రము గల పురుషుడు కృష్ణాజినముల ధరించియుండును. గద్ద ముఖము వంటి ముఖము గలవాడు కుంభ ప్రథమ ద్రేక్కాణజాతుడని భావము. ఇది శని ద్రేక్కాణము. మాసిన వస్త్రముల ధరించి తల మీద కుండ నుంచుకొని అడవియందుండు స్త్రీ రూపము ఈమె కాలిన బూరుగుచెట్లు గల బండియందుండి లోహములు గ్రహించుచుండును. ఈ రెండవ ద్రేక్కాణము అగ్నియుక్తమును బుధ ఆధిపత్యమును గలది. స్త్రీరూపము. కుంభరాశి తృతీయ ద్రేక్కాణము శ్యామలవర్ణుడై, చెవులందు వెంట్రుకలు గలిగి, కిరీటము ధరించిన పురుషుడు. వీడు చర్మము, ఆకులు బంక, పండ్లు గలవాడు. లోహమిశ్రితములైన కుండలను ధరించియున్నాడు. ఈ ద్రేక్కాణమునకు శుక్రు డధిపతి. పురుష రూపము. కుంభము మాయాస్వభావము, పరమార్థచింతగల రాశి యని చెప్పబడియున్నది. చెమ్మగల స్థానములను, హీన ద్రవ్యములను, దుర్మార్గుల స్థలములను, నీచ స్థానములను కల్లు దుకాణములను, జూద గృహములను, గనులను, ద్రాక్ష తోటలను, గుహలను సూచించును. నరముల సంబంధము గల వ్యాధులకు విలవిల లాడించు వ్రణములకు, పిరుదులు కండ్లు, రక్తప్రసరణ, శ్వాసలకు కారకత్వము గల రాశి. ఇందు జననమొందు పురుషుల విషయమున మంత్రేశ్వరుడు :—

''ప్రచ్ఛన్న పాపో ఘటతుల్య దేహో
విధాత దక్షోఽధ్వసహోఽప్రవిత్తః
లుబ్ధః పరార్థి క్షయవృద్ధి యుక్తో
ఘటోద్భవః స్యాత్ప్రియ గంధపుష్పః. యన్నారు.:

కుంభలగ్న జాతకులు రహస్యముగా పాపకర్మల జేయుదురు. ఘటమును పోలియుందురు. ఇతరుల హింసించుటయందు నేర్పరులు. వీరల జీవనోపాధి స్వల్పము. ఇతరుల ధనముల విరివిగా వాడుకొనుటయందు నేర్పరులు. జీవితమందు లాభనష్టముల నొందుదురు. సుగంధద్రవ్యములు, పుష్పములన్న వీరికి ప్రీతి. జీవితమందు అనేక కష్టముల నెదుర్కొందురు. అవమానముల నొందుదురు. దారిద్ర్యమనుభవింపగలరు. పిల్లల గూర్చిన చింత వీరల కెక్కువగును. భార్యవలన మనోవ్యథ గల్గును. గ్రహములు శుభస్థానగతులైననూ వారలవల్ల ప్రాప్తించు పూర్ణ ఫలముల నరయ వీలుగాదు.

'అరుణోపి వృషభే శ్రేష్ఠః సగుణోపి ఘటంత్యజేత్.'

సుగుణములు గల (శుభయుతమైన) కుంభలగ్నము కంటె అశుభయుతమగు వృషభము ఉత్తమమని శాస్త్ర వచనము. కుంభలగ్న జాతకుల గూర్చి చెప్పబడిన వివిధాభిప్రాయముల పరిశీలించిన ఈ క్రింది విధముగా నున్నవి.

కుంభలగ్న జాతకుల లక్షణములు

కుంభలగ్న జాతకులకు ఇతర లగ్న జాతకులకు గల భేదముల చూచుచున్నాము. ఈ లగ్నాధిపతికి లగ్న ద్వాదశాధి

పత్యము లున్నవి. లగ్నభావము జాతకుని శరీరము, ప్రతిష్ట, అవయవ సౌష్టవము, జాతకునకు సహజముగా ప్రాప్తించు శుభాశుభములు, స్వతంత్రాది లక్షణముల సూచించును. ద్వాదశ భావము కష్ట నష్టములను, మనోద్రేకములను, ఆత్మ స్వరూప తత్వమును (Spiritualism) బంధనమును, మోక్షము, సూక్ష్మవిద్య లందలి జ్ఞానమును, జీవితమందు ప్రాప్తించు వ్యతిరేక ఫలములను సూచించును. ఈ రెండు భావములకు కారకత్వముగల గ్రహము న్యాయదృష్టిలో ఈ భావముల కారకత్వముంకు, వాంఛలకు, సౌఖ్యములకు, ఉత్తర జన్మ హేతువగు శుభవాంఛలకు, మోక్షప్రాప్తి మొదలుగా గల వానికి రాజమార్గ మవలంభింపవలెను. ఏ గ్రహమైననూ తన తనుభావమును వ్యర్థపరుపదనుట దానికి హేతువుగదా! గాన కుంభరాసి జాతకులు ఈ రెండు భావముల లక్షణములు గలవారై యుండవలెను. వారికి అహంకారము (Ego) యున్నదా లేదా ? స్వతంత్రులా ? అస్వతంత్రులా ? ఏమి భావములు గలవారను ప్రశ్నలకు సమాధాన మరయుట కష్టము. గాన వీరి భావములను, చర్యలను గ్రహించుట కష్టమని చెప్పవచ్చును. ప్రాపంచికదృష్టి గలవారు వీరిని కొన్ని వేళల మతిలేనివారుగను, సంఘ సంబంధములకు అసమర్థులుగను, భావించుట, ఇతర సమయములందు వీరి శక్తి సామర్థ్యముల కొనియాడుట జరుగుచుండును. వీరు అనుచరులతో కలసి ప్రాపంచిక సుఖముల ననుభవింపవలెనను కోర్కెలతోను, మానసికముగా తమకు సహజముగా ఉత్పన్నమగు పరమార్థ చింత గలవారై దైవరహస్యముల నెరిగి ప్రపంచ వాంఛలకు దూరులుకావలెనను కోర్కెలతోను బాధపడుచుందురు. కొన్ని సమయములందు ఇతరులు వీరిని తృజించుట, మరికొన్ని సమయము లందు ఆదరించుట జరుగుచుండును. స్థిరరాసి గాన కుంభము స్థిరత్వముతో గూడిన అధికశక్తి నిచ్చుచున్నది. గాన మకర కారకత్వములను కుంభరాసి జాతకులు సవ్యమార్గమున నడపింప శక్తివంతులు. మకరము వ్యయభావమైనందున మకర రాసి జాతకులకు కుంభరాసి జాతకులకు భేదములు కన్పించుచున్నవి. కుంభరాసి జాతకులు సహజ మిత్రులు. వీరు మిత్రుల ఆదరించుట, మిత్ర సంస్థలకు అధిపతులై శీఘ్రకాలములో ఉన్నతస్థితి పొందగలరు. ఈ జాతకులు సూక్ష్మబుద్ధి గలవారై యుక్తితో ప్రవర్తించు శక్తి, తమ మనోభావముల త్వరగా ప్రకటింపకుండుట, స్థిరచిత్తము, నిలుపుదల (Conservation) శక్తి, నిర్మలత్వము, దయాదాక్షిణ్య స్వభావము, ఇతరుల మనోభావముల గ్రహించు శక్తి, ఇతరుల మన్నింపగల్గ ఉదారత, ప్రజాదరణ, ఆకర్షణీయమగు ఆకారము, తెలివి, జ్ఞాపకశక్తి, అవలీలగా గ్రహించు జ్ఞానము, సాహిత్యమండలి ప్రేమ, బంధు, ఉద్రేకముల నణచుకొను మహాశక్తి, సామర్థ్యము, ఎక్కువగా ఖర్చుచేయు స్వభావము, పారమార్థికచింత, సర్వసంగ పరిత్యాగము చేయగల మనోధైర్యము మొదలగు శుభలక్షణములను మందస్వభావము, దుర్మార్గము, మనశ్చాంచల్యము, ధనమంతయు వ్యయపరచు స్వభావము, బంధువర్గ దూషణ, పాపకర్మాసక్తి, అందమగు ఆకారము, మతమును దూషించుట, హృద్రోగ బాధ, ఉద్రేకము, విచక్షణాజ్ఞానరాహిత్యత, పెద్దలతో కలహించుట, తమచే నొనర్పబడు పాపకర్మల ఫల మనుభవించుట, బాల్యమందు వివాహము నొందిననూ నీతి నియమములు లేకుండుట, వారు చేయు కొలది మంచిపనులు వటాటోపమునకే గాని హృదయ పూర్వకశుద్ధి గలవి గావని, అనేక ప్రాతిపదికల ప్రారంభించి అందు స్వలాభ వాంఛ గలిగి యుందురని, సన్నని దేహము గలిగిననూ ఆకర్షణీయులని, ఇతరులమీద అధికారము చలాయించుకోర్కె గలవారని, జయాపజయముల సమానముగా స్వీకరింప సామర్థ్యత గలవారని, సంతోషరహితులని, సేవకవర్గము గలవారని, మణుల గలిగి యుందురని, వారి భార్యలు పరమార్థచింత గలవారని జెప్పబడి యున్నది. ఏకాదశరాశి కుంభమైనందున ఈ రాశి జాతకులు పరమార్థచింత గలిగి ప్రాపంచిక సౌఖ్యములకు లతీతమగు వాంఛల గలవారని, మానవులై మానవులయం దభిమానము గలవారని, నిగూఢమైన విశాల భావముల గలవారని ప్రజాసేవ సలుపుటయందు హృదయపూర్వక ప్రేమ గలవారని గూడ చెప్పబడి యున్నది. ఈ హంశముల గమనించిన శుభాశుభములు వ్యక్తమగుచున్నవి. గాన ఇవి లగ్నాధిపతియగు శని బలముమీదను, ఇతర గ్రహ సంబంధముల మీదను ఆధారపడి యుండునని గ్రహింపనగును.

కుంభమెట్లు పాపరాశి?

లగ్నాధిపతియగు శని వ్యయాధిపతి గాన ఈ లగ్నజాతకులు త్వరగా ఆందోళనలకు, ఆటంకములకు, మనోవ్యధలకుపాలై విరక్తి నొందగలరని తెలియుచున్నది. సర్వశుభుడనగు గురుడు ఈ లగ్నమునకు ద్వితీయ లాభాధిపతి. లాభాధిపత్యము పాపము గాన ఇతనిని పాపిగా చెప్పియున్నారు. కుజుడు తృతీయ రాజ్యాధిపతియై సముడైననూ లగ్నాధిపతికి ప్రబల శత్రువు గాన, అంత శుభుడు గాడు. వీలైనంతవరకు పాప ఫలములనే ఇచ్చు స్వభావము గలవాడు. శుక్రుడు చతుర్థ భాగ్యాధిపతి. శుభునకు కేంద్రాధిపత్యము పాపము గాన కొంతవరకు పాపి. గాని ఉత్తరోత్తర కోణాధిపత్యము ప్రాప్తించినందున శుభుడు. ఉభయాధిపత్యములైన కేంద్ర కోణాధిపత్యములు ప్రాప్తించిన గ్రహము లెట్లు ఫలముల నీయునో ఆంధ్రపత్రికయందు

కర్కట, సింహలగ్నములకు కుజ కేంద్ర కోణాధిపత్య విచారణ యందు, తులా లగ్నమునకు శనికి ప్రాప్తించిన కేంద్ర కోణాధి పత్య విచారమందు దెలిపియున్నాను. కుంభము స్థిరరాశి. స్థిరరాస్యులకు నవమాధిపతి బాధక గ్రహము. ఈ లగ్నమునకు నవమాధిపత్యము గలిగిన శుక్రుడు బాధకాధిపతియగు చున్నం దున ఈ శుక్రునకు పూర్ణశుభత్వము ప్రాప్తింపదు. కేంద్ర బాధకాధిపతి, శుభగ్రహమగు శుక్రుడు ఈ లగ్నమునకు యోగ కారకుడని ఋషులు చెప్పియున్నారు. ఈ విషయమందు ఎంత వరకు, ఎచ్చట శుక్రుడు యోగకారకు డగుచున్నాడు, కేంద్ర బాధకాధిపత్య పాపములు ఏ స్థానమం దొసగుచున్నాడను విష యము సమగ్రముగా పరిశీలించినగాని ఈ గ్రహ శుభఫలముల నిర్ణయింపరాదు. ఎట్లున్ననూ ఈతని దృష్టి ఈ లగ్నజాతకు లకు పాపఫల మిచ్చుచుండుట అనుభవములో కన్పించుచున్నది. బుధుడు పంచమ అష్టమాధిపతి. అష్టమాధిపత్య పాపము పంచమ భావమునకు గలిగి ఈ లగ్నజాతకులకు సంతాన విషయ మున బాధ కలిగించుచున్నాడు. చంద్రుడు షష్ఠాధిపతిగాన ఈతనికి శుభత్వములేదు. రవి సప్తమాధిపతి. లగ్నాధిపతియగు శనికి శత్రువు. గాన, మారక స్థానాధిపత్యముచేతను శత్రు వగుటచేతను పాపి యగుచున్నాడు. పై హంశముల పరిశీ లించిన ఈ లగ్న జాతకులకు ఏ గ్రహమూ సంపూర్ణముగా శుభుడగుట కాన్పింపదు. అందుచే ఈ లగ్నమును పాపమని భావించుటయందు కొంత హేతు వగుపడుచున్నది. పరాశరులు కుంభమునకు చంద్ర, కుజ, గురులు పాపులని, బుధ శనులు కొంతవరకు మేలని, రవి తన స్థితి ననుసరించి ఫలముల నొసగు చున్నాడని, శుక్రుడు పూర్ణ శుభుడై తన మూలత్రికోణ, ఉచ్ఛస్థానములందుండి, గురు, కుజులతో కలిసి రాజయోగ మొసగుచున్నాడని చెప్పియున్నాడు. వివిధ గ్రహములు వివిధ స్థానగతులై ఎట్లు ఫలముల నొసగుచున్నారను హంశము తర్వాత విచారింపనగును.

శని :—లగ్నాధిపతియగు శనిని ముందుగా విచారించి ఇతర గ్రహముల విషయ మెరుగగలము.

మంత్రేశ్వరుడు :—

యద్భావేష్వశు భోపి వా దయుపతి స్తద్భావవృద్ధిః దిశో
యః సా నాధిపతిః సచేద్యధితనోః ప్రాబల్య మన్యస్తవ॥

లగ్నాధిపతి పాపియైననూ ఏ భావగతుడైన ఆ భావమును వృద్ధిచేయును. ఇతనికి లగ్నాధిపత్యముతోబాటు దుస్థానాధి పత్యము గలిగినపుడు లగ్నాధిపత్య ఫలములనే ఈయును గాని దుస్థానాధిపత్య ఫలముల నీయడు.

ద్విస్థానాధిపతి త్వమస్తి యదిచేన్ముఖ్యం త్రికోణర్క్షఃఠ
తస్యార్థం స్వగృహేఽథ పూర్వ ముభయోర్వృత్త హశాదౌ వదేత్.

రెండు గృహముల కాధిపత్యముగల గ్రహములు మూల త్రికోణాధిపత్య ఫలముల సంపూర్ణముగను, రెండవ అధిపత్య గృహఫలముల అందు సగము మాత్రమే ఇచ్చునని మంత్రేశ్వర వచనము.

శని కాలపురుషుని దుఃఖమని తెలుపబడి యున్నది. ఇతడు నల్లని దేహము గలిగి 100 సంవత్సరముల వయస్సు గలవాడు. శూద్రుడు. ఈశ్వరాంశ గలిగి వేదాంతకారకు డగుచున్నాడు. పశ్చిమదిక్కున కధిపతి. తామసుడు. నపుంసక గ్రహము. వాయు తత్త్వము గలవాడు. ఛాయాసూనుడు. తరణి తనయుడు. కోణుడు, ఆర్కి, మందుడు, పఙ్గుడు, కాళుడు, అసితుడు, సౌరి, సూర్యపుత్రుడు, యమాగ్రజు డనునవి ఈతని పర్యాయ నామ ములు. పూర్ణముగు సహజపాపి. మూల ప్రధాని. నీలము ఇతని మణి. సీసము ధాతువున కధిపతి. కషాయము ఇతని రసము. 3, 10 స్థానములను తన అధిదృష్టిచే వీక్షించును. ఈ దృష్టి ఈతనికి బలముగలది. ఆయుష్యము, జీవనోపాయము, మృత్యు హేతువు, విపత్సంపదలు ఇతని ఆధీనములు.

ఆయుష్యం, మరణం, భయం, పతితతాం దుఃఖావమానా మయాన్
దరిద్రం భృతుకాప వదా కలుషాణ్యాశౌచ నింద్యాపదః
స్థైర్యం, నీచ జనాశ్రయంచ మహిషం తంద్రామృణం చాయసం
దాసత్వం కృషిసాధనం రవిసుతాత్కారాగృహం బంధనం॥

మంత్రేశ్వర వచనము. ఆయుర్దాయము, మరణము భయము, అవమానము, దుఃఖము, మానముపోవుట, వ్యాధి, దరిద్రము, సేవకావృత్తి, పాపము, శౌచము, నింద, దుర దృష్టము, స్థైర్యము, నీచజనాశ్రయము, ఎనుబోతు ఎందత్వము, అప్పులు, ఇనుము, దాస్యము, వ్యవసాయపు పనిముట్లు, కారాగృహము, బంధనము శనికారకత్వములు.

పరిజ్ఞు ర్నిమ్నవిలోచనః కుశతను ర్దీర్ఘః సిరాలోంసః
కృష్ణాంగః పవనాత్మకోఽతిపిశునః స్నావ్యాత్మకో నిర్ఘృణః
మూర్ఖః స్థూలనఖ ద్విజః పరుషరోమాంగోఽశుచిస్తామసో
రౌద్రః క్రోధపరో జరా పరిణతః కృష్ణాంబరో భాస్కరిః॥

శనిని గూర్చి మంత్రేశ్వరుడు ఇతను నల్లని ఆకారము, కుంటికాలు, వాతప్రకృతి, లోతైన కండ్లు, సన్నని పొడవైన, సిర, ధమనులు పైకి కనుపించు దేహము, సోమరితనము కల వాడని చెప్పియున్నాడు. కండరముల కాధిపత్యము గలవాడని,

క్రూరుడని, దయాదాక్షిణ్యములు లేనివాడని, మొద్దు స్వభావము కలవాడని, పొడుగైన పండ్లు, నఖములు, మొరటుబారిన కేశములు, అవయవములు కలవాడని, మలినుడని, పాపకర్మవంతుడని, భయంకరుడని, కోపిష్ఠియని, వృద్ధుడని, నల్లని వస్త్రములు ధరించియున్నాడని చెప్పియున్నారు.

వాయుతత్వ స్థిర రాశ్యాధిపతియగు ఈ గ్రహము ఉత్కృష్టమైన ఆలోచనాపరుడని, మంత్రాంగమందు నిపుణుడని, అసాధారణ ప్రజ్ఞావంతుడని, దుర్మార్గుడని పేరొందిననూ దుర్మార్గమునుండి గాని సన్మార్గము ప్రాప్తించనందున కష్టములకు కారకుడై జీవుల పరీక్షించి మోక్షసాధనకు మార్గదర్శి యగుచున్నాడని చెప్పవచ్చును. ఏక కళ కలవాడు. బుధ శుక్రులు మిత్రులు, గురుడు, సముడు, రవి చంద్ర కుజులు శత్రువులు. మకర కుంభము లితని క్షేత్రములు. తుల ఉచ్ఛ స్థానము. అందు 20 భాగ పరమోచ్ఛ. మేషము నీచస్థానము. అందు 20 భాగ పరమ నీచ. వృషభ కన్య, మిథున, తులలు మిత్రక్షేత్రములు, ధనుర్మీనములు సమక్షేత్రములు, మేష, కటక, సింహ, వృశ్చికములు శత్రుక్షేత్రములు. కుంభము మూలత్రికోణ స్థానము. రేవతి ఈతని జన్మ నక్షత్రము. పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్రల కీత డధిపతి. ఇతని మహర్దశ 19 సంవత్సరములు. నరలోకవాసి. సప్తమ కేంద్రమందు బలము కలవాడు. షడ్బలమందు 300 విరూపములు, స్థానబలమందు 96, దిగ్బలమందు30, చేష్టాబలమందు40, కాలబలమందు 67, ఆయనబలమందు 20 విరూపముల బలము కలిగి పూర్ణబలుడగుచున్నాడు. తులా, మకర, కుంభములందు, స్వద్రేక్కాణమందు, స్వనవాంశయందు, కృష్ణపక్షమందు, స్వదశయందు రాశ్యంతమందు, దక్షిణాయనమందు, వక్రించినపుడు కృష్ణపక్షమందు, గ్రహయుద్ధమందు (రవితో తప్ప) బలవంతుడు. రాశి మధ్యమందు కూడ బలముకలవాడని మరియొక అభిప్రాయమున్నది. వైశ్వదేవ సమయ మితని కళుభము. భచక్ర పరిభ్రమణమునకు షుమారు 30 సంవత్సరముల కాలము పట్టును. వక్రాది గుణములు కలవాడైనందున ఈ కలము కొంత మార్పు చెందుచుండును. చతుష్పద గ్రహము. శైవాటవులందు సంచరించువాడు. బ్రహ్మ ఈతని కధిదేవత. నిర్మలమగు నీలము ఇతని రత్నము. శిశిరఋతువు ఈతని ఆధిపత్యమందున్నది. ఉత్కారాలయము ఇతని నివాస స్థానము. గంగానదీ అంతము మొదలు హిమాలయము వరకు ఈతని దేశము. ఆకాశ కక్ష్యయందు పైనుండు గ్రహము. స్నాయువు ఇతని ధాతువు. అధోదృష్టి గలవాడు. అష్టమభావమందుండి శుభము చేయువాడు. సుందరమగు పచ్చని చూపు కలవాడు. తమోబుద్ధి గలవాడు.

'రవిజః కళత్రే విలగ్నతస్తే విఫలాభవంతి'—సప్తమ కేంద్రమందు ఫలప్రదుడు గాడు.

'రాహుదోషం బుధోహన్యా దుభయోస్తు శనైశ్చరః'. బుధ రాహువుల దోషముల పోగొట్టువాడు. దారిద్ర్య దోషము నీచకర్మము, పిశాచములు, దొంగలు మొదలగువారి చేతను, సంధిరోగముల చేతను వ్యసనము కల్పించును. నరకాధివాసుల కధిపతి. శశయోగము ఈతనిచే ప్రాప్తించుచున్నది.

శని లగ్నగతుడైనను, లగ్నమును నీక్షించిననూ ఉన్నతమగు శక్తుల నిచ్చుచున్నాడు. బాధ్యతల గుర్తించి ప్రవర్తించుట, సమాజాభివృద్ధికి శక్తి నొసగుట, ఆత్మాశ నొసగుచున్నాడు. మాయాకారకుడై ప్రాపంచక జీవులను పరీక్షించి మోక్షకరకు డగుచున్నాడు. సహజ మందప్రాణసి. మర్మము తత్కాలిక బలహీనత, వ్యాకులత, నిరాశ, హీనులను మనో వైఖరి, సహనము, లోటుపడితిమను భావము, నియమిత వృత్తి వ్యాపారములు, అతి జాగ్రత్త ఈతని స్వభావములు.

శనికారకత్వములు:—దారిద్ర్యము, మరణము, ఆయుర్దాయము, దుఃఖము, దురదృష్టము, అతికష్ట పరంపరలు, సోమరితనము, జాగు, విషాదము, దీర్ఘవ్యాధులు, కష్టవృత్తులు, పట్టుదల, రహస్యగోష్టి, స్థైర్యము, ధార్మికగుణము, సత్ప్రవర్తన, నిజాయితి, ఆలోచనాశక్తి, వివేకము, భక్తి, వైరాగ్యసంపద, బాధ్యతలు, విరోధము, సభాజడత్వము, దానము, ఔదార్యము, సుకర్మ, గురుల, పెద్దల ధిక్కారము, కులవిద్యా సంగ్రహత, కఠిన మనస్సు, ప్రసిద్ధమగు జీవితము, భౌతిక జీవితము, ప్రయాణములు, అంగవైకల్యము, వనచరులు, అసత్యవాదన, మురికితనము, కృశించిన నరములు, అధిక కోపము, ఆయాసము, నీచస్త్రీల సంతానము, జారత్వజన్మలు, చెడు స్నేహములు, పాపములు, క్రూరులు, కయ్యములు, చిరకాల వియోగదుఃఖమ్ము, తలవెంద్రుకలు, దొంగతనము, మత్స్య మాంస భక్షణ, మత్తు, మదపదార్థ భక్షణ, ఋణములు, కారాగారశిక్ష, రాజదండన, జాతిభ్రష్టత, ఆచారహీనత, నీచదేవోపాసన, శాంతము, నీచజీవనము, హూణవిద్య, దాస్యము, కుత్సితము, శిల్పవిద్య, విద్యావిఘ్నములు, దుర్వ్యయములు, గణితము, మాంద్యత, కుడిచెవి, ఆకస్మిక ప్రమాదములు.

శనికారకత్వ వస్తువులు:—కుండలు, పగరు, దొంగు పాదుకలు, లోహములు, పుచ్చిన గ్రోళ్ళు, ఇనుము, వేళ్ళలు, దాపజనులు, ఎలుగుబంట్లు, గాడిద, తోడేలు, మొసలి, కుందేలు, పిల్లి, పాములు, కాకులు, కోయిలలు, దున్నలు, గేదెలు, చేపలు

ఒంటెలు, గుడ్లగూబలు, అరటిచెట్లు, మేకలు, గొఱ్ఱెలు కుక్కలు, పిశాచములు, ఏనుగులు, గుఱ్ఱములు, చర్మము పక్షులు, భస్మములు, విభూతి, తిలలు, కంబళ్లు, గొంగళ్లు, బాణము, సీసము, ఎముకలు, తైలములు.

రాజ్యాంగ సంబంధములు:—సీసము, ఇనుము, రాగి గనుల పరిశ్రమ, వ్యవసాయ పథకములు, వ్యవసాయ శాఖలు, బొగ్గు గనులు, కాఫీ, టీ, పండించువారు, అటవీశాఖ ఉండరి ఉద్యోగులు, కార్మికశాఖ, కార్మికులు, చిన్న పరిశ్రమలు, ఉక్కు పరిశ్రమ, మైకా గనులు, అల్యూమినియం, తోళ్లు, చెప్పులు మొదలగు పరిశ్రమలు.

శనికారకత్వ వ్యాధులు :—

వాతశ్లేష్మ వికారపాద విహితం చాపత్తి తన్ద్రాశ్రమాన్
భ్రాంతిం కుక్షిరుగంతరుష్ణ భృతకధ్వంసంచ పార్శ్వాహతిం
భార్యా పుత్ర విపత్తిమఙ్గ విహితం వృక్షాత్పతన కల్మిజో
వృక్షాశ్మ క్షతిమాహ కశ్మలగణైః పీడాం పిశాచాధిభిః॥

వాత పిత్త వ్యాధులు, దీర్ఘవ్యాధులు, అజీర్ణము, శూల నొప్పులు, పక్షవాతము, రక్తపోటు, క్షయ, నరముల బలహీనత నపుంసకత్వము, మూసికవేదన, మోహనీరు, చిత్తచాంచల్యము స్ఫోటకము, ఉబ్బసము, పిశాచబాధలు, చర్మవ్యాధులు, చెవిలోని చీము, మూత్రపిండ వ్యాధులు, ప్లీహవ్యాధి, చలి, జలుబు, చెవుడు దంతవ్యాధి, డిఫ్తీరియా, వెన్నుజబ్బులు, ఎముకల వ్యాధులు, నారి కురుపులు, పిప్పిగోళ్లు.

పై జెప్పబడినవి గాక ఈతని ఆధిపత్యమున, కాలమి ఆకలి, కార్మిక సమూహములు, చతురత, పొందికజేయు శక్తి, క్రమశిక్షణ, క్రౌర్యము, న్యాయపరిపాలన, రాజగుణ సంపత్తి, కామోద్రేకముల నశింపజేయుట, ప్రజోపకారమగు ఆశయములు, పరిశోధనాశక్తి, స్వబుద్ధి, Introspection గలవు. రాజధర్మము నెరిగి పరిపాలన సలుపుటయే గాక సేవా ధర్మమును గూడ క్రమశిక్షణతో నాచరింపగల సమర్థుడు. న్యాయముగా జీవులకు ప్రాప్తింపవలసిన ఫలములను, స్వతంత్ర, శక్తిని, ఫలాపేక్షలేని సేవను, కల్పించి పరీక్షించుచున్నాడు. శుభుడై తన మహర్దశా కాలమందు ధన, ధాన్య, సంపదల నొసగుచున్నాడు. పాపుడై అత్యంత కష్టముల నిచ్చుచున్నాడు.

షడ్బలయుక్తుడగు శని పాప ఫలముల తక్కువగను బలహీనుడై అత్యంత పాపఫలముల నొసగును.

గ్రహస్థిత ఫలములు

సామాన్యముగా క్రింద తెలుపబడిన గ్రహస్థితి గల కుంభలగ్న జాతకులు శుభఫలముల నొందుచున్నారు.

1. రవి—3, 6, 11, 12 భావములందున్న
2. చంద్రుడు—2, 3, 4, 8, 12 భావములందున్న
3. కుజుడు—2, 3, 5, 7, 10, 12 భావములందున్న
4. గురుడు—2, 4, 5, 7, 9, 10 భావములందున్న
5. బుధుడు—3, 5, 7, 10, 12 భావములందున్న
6. శుక్రుడు—2, 4, 5, 9, 10, 11 భావములందున్న
7. శని—3, 6, 8, 11, 12 భావములందున్న
8. రాహు—3, 6, 8, 11 12 భావములందున్న
9. కేతు—3, 6, 11, 12 భావములందున్న

శని :—లగ్నమందున్న తన మూలత్రికోణ స్థిత ఫలముల నిచ్చును. సప్తమ మందున్న శని దశయందు రాజయోగప్రాప్తి. శని లగ్నమందున్న ప్రపంచజ్ఞానము, మంత్రాంగశక్తి, తీక్షణ బుద్ధి, దైవచింత గలుగును. ఈతని దశలో దూరప్రయాణములు, వ్యవహార జయము, భాగ్యము ప్రాప్తించును. శని ద్వాదశాధిపతి గాన వృద్ధాప్యమునందు నష్టములు ప్రాప్తించును. అత్యాశాపరులై అబద్ధము లాడి ధన మార్జింతురు. సోదరప్రేమ యుండదు. పిరికితనము గల్గును. తెలివిగలిగి విద్యావంతులైననూ బుధునకు అష్టమాధిపత్య పాపమున్నందున సంతానసౌఖ్య ముండదు. సుఖవంతమగు సంసారము గలిగిననూ ఇతర స్త్రీల యందలి వాంఛ గలవా రగుదురు. పూర్ణాయుర్దాయవంతులు. తండ్రి బాల్యమందు మరణించును. పిత్రార్జిత ఆస్థి ఎక్కువగా నుండదు. చంద్ర, కుజ, గురులకు పాప సంబంధము గలిగిన మారకు లగుదురు. కార్మికుల పాలిటి కల్పతరులు.

గురుడు:—గురువు ద్వితీయ లాభాధిపతియై పాపియైనను ఈతని స్థితి దృష్టి శుభఫలముల నొసగును. గురు వీక్షణ లగ్నమునకు గాని లగ్నాధిపతికిగాని గలిగిన శుభము. దశమభావ గతుడై ధన భావమును చూచిన అధిక ధనయోగము ప్రాప్తించును. కోణస్థితి శుభము. గురుడు లగ్నమందున్న అధిక విద్యాప్రాప్తి. దాక్షిణ్యము, దైవచింత, వాగ్వాదము, ఊహాశక్తి గల్గును. ఈతని దశలో అస్తి నష్టమగును. సుఖముండదు.

శుక్రుడు:— యోగకారకుడు. శుక్రుడు 10 నందు కుజుడు 9 నందున్న (భాగ్య రాజ్యాధిపతుల పరివర్తన మహాయోగము) రాజయోగము. ధనస్థానగతుడైన ధనయోగము. 4, 9 లందు శుభుడై ఉన్నత పదవుల నొసగగలడు. 7 నందు పాపియైననూ ఈ లగ్నమునకు శుభుడు. శుక్ర, శనుల యుతి, శుక్ర గురుల యుతికన్న రాజయోగ్యపదము. లాభమందున్న

శుక్రుడు పూర్ణ శుభఫలముల నీయగలడు. శుక్రుడు లగ్న మందున్న ఈతని దశలో సర్వ శుభములు గలుగును.

బుధుడు:—కేంద్రాధిపతులతో గలసి శుభస్థానగతుడైన గొప్ప అదృష్టము గల్గును. కుజ, బుధుల యుతి గలిగిన గొప్ప శస్త్రవైద్య నిపుణు లగుదురు. బుధుడు లగ్నమందున్న తొందరపాటు గలిగిననూ ఖ్యాతిగల విద్యావంతు డగును. ఈతని దశలో అధిక ధనప్రాప్తి—సుఖప్రదమగు జీవనము ప్రాప్తించును.

రవి :—రవి లగ్నమందున్న జాతకులు దరిద్రము, దురదృష్టము, మొండితనము గలిగియుందురు. ఈతని దశలో అధిక కష్టములు ప్రాప్తించును. రవి ఉపచయములందుండుట మంచిది.

చంద్రుడు:—చంద్రుడు లగ్నమందున్న ఒంటె మెడ వంటి మెడ గలుగును. పొడవైన పండ్లు, ఎత్తగు పిరుదులు, తొడలు గలిగియున్ననూ చూపరిగాను, చురుకుగాను యుందురు. ఈ చంద్రదశయందు ఆస్తినష్టము, రాజకోపము, మనోవ్యాధి ప్రాప్తించును.

కుజుడు:—కుజుడు లగ్నమందున్న స్వతంత్రత, ఉద్రేకము, నీతి నియమములు లేకుండును. కుజదశయందు అధికార నిరాదరణ, తస్కారక బాధలు గలుగును.

కుంభ ద్వాదశాంశ పరిశీలన - దశవర్గలు

రాసులు	1	$\frac{1}{2}$	$\frac{1}{3}$	$\frac{1}{4}$	1/7	$\frac{1}{8}$	1/9	1/10	1/11	1/12
మేషము	కుజ	చం.	గురు	10 శని	శుక్ర	శుక్ర, కుజ	కుజ, గురు	గురు	చంద్ర	11 శని
వృషభము	శుక్ర	రవి	10 శని	11 శని	కుజ	బుధ	బుధ,చంద్ర	రవి, బుధ	విర	11 శని
మిధునము	బుధ	చం.	11 శని	గురు	బుధ, శుక్ర	10 శని	కుజ	గురు	10 శని, శుక్ర,బుధ	11 శని
కర్కాటము	చంద్ర.	రవి	కుజ	11 శని	శుక్ర	రవి, బుధ	గురు	రవి, బుధ	శుక్ర, బుధ	11 శని
సింహము	రవి	చం.	గురు	11 శని	కుజ	కుజ	రవి, బుధ	10 శని	కుజ, శుక్ర	11 శని
కన్య	బుధ	చం.	10 శని	గురు	బుధ	కుజ	కుజ	బుధ	కుజ, గురు	11 శని
తుల	శుక్ర	రవి	11 శని	11 శని	గురు	బుధ,చంద్ర	10 శని	10 శని	గురు	11 శని
వృశ్చికము	కుజ	చం.	కుజ	11 శని	బుధ,చంద్ర	11 శని	బుధ	బుధ, శుక్ర	10, 11 శని	11 శని
ధనస్సు	గురు	రవి	గురు	గురు	10 శని	బుధ	శుక్ర, బుధ	10,11శని	11 శని	11 శని
మకరము	10 శని	చం.	10 శని	10 శని	చంద్ర, రవి	కుజ, శుక్ర	10,11శని	బుధ, శుక్ర	గురు	11 శని
కుంభము	11 శని	రవి	11 శని	11 శని	11 శని	గురు	శుక్ర	11 శని	కుజ	11 శని
మీనము	గురు	రవి	కుజ	గురు	గురు	గురు	గురు	రవి	బుధ	11 శని

పై వివరముల ననుసరించి దశవర్గులలో కుంభ శనికి ప్రాప్తించిన స్వవర్గులు :—

మేషమందు కుంభ ద్వాదశాంశయందు జననమొందిన జాతకులకు కుంభ శని					1 వర్గము
వృషభమందు	,,	,,	,,	,,	2 వర్గములు
మిధునమందు	,,	,,	,,	,,	2 వర్గములు
కర్కాటమందు	,,	,,	,,	,,	2 వర్గములు
సింహమందు	,,	,,	,,	,,	2 వర్గములు
కన్యయందు	,,	,,	,,	,,	1 వర్గము
తులయందు	,,	,,	,,	,,	2 వర్గములు
వృశ్చికమందు	,,	,,	,,	,,	4 వర్గములు
ధనస్సునందు	,,	,,	,,	,,	3 వర్గములు
మకరమందు	,,	,,	,,	,,	2 వర్గములు
కుంభమందు	,,	,,	,,	,,	6 వర్గములు
మీనమందు	,,	,,	,,	,,	1 వర్గము

పొందుచున్నాడు. ద్వాదశలగ్న విచారము సలిపిన, ధనుర్మీనములకు మాత్రము శని పాపి. కర్కాట, మకర, సింహ, కుంభములకు సముడు. మిగిలిన రాసులకు శుభుడు. శని ఎక్కువ స్వవర్గలు గలిగిన బలవంతుడై శుభఫలముల నొసగును. ధనస్సునకు పాపియగు శని కుంభ ద్వాదశాంశమందు జనన మొందిన వారలకు 3 స్వవర్గలు కలిగియున్నాడు. గాన పాపమంత అధికముగాని తెలియుచున్నది. శని శుభుడుగా పరిగణించబడు రాసులలో వృశ్చిక మున్నది. అందు కుంభ ద్వాదశాంశయందు జననమొందిన వారలకు 4 స్వవర్గల నొందిన శని పాపుడగుటకు వీలుగాదు. శుభఫలములనే నీయగలడు. ఈహాంశముల గ్రహించి కుంభ ద్వాదశాంశ జననము ఏ రాసులందు పాపకారణమో తెలియవలెను. ప్రపంచమందు జన్మించువారలలో సుమారు 1/12 వంతు కుంభలగ్న జాతకులు. సుమారు 1/144 వంతు కుంభలగ్న కుంభ ద్వాదశాంశయందు జన్మించువా రున్నారు. వీ రందరకూ పాపఫలములు ప్రాప్తించునను టన్యాయముగాదు. గాన జైమినీ మహర్షి మొదలగువారు చెప్పిన రీతిగా కుంభ లగ్న జననము పాపముగాదని తెలియుచున్నది. జననకాలము ననుసరించి పీఠికమీద ఏర్పడు యోగముల ననుసరించి శుభాశుభ ఫలములు ప్రాప్తించునే గాని కుంభరాశి జననముగాని, కుంభ ద్వాదశాంశ జననముగాని పాపమనుట న్యాయముగా తోచదు. రెండు రాసుల కాధిపత్యముగల గ్రహములు తామేరాశి యందుండునో ఆ రాసిఫలముల ప్రధానముగా నీయగలవని శాస్త్రప్రమాణము ముందు దెలిపియున్నాను. అందు మూల త్రికోణగతుడగు శని తన వ్యయాధిపత్యములో సంబంధము లేక లగ్నాధిపత్య ఫలముల మాత్రమే నీయగలడు. కుంభ ద్వాదశాంశయందు జనన మొందినవారలకు శని శత్రుక్షేత్ర మగు వృశ్చికమందున్ననూ కుంభ ద్వాదశాంశకు ప్రాప్తించు దశవర్గలలో 4 స్వవర్గల కాధిపత్యము నొందుచున్నందున బలయుక్తుడై, లగ్నాధిపతి యగుటచే తన స్వదశా ప్రథమ భాగమందు మూలత్రికోణాధిపత్య శుభఫలముల నొసగి, ద్వితీయ భాగమందు తీవ్రమగు వ్యయాధిపత్య పాపము నొసగుచుండుట అనుభవము. ఈవిధమున ద్వాదశ రాసులందు కుంభ ద్వాదశాంశయందు జననమొందిన వారల శని మహర్దశా ఫలముల విచారించిన నిజస్థితి ఎరుగనగును.

కుంభ రాసికి గురుసంబంధము

శని కారకత్వ రాసులగు మకర కుంభములలో శని కారకత్వములు ఎక్కువగా మకరమందు గన్పించుచున్నవి. కుంభమందు ఎక్కువగా గానరావు. గురుకారకత్వము లెక్కువగా కుంభరాసి జాతకులందు గన్పించుచున్నవి. మకరరాసి జాతకులు నిర్బంధములచే గాని, ఆశాభంగములచే గాని ప్రాప్తించిన గంభీరత వహింతురు. ఇందు కొంత దురదృష్టము చూపట్టును. వీరు క్రూరులకు యజమానులు. క్రూరశిక్షణ వీరలకు ప్రధానము. సహజముగా అత్యల్ప విషయములందు కూడ జోక్యము కలుగజేసికొందురు. అహంకారము గలవారు. ప్రతీకారవాంఛ మెండు. డొంకతిరుగుడు పద్ధతుల నవలంభించి స్వలాభములకు పాటుపడుదురు. కుంభలగ్న జాతకులకు శని ద్వాదశాధిపతి యగుటచే అంత బలము గలవాడు గాడు. శని కుంభ సంబంధముచే ఎక్కువ పాపఫలముల నీయక గురు సంబంధమగు శుభముల కొంతవరకు ఇచ్చుచున్నాడు. కుంభము వాయుతత్వరాసి గాన తెలివితేటలకు ప్రధానము. స్థిరరాసి గాన తరుచుగా మార్పులకు ప్రతికూలము. న్యాయదృష్టి నొసగును. భచక్రమందు 11 వ రాసి యైనందున లాభ సంబంధముగలది. లాభములు గురుకారకత్వములు. ఆకాశతత్వ స్థిరరాసిగాన రక్తప్రసరణకు కారణము. రక్తప్రసరణ గురుకారకత్వము. ఇందు జన్మించినవారు ఎల్లప్పుడూ తమ క్షేమమును, ప్రజల క్షేమమును వాంఛింతురు. వీరు మేధావులు. నూతన మార్గముల సృష్టించువారు. స్థిరచిత్తము, మనోధైర్యము, స్నేహితులయెడ నిష్కళంకమగు ఆదరాభిమానములు, జాగ్రత్తగా ఆలోచించి మాటలాడుట, అన్న మాటలను నిలబెట్టుకొనుట, వీరలకు సహజము. ఈ లక్షణములు గల గ్రహము గురుడు. మేధాతనము, అభిమానము, స్వస్థతకూర్చు శక్తి, కాంతి, తేజస్సు, అన్యోన్య సంబంధములు, ఇతరుల నొప్పింపకుండుట, ఆదరణ, అభివృద్ధి, మాధుర్యత, నమ్రత, కుంభమునకు, గురునకు గల లక్షణములు. కుంభలగ్న జాతకులు తమ అభిప్రాయములను సంఘముల ద్వారా విశదపరతురు. గురుడు హెచ్చరిక సలుపువాడు. తన స్థితి తా నెరిగియున్నాడు, బాధ్యతల గుర్తెరిగి, తన మాటను నిలుపుకొను స్వభావము గలవాడు. ప్రజల బాధ్యతల గుర్తింపక ప్రవర్తించిన తిరుగుబాట్ల నొనర్చుటకు గురు సంబంధము ప్రధానము. ఇందువలన కుంభలగ్న జాతకులు స్వతంత్రాభిలాష కలిగి అసాధారణమగు పనుల నిర్వహింప గలవారగుచున్నారు. ఈ కారకత్వములు శనికి ప్రతికూలములు. గాన గురు సంబంధము కుంభరాశి కెక్కువని గ్రహింపవలెను. కుంభము నీటికుండను సూచించును. ఈ నీరు సృష్టికి ప్రేరేపణలకు ప్రధానము. వాయుతత్వ రాసియగు కుంభము గురు కారకత్వమగు ప్రేరేపణను, శబ్దమును కూడబట్టుచున్నది. శాస్త్రములందు శని సృష్టిప్రేరేపణలకు కారకుడని చెప్పబడియుండలేదు. శని అభివృద్ధికి, వికాసమునకు కారకుడు. గురుడు సృష్టికి దూరదృష్టికి, ప్రేరణకు కారకుడు. గాన గురు

కుంభ రాశి

సంబంధములేని కుంభలగ్న జాతకులు సంఘాభివృద్ధిమార్గముల ననుసరింపజాలరు. పై హంశములచే కుంభమునకు శని సంబంధముకన్న గురు సంబంధము ఎక్కువగా కన్పించుచున్నది. ఇందుచే కుంభలగ్న జాతకుల ఫలముల విచారించునపుడు గురుస్థితిచే గలుగు శుభాశుభముల విచారించుట ప్రధానము.

ఆగస్టునెలలో ప్రచురింపబడిన గ్రహసంబంధమను వ్యాసములో దివాకర సిద్ధాంతమందు గ్రహసంబంధములు ఎట్లేర్పడుచున్నవో చెప్పియున్నాను. ఈ వ్యాసమందు ఈ సిద్ధాంతరీత్యా దశాంతర్దశల క్రమము వానిచే ప్రాప్తించు ఫలముల నెరుగగలరు.

కుంభరాసికి శని లగ్న వ్యయాధిపతి గాన ఈరాసి జాతకులకు ప్రాప్తించు కష్టనష్టములు స్వయంకృతాపరాధ ఫలములు. వారు నిర్వహించు వ్యవహారములందు కడు శ్రద్ధతో వ్యవహరించుట ముఖ్యము. రాశ్యాధిపతియగు శనికి గోచారమందు జన్మలగ్నాధిపతి జననకాలమందున్న భాగలతో సంబంధము (యుతి) గలిగినపుడు ఆరోగ్యభంగము లేదా కృషియందు అశుభఫలములు ప్రాప్తింపగలవు. వీరు ఆయా కాలములందు అనేక సమస్యల నెదుర్కొనవలసియుండును. ప్రస్తుతమందు శని కుంభరాసిచార సలుపుచున్నాడు. సామాన్యముగా ఒక్కొక్కరాసియందు శని 30 నెలలుండును. ప్రతి రాశియు 9 నక్షత్రపాదముల గలిగియున్నది. కుంభము, ధనిష్ఠ 3, 4 పాదములు, శతభిషం—4 పాదములు, పూర్వాభాద్ర 1, 2, 3 పాదములు కలిగియున్నది. ఈ నక్షత్రములకు కుజ, రాహు, గురు లధిపతులు. శని ఈ నక్షత్రములందు సంచరించునపుడు ఆయా నక్షత్రములందలి ఆధిపత్య ఫలముల నీయగలడు. ధనిష్ఠ చారయందు కుజాధిపత్య ఫలములు, శతభిష చారయందు రాహు ఆధిపత్య ఫలములు, పూర్వాభాద్ర చారయందు గురు ఆధిపత్య ఫలములు ప్రాప్తించును. శని కుంభ రాసి చారయందు 30 నెలలు యుండును గాన ఆ కాలమును వింశోత్తరీ దశాక్రమమున కుజ, రాహు, గురుల మహర్దశగా నిర్ణయించి అందు అంతర్దశల నిర్ణయింపవలెను. అట్లు చేయగా శని కుంభ ప్రవేశమునుండి ఈ సంవత్సరాంతము వరకు ఏ దశా విదశానాథుల ఫలముల నొసగునో తెలియగలదు. కుంభమందు శని 26—1—64 న ప్రవేశించినాడు.

26— 1—64	నుండి	11—2—64	వరకు	కుజదశ	బుధాంతరము	
11— 2—64	నుండి	18—2—64	వరకు	,,	కేత్వంతరము	
18— 2—64	నుండి	7—3—64	వరకు	,,	శుక్రాంతరము	
7— 3—64	నుండి	13—3—64	వరకు	,,	రవ్యంతరము	
13— 3—64	నుండి	23—3—64	వరకు	,,	చంద్రాంతరము	
23— 3—64	నుండి	12—4—64	వరకు	రాహుదశ	రాహ్వంతరము	శతభిషా ప్రవేశము
12— 4—64	నుండి	5—5—64	వరకు	,,	గుర్వంతరము	
5— 5—64	నుండి	27—7—64	వరకు	,,	శన్యంతరము	ఈ కాలమందు శని వక్రము
27— 7—64	నుండి	21—8—64	వరకు	,,	గుర్వంతరము	
21— 8—64	నుండి	18—9—64	వరకు	,,	రాహ్వంతరము	
18— 9—64	నుండి	9—10—64	వరకు	కుజదశ	చంద్రాంతరము	ధనిష్ఠా ప్రవేశము
9—10—64	నుండి	25—11—64	వరకు	,,	రవ్యంతరము	వక్రత్యాగము
25—11—64	నుండి	15—12—64	వరకు	,,	చంద్రాంతరము	
15—12—64	నుండి	శతభిషా ప్రవేశము		రాహుదశ	రాహ్వంతర ప్రారంభము	

ఈ పద్ధతి ననుసరించి ఉదాహరణ జాతక ఫలముల పరిశీలింతము.

	గురు ×	రాహు	కుజ
చంద్ర	రాశి చక్రము		లగ్నము
	శుక్ర శని కేతు	రవి బుధ	

	రాహు	చంద్ర	లగ్నము
శని	జనన కాల దశాంశ చక్రము		
			గురు
రవి బుధ		కేతు కుజ శుక్ర	

చంద్ర	గురు ×	కుజ శుక్ర	రాహు రవి బుధ
శని	2–7–64 గోచారము		
కేతు			

	× 8	గురు 2	రాహు 4
చంద్ర, 12 శని—6	20–9–64 గోచారము		శుక్ర కుజ–9
కేతు			రవి బుధ

దశమ భావము —8°

లగ్నము	3— 9—53	పుష్యమి	— శని
చంద్ర	10—12—27	శతభిషం	—రాహు
శనీ	7—23—12	జ్యేష్ట	—బుధ
రాహువు	1— 9—14	కృత్తిక	—రవి


2—7—64

శని	10—11—27	శతభిష	— రాహు
రాహు	2— 8—45	ఆరుద్ర	— రాహు
కుజుడు	1—16—55	రోహిణి	— చంద్ర
చంద్రుడు	11— 6— 9	ఉత్తరాభాద్ర	— శని
శుక్రుడు	1—28—47	మృగశిర	— కుజ

ఈ జాతకుడు కుంభరాశియందు జన్మించియున్నాడు. జననకాల దశాఫలముల గోచారవిధమున. సమన్వయముచేసి ఈ సిద్ధాంతఫలముల నిర్ణయింపవలెను గాన చంద్రరాశి ప్రధానము. లగ్నమునుండి, చంద్రలగ్నమునుండి దశమాధిపతి కుజుడు. కర్కాటకమునకు కుజుడు యోగకారకుడు. కుంభమునకు పాపిగాడు. 2—7—64 న ఈ జాతకునకు శని మహర్దశ శుక్రాంతర బుధభుక్తి జరుగుచున్నది. పై జెప్పబడిన దశాక్రమమున రాహుదశ శన్యంతరము జరుగుచున్నది. 2–7–64 న దశమాధిపతి కుజుడు చంద్ర నక్షత్రమందు, చంద్రుడు శని నక్షత్రమందు, శని రాహు నక్షత్రమం దున్నారు. గాన లగ్న, రాజ్య, అష్టమాధిపతులకు సంబంధ మేర్పడినది. రాహువు స్వనక్షత్రగతుడై వ్యయమందున్నాడు. జననకాల దశాంశ చక్రము ననుసరించి రాజ్యభావ ఫలముల నరయవలయును. రాజ్యాధిపతి గురువు శనిచే చూడబడుచున్నాడు. శని అష్టమ భాగ్యాధిపతి. దశమభావమునకు శుభదృష్టి లేదు. దశమ భావమునకు భాగ్యాధిపతి వ్యయమందుండుట, భావమునకు భావాధిపతి షష్టాష్టకము గలిగియుండుట గమనించిన రాజ్యమునకు, గురునకు గల్గిన పాపము శనివలన సంక్రమించినదని విశదమగును. శని మహర్దశ, శుక్రాంతర బుధ భుక్తి జరుగుచున్నది. శని అష్టమాధిపతి. శుక్రుడు చతుర్థ లాభాధిపతి. బుధుడు తృతీయ వ్యయాధిపతి గాన ఈ కాలమందు భాగ్య లాభములకు నష్టము సూచింపబడుచున్నది. దివాకర సిద్ధాంతరీత్యా రాహుదశ శన్యంతరము జరుగుచున్నది. శని వక్రించి బలవంతుడైనాడు. లగ్న, అష్టమ, రాజ్యాధిపతుల సంబంధము గలిగినది గాన రాజ్యభావమునకు పాపము గలుగవలె ననుట నిస్సందేహము. దశమభావమునకు (వృశ్చికమునకు) శని, కుజుల పాపదృష్టి ప్రాప్తించినది. దశానాధుడగు రాహువు భావమున కష్టమందున్నాడు. శుక్రుడు వృషభమందున్ననూ ఈతని దృష్టి రాజ్యభావమునకు ప్రాప్తింపలేదు. గాన పై జెప్పిన విధమున ఈ కాలమందు కృషియందు అశుభఫలములు ప్రాప్తింపక తప్పదు. తన్మూలకముగా అనేక సమస్యల నెదుర్కొనవలసి వచ్చినది. ఇట్టి పాప ఫలము ప్రాప్తించునని ఈ జాతకునకు ఉద్యోగము ప్రాప్తించు కాలము నిర్ణయించినపుడే చెప్పియున్నాను. ఈ పాపఫలముచే ఈ జాతకుడు అనుభవించుచున్న (Gazetted) ఉద్యోగము నుండి విరమించుకొనవలసి వచ్చినది. గాన ఈ సిద్ధాంతము ననుసరించి చెప్పబడిన శుభాశుభ ఫలములు క్రమముగా ప్రాప్తించినవి.

రాబోవు కాలమందు ఎట్లుండునో విచారింతము. 18—9—64 నుండి శనికి కుజ నక్షత్రమగు ధనిష్ఠయందు చార యున్నది. అపుడు శని కుజదశ చంద్రాంతరమందుండును. జననకాలదశ ననుసరించి అప్పటికి శనిదశ శుక్రాంతర కేతుభుక్తి జరుగుచుండును. తృతీయ రాజ్యాధిపతియగు కుజుడు శని నక్షత్రమందు, లగ్నాధిపతి శని కుజ నక్షత్రమందున్నందున వీరలకు పరస్పర సంబంధ మేర్పడుచున్నది. కుజుడు తన అధిదృష్టిచే శనిని చూచుచుండును. కుజునకు గురుని వలన నీచభంగము ప్రాప్తించినది. జన్మ లగ్నాధిపతియగు చంద్రుడు జననకాలమందున్న కుంభ 12 వ భాగయందుండి నీచభంగ మొందిన దశమాధిపతియగు కుజ వీక్షణ నొందుచున్నాడు. దశాంశ చక్రమందు రాజ్యాధిపతియగు గురుడు కుజుని నీచభంగమునకు కారకుడైనాడు. కుజఫలముల నివ్వనున్న శని తన తృతీయ దృష్టిచే జననలగ్న దశమమును, దశమ దృష్టిచే చంద్రలగ్న దశమమును చూచుచున్నాడు. దశమభావమునకు శని గురుల దృష్టి ప్రాప్తించుటయే గాక భావాధిపతి భాగ్యమందు మిత్రక్షేత్రమున నీచభంగ మొంది యుండును. గాన ఆ తదాది రాజ్యభావమునకు మరల శుభము గలుగుననుట నిస్సందేహము. అనగా 18—9—64 నుండి 9—10—64 వరకుగల కాలమందు చంద్రుడు కుజ నక్షత్రములందు చార గలిగినపుడుగాని, గురు నక్షత్రములందు చార గలిగియున్నపుడుగాని తిరిగి ఈ జాతకునకు ఉన్నతమగు పదవి ప్రాప్తించును. చంద్రుడు పునర్వసు నక్షత్రమందు కర్కాటరాసియందు చార సలుపువేళ ఈ జాతకుడు శుభ ఫలముల నొందగలడు. శుక్ర, కేతుల విచారించిన అనేక విషయములు గోచరింపగలవు. పాఠకులు ఈ విషయముల గూడ గమనింతురని విశ్వసించుచున్నాను.

దివాకర సిద్ధాంతము ననుసరించి ద్వాదశ లగ్నములకు వివిధ భావ ఫలములను గ్రహముల వివిధ దశాంతర్దశలందు ప్రాప్తించు వివరముల క్రమముగా తెలుపగలను.



వ్యావహారికభాష వ్యాకృతి

శ్రీ సూరిరామ సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్లో॥ వాగర్థావివసంపృక్తౌ - వాగర్థప్రతిపత్తయే।
జగతః పితరౌవందే పార్వతీ పరమేశ్వరౌ॥

ప్రాపంచిక వ్యవహారములందుఁ గలుగుచుండు ప్రయోజనములఁబట్టి లౌకికభాషయందుఁ దఱచుగా నూత్నపద సన్నివేశాది కారణములచే మార్పులు కలుగుచుండుట సహజము. భిన్న రాజన్యుల కాలములందు నాయా రాజకీయాది పదజాలములును జేరుచుండును. కర్ణాటక రాజుల పాలనమునఁ గన్నడ భాషాది సంస్కృతి బహువిధముల నాంధ్రమున వ్యాప్తి జెందెను. తురుష్కుల రాజ్యమున మ్లేచ్ఛ పదములు సహితము చూరఁగొనిన రీతి నాంగ్లేయుల యేలుబడియందున నాంగ్లపద సాంప్రదాయములును దన్నాగరకతతోబాటుగ నాటుకొనినవి.

క్రమక్రమముగా నాగరకత యభివృద్ధినొంది ముద్రణాది సౌకర్యముల వలన గ్రంథ రచనాదుల శీఘ్రవ్యాప్తికి నావకాశము నేర్పడుటచే యథాగతిఁ బరిణతిఁ బొందియున్న యాంధ్రభాషను గొంత నియమించి యప్పటికిఁ బూర్వము ప్రాచుర్యమున నున్న భాషాస్వరూప మవగత మగునట్లుగా వ్యాకృతి నేర్పఱచిరి. అందును గొన్ని శబ్దముల సహజ స్వరూపముల దెల్పి సంధి సమాసాద్యవసరములందును విభక్త్యాది భేదముఁ చేతను భూతాది కాల-భేదములచేతను సృష్టిజ్ఞన్నాదులందుఁ గల్గుచుండు పరిణామముల గుర్తెరుఁ గునట్లుగా వివరింపఁ బడినది. ఇట్టి నియమము లసంబద్ధములైయున్న తత్పూర్వ గ్రంథముల సమన్వయించుటకు "నాంధ్రనామ సంగ్రహాది" నిఘంటువులు సంపూర్ణముగా సహాయకరములుగాకుండుటచే "శబ్ద-రత్నాకరము" మున్నగు నిఘంటువుల నిర్మితి సహితమవసరమై చూపట్టినది.

యదార్థమున నన్నయాదుల వ్యాకృతి రచనల కాలమందు మాత్రము భాషయట్టి రూపముననే లౌకిక వ్యావహార్యమున నున్నదనియును మనము నిర్ణయింపఁ జాలము. "ము" వర్ణకము ప్రథమైకవచనాంతమునం గొన్ని పదములందైన నొకప్పుడుండెనని ప్రస్తుత భాషా స్వరూపముఁ బట్టి మన మూహించుటకు నెట్టి యవకాశము కాన్పించుటలేదు. సంస్కృత శబ్దములును "కాలం, ముఖం, లోకం" అను రూపములు వ్యావహారికమున నున్నవి. కాని "ము" వర్ణక ప్రయోగము లౌకిక భాషయందు మచ్చునకైన నెచ్చటను గానఁ బడుటలేదు.

మాండలిక భేదముల వివరించుచు "డొక్క" యను పదము నర్థము చేసికొనుటలో భిన్నమాండలికులగు పండితులెట్లు శ్రమనొందినదియు శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య గారుదహరించిరి.

"పొట్టడొక్క కడుపు— బొజ్జబొట్ట యనంగ
నుదరమునకు నాఖ్య—లొప్పుచుండు"

అను నాంధ్రనామ సంగ్రహ పద్యము నెరుఁగని పండితుఁడిట్టియెడ ఖసూచియగుటయు సహజమే. ఇట్లే:-

"కాంతఁ బేరగునాలవ
పాలికిఁ బాదంబునకును—బాలేందుధరా"

అనెడు నానార్థములు సహితమెరిఁ గినప్పుడే తన్నుఁ బండితునిగా నెంచుకొనవలసినయున్నదిగాని యన్యము కానేరదు.

ఇట్లు నిఘంట్వాదుల భిన్న ప్రాంతీయములగు పద సంచయములనెల్ల ప్రదర్శించుటయు నవసరమైయున్నది. కాని వ్యావహారిక భాషయందుఁ గల మాండలిక భేదములత్యంతము క్లేశావహములై కాన్పించుచున్నవి. వాని నన్నిటిని సమన్వయమున గొన్ని యెడల సుష్టువులుగా నెంచినను వానినెల్లరు నవలంభింపవలసిన యవసరము కాన్పించదు.

"ఏమి" యనుపదము "ఏమిటి, ఏంటి, ఏమిది, ఏంది, ఎంది" అను భిన్న విధముల భిన్న ప్రాంతీయము

యున్నది. "అట్లు" అను పదము "అట్లాగే, అట్టాగే, అలాగే, అట్టా" అను వివిధ పరిణామముల నొప్పుచున్నది. "ఆ విధమున" అనునర్థమున "ఆమొయిన" అనుటకు "ఆమోయిన"అవియును గొన్ని ప్రాంతముల వాడుకకలదు. "ఏందది ఆమోయిన మొద్దారె కూర్చున్నాడు !" అనుచు గుంటూరు మండలమున శిష్ట ప్రయోగము కాన్పించుచున్నది. "గట్ల, గిట్ల" తోబాటుగ "గక్కడ", గిక్కడ" లను తెలంగాణమున వాడఁబడుచున్నవి. "వచ్చాడు", చూశాడు" అను నట్లుగా "వచ్చిండు, చూశిండు" అనియును శిష్ట ప్రయోగములై కానఁబడుచున్నవి. "చూచుట, పోయుట" యనుటకు "చూసుడు" "పోసుడు" ననియు విహితములై యున్నవి. "అట్లందు" వనుటకు "గట్లన బడతవు" అని భావే ప్రయోగము కలదు. "ఇమ్మను, రమ్మను" అనుపదములు "ఇమ్మాను, రమ్మాను" అను రూపముల నున్నవి.

"ఆయిబాబో ! దీని తల్లిబొడ్డు బొక్క" మొదలగు నూతన పదములు గోదావరీ మండలమున సాధారణ్యమున నున్నవి. "వచ్చినయ్యా" అను కృష్ణామండల ప్రయోగముకంటె "వచ్చాయా" అను గోదావరీ మండల ప్రయోగము మాత్రా లాఘవముచే సౌష్ఠవాధిక్యతఁ గలిగియున్నదనవలసియున్నది. పాకశాలయందు నపూపములఁ జేయుటకై పిండిని ముందుగా దడిపిపెట్టుటకు "ఉప్పుట" యని వ్యవహరింతురు. శ్రాద్ధ దినమునందు "పిండిని ఉబ్బేసి కలుపు"మని అత్త కోడలితో బల్కుట గోదావరీ మండలమునఁ గలదు. "బంగాళాదుంప కూరంటే నాకు చచ్చే యిష్టం" అని ధారాళముగా లౌకిక భాషా రచనములందును వాడుచున్నారు. "చచ్చే" అను పదమును "అత్యంతము" అను నర్థమున నిఘంటువులోఁ జేర్పఁ దగదు కదా ! ఇట్లు కట్టుబాట్లు త్రెంచుకొని విచ్చలవిడిగా ప్రవృత్తినొందుచుండు వ్యావహారిక భాషయందున నశ్లీలాది దోష బాహుళ్య మెప్పటికప్పుడు దొరలుచునే యుండును.

తెలంగణమున వ్యావహారిక భాషయందున దోసంగులు బహుభంగులఁ గానఁబడుచున్నవి.

"దీనినిఁ బట్టుకొను"మనుటను "దీన్ని పట్టుకో"అని ధారాళముగాద్వితీయ మీఁద "గసడదవా"దేశము బాహుళ్యమున నున్నది. ఔత్తరీయ సాంప్రదాయమున "వబయోరభేదః" అను విధానమున "వసన్త" మనుటకు "బసంత్" "రవీంద్రుడు" అనుటకు "రబీందర్"యని వాడ బడుచుండగా, విచ్చల "బకార" స్థానమున "వకారమును" బ్రయోగించుట సుఖ

"పగిలినది" "తగిలినది" అను పదములు "పలిగినది. తలిగినది" అనుచు వర్ణ వ్యత్యయమున వాడంబడుచున్నవి. "నా దగ్గర" అను నర్థమున "నాతోడ" ననుటకు "నాతన" అని యుపయోగింపఁబడుచున్నది.

"నా కెల్లె" అనఁగా నా వైపున నను నర్థమున నాంధ్ర ప్రాంతమున నింద్య గ్రామ్య ప్రయోగము. కాని "మావూరు కెల్లె వస్తున్నాను" "పట్నంకెల్లె పోతున్నాను" లనుచు "నుండి" యనియును "వఙ్గఁకు" ననియు రెండర్థముల నీ పద ముపయోగమున నున్నది. ఉదాహరణమాత్రముగా నిచ్చట రెండు మూడు ప్రయోగముల నుదహరించితిని గాని, శిష్టాశిష్ట వివక్షత లేక సర్వజన విశిష్టమై బహు దోషపదములు గానఁబడుచున్నవి.

గోదావరీ మండలమున "దొబ్బేశాడు" లను పదమును "పారిపోయెను, ఎత్తుకొని పోయెను" లను నర్థమున స్త్రీ జనములు సహితము పల్కుచుండ విని కృష్ణామండల వాసులు తేఱిచూచుచుందురు. తెలంగాణమున నీ పదము "త్రోసెను" అను నర్థమున సర్వత్ర ప్రయుక్తమై కాన్పించుచున్నది. కావున నిందలి ప్రథమాక్షరమును గ్రామ్య సహితముగా నొప్పి,

"మందుకుం ద్రొబ్బి గురునకు—మ్రొక్కు మనియె" నని పోతనాదులును బ్రయోగించిరి.

★

ప్రాంతీయ భేదములచేతను గల్గు పరిణామ భేదము లనేకములు కాన్పించుచున్నవి. "ఏకణా, దో అణా, దస్ అణా, సమ్రాణా" మొదలగు స్థానముల సంఖ్యావాచకములే కాదు. "రావణుడు సీత నెత్తుకొని పోవుచుండగా "రాస్తాలో జటాయువు గాడీని రోకాయించాడు" లని హరిదాసు కథలో చెప్పుచున్నాడు. కన్యాశుల్కంలో గిరీశం "ఏమోయి ! My dear Venkatsam ! ముఖం చేతికిచ్చావ్" అన్నాడు. అంతకంటె దీర్ఘ పదప్రయోగము చేయలేదు. మా చిన్నతనంలో "When I say "one" you better చేతులు పైకెత్తండి" అని మాస్టరుగారు Drill చెప్పేవారు.

"అసలే I am suffering from fever అందులో మీరు Question వేస్తే How can I answer సార్" అని పిల్ల లనేవారు. Higher forms చదివె విద్యార్థులు కనుక అంత పొడుగుగా మాట్లాడా రనుకొనవచ్చునుగాని, ఈ హరిదాసుగారు ఎంత పాండిత్యమున్న లన్ని పదముల నురుదులో పలుకుచున్నారని తలచవలసి యున్నది ! క్రమ క్రమముగా నురుదు భాష సార్వజనీనముగునట్లుగా నపుడుద్దేశింపఁబడిన ధనియును దెలియుచున్నది.

వ్యావహారికభాష - వ్యాకృతి

భోజరాజు పది సంవత్సరములలోఁ దన రాజ్యము నందంతటను సంస్కృతభాష వ్యాప్తిలోనికిఁ దెచ్చెనని చెప్పుదురు.

''కావా బాలా—కాంచనమాలా
కస్యాః పుత్రీ—కనకలతాయాః
కిం తే హస్తే—తాళపత్రం
కావా లేఖాః—కాఖాగాఘాః.''

పాఠశాలకు జనుచున్న పంచవర్ష ప్రాయము బాలికతో భోజుం డిట్లు సంభాషించెనని ప్రతీతి కలదు. సంస్కృతము గ్రాంధికభాషయే గాని ''Spoken languag' కాదని కొందరు పల్కుచున్నారు. చాలకాలమునుండి సంస్కృత పాఠశాలలు ప్రసిద్ధములైయున్న విజయనగరము, కోనసీమ, సరిపల్లె, ఆగిరిపల్లి'' మొదలగు స్థలముల విద్యార్థులు బరిశీలించిన యెడల వారితో తుల్యతను మనము సంపాదింపలేమందుల కెంతయు చింతింపవలసి యున్నది. అట్టి దైవభాషను సర్వత్ర వ్యాప్తియందుఁ దెచ్చుటకై సర్వథా యత్నించుట మన విద్యుక్త ధర్మమై యున్నది.

తాండూరు పట్టణమునఁ గూరగాయలమ్మ మనిషి వచ్చి ''అమ్మా! మీకు బేనా!'' అని యడుగును. ''మాకు బేడ'' అనియును ప్రత్యుత్తరము నిత్తురు. ఇంతియకాక, ''విసత్తారుబొట్టు—అరుస్వరణా'' అను పదములును కన్నడ ప్రాంతమునఁ బాలుర ముఖముల వినఁబడుచుండును. ఇట్లే తమిళ ప్రాంతములందును నాయా పదములు మిశ్రితములై వ్యవహారికభాషయందుఁ గాన్పించును. పంచ ద్రావిడములు పరస్పర సంబంధము కలవియై యున్న కారణమునఁ గొన్ని పదము లాంధ్రమున యథాతథముగా వచ్చి చేరినను వానినంతటితో నియమించి గ్రాంధికాది రచనముల పలుపవలసి యున్నది కదా! లేనియెడల ''నా దుడ్డుదా! నేడుదా! కుడురా'' అనెడు ''అరవ రామదాసు'' కథవలె అత్యంతము హాస్యాస్పదముగా నుండును.

సుమారు రెండు మూడు దశాబ్దముల నుండి నవలాది గ్రంథరచనములు పత్రిక ప్రచురణములు వ్యావహారికభాషయందున్న మమువుచున్న కారణమున నీ భాష యిప్పటికే సార్వజనీనమై యుండనోపుఁ గావున మాండలిక భేదముల్ క్రమముగాఁ బాటింపవలసిన యగత్య ముండఁబోదని తలంచుట యుక్తి యుక్తము కనేరదు. ఇప్పటి కెన్ని సంవత్సరముల నుండియో గ్రాంధికభాషను బఠియించుచు నందు బాండిత్యము సంపాదించి ప్రబంధాది గ్రంథరచనల చేయుచున్నవారైనను నా భాషకు గృహకృత్య వ్యవహారముల వినియోగింప నేరకున్నారు. ''వెన్నెలి! బిచ్చగా డేతెంచె. తండులంబుల జేకొని చెచ్చెర విచ్చేయు'' మని నిజపత్నికి వాక్రుచ్చిరని శ్రీ కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి వచనముల నెంతయో వింతగాఁ జెప్పుకొనుచున్నాము. కావునఁ గృష్ణా గోదావరీ మండలములందలి వ్యావహారికభాషాపదములలో రచనలను, బత్రికాదులనుఁ జదువుచున్న కారణమున నీ భాషయె యలవడియున్య మాండలికులు స్వమాండలిక పదముల మఱతురని యెంచరాదు. ఇదొక్క ప్రాంతీయమైన వ్యావహారికభాష ప్రమాణ మనియును మఱొక్క ప్రాంతీయ మసహజ మనియును ననఁజాలము. వివిధ ప్రాంతీయ భాషా రచనలు కొన్నియెడల విభిన్నార్థ ప్రదర్శకములై యుండుననుటలో సంశయము లేదు. ఈ భావమును బురస్కరించుకొనియే స్వమాండలిక భాషలందున గ్రంథరచనల సల్పుట కెందరో సందియముచే ముందంజవేయ సాహసింపనేరకున్నారు.

''ఏది! నీ తప్పుల దప్తరమును విప్పు'' మని శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు పుత్రున కనతిచ్చిరట. వారి ''బాలకవి శరణ్యము'' నందు నిరూపించిన రీతినిఁ బూర్వ కవి ప్రయోగములందు సహితము దోసఁగు లెల కలిగె ననవలసి యున్నది! ''ప్రమాదో ధీమతా మపి'' ధీమంతులకును బ్రమాదము సహజమై యున్నది. ''To err is human''. జలమునకు నిమ్న ప్రవణమువలె రజస్తమో విశిష్టమై యున్న చిత్త మెల్లప్పుడును సన్మార్గ సంచరణమున లాఘవము కలిగి యున్నది.

''ప్రఖ్యా రూపంహి చిత్త సత్త్వం
రజస్తమోభ్యాం విశిష్ట
మైశ్వర్య విషయం భవతి.''

స్వయముగా సత్త్వమైన చిత్తము జ్ఞానస్వరూపము. రజస్తమస్సులచే నావృతమై యుండుటచే నాత్మను స్వస్వరూపాను సంధానమునుండి వినివృత్త మొనర్చి ప్రాపంచిక విషయాసక్త మగునట్లుగ నొనర్చుచున్నదని శ్రీ పాతంజల యోగసూత్రము. కావునఁ గొండపైకి గుండును దొరలింప యత్నించు తెఱంగున నను పదమును నీ చిత్తము నన్యాయత్తము కాకుండ సర్వదా జాగరూకత వహించుట ముఖ్య కర్తవ్యమై యున్నది. ఒక్కసారిగా రచియించిన కార్యము సంస్కారరూపమును జిత్తమున హత్తియుండి మరల దత్తదను రూప దేశ కాలాదులందును బ్రవృత్తి నొందుచుండు. ఇట్లు కొన్ని సార్లుగా మరల మరల నాచరించిన కార్యము దృఢ సంస్కృతి నొందిన నదియే తత్ప్రకృతిగాఁ బరిణమించును. ఇట్లు చిత్తము సర్వదా బహిఃకార్య ప్రవృత్తిచేఁ గలుషితమగు

చుండుటచే నిది బహు జన్మార్జిత సంస్కార పుంజమై యొప్పుచున్నది.

వ్యావహారికభాష సహితము భిన్న ముఖములఁ గల్గి చుండు వివిధ సంస్కార బాహుళ్యముచేఁ గట్టుబాట్లు దొలఁగి యథేచ్ఛముగా బ్రసరించుచు వచ్చుచున్న కారణమున నప భ్రంశమై నిజస్వరూపమును గోల్పోయినది. అను పదము నెన్నివిధముల నిర్బంధములఁ బట్టుకొని వచ్చుచున్నను బరాకు కల్గినపు డెల్ల పండితుల ముఖమునుండియును జారి దాని కభ్యసితమైయున్న భ్రష్టపథము ననువర్తించు చుండును.

★

"నీ ముఖమునుండి యుచ్చరించు భాష సుష్టువు కాదని నీవేల సంశయించెద" వని శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగా రొక యుపాధ్యాయునిఁ బ్రశ్నించిరట ! సుష్టుతా సుష్టుతల నుచ్చరించు పదములందే నిర్ణయింపవలసి యున్నది. ముఖమునుండి యుచ్చరించు శబ్దజాలమున కెల్లను రజస్తమో స్సంస్కారబాహుళ్యమున నిమగ్నమైయున్న చిత్తవృత్తియే మూలకారణమై యున్నదని యెఱుఁగదగి యున్నది. కాల హీనిచే సర్వతోముఖముగ భ్రష్టత నొందుచున్న వ్యావహారిక భాషాపదములెల్ల సుష్టువులే యని యెట్లు నిర్ణయింపగలము ! విశృంఖల వృత్తిచే నుచ్చ నీచములు బాటింపక యథేచ్ఛముగాఁ బల్కుచుండు నీచునకునువాని ప్రాక్తన సంస్కారానుగుణ్యమగు బుద్ధి వృత్తియే కారణమగుచుండును. కావున ముఖమునుండి యుచ్చరించు పదముల సౌష్టవము ననుసరించియె ఆయా వ్యక్తుల యొక్కయు, నాయా ప్రాంతముల యొక్కయు నాగరకత నిర్ణయింపఁబడుచున్నది. అట్లుగాక, బహుభంగుల వచ్చి చేరుచుండు తప్పులచే సర్వ విధముల వికృతాకృతి నొందుచున్న భాషయె సర్వథా గ్రంథ రచనాదులందును విధియింపఁదగిన యెడల శ్రీరామమూర్తి పంతులుగారు సూచించిన తప్పులశ్రస్త మంతయు నొక్కసారిగా నొప్పులకుప్పగాఁ బరిణమించుచున్నదిగదా ! పూర్వ కవిప్రయోగములగుట సుష్టుగా నెంచబడుచున్నను సందర్భ సుగుణాతిశయము కాన్పించిన యెడలనే సర్వదా గ్రాహ్యమగు నని యర్థము. లేనిచో "ఛాందసత్వాన్న దోషః" అన్నలుల నెంచఁదగియున్నది.

వ్యావహారిక భాషయందును శిష్టము, గ్రామ్యము, నింద్యము మొదలగు భేదములు గల్పించుచున్నారు. సంస్కృత ప్రాకృతాదిభవము లపభ్రంశములై యాంధ్రమునఁ గన్పట్టు రీతిని గొన్ని ప్రదేశముల నాగరకజనుల ముఖమునను నింద్య గ్రామ్య శబ్దజాలము విశేషముగా గాన్పించుచున్నది. ఈ వైలక్షణ్యమున కేమనవలసి యున్నది !

ఉ. మద్దెల వాసడానికిని మంగలి రంగడు యుద్దె గాడుబో
గుద్దును డోలువిూన, మన గుర్వన పెండ్లికి సందె రేవులో
మిద్దెలకాడ పోరుబడి మీసము దువ్వి పోనాయిబాడ సే
కొద్దిని వాసె వాద్దెమని కూసును మూఢుడు రాజశేఖరా !

ఇట్లు నిరూపింపఁబడిన భాష యంతయు నింద్యమే కదా !

"యెలక జల్మంలోన యెవరమోనంటి
సిగ్గొచ్చినయ్యంది సిలకనా యెంకి."

ఈ యెంకి పాటలు సహితము "అందురు మూర్ఖులు చంద్రశేఖరా" అను నింద్య భాషయందున నున్నను నవరక్త వాఙ్మయము కాఁజాలవని శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులును సమర్థించియుండ కాలక్రమమున నిట్టి రచనలను వ్యావహారికమునకు సుష్టువులుగా నెంచుటకై యత్నింపవలసిన యవసర ముండునేమో !

హిందీభాషా సాంప్రదాయము ననుసరించి పదములందలి ద్వితీయాంతిమాక్షరముల కుండు "అకారస్వర" ముచ్చరింపఁబడదు. లిపియందు నక్షర స్వరూపమున నుపపన్నమై యున్నను సంస్కృతపదమునందు సహితము "అకారము" వదలివేయుబడుచున్నది. "రామ" యను శబ్దము "రాం" అనఁబడును. "లోక" శబ్దము "లోక్" అగును. ఇట్లు పుంలింగ శబ్దములు సహితము నపుంసకాంతములుగను, హలంతములుగను బరిణమించుచున్నవి. సంస్కృతభాష యందలి శబ్దములెల్ల నర్థసిద్ధి కలవియై యుండుటచే నిట్లు స్వరోచ్చారణమును వదలివేసిన యెడల నాంధ్రమునందు "దద్భవ శబ్దముల" వలె నిర్జీవములై యెట్లు విపరీత ఫలప్రదము లగునదియును మ ద్విరచిత "శబ్దార్థ తత్త్వము" నందు సోదాహరణముగా నిరూపించితిని.

"రఘుపతి రాఘవ రాజారాం
పతిత పావన సీతారాం."

ఈ గీతమునందు గల "రాం" అను శబ్దమునందును "ఇక మీ జోలికి మేమేరాం" అను పదమునందు "రాం" అను శబ్దోచ్చారణమునందు గల్గు నర్థసిద్ధియందు నెట్టి భేదము కలుఁగనేరదు.

వ్యావహారికభాష . వ్యాకృతి

శ్లో. శ్రీరామ రామ రామేతి—రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం—రామనామ వరాననే !''

ఇందు ''శ్రీరామ, రామ, రామ'' యని రామ నామమును విస్పష్టముగా మువ్మారులు పలుకుచు శ్రీరామ నామమాహాత్మ్యమును బరమశివుఁడు జగదంబకు నుపదేశించెను. కాని, మనకు బ్రస్తుత ముపలబ్ధమై యున్న హిందీభాషా సాంప్రదాయముచే నవశబ్దజాలములు దెచ్చిపెట్టుకొని మన వ్యావహారిక భాషను సర్వ విధముల దోష భూయిష్ఠ మొనర్చుకొనుచున్నాము. భగవన్నామ సంస్మరణమునందు సహిత మిట్టి దోషముఁ గొనితెచ్చి పెట్టుకొను నవసరము కల్గినందుల కెంతయు జింతిల్లవలసి యున్నది. ఈ తప్పుల తడికలను గావని యవరోధించువా రెవ్వరు ?

''జనగణమన అధినాయక జయహే
భారత భాగ్యవిధాత !''

ఈ ప్రయోగమునందు విసంధి యేల విధియింపబడిన దనునది వంగభాషా సాంప్రదాయ మనవలసి యున్నది.

''వింధ్య హిమాచల యమునా గంగా
ఉచ్ఛల జలధితరంగా.''

ఇది బహువ్రీహి సమాసమే యైనయెడల నిందును విసంధియే కానంబడుచున్నది గదా ! ఇంతియుకాక ఆంధ్రమున సమాస ప్రకరణ మంతయును దత్సమ పదములందున సంస్కృత భాషా ప్రకరణము ననుసరించియే యున్నది. అట్లుగాక భిన్నముగా నున్నను విశ్వకవి ప్రయుక్త మగుటచే వంగభాషా సాంప్రదాయమని యెంచి మన మందరము సర్వదా సంస్మరింపవలసి వచ్చినది గదా ! కొంతకాలమున కిట్టివి వ్యాప్తియందు నిలచియుండి సుష్టుసాంప్రదాయముల విస్మరింపఁజేయు ననుటలో సంశయ ముండబోదు. లౌకికభాష యందుననే గాక, గ్రాంథిక భాషయందును నిట్టివి స్థిరనివాస మేర్పరచుకొను ననుట సహజము.

ఈ యవసరమున మఱొక్క యంశమును సహితము నొక్కి వక్కాణింపవలసి యున్నది. ''నమస్తే'' అనగా నిది హిందీభాష కాబోలునని యతి సులభమున ననేకులు దీనిని వాడుచున్నారు. ''బ్రహ్మచారి—నమస్తే'' అను హిందీ చలనచిత్రముతో నీ పద మిు వ్యాప్తిలోనికివచ్చెనని కొందరుతలంచుచున్నారు. నమః తే ''నీ కొఱకు నమస్కారము అని పల్కుటలో నమస్కారమున కర్హులగు వారలకు దండముతోబాటుగ ''నీకొఱకు' ననెడి ఏకవచన ప్రయోగ మేటి సాంప్రదాయమో తెలియుట లేదు. ''నమస్తే రుద్రమన తే'' అను నిత్యాది విధానములందు బరమేశ్వరునందుఁ దక్క యన్యస్థలములందు నమస్కారార్హులగు పెద్దలయెడ ''నీ కొఱకు'' నను నేకవచన ప్రయోగము చెల్లబోదు. దీనియందలి దోషమును వివర్శించిన విద్వాంసులు సహితము విన నొల్లకుండుట విషాదకరమై యున్నది. ఇది యంతయు నలౌకికమని యెంచక పెద్దలు సహిత మీ శబ్దమును వినినంతనే తాము హిందీ భాషలోనే దండమును బొందగల్గినట్లుగా నాధిక్యత నెంచి యత్యంతము సంతసిల్లుచున్నారు.

ఇట్టి వివిధ శ్రమల కోర్వఁజాలక కాబోలును ఆంగ్లమున్న దండము మొదలు దేవార్చనము వరకు ననుసట్లుగా ''You'' అను బహువచన ప్రయోగమున నెన్నుచున్నారు. తుట్టతుదకు '' You are my dog '' అనుచుఁ దన కుక్కను సహితము బహువచనమున సంబోధించుచున్నారు. మన సాంప్రదాయము దీనికి విరుద్ధముగా నున్నది. ఇట్లెప్పటి కప్పుడు తప్పొప్పులు దెలియనొల్లక విచ్చలవిడిగా పెచ్చుపెరిగి ఏ యలౌకికుంచేతనో చేయఁబడిన ప్రయోగములెల్ల వ్యావహారికభాష యందు నిలచిపోవుచుండుటచే నీ భాషకు నైసర్గికమగు సుష్టుత యెట్లు స్థిరముగా నుండఁగలదు !

''నమో వెంకటేశా—
నమో తిరుమలేశా.''

''నమో వెంకటేశా'' అనినట్లుగా ''నమో తిరుమలేశా'' అనియును నీ కవి ప్రయోగించినాడు. ''నమః + తే = నమస్తే'' అని యగుచుండగా ''నమ + తిరుమలేశా = నమస్తిరుమలేశా'' అని యేల పలుకరాదో తెలియదు. ఇది స్థిరముగ నిలచి సార్వజనీన మగుచున్నదిగదా ! కొంతకాలమునకిది పూర్వకవి ప్రయోగమై కన్పించును.

ఇట్లు భిన్న స్రోతోముఖములఁ బరివర్తమై సర్వదా పరిణతిం బొందుచుండు వ్యావహారిక భాషయందుననే గ్రంథ రచనల సల్పుచు వచ్చిను గొంతకాలమునకుఁ బూర్వ ప్రణీత గ్రంథములు జదువు సామర్థ్యము సహితము నశించిపోవును. ఇట్లు ప్రతి శతాబ్దియందును మరల మరల వాకృతులను నిఘంటువులను వ్రాయుచు వచ్చిన నీ కలాపమునకు మాత్ర మవధి యెక్కడ ? ఇట్లు రచియించు వ్యాకృతులును కేవల మా శబ్దముల దేశ ప్రయోగ భేదములు గల్గు చరిత్రల వంటివే యగును గాని శబ్ద ప్రయోగ [illegible]ముమ నిధి [illegible]ంప సమర్థములు కాఁజాలవు కదా !

ఆంగ్లమున వర్ణక్రమము (Spelling) న గల క్లేశభావమును సహింపజాలక ధ్వనిప్రయుక్త (Phonetic) విధానమునకై నవ్య మార్పుల వలన బూర్వ రచిత గ్రంథముల నన్నిటిని మరల వీనూత్న విధమున ప్రచురించు వరకును వానిని జదివించు సామర్థ్యము తొలగి పోవుచున్నదని బహుభంగుల విచారించుచున్నారు. కావున గ్రాంథిక భాషయందు గాని, లిపియందు గాని చేయునట్టి మార్పులవలన ఈ సమస్య యత్యంతము క్లిష్టతర మగుచుండును.

ఆంగ్లమునందు - సహితము లౌకికభాషయందు నెల్లపుడును గలుగుచుండు దోషములు వివిధ పాశ్చాత్య దేశములందున్న బహువిధములుగ గాన్పించుచున్నను రాజకీయాది వ్యవహారములందును నట్టి యపశబ్దముల కెట్టి యవకాశము కలుగనీయక ప్రాచీన సాంప్రదాయములనే సగౌరవముగ నాదరించుచున్న కారణమున నా భాషయే ప్రస్తుత మాధునిక ప్రపంచమునందంతటను సామాన్యమున వ్యవహారిక భాషయై వర్తింప వీలగుచున్నది. అట్లుగాక లౌకికభాషయందు గలుగుచున్న యపభ్రంశములనెల్ల సర్వ ప్రపంచ మవలంభింపవలసి వచ్చునెడల నా భాషయత్ర తత్ర కావలసి వచ్చెడివి.



కాళిదాస భవభూతులు -కథా ప్రణాళిక*

శ్రీ జి. సూర్యనారాయణ

"కాళిదాసస్య సర్వస్వ మభిజ్ఞాన శకుంతలమ్."

అన్న లలోక్తిని బట్టి కాళిదాస కృతమగు నాటకత్రయములో నభిజ్ఞానశాకుంతలమే సర్వోత్కృష్టమనియు అట్లే "ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే" యన్న సూక్తినిబట్టి ఉత్తర రామ చరిత్రము భవభూతి రచనలలో నుత్తమ నాటకమనియుఁ జెప్పదగును. ఈ నాటకద్వయ సమీక్షయే యీ మహాకవుల తార తమ్యమును నిరూపింపగలదు.

కాళిదాసు తన కావ్య వస్తువును మహాభారతములోని శకుంతలోపాఖ్యానమునుండి గ్రహించెను. పద్మపురాణాంతర్గత మైన స్వర్గఖండములోఁ గూడ శకుంతలోపాఖ్యాన వర్ణన కలదు. అభిజ్ఞానశాకుంతల మీ రెండవదానినే ఎక్కువగ పోలి యున్నది. కాని, పద్మపురాణము శాకుంతలమునకుఁ దరువాతి రచనమనియు శాకుంతలమే యా కావ్యరచనకు మూలమనియు పలువురు పండితుల అభిప్రాయము. కాన పద్మపురాణము శాకుంతలమునకు మూలాధారమని నేను చెప్ప సాహసింపను.

మహాభారతములోని శకుంతలోపాఖ్యాన సారాంశమును చిత్తగింపుడు.

"శకుంతల మేనకా విశ్వామిత్రులకు పుత్త్రిక. పితరులచేఁ బరిత్యక్తయైన నామెను కణ్వమహర్షి సాకును. మృగయా వినోదియై దుష్యంతుఁ డొకనాఁడు వేట శ్రమమునఁ గణ్వా శ్రమమును బ్రవేశించి యౌవనవతియైన శకుంతల ముగ్ధ మోహన సౌందర్యమునకుఁ బరవశుఁడై గాంధర్వ విధిచే నామెను వివాహమాడి నగరమునకు రప్పించుకొందునని బాసచేసి తన రాజధాని కేగును.

కణ్వుఁ డాశ్రమమున లేని సమయమున నీ సంఘటన జరుగుటచే తదనంతరము కణ్వుఁడు తన తపః ప్రభావముచే సర్వము నెఱింగి క్షత్రియోచితమగు గాంధర్వ వివాహము న్యాయమగుట నామోదించెను. కొంతకాలమున కాశ్రమ నివాసిని యగు శకుంతలకు పుత్త్రుఁడు గల్గును. పుత్త్రవతి యగు శకుంతలను గణ్వుఁడు తన శిష్యుల నిచ్చి భర్తృ సాన్నిధ్య మునకుఁ బంపును. రాజసభలో శకుంతలను గుర్తింపనేరని దుష్యంతుఁ డామెను నిరాకరించును. పిమ్మట ఆమె తన పత్ని యని యాకాశవాణి ముఖమున నెఱిఁగి పరిగ్రహించును. వాస్తవ మునకు రాజు వివాహ వృత్తాంతమును విస్మరింపఁడు. కాని లోకాప వాదభీతుఁడై యాతఁడు ఆమెను పరిగ్రహించుటకు వెనుక దీయును. ఈ కథనే కాళిదాసు తన నాటకమున నిట్లు మార్చివైచెను.

ప్రథమాంకము

దుష్యంతుఁడు కణ్వాశ్రమమునఁ బ్రవేశించును. శకుం తలా దుష్యంతులు పరస్పరము దెలిసికొని ప్రేమింతురు అనుంగు సకియలగు అనసూయా ప్రియంవదలు ప్రేమ కలాపమునకుఁ దగిన దోహదముఁ జేయుదురు.

* మూలము—డి. ఎల్. రాయ్.

ద్వి తీ యా ం క ము

వేటయందు నిరుత్సాహముం జెందిన దుష్యంతుడు విదూషకునితో శకుంతలా ప్రేమ కలాపమును గూర్చి ముచ్చటించును. రాజు మృగయాసక్తు డగుటకై సేనాపతి ప్రయత్నించి వ్యర్థీభూతుం డగును. తాపసద్వయము ప్రవేశించి రాక్షస బాధానివృత్తికై రాజును వేడును. మాతాజ్ఞా పరిపాలనమునకై విదూషకుని రాజధానికి బంపి తిరిగి తాను తపోవనమును బ్రవేశించును.

తృ తీ యా ం క ము

శకుంతలా దుష్యంతులు పరస్పర ప్రేమానురాగములం బ్రకటించి గాంధర్వ వివాహ విధి నంగీకరింతురు. చెలికత్తెలీ విషయమున తగు విధమున సహకరింతురు.

చ తు ర్థా ం క ము

విరహిణియగు శకుంతలయొక్క స్థితిని గూర్చి అనసూయా ప్రియంవదల సంభాషణ. ఇంతలో దుర్వాసుని యాగమనము. శాపము. వృద్ధ గౌతమిని మఱిద్దర తాపసులను వెంటనిచ్చి కణ్వుడు శకుంతలను దుష్యంతుని కడ కంపును.

(ఈ అంకములో రాజు శకుంతలను విడిచిపోవునపుడు అభిజ్ఞానముగా స్వనామాంకితమగు నంగుళీయక మిచ్చుట గాననగును.)

ప ం చ మా ం క ము

గౌతమీ తాపసద్వయ సహితయై శకుంతల రాజసభకుం బ్రవేశించును. రాజు నిరాకరింపంగా నామె యంతర్ధాన మగును.

అం కా వ తా ర ము

ధీవరుడు, నాగరికులు, ఇద్దరు భటులు ప్రవేశించుట. అంగుళీయోద్ధరణము.

ష ష్ఠా ం క ము

రాజు విరహావస్థ—ఇంద్రుని యాహ్వానము.

స ప్త మా ం క ము

స్వర్గమునుండి తిరోముఖుండైన దుష్యంతుడు హేమకూటమున భార్యాపుత్త్రుల గలియును.

ఉపాఖ్యాన సందర్భమున నీ నాటకమునకును మహాభారతమునకును విశేష వైషమ్య మున్నట్లు తోపదు. కాళిదాసు మూలకథను కేవలము విస్తృత మొనర్చెను. ఇక ప్రధాన భేదములు మూడు. 1. భారతమును బట్టి శకుంతలకు పుత్త్రోత్పత్తి కణ్వాశ్రమమందే జరుగగా నాటకమున ప్రత్యాఖ్యానమైన పిదప పుత్త్రుం డుదయించును. 2. మహాభారతములో శకుంతలా ప్రత్యాఖ్యానమును, తిరిగి పరిగ్రహణమును రాజసభలోనే కాగా నాటకమున శకుంతలా పరిగ్రహణము హేమకూట యాశ్రమమున జరిగినది. 3. విశిష్టమైన భేదము అభిజ్ఞానము, దుర్వాస శాపము.

కాళిదాసు తన నాటక వస్తువును భారతేతిహాసము నుండి గ్రహించినట్లే భవభూతియు తన యుత్తరరామ చరిత్రమందలి కథను వాల్మీకి రామాయణమునుండి గ్రహించెను. రామాయణమందలి కథ యిట్లున్నది.

"లంకా విజయానంతరము రాముం డయోధ్యను బరిపాలించుచుండగా ప్రజలలో సీతా విషయమైన దుశ్శంక లారంభమగును. తన యాభిజాత్యమ్మును రుజువుం జేయుటకై రాముడు మున్యాశ్రమ దర్శన మిషచే గర్భిణియగు జానకిం నడవికి బంపును. వాల్మీక్యాశ్రమ మామె కాశ్రయ మగును. అచ్చట లవకుశులు పుట్టుదురు. అటుపిమ్మట రాముం డశ్వమేధ మొనర్చును. తపోనిరతుడగు శూద్రకుని వధించును. అశ్వమేధావసరమున లవకుశ సమేతుడై వాల్మీకి మహర్షి రాజసభకు వచ్చును. అచ్చట లవకుశులు రామాయణమును గాన మొనర్తురు. శ్రీరాముడు వారిని పుత్త్రులుగా గుర్తించి తిరిగి సీతను పరిగ్రహింపం గోరును. కాని ప్రజా సమక్షమున సీతా సతీత్వమును ధ్రువపఱచుటకై యత డగ్నిపరీక్ష చేయగోరును. అభిమానధనయగు సీత భూమాతమం జేరును."

భవభూతి ఈ యుపాఖ్యానమునం తన నాటకమున నిట్లు మార్చెను.

ప్ర థ మా ం క ము

అంతఃపురమున సీతారాములు మిథునానురాగ సల్లాపములో నుండునంత రాముడు అష్టావక్రుని ముఖమున వసిష్ఠుని యాదేశము విని ప్రజారంజనమునకై జానకినైనం ద్యజింప శపథముం జేయును. చిత్రపట దర్శనము. సీత తన తపోవన సందర్శనోత్సుకతను రామునికి వెలిబుచ్చును. దుర్ముఖుడు ప్రవేశించి సీతను గూర్చి లోకాపవాదములు దెలియంజేయును. రాముడు జానకిని బరిత్యజింప నిశ్చయించును.

ద్వి తీ యా ం క ము

రాముడు పంచవటిలోం బ్రవేశించి శూద్రకుని వధించును. రాముడు జనస్థానము నవలోకించును.

తృతీయాంకము

తమసా, వాసంతీ, ఛాయాసీతల సమక్షమున రాముడు సీతకై విలపించును. (ఈ అంక విష్కంభమున తమసా మురళల సంభాషణము వలన రాముడు సువర్ణ సీతా ప్రతిమతో నశ్వమేధ మొనర్చినట్లు తెల్లమగును) వనవాసాంతమున సీత ప్రసవ వేదన సహింపలేక గంగా ప్రవేశ మొనర్చును. భూమియు భాగీరథియు నామెను పాతాళమునకుఁ గొనిపోయి రక్షించి కవల లగు లవకుశులను వాల్మీకి కప్పగింతురు.

చతుర్థాంకము

అరుంధతీ కౌసల్యా జనకుల విలాపము. వారు లవునిఁ జూతురు.

పంచమాంకము

లవచంద్రకేతుల యుద్ధము.

షష్ఠాంకము

విష్కంభములో విద్యాధర దంపతుల ముఖమున నా యుద్ధ వర్ణనము. రాముడు లవకుశులను చంద్రకేతువును గలియుట. కుశుని వలన రాముడు వాల్మీకి కృత రామాయణమును వినుట.

సప్తమాంకము

రాముడు సీతా నిర్వాసన నాటకమును దర్శించును. సీతారాముల పునస్సంయోగము.

భవభూతి రామాయణములోని కథాభాగము నేమాత్రము గ్రహించినట్లు లేదు. రామాయణములోని రాముడు స్వీయవంశ ప్రతిష్ఠకై సీత నొక నింద నెపము తోఁ బంపును. కాని, భవభూతి రాముడే మియు లేక ప్రజానురంజనము కొఱకే యట్లు త్యజించును. మఱియు శిశు మస్తకుఁడగు శూద్రకుని దివ్యరూపధారణమును రాముని ఛాయా సీతా సంపర్శనమును లవ చంద్రకేతుల యుద్ధమును రామాయణమున నపూర్వములు. విశేష వైశిష్ట్యము సీతారాముల పునస్సమాగమము.

ఈ కవు లిద్దరును మూల కథల నేల యిట్లు మార్చిరను ప్రశ్న తోఁక మానదు.

కాళిదాసు శాకుంతలుని ద్వారమున శకుంతలా దుష్యంతుల సమాగమమును సంధించును. లవకుశ వృత్తాంతమును, దృష్టిపథముఁ దొంచుక నియె కవి యిట్లు చేయుండును. ఈ పరివర్తనమునకు కారణము పరితాదృష్టమై యుండవచ్చును. పునస్సమాగమము గూడ నిట్లే కల్పితమై యుండవచ్చును.

ప్రధాన భేదములగు అభిజ్ఞాన దుర్వాస శాపములును నొక మహా ప్రయోజన సాధనమునకే కవి సంకల్పించియుండును. శకుంతలా నాటకమున నీ యభిజ్ఞాన శాపములు జొప్పించుట చేతనే దుష్యంతుఁడు నిర్దోషి యనుట బోధగుచున్నది. పూర్వకథ ననుసరించి దుష్యంతుఁ డొక బహుపత్నీకుఁడగు విషయలోలుఁడై సుకరండ పాన మత్త భ్రమరమువలెఁ దోచును. అట్టివాఁ డొక సుకుమారరూప పుష్పసుందరిని జూచి ప్రాలె నన్నచో నాశ్చర్యమేమి? అతఁ డొక ముగ్ధను ధర్మభ్రష్టను జేసి పోయినను నతని ప్రవృత్తి కది సహజమే! పిమ్మట నతఁడు రాజసభలోఁగాని యంతఃపురములోఁగాని అజ్ఞాతమగు తన ప్రవర్తనను బహిర్గతము చేయక మిన్నకుండుటయు, తుదకామెను స్వీకరింపకుండుటయు, నాతని ప్రవృత్తికి విరుద్ధము గాదు. కాని, కాళిదాసు తన దుష్యంతుని ధార్మికశ్రేష్ఠునిగను, కర్తవ్య పరాయణునిగను తీర్చిదిద్ది చిత్రించెను. అందుచే తన నాయకుఁడు కళంక నిమగ్నుఁడు కాకుండ రక్షించుటకై గాంధర్వ వివాహము, అభిజ్ఞానము, మునిశాపము—అన్న వానిని కవి కల్పించెను.

ఈ నాటకములోని దుష్యంతుని చరిత్రమును సూక్ష్మదర్శినిచే దిలకించినచో నాతఁడు కేవల మొక రసికుఁడు నిగ్రహవంతుఁడునై కనుపట్టును. కణ్వాశ్రమమున నతిథిగా నుండుట కంగీకరించిన రాజునకును "దుహితరం శకుంతలా మతిథి సత్కారాయ నియుజ్య" అను వైఖానసోక్తికిని చాల సంబంధము గలదు. ఈ ఆకాంత శకుంతలా శబ్దము రాజును ముగ్ధుని జేసెను. కనుకనే మంచిది "తాం ద్రక్ష్యామి" యన్న ప్రత్యుత్తరమును కేవల ముదాసీన భావముతో నీయలేదు. అటుపిమ్మట ఆశ్రమోద్యానమున సఖీసమేతయగు శకుంతలను వీక్షించి దుష్యంతుఁడు "దూరీకృతాః ఖలు గుణై రుద్యాన లతా వన లతాభిః" (అడవి తీఁగలు తమ గుణములచే నుద్యాన లతలను మించినవి) అని యాలోచించుటయు కేవలము కవి కల్పిత భావమును గాదు. ఇది కవి కల్పనయే యగుచో దాని వెంటనే "ఛాయా మాశ్రిత్య" (ఛాయ) నాశ్రయించి పొంచి చూచుటకు హేతువేమి? హృదయము కలుషితమైనప్పుడే పొంచి చూచుట తటస్థించును. దుష్యంతుఁడు చోటునిచ్చెడి చెట్టుచాటున పొంచియుండి యా ముగ్గుర చెలియల సంభాషణమును విని వారిలో శకుంతలను గుర్తించిన పిమ్మట "కణ్వముని యసాధుదర్శి గనుకనే యిట్టి రత్నము నాశ్రమ ధర్మమున బంధించినాడు" అని పలుకుట జాలిజెందియు గాదు. అతఁడు పాదపాంతస్థితుఁడై యా మునిబాలికను గాంచుచు నిట్లు ప్రశంసించెను.

"ఇదమ్ ఉపహిత సూక్ష్మ గ్రంథి నా స్కంధ దేశే స్తన

యుగ పరిణాహోచ్ఛాదనా వల్కలేన వపురభినవమస్యాః పుష్యతిస్వాం
నశోభాం కుసుమ మివనపిద్ధం పాండు పత్రోదరేణ."

(మూపున చిన్న ముడి వైచి కట్టబడిన వల్కలముచే స్తనమండల మంతయును గప్పబడినది. పండుటాకులచేత గప్పబడిన పుష్పమువలె నభినవమగు నీమె శరీరము స్వీయ శోభను ప్రకటింపజాలకున్నది.)

దుష్యంతుని లక్ష్యము ప్రధానముగ నెచ్చట నున్నదో పాఠకు లూహింతురుగాక! అటుపిమ్మట దుష్యంతుడే స్వయముగ "అస్యామభిలాషి మే మనః" (నా హృదయ మీమెను గోరుచున్నది) అనుటలో పాఠకులకు సంశయ నివృత్తి యగుచున్నది.

కాని, కాళిదాసు ఈ కళంకమునుండి దుష్యంతుని జక్కగ కాపాడెను. అతడు కాముకుడయ్యును శకుంతలను వివాహమాడ నెంచును. శకుంతలా జనన వృత్తాంతమును గూర్చి ప్రశ్నించుకొని యిట్లు తర్కించుకొనును. "సతాంహి సందేహపదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః" (సజ్జనులకు సందేహాస్పద వస్తువులందు అంతఃకరణ ప్రవృత్తియే ప్రమాణము) శకుంతల మేనకా విశ్వామిత్రుల పుత్రిక యని తెలిసికొన్నపుడు తనకు హృదయభారముపశమింప రాజిట్లు తలపోయును.

"ఆశంకసేయ దగ్నిం తదిదం స్పర్శక్షమం రత్నమ్."

(హృదయమా! నీ వింతవరకు దేనిని అగ్నియని శంకించుచుంటివో యది స్పృశింపదగిన యొక రత్నము.)

ఇట్లు రాజు కాముకుడయ్యును, కామాంధుని వలె చిత్రింపబడలేదు. ఈ మానసిక విప్లవమునందు దాతని మానసత్వము నశించి యతడు వివేకచ్యుతుడు కాలేదు. అతడు కామదృష్టిచే శకుంతలను జూచి తన కుపభోగ్య వస్తువుగ భావించుట వాస్తవమయ్యును హృదయమున నాతడామెను వివాహమాడ సంకల్పించెను. అతడు ముగ్ధయగు శకుంతలను ధర్మభ్రష్టను జేసి పారిపోజాలని సత్సంకల్పుడు.

కామోపాసకులగు కొందఱు కవుల దృష్టిలో వివాహ మొక తుచ్ఛ విషయము. వివాహ మనునది స్వర్గీయ ప్రేమకు ప్రతిబంధకమని వారి తలంపు. వారి దృష్టిలో వివాహ మనావశ్యకము. కావ్యములో వివాహమునకు స్థానములేదని వారి మతము.

Platonic love లో వివాహమునకు స్థానము లేదు. ఏలయన వారి ప్రేమయందే భవిష్యదితిహాసము పర్యవసితము.

(జాయాపతుల మన్మథ క్రీడ యున్నచోట వివాహమనివార్యము. వైవాహిక సంబంధములేని సంయోగము ఒక అపవిత్రమగు కేవల పాశవిక కృత్యము మాత్రమే. ఇట్టి ప్రేమయు [illegible] కామక్రీడయే! దంపతుల సంయోగము క్షణికము కదనియు నది చిరంజీవియై సంవర్ధితము కవలెననియు [illegible] వివాహమున నది నిక్షేపింపబడెను. ఈ పవిత్ర సంస్కారము (వివాహము) గృహమునకు సుఖదాయకమును, సంతతికి క్షేమకారియు, సమాజమునకు మంగళప్రదమును నగు సాధనము. సమస్త సాంఘిక సంక్షేమమున దానిపై నాధారపడి యున్నది. నిరర్థకమగు కామ ప్రవృత్తికి వివాహము సౌందర్యమయ మొనర్చును. ఉచ్ఛృంఖలమగు నింద్రియ వ్యాపారమున కది నిరోధము. విశ్వసృష్టి నది స్వర్గతుల్య మొనర్చును. పశుపక్ష్యాదులందున్న తత్తుల్యములగు ఆటంకజాలమందును వివాహము వ్యర్థము. వివాహము నాగరకతకు చిహ్నమగుట నది తుచ్ఛమును సంస్కారహీనము నని భావింపరాదు.)

ఏమి! కావ్యమున వివాహమునకు స్థానము లేనేలేదా? విశృంఖలమగు తుచ్ఛ కామకేళికిని, నగ్న సౌందర్య వర్ణనకును, ఉద్వేగమునకును, పాశవికమగు క్షణికసుఖమునకును మాత్రమే స్థానము గలదా? వివాహ మనునది గుడ కవ్యమున నీ విషయముల వర్ణించుట హేయమా? కేవలము భారత చంద్రుని (ఒక బెంగాలీ కవి) వంటి కామోపాసకులగు కవులు మాత్రమే యిట్టి నగ్నతచే నరకమునందు మెండెదరు. వివాహానంతరమైన నిట్టి విషయ వర్ణనము కేవలము వ్యాధిపీడితుని యున్మాదము వంటిది.

మహాభారత కర్తయు కావ్యమున వివాహ మపరిహార్యమనియే భావించెను. పాశవిక సంయోగము నాతడు వర్ణింపనే లేదు. మహాకవియగు కాళిదాసును కర్తవ్యజ్ఞాన విహీనమగు [illegible] ప్రేమనియే భావించెను. అతడు సుందరమగు చిత్రమునకే [illegible]. అందుచే వివాహ మపరిహార్యమని యెంచెను. [illegible] వికసిత సుగంధ పుష్పము, జలజల పారు సెలయేఱు, హరిణీయాన [illegible] కమలనేత్రములు, మధుర పల్లవాధరములు, [illegible] యును సౌందర్య భూషణములే! కాని పురుషుని యంతఃకరణ సౌందర్యము ముందివి యన్నియును తేజోహీనములై దూరీకృతము లగును. భక్తి ప్రపత్తులు, కృతజ్ఞతా స్నేహములు, సేవా త్యాగములు స్వర్గ సుందరములు. వీనిముందు కోమల సృణాళబాహువులు, పీన పయోధరములు, లజ్జావినమ్రములై యుండ వలసినదే! ఆత్మప్రబోధకమగు కర్తవ్యజ్ఞానము కంటె సౌందర్యశోభిత

ప్పైన దేవి కలదు ? ఇది లాలసత్వమునకు గూడ శోభను గూర్చును. బీభత్సరూపమైన తుచ్ఛ కామమును గూడ సుందర మొనర్చును. వివాహమును విడిచి కేవలము లాలసత్వమును మాత్రమే చిత్రించినచో నది సౌందర్యహీనమే గాక గర్హ్యముకూడనై యుండును. కామోపాసకుల కిది రమణీయముగా నుండుట కామోద్దీపక మగుటచేతనే గాని సుందర మగుటచే గదు.

కవి మరియొక చోట దుష్యంతుని చక్కగాఁ గాపాడెను. రాజధానికి బోయిన దుష్యంతుఁడు శకుంతలను మరచుటయే గాక ధర్మవిహితముగ బరిణయమైన భార్యనుగూడ నిరాకరించెను. కాముకుఁడును దక్షిణ నాయకుఁ డునగు రాజిట్లు చేయుటలో నాశ్చర్యములేదు. కాని కవి యభిజ్ఞాన, ముని శాపములఁ గల్పించి దుష్యంతుని రక్షించెను. శకుంతలను వీడి వెళ్ళునపుడు రాజామెకు అభిజ్ఞానముగా స్వనామాంకితమగు నంగుళీయకమిచ్చెను. దీనినిబట్టి రాజామెను ధర్మపత్నిగా నంగీకరింప సంకల్పించినటుల సుస్పష్టము. దుష్యంతుఁడు శకుంతలను విస్మరించుట స్త్రీలంపటుఁ డగుటచేఁ గాదనియు దానికి కారణము దైవికమనియు కవి ముని శాపమును గల్పించి యాతని శీల రక్షణఁ జేసెను. కనుక దుష్యంతుఁడు నిర్దోషియనియే చెప్పఁ దగును. ఇంతేగాదు. శకుంతలా ప్రత్యాఖ్యానమునకు ధర్మ భీతియే కారణమని కవి చిత్రించెను. చతుర్థాంకములో విరహిణియగు శకుంతల దుష్యంత ధ్యానమగ్న మానస. అట్టి సమయమున దుర్వాస మహర్షి వచ్చి "అయమహంభోః" (ఇదిగో నేను వచితిని) అనగా అన్య మనస్కయగుట శకుంతల వినిపించు కొనదయ్యెను. తరువాత అనసూయ వినుచుండగా దుర్వాసు డిట్లు శపించుచుండును.

"విచింతయన్తీ యమనన్య మానసా
తపోధనం వేత్సి నమాముప స్థితమ్
స్మరిష్యతిత్వాం ననబోధితోపిసన్
కథాం ప్రమత్తః ప్రథమం కృతామివ."

(అనన్య మనస్కవై వచ్చిన యతిథిని నన్నెరుఁగ జాలక నీ వెవని ధ్యానించు చుంటివో అతఁడు మదమత్తుఁడై, తానన్న మాటను దెలిపినను జ్ఞప్తికి దెచ్చుకొనజాలక పూర్వ కథను జ్ఞాపకముచేసినను నిన్ను గుర్తింపఁ జాలఁడు.)

ఇట్లు శపించిపోవు దుర్వాసుని పాదముల ప్రాశి అనసూయ యిట్లు ప్రార్థించెను. "మా ప్రియసఖి యింకనుఁ బాలిక. ఆమె తప్పును మీరు తప్పు బట్టవలదు." చివర కాయన ప్రసన్నుఁడై ఏ యాభరణమునైన (తదంగుళీయకము) నభిజ్ఞగాఁ జూపినచో రాజునకు తిరిగి గుర్తునకు వచ్చునని చెప్పి పోవును. అత్తవారింటికి వెళ్ళు శకుంతలకీ శాప వృత్తాంతమును అనసూయగాని ప్రియంవద గాని చెప్పియుండలేదు. శంకా సంకులితాంతరంగయగు శకుంతల నింకను బాధించుట న్యాయముగాదని వారీ సంగతిని గోప్యముగ నుంతురు. కాని దుష్యంతుఁ డిచ్చిన యంగుళీయకమును శకుంతలకు జూపి రాజర్షి నిన్ను గుర్తింపకున్నచో నీ యభిజ్ఞానమును జూపు'' మని మాత్రము చెప్పుదురు.

ఈ యభిజ్ఞానము నొక్కదానినే యాధారముగాఁ జేసికొని యీ నాటకమును రచించినను నాటకము లోప భూయిష్ఠముకాదు. కాని దుర్వాస శాపము లేకున్నచో దుష్యంతుఁడు కేవలము కాముకుఁడుగా చిత్రింపఁబడి యుండెడివాడు. భవభూతియు తన కవితా నైపుణ్యముచే నాయకుడైన శ్రీరాముని రక్షించెను. వాల్మీకియొక్క రాముఁడు వంశ మర్యాదకై తన యర్ధాంగి నొకవ్యాజమున నరణ్యమున కంపెను. దానిచే రాముని శీలమునకుఁ గళంకము రాగలదని భవభూతికిఁ దోచెను. రాజునకు సర్వదా ధర్మాచరణమే ప్రధాన కర్తవ్యము. అతని కొకవైపు ధర్మనిర్వహణము రెండవవైపు సమస్త ప్రపంచమును. వంశ మడుగంటినను, రాజ్యము నష్టమైనను నిరపరాధుల దండింపనని తలచుట యాతని కుచితము. వంశమర్యాదా రక్షణమును కన్యా వివాహమును ధర్మములే! కాని, దానికి మించిన ధర్మము న్యాయవిచారణము. సీత నిరపరాధయని రామునకుఁ దెలియకపోలేదు. వంశమర్యాదా రక్షణకై నిరపరాధినియగు స్త్రీని వెడలనడచిన రాజు తన వంశమర్యాదను రక్షించుకొనజాలఁడు సరికదా, సమూలముగ నశించును. అందుచే భవభూతి అష్టావక్రుని యెదుట రామునిచే నిటు ప్రతిజ్ఞ చేయించును.

స్నేహం దయాం తథాసౌఖ్యం యదివా జానకీ మపి
ఆరాధనాయ లోక స్యముంచతో నాస్తి మే వ్యథా.

(ప్రజానురంజనము కొఱకై స్నేహమును, దయను, సౌఖ్యమును తుదకు సీతను గూడ పరిత్యజింపవలసి వచ్చినను నాకు చింతలేదు.)

రాజునకు ప్రధాన కర్తవ్యము ప్రజానురంజనమే యని భవభూతి నిరూపించెను. ఆ కర్తవ్య పరిపాలనకై రాజు జానకిఁ నడవికిఁ బంపెను. ఇట్లు భవభూతి యవకాశ మొదవినపుడెల్ల రాముని నిర్దోషిగ చిత్రించెను.

పుణ్యపురుషుఁడగు శూద్రకరాజు శిరమును రాముఁడు ఖండింప నాతఁడు దివ్యరూపము ధరించి వచ్చి రామునకు జనస్థానమును జూపించును. ఇది యవాల్మీకము. రామాయణమున రాముఁడు శూద్రకుని వధించెను. శూద్రుఁడయ్యును

తపస్సు చేయుటయే యాతని దోషము. భవభూతి కిది న్యాయముగఁ దోపలేదు. పుణ్యకార్యమునకు మరణశిక్షయా! భవభూతి రాముఁడు దయతో శూద్రకుని శిరచ్ఛేదము గావించి యాతనికి శాపవిముక్తి గల్పించెను.

కాని యీ కవు లిద్దరు నిట్లు కథలను తాఱుమాఱు చేయుటకు విశేష కారణ మొకటి యున్నది.

సంస్కృత సాహిత్యమం దెంతటి ప్రసిద్ధకవియు నాలంకారిక సూత్రముల నధిగమింపలేఁడు. శాస్త్రానుసరణము వారి విధి. నిరీశ్వరవాదులును, వేదబాహ్యులును తుదకు నోటితో నైన వేదమును మన్నించెడివారు. కనుక ఈ కవికుంజరద్వయమును ఆలంకారిక సూత్రములను బాటించియే నాటకరచన జేయవలసి వచ్చినది. ఆలంకారిక సూత్రముల ననుసరించి కావ్య నాయకుఁడు సర్వగుణ సంపన్నుఁడును దోషరహితుఁడునై యుండవలెనను నియమము గలదు.

కొందఱీ నియమము శృంఖలా సదృశమనియు, నాటక కర్తయొక్క స్వాతంత్ర్యమునకు భంగకారి యనియు వాదింత్తురు. కాని గానమందు లయ, నృత్యమునందు భంగిమ, కవిత్వమున వృత్తము, సైన్య సంచారమున క్రమగతి నియమబద్ధములు గదా! అదియునుగాక 'నిరంకుశాః కవయః' అనుటలో కవి నియమశూన్యుఁ డనుట కానేరదు. అట్టి నియమావళి యుండుట చేతనే వారి కావ్యములంత రసవత్తరములును శోభాసుందరములు నగుచున్నవి. ఈ నియమ మఁచితమా, యనుచితమా యనియే మనము పరామర్శింపవలసి యున్నది.

నాయకుఁడు సర్వగుణ సమన్వితుఁడుగా నుండవలెనన్న కథావస్తువు ఉదాత్తముగ నుండవలెనని నా తలంపు. సామాన్యముగ సంస్కృత నాటకములన్నిఁటి నాయకులు రాజులుగాని, రాజపుత్త్రులుగాని యై యుందురు. ఈ నియమమును స్వీకరింపకున్నను ప్రపంచమందలి యుత్తమ నాటకములం దెల్లెడ నాటక కళాభిజ్ఞు లెల్లరు దీనిని పాటించియున్నారు. Shakespeare నాటకములం దెల్లెడ నాయకుఁడు చక్రవర్తియో, రాజపుత్త్రుడో యై యుండును. Macbeth తుదకు రాజయ్యెను. Othello ఒక General యై యుండెను. ఇటలీ దేశపు చిత్రకారులు క్రీస్తు జీవిత చరిత్రనే తమ చిత్రములకు వస్తువుగా స్వీకరించిరి. Homer మహాకవి తన 'ఇలియడ్' కావ్యమున రాజుల యుద్ధమునే కావ్యవస్తువుగ స్వీకరించెను.

ఆధునిక నాటక సాహిత్యవేత్తల కీ మత మంగీకార్యము గాదు. Ibsen వ్రాసిన ప్రసిద్ధ నాటకములందలి నాయకు లందఱును సామాన్య గృహస్థులే. వాస్తవమునకు సాంఘిక నాటకములందలి కథావస్తువు గార్హస్థ్య జీవనమె.

సంస్కృతాలంకారిక నియమము సాధారణముగ సమంజసమే. కావ్యవస్తు వుదాత్తము గాకున్న నాటక కార్యములు గౌరవప్రదములు కాజాలవు. ఏ మహా శిల్పియు కేవల మొక ఱంటుకల యావమును చిత్రింపడు. అతడు నిర్దోషముగ స్వాభావికముగ నిటుకల కుప్పను మాత్రము చిత్రింపగలడు. కాని యా చిత్రణము రాఫేలు వ్రాసిన మడోనా చిత్రము ముందు త్రోసిరాజు. (Ibsen సైతము) అట్లే యెట్టి యుత్తమ నాటకకర్తయు తన నాటకమునకు సామాన్యుని నాయకునిగ స్వీకరింపలేదు. లేఖకుని సామర్థ్య మిట్టి చరిత్ర చిత్రణమునందు వ్యక్తమగును. అందలి సూక్ష్మాతి సూక్ష్మ వర్ణనమును ప్రదర్శనమును యోగ్యములు కావచ్చును. కాని Shakespeare యొక్క Julius caesar ముందు త్యాజ్యములే! ఇట్టి నాటక దర్శనమున ప్రేక్షకుని హృదయము స్పందింపదు. వాని ప్రకృతిశోభను గాంచి హృదయమున హర్ష విస్మయములు మాత్రము కలుగును.

నాటకకర్త నైపుణ్యము మాత్రము వెల్లడియగు నాటక ముత్తమజాతికిఁ జెందనేరదు. మహానాటక రచయిత రచన యింతటితో నాగదు. ఏయే చిత్రములను దర్శించుటచేత నేమి, నాటకముల దర్శన శ్రవణములచే నేమి ప్రేక్షకులు తాదాత్మ్యమును బొందెదరో అవియే యుత్తమ సృష్టికిఁ జెందిన వనదగును. Irving (ఒక ప్రసిద్ధ నటుఁడు) రంగస్థలమున నభినయించునపుడు Irving బాగుగ నభినయించు చున్నాఁడను భావము గల్గినచో నది యుత్తమమైన యభినయము కానేరదు. Irving అభినయించునపుఁ డాతని విస్మరించి అత డభినయించుచున్న Hamlet పాత్రనే ప్రశంసించినచో నదియే యుత్తమాభినయము. అట్లే యే నాటకమును జూచి సామాజికులు తన్మయులై రసానంద మనుభవింతురో, పరవశు లగుదురో యదియే యుత్తమ నాటక మగును గాని కేవలము విస్మయమును మాత్రము గొల్పునది కాదు.

మహారాజుల ప్రణయము, యుద్ధము, తుదకున్మత్తతయు మనలో నొక వ్యామోహమును గలిగించును. రాజశబ్దమే యాతఁడు సమస్తజాతి ప్రతినిధి యనియు, సమస్త ప్రజా గౌరవార్హుఁడనియు, జాతి మహత్తర మాతనియందు నిష్ఠమనియు స్ఫురింపజేయును. అతఁడు ఘంటాపథమున నడచినచో జనులు సందర్శనోత్సుకులై గుమిగూడెదరు. రాజసభా మధ్యమున నాతని నెప్పుడాల్పక చూచెదరు. ఇట్లాతని చర్యలందేమి, వాక్కులందేమి యొక నిగూఢత్వము నిండి

యున్నది. ఆతని నిత్యకృత్యముల సైతము జనులు చెప్పి కొందురు. కామలంపటుఁ డయ్యును రాజు రాజశబ్ద వాచ్యుఁడే! వృద్ధ పితామహియు తన మనుమనికి 'అనఁగ ననఁగ నొక రా'జని రాజకథనే చెప్పును. ఇక నీ రాజునకు తగిన కన్య లేకున్న కథ కందము చేకూరనే చేకూరదు.

ప్రజలలో నున్న యీ కౌతుకమునకు కారణమును విచారింతము. మన మొక విషయమును గూర్చి వినుటయే గాని చూచుట సంభవించనిచో దానియెడ మనకు కౌతుక ముదయించుట సహజము. ఇక రాజ విషయమైన చెప్పనేల ? అతఁడు సర్వులచే సర్వదా దర్శనీయుఁడు. ఆయన కనుసైగ జేసిన చాలును. యుద్ధరంగమున ప్రాణము లొడ్డుటకు శత సహస్ర సంఖ్యాకముగా సైన్య మాయత్తమగును. అతని ధనాగారములచే నసంఖ్యాకములగు కుటుంబములు పరిపోషితము లగును. రాజసౌధ మభిరామముగా నుండును. అందుచేతనే రాజనిన నంతటి కౌతుకము.

నాటకకర్తలు గూడ రాజవృత్తాంతమే వర్ణనీయమని భావించుచున్నారు. సముద్రములేని వట్టి తరంగములు ప్రదర్శించుటలో శోభ లేనట్లు తమ కార్యమునకు నిరవధికమైన సువిశాల కార్యక్షేత్రమగు మహారాజ చరిత్రనే కవులు కావ్య వస్తువులుగ స్వీకరించుచున్నారు. అందుచేతనే పెక్కు నాటకములలో రాజులే నాయకులుగ గ్రహింపఁబడుచుండిరి. రాజు కేవలము కావ్యనాయకుఁడైననే వర్ణ్యముత్కృష్టమైనపుడిక నారాజు సర్వగుణ సంపన్ను డగుచో చెప్పెడి దేమి ? అయిన నొకటి—నాటకములోని విషయ ముత్కృష్టమై యుండవలెనను విషయము మంచిదే కాని రాజే నాయకుఁడుగా నుండవలె ననుటలో సామంజస్యము తోఁపదు. సామాన్య గృహస్థుఁడును ధీరోదాత్త చరిత్ర గలవాఁడైనచో, కార్యశూరుఁడైనచో, ధర్మనిర్వహణ దక్షుఁడైనచో నాతడును నాయకుఁడు కాదగును.

కాని యట్టి సామాన్య గృహస్థుఁడు కర్తవ్య పరాయణుఁడైన మహాత్ము విశిష్టుఁడు కావలయును. నాయకుఁడు సర్వగుణ సంపన్నుఁడును, దోషరహితుఁడును కావలెనను కఠిన తమ నియమమును పాటించినచో రెండు దోషములు గలుగ్చుచున్నవి. ఒకటి—నాటకములన్నియు పోతపోసినట్లు వైవిధ్యము లేకుండ నుండవలసి వచ్చును. రెండవది—ఆతని చరిత్ర మలౌకికమై యస్వాభావికముగ నుండును. ప్రతి మానవుని యందును గుణదోషములు సమ్మిశ్రమములై యుండుట సహజము. ఇక కావ్య వస్తువు నందలి నాయకుఁడు దోషరహితుఁడైనచో నతఁడు నజీవుడుగాని యసహజమగు నొక వింత జీవిగా దోచును. అట్టి మానవుఁడు గుణ సమష్టి రూపమున భాసించును. ఆదర్శవాదుల (Idealistic) నాటకములను నావశ్యకములే. ఇట్టి నాటకములందు కేవలము దోషరహితునిగ నాయకుని జిత్రించుట స్వాభావికము గాదు.

కాని ఇదియు నిక్కమే. లంపటుఁడు గాని, మూర్ఖుఁడుఁ గాని నాయకునిగ జిత్రింపబడినచో ప్రపంచమున సౌందర్యమును ప్రదర్శింపలేము. ప్రకృతి సౌందర్యమయ మనుటకు వీలులేదు. పదార్థములన్నియు సుందరము లగుచో నిక సుందర శబ్ద మర్థరహిత మగును. అందుచే సౌందర్య విహీనుని కావ్య నాయకునిగ నెన్నుకొనరాదు. సౌందర్యముయొక్క ప్రతిభ నినుమడింపజేయుటకై సాదృశ్యమున సౌందర్యవిహీనతనుఁ ప్రదర్శింపఁదగును.

కాని Shakespeare మహాకవి ఈ నియమమును బాటింపలేదు. ఆతని యుత్తమ నాటకమందలి కావ్య వస్తువును మహత్తరమైనదే. కాని, యందలి నాయకులలో గుణ విశేష మేదియును లేదు. ఆతని Hamlet నందు ప్రశంసార్హమగు పితృభక్తి పరాయణత ద్యోతక మగును గాని యది నాటకమునందంతటను సుదృఢముగ పరివ్యాప్తము కాలేదు. ఇక King Lear తన దుహితయొక్క అమూల్యమగు పితృప్రేమను గ్రహింపనేలేని దుర్బలుఁడును ఉన్మాదియు నయ్యెను. పితృభక్తి శూన్యలగు తన కుమార్తెలు Regan, Gonerill అనువార లాతని పార్శ్వచరులను తొలగించి నందుకు దుఃఖించును. **Ingratitude thow morble hearted tie!** (శిలా సదృశమగు కృతఘ్నతా ! నీకు ధిక్కారము) ఉన్మత్త ప్రలాపమగు నీ యాక్షేప మాతఁడున్మత్తుఁడని తెలియుజేయును. Othello కేవల మీర్ష్యచే నంధుఁ డయ్యెను. ప్రమాణ నిరూపణ లేకయే ధర్మ పత్నిని వధించెను. Macbeth కృతఘ్నుతకు ప్రతిరూపము. Antony కేవలము కామాంధుఁడు. Caesar దాంభికుఁడు. కాని Shakespeare ఆయా దౌర్బల్య గుణములకు గతి ఫలితమును పాప ప్రవృత్తికి పరిణామమును ఘోరముగ ప్రదర్శించెను. ఎల్లెడ పాపము విఫలమై నశించుట చూపెను. Goethe తన Faust నందు నిదియే ప్రదర్శించెను.

కాని Shakespeare ఆయా నాటకములందు ప్రదర్శించిన వస్తువు నాయకుల నత్యంత తేజస్సంపన్నుల గావించి నాటకమునకు వన్నె జేకూర్చినది. Hamlet నాటకమున Horatio, Polonius, Ophilia లును King lear నందు Kent, Fool, Edgar, Cordilia లును Othello నాటకమందు పవిత్ర చరిత్రయగు Desdemona

యును, ఆమె చెలికత్తెయును **Macbeth** నాటకమందు **Banquo, MacDuf** లును **Antony and Cleopatra** నాటకమున **Octavius** ను, **Julius ceasar** నాటకమందు **Brutus, casius** లును, ఆయా నాయక పాత్రల నధిగమించి యుండిరి.

Shakespeare ఇట్లు చేయుటకు కారణమేమి? ఆతడు ధనాభిమానియు క్షమాశక్తి ప్రియుడును నని నా భావము. భౌతికక్షమ యాతని కత్యంత ప్రియతమము. మహోత్తమమైన చరిత్రము కంటె సువిశాలమైన చరిత్రమే యాతని ముగ్ధు నొనరించును. విశాల క్షమ, విశాల బుద్ధి' విశాల ద్వేషము, విశాలేర్ష్య, విశాల ప్రతిహింస, విశాల లోభము సమధికముగ లోభనీయములై యుండును. నిరీహుడగు శిశువు, పరదుఃఖా పీడితుడగు బుద్ధుడు పరమభక్తుడగు చైతన్యుడును నాతని దృష్టిలో నీరవులు. ఇట్లనుటచే నాతడు స్వార్థత్యాగ మహిమ నెఱుగడని జనదు. కాని యాతడు క్షమాశక్తిని జూపి బాహ్యాడంబరమును జూపి చరిత్ర మాహాత్మ్యమును గౌణమొనర్చెను.

పౌరస్త్యకవులు ధర్మ మహిమా ధురంధరులు. వారి దృష్టిలో ధర్మమే మహోత్తమమైనది. క్షమాశక్తి వారెఱుంగనిది కాదు. కాని వస్తు మహత్వమే వారి కధిక సంతోషదాయకము. వారికి ధర్మముముందు క్షమ యానుషంగికము. నాటక నాయకులు సర్వగుణ సంపన్నులగు ధర్మమూర్తులు గాకున్న మహత్తరులు కాజాలరని వారి యభిప్రాయము. అందుచే బ్రాహ్మణకవులగు కాళిదాస భవభూతులు తమ నాటక కథావస్తువును సర్వగుణ సంపన్నము జేయదలచిరి.

కాని, వారు తమ నాయకుల నెంత సర్వగుణ సంపన్నుల జేయ జూచినను వారు కృతకృత్యులు గారైరి. ఎల్లెడ వారి నాయకుల యెడ వారి క్రోధము గిరి నిర్ఝరమువలె హృదయముల జీల్చికొని బహిర్గత మగుచున్నది. బహుధా ప్రపీడితులగు నాయికల యెడ వారికి గల కరుణ వాహినియై వెల్లి విరిసినది. రాజసభలో శకుంతలా ప్రత్యాఖ్యానమునకు పూర్వమే అనగా కోపమునకు హేతువు లేకున్నను వృద్ధ గౌతమి (ఈమె గురువుల యంగీకార మపేక్షింపలేదు. మఱియును నీవును బంధువుల నడుగలేదు. కనుకనే మీ యిద్దఱుల యాచరణము గూర్చి కన్వుడేమనును ? అయిన దాని కామోదించెను.) అంతర్నిహితమైన అగ్నిజ్వాల కిది వ్యంగ్యోక్తి. ఇక ప్రత్యాఖ్యానమైన పిమ్మట శార్ఙ్గరవుడిట్లు పల్కెను.

"మూర్ఛన్త్యమీ వికారాః ప్రాయేణైశ్వర్య మత్తానామ్."

(ఐశ్వర్యమత్తుల కిటులనే తఱచుగ మనో వైకల్యము కల్గుచుండును.) అటుపిమ్మట.

"కృతాభిమర్శా మనుమన్య మానః
సుతాం త్వయానామ మునిర్విమాన్యః
ముష్టం ప్రతిగ్రాహయతా స్వమర్థం
పాత్రీకృతో దస్యురి వాసి యేన."

(దొంగను శిక్షించుటకు మారుగ వానికి ధనసత్కారను చేసినవానివలె తన కుమార్తెయొక్క కన్యాత్వమును భంగపఱచినందు కామోదించినట్టి ఋషియు అవమానార్హుడు) తదనంతరము ప్రత్యాఖ్యాతయగు శకుంతల లజ్జానత వదనయై యున్నపుడు శార్ఙ్గరవుడు.

ఇత్థ మప్రతిహతం చాపల్యం దహతి.'

(అప్రతిహతమగు చాపల్యము నిన్నిట్లు దహించుచున్నది.) యని యాక్షేపించును. అనగ అవాలోచితముగ జరిపిన నీ రహస్య ప్రణయ చాపల్యమునకు తగిన ఫల మనుభవించుము. దీనికి ఉజ్జ్వలతను బలుక శార్ఙ్గరవుడు దురాయితో నిట్లనును :

"ఆజన్మ నశ్శాఠ్య మశిక్షితో యస్తస్యా ప్రమాణం వచనం జనస్య
పరాభి సంధాన మధీయతే యైర్విద్యేతితే సంతు కిలాప్త వాచః"

(పుట్టినది మొదలు టెవరు ధూర్తత్వము నెర్వరో వారి మాట పాటింపదగినది కాదు. పరప్రతారణ పాఠమును ప్రత్యేకముగ జదివినవారి వాక్కులే విశ్వసనీయములు.) ఇది కఠినతమమగు వ్యంగ్యోక్తి. తుదకు వృద్ధ గౌతమీ సహితులై శిష్యులు శకుంతలను విడిచి వెళ్లుట రోషాతిశయ ప్రకటనమే. అది కాముకులగు శకుంతలా దుష్యంతుల యెడ వైమనస్యమే. ఈ పాత్రల వాక్కులలోని తీవ్రత యంతయు కాళిదాసు యొక్క ఆత్మగత క్రోధ మనియే భావింపనగును.

ఇట్లే రాముని పాత్రలోని యుచితపాత్ర పోషణకు శ్రద్ధపడిన భవభూతియు తృతీయాంకమున వాసంతీ ముఖమున తన స్వీయాభిప్రాయ ప్రకటనను జేసినట్లు తోచును. ఛాయా సీతావిష్కంభమున వసంతి వ్యంగ్య వజ్రాయుధాస్త్రములచే రాముని హృదయము నెట్లు ప్రపీడించెనో చూడుడు :

"త్వం జీవితం త్వమసి మే హృదయం ద్వితీయం
త్వం కౌముదీ నయనయో రమృతం త్వ మంగే
ఇత్యాదిభిః ప్రియ శతై రను రుధ్య ముగ్ధాం
తామేవ శాంత మథవా కిమిహోత్తరేణ."

(నీవు నా జీవితము. నా రెండవ హృదయము. నా నేత్ర జ్యోత్స్నవు. నా కమృతము. ఇత్యాది ప్రియోక్తులచే ముగ్ధ యగు నామెను సంతోషపఱచి యుంటివి. ఎక్కువ చెప్పుటచే నేమి ప్రయోజనము) పిమ్మట రాముడు "లోకు లెందుకు వినరో వారికే యెఱుక" యన్నపుడు వాసంతి యిట్లనును:

"అయి కఠోర యశః కిలతే ప్రియం
కిమయశో నను ఘోర మతః పరమ్."

(ఓ కర్కశుడా! నీకు కీర్తియే ప్రియము. కాని ఇంతకంటె యపకీర్తి ఏమున్నది.) అటుపిమ్మట రాముని కన్నె చిరపరిచిత స్థానములం జూచి పూర్వ సుఖానుభవ స్మరణముచే నతని శోకమగ్ను నొనర్చును.

ఇది యుచితమే. ప్రపంచమున పరపీడితులం జూచి విలపింపని యే మహాకవియు నుండడు. కనుకనే మైకేలు మధుసూదనదత్తు రావణునికై విలపించును. Milton సైతాను దుఃఖములు జూచి వగచును. నిరపరాధయు, అవమాన శోకమగ్నయు నగు Desdemona మరణానంతర మామె చెలికత్తె ముఖమున వెడలిన తీవ్రతరములగు భర్త్సన వాక్యము లీశ్వర వాణి యనిపించును. కాళిదాసుని రోషము గౌతమీ ముఖమునను, భవభూతి రోషము వాసంతి ముఖమునను వ్యక్తమయ్యెను. కామోద్రిక్త యయ్యును శకుంతల సరళ హృదయ యగు ముని బాలిక. ప్రలుబ్ధయు పరిత్యక్తయు నగు నామె దుఃఖమునకు కవి హృదయము క్షోభించినది. ఇక సీత సాధ్వి స్వచ్ఛాకాశమువలె పవిత్ర చరిత్ర గలది. నక్షత్రమువలె తేజస్విని. శేఫాలికా కుసుమము వలె సుందరమై జాతి సుమమువలె వినమ్రము. అనుపమయగు ఆమె దైన్యమునకు పశుపక్ష్యాదులుం గూడ రోదింప కవి యూరకుండునా? అందుచే దేవతుల్యుడగు రామునిపై గూడ కవి క్రోధోద్రిక్తుం డగును.

భవభూతి నాయికా నాయకులకు తుదకు సంయోగమును గల్పించుట యాలంకారిక నియమానుసరణమునకే! నాటకములు సుఖాంతములుగా నుండవలెనను యాలంకారిక నియమము గలదు. సంస్కృతమున దుఃఖాంత నాటకములు లేవు. పూర్వోక్త నియమమే దీనికి కారణము. నాయకుడు పుణ్యాత్ముడైనచో ఫలము పుణ్యము గావలెను గాని దుఃఖము కాజాలదుగదా! అందుచే పుణ్య విజయమును పాప పరాజయమును జూపింపవలెను. ఏలయన అధర్మజయము చూపుటచే జనులలో ధార్మికత నశించును.

నేనీ నియమమును బాటింపజాలను. వాస్తవిక ప్రపంచమున తఱచు అధర్మ జయమే గోచర మగుచున్నది. లేనిచో నీ భూమి క్షుద్రులతో, స్వార్థపరాయణులతో వంచకులతో నిండియుండదు. ఎల్లప్పుడును తుది ఫలము ధర్మ విజయమే యగుచో జను లందరును ధార్మికులే యగుదురు. అప్పుడు కేవలము ధార్మికుడైనంత మాత్రమున ప్రశంసాపాత్రుడు కాజాలడు. ధర్మ మణగియుండుటయు నధర్మము స్వేచ్ఛా విహారము సల్పుటయు మనము నిత్యజీవితమున జూచెడి నగ్న సత్యము. ఏసుక్రీస్తు జీవితమును Martyrs జీవితములును నిందుకు ప్రబల నిదర్శనములు.

పూర్వము ఇంగ్లాండు నందును Poetic justice (కావ్య న్యాయము) అను సారస్వత నీతి యొకటి యుండెడిది. దానిచే కావ్య నాటకాదులకు తగినంత వికాసోత్తేజములు కలుగమి నా నీతి నొకవిధముగ నాదరింపరైరి. ఏలన దాని ననుసరించినచో మానవ జీవితమందలి యదార్థికము ప్రదర్శనయోగ్యముగా నుండెను. పాతకు లాహా గానము చేయవలసి యుండును.

నాటకమున అధర్మజయమును ధర్మపరాజయమును ప్రదర్శించినచో నది యవినీతిబోధక మనరాదు. దుఃఖ దారిద్ర్యములందు చరింపక ఆర్థిక లాభనష్టములను సరకుగొనక ధర్మపాలన ఫలమే ధర్మపాలన సుఖమనుట యెపుడు గణింపబడునో అపుడే ధర్మము ధర్మమనిపించుకొనును. Latimer and Cranmer లు తేజస్సుతో మృత్యువు నాలింగన మొనర్చుకొనిరో మహారాణా ప్రతాపసింహుడు ఏ మహత్తర బలముచే మరణ పర్యంతము కటిక దారిద్ర్యమును ఘోర దుఃఖమును అనుభవించెనో ఆ ఘనత కేవలము సామాజికులనే ముగ్ధుల జేయుటలేదు. ఆత్మత్యాగశీలురును గౌరవము ననుభవింపగలరు.

స్వర్గఫల కాంక్షచే ధార్మికుం డగుటయు, భవిష్యదైశ్వర్యమునకై ఋజుమార్గ వర్తనుం డగుటయు, ప్రత్యుపకారము నాశించి యుపకారము సేయుటయు ధర్మపద వాచ్యములు కానేరవు. అది స్వార్థసేవ మాత్ర మగును. సత్యమును ఖండించు శిక్ష సత్యముతో ప్రతిఘటించిన నశించును. సత్యమునకు జంకక దాని నాలింగన మొనర్చుకొను శిక్షయే యున్నత మగు శిక్ష. నీతి నుపదేశింపదలచినచో "చూడుము ధర్మమునకు ఫల మెప్పటికిని దుఃఖమే గని, సంపదగాని, సుఖముగాని కాదు. కాని యీ దుఃఖరూపమున నున్న సుఖము ముందు సర్వ సంపదలును తలలు వంచుకొనవలసినదే." యని చెప్పనగును. ధర్మమువలన ప్రతిఫలాపేక్ష లేనివాడే ధార్మికుడు. అట్టి ధర్మనిరతుడు ధర్మమును ప్రేమించుట, దాని ప్రఖ్యాతిని జూచి కాదు. దాని సౌందర్యమును జూచి ముగ్ధుడగును.

సత్యమును మఱుగుపరచు ధర్మము బలిష్ఠము కానేరదు. ధర్మ సౌందర్యమును జూచినవా డెవ్వడును ధర్మము

యొక్క భౌతిక పతనమును జూచి ధర్మమునుండి తిరోగమింపడు. ధర్మమును అంగడి వస్తువుగా భావించువాడును, ప్రతిఫలాపేక్షితుఁడును మాత్రమే తిరుగుమొగము పట్టెదరు.

ఈ నీతిని బురస్కరించుకొనియే కాళిదాసు శకుంతలా దుష్యంతులకును, భవభూతి సీతారాములకును తుదకు సంయోగము గల్పించిరి. కాళిదాసు మూలకథను భిన్నముగ నడుపలేదు కాని భవభూతి సంకటమున బడెను.

ఉత్తరరామ చరిత్రమున సప్తమాంకమున రామలక్ష్మణులును, పురవాసులును వాల్మీకి కృతమగు **సీతా** నిర్వాసన నాటక ప్రదర్శనమును జూచుచుందురు. ఆ ప్రదర్శనములోనే లక్ష్మణుఁడు సీత నడవిలో విడచును. సీత గంగలో బడుట మొదలు ఆమె రసాతలమున ప్రవేశించు నటకు గల కథ ప్రదర్శింపఁబడును. రాముఁడు "క్ష్మ భిత బాష్పోత్పీడ నిర్భర ప్రమగ్నుఁడై (పొంగి పొరలు కన్నీటి వెల్లువచే వ్యాకులుఁడు వేగాపొగిలుఁడు) ఆ ప్రదర్శనము చూడసాగెను. సీత రసాతలమున ప్రవేశించి నప్పుడు రాముఁడు :

"హా దేవి ! దండకారణ్యవాస ప్రియసఖి ! చారిత్రదేవతే! లోకాంతరం గతాసి" (అయ్యో ! దేవి ! దండకారణ్య సహచరి ! చారిత్రదేవతా! పరలోకమున కేగితివా !) అని మూర్ఛ నొందగా లక్ష్మణుఁడు "భగవన్ వాల్మీకే పరిత్రాయస్వ పరిత్రాయస్వ ఏషః కింతే కావ్యార్థః" (వాల్మీకి భగవానుఁడా! రక్షింపుము. నీ యీ కావ్యమునకు ప్రయోజన మేమి ?) అప్పుడే యశరీరవాణి విని పించును.

"భో భోస జంగమ స్థావరాః ప్రాణభృతో మర్త్యా మర్త్యాః
పశ్యత భగవతా వాల్మీకి నా సుజ్ఞాతం పవిత్ర మాశ్చర్యం"

(ఓ స్థావర జంగమములారా ! మర్త్య మర్త్యులగు ప్రాణులారా ! వాల్మీకి యానతిచే నొసరింపబడిన పవిత్రము నాశ్చర్యము నగు నీ వింత చూడుడు) లక్ష్మణుడు చూచెను.

"మంథాది వక్షుభ్యతి గాంగ మంభో
వ్యాప్తంచ దేవర్షిభి రంత రిక్షమ్
ఆశ్చర్య మార్యా సహదేవతాభ్యాం
గంగా మహీభ్యాం సలిలా దుదేతి."

(తరచినట్లు గంగాజలము క్షుభ్యమగుచున్నది. అంత రిక్షము దేవర్షులతో నిండినది. ఎట్టి వింత ? ఆర్యురాలగు సీత గంగా భూదేవులతో నీటినుండి పైకి వచ్చుచున్నది) మరల నేపథ్యమున ధ్వని యగును. "అరుంధతి జగద్వంద్యే గంగాపృథ్వ్యౌ భజస్వనౌ అర్పితేయం త వాభ్యాసే సీతా పుణ్యవ్రతా వధూః." (జగత్పూజ్యవగు నరుంధతీ ! గంగా వసుంధర లగు మే ముభయులము పావన చరిత్రయగు సీతావధువును నీ కప్పగించుచుంటిమి.)

లక్ష్మణుఁడు—"ఆశ్చర్య మాశ్చర్యం". మరల రామునితో నిట్లనును : "ఆర్య పశ్య పశ్య" (ఆర్యా చూడుము చూడుము) కాని రాముఁ డప్పటికిని మూర్ఛావివశుఁడై యుండుట లక్ష్మణుఁడు గాంచును.

తదనంతరము సీత అరుంధతితో రాముని యొద్దకు వచ్చి తన కరస్పర్శచే పతిని సంజీవితుని జేయును. రాముఁడు లేచి గురుజనమును గాంచును. అరుంధతి గంగా వసుంధరలను రాముని కెఱింగింప రాముఁడు :

"కథం కృత మహాపరాధో భగవతీభ్యా మనుగృహీతః"

(కృతాపరాధుఁడగు రాముఁడు మీదయ కెట్లు పాత్రుఁడయ్యెను) అని నమస్కరించును. అచ్చట సమావేశమైన ప్రజల నుద్దేశించి యరుంధతి యిట్లనును :

"భో భో ! పౌర జానపదాః ఇయమధునా భగవతీభ్యా మేవం ప్రశస్య మమారుం ధత్యా స్సమర్పితా పూర్వంచ భగవతా వైశ్వా నరేణ నిర్ణీత పుణ్యచరిత్రా సబ్రహ్మకైశ్చ దేవైస్సంస్తుతా సవితృ కులవధూర్దేవ యజన సంభవా **సీతా**దేవీ పరిగృహ్యత ఇతి కథం భవంతో మన్యన్తే."

(ఓ పౌర జానపదులారా ! ఈ సీతాదేవి గంగా వసుంధరలచే ప్రశంసాపూర్వకముగ నా కప్పగింపఁబడినది. వైశ్వానరుఁ డీమెను పరిశుద్ధగా నిర్ణయించెను. బ్రహ్మాది దేవతలును సూర్యకుల వధువును, యజ్ఞసంభవయు నగు నీమెను బహుధా ప్రశంసించిరి. రామచంద్రుఁ డిపుడీమెను గ్రహింపనున్నాఁడు. మీ మీ యభిప్రాయమేమి ?) అప్పుడు లక్ష్మణుఁ డిట్లనును :

"ఏవమార్య యారుంధత్యా నిర్భర్త్సితాః ప్రజాః కృత్స్నశ్చ భూతగ్రామ ఆర్యాం నమస్కరోతి లోక పాలాశ్చ సప్తర్షయశ్చ పుష్పవృష్టి భిరుపతిష్ఠన్తే." (ఆర్య యగు నరుంధతిచే నిటుల ప్రశ్నింపఁబడిన ప్రజలు సీతకు నమస్కరించుచున్నారు. లోకపాలురును సప్తర్షులును పుష్పవర్షము కురిపించు చున్నారు.) అరుంధతిచే ననుజ్ఞాతుఁడై రాముఁడు సీతను పరిగ్రహించును. లవకుశులు ప్రవేశింతురు. ఆలింగ నాశీర్వాదానంతరము యవనిక వ్రాలును.

భవభూతి యొకే యంకమున ప్రదర్శనమున వియోగమును జూపి వాస్తవమునకు సీతారాముల సంయోగమును గూర్చెను. అసలు జరిగినది, వాస్తవమున వియోగమును ప్రదర్శనమున సంయోగమును. ఏలయన సీత రసాతల ప్రవేశానంతరమే యీ కవి కౌశల్యము పట్టువడినది. అంతర్నాటక

మందలి యీ గంభీర కరుణాత్మకమగు దృశ్యానంతర మీ యసహజమైన సీతారాముల సంయోగ మున్మత్తుని హాస్యము వలెను, దగ్ధపటల నగరముపై సవితృ కిరణ ప్రసారము వలెను, రోదన మందలి వ్యంగ్యోక్తి వలెను కనుపట్టుచున్నది. భవభూతి యలంకార శాస్త్రము నధిగమింపలేక శాస్త్ర మర్యాదా రక్షణకై కావ్య కళను జంపెను.

కాళిదాసు తన బుద్ధి చాతుర్యముచే కావ్యకళకు గాని అలంకారశాస్త్రమునకు గాని బాధలేని విషయము నెన్నుకొనగ భవభూతి యలంకార శాస్త్రమును వ్యతిరేకించు విషయ మెన్నుకొని యధిగమింపలేక కావ్య కళకు కళంక మాపాదించెను.

ఈ నాటకము నీవిధముగ Poetic Justice (కావ్య న్యాయము) కావ్యకళ యొక్క గొంతుక నులిమివైచెను. విద్రోహియగు పురుషుఁడు తుదకు సుఖవంతుఁడగుట జూచి శ్రోతలు ముదమందజాలరు. కాని భవభూతి నాటకమున నిదియే గావించెను.

దుష్యంతుఁడు శకుంతలను ప్రత్యాఖ్యానించుటలో నతని దోషము లేదని కాళిదాసు నిరూపించెను. కారణము దైవికమగు భ్రాంతి. అందుచే దుష్యంతుఁడు నిరపరాధి. కాని రాముఁడు బుద్ధిపూర్వకముగ సీతను బరిత్యజించెను. ప్రజ చెప్పినంత మాత్రమున విచారింపకయే, విశ్వసనీయయు ఆజన్మదుఃఖితయు, పతిగత ప్రాణయు నగు అర్ధాంగి నడవుల పాలు జేసెను. ఇట్లు చేయుటలో రామునకు కష్టము గలుగ లేదని కాదు. కాని యది స్వయంకృతాపరాధము. అతఁడు దుఃఖించెనని సీతా నిర్వాసనము సమర్థనీయము కాజాలదు. సీతాపరిత్యాగము చేతను కర్తవ్యపాలన మొనర్చితినని భావించెను. గాని వాస్తవమునకు గాదు. ప్రజ చెప్పినదాని నంతటిని పాటించుట రాజధర్మము గాదు. న్యాయవిచారణ రాజ కర్తవ్యము. సీతయు ప్రజలలో నొక్కతె కాదా ? ప్రజారంజనకై తల్లినిగాని, సోదరినిగాని, భార్యనుగాని కొఱతవేయుట చూచితమా ? Brutus తన పుత్రుఁడు నిశ్చయముగ దోషియని నిర్ధారించిన పిమ్మటనే ఆతనికి మరణశిక్ష విధించెను. ప్రజావాక్కు ననుసరించి యట్లు చేయలేదు. ప్రజాపవాదమునకు గుఱియైన సీత సాధ్వియని రాము డెఱుఁగును. ఆమె నిరపరాధినియని నిర్ణయించుటకు తిరిగి మఱియొక యగ్నిపరీక్ష నొసంగవచ్చును. కాని, అట్లు చేయక శ్రవణ మాత్రముననే యరణ్యావాసమున కాజ్ఞయిచ్చెను. సీతకును అస్తిత్వము లేకపోలేదు. ఆమెకును హృదయ మున్నది. నిష్కారణముగ నామె హృదయమును క్షోభ పెట్టుటకు రామున కేమి యధికారము గలదు ? ఇట్టి రాముఁడు తిరిగి సీతను బొందుట కయోగ్యుఁడు. వాస్తవమున కతఁడు పొందలేదు. ఇదియే సారస్వత న్యాయము. Poetic Justice. భవభూతి యొక్క రాముఁడు ప్రజానురంజనమునకై మహత్తర కర్తవ్యమునుండి పతన మొందెను. ఆ కర్తవ్యము న్యాయ విచారణము. నిరపరాధయు, విశ్వసనీయయు నగు సీతకు తాను తన జాగ్రదవస్థలోనే వనవాస మొసగెను. కనుకనే యాతఁడామెను తిరిగి పొందుట కయోగ్యుఁడు. ఆతఁడు యజ్ఞమున సువర్ణసీతా ప్రతిమ నిడుకొనుటయు, ఆమెకై పరితపించుటయు సత్యములే కాని న్యాయవిచారణ సేయలే దనుటయు సత్యమే ! కనుక నాతఁడు సీతను బొందుట కయోగ్యుఁడు. వాల్మీకి యొనరించిన దెంతయు సుచితమైనది. భవభూతి కావ్యకళను నాటక న్యాయమును రూపుమాపెను.

రాముఁడు తిరిగి సీతను పొందుట కామె పాతివ్రత్య ప్రభావమే కారణ మనవచ్చును. ఇట్లనుట సీతకు ఘోరమగు అపచార మనుట నా తలంపు. సీత పతిత్యక్త యగుటకు కారణమేమి ? తిరిగి స్వీకృత యగుటకు కారణమేమి ? రెంటికిని సీత ప్రమేయ మేమియు లేదు. దోషి రాముఁడు మాత్రమే ! స్వయంకృతాపరాధముననే రాముఁడు సీతను బోగొట్టుకొనెను. ఈ యపవాదము కేవలము సీతను గూర్చి మాత్రమే కాదు. సమస్త ధర్మ నీత్యుద్ఘాటనమును గూర్చియు నైయున్నది. దీనినే ఆంగ్లమున **Adding insult to injury** అందురు.

ఎవరు స్త్రీని కామదృష్టితో జూచుచు స్వాతంత్ర్యమీయక తన యింటనున్న వస్తుసామగ్రిలో నొకదానినిగ పరిగణింతురో వారు నే జెప్పిన సంగతిని గ్రహింపజాలరు. మరియు పతి దుర్వినీతుఁడయ్యును సతి యాతని యడుగులకు మడుగులొత్తవలెననియు, స్త్రీ ఎప్పుడో యొకసారి భ్రష్టయయ్యు పతి యామె శిరచ్ఛేదము చేయవలెననియు భావించెదరో నట్టివారికి బోధించుటకై కాదు నా యీ ప్రయాసము. స్త్రీలు, అసహాయులు, మృదు స్వభావులు, వారు పురుషుల యధీనమందుండవలయు ననుట నేనును అంగీకరింతును. పురుషుల స్వతంత్రవర్తనముకంటె స్త్రీల సతీత్వమే వేయిమడుంగు లధికముగా నుండదగుననియు భావింతును. అయినను స్త్రీకి స్వతంత్రమగు అస్తిత్వముగలదు. భారత వర్షమున రమణీ లలామ లెందరో జ్యోతిష రచనగావించి రాజ్యపాలన మొనర్చిరి. సంగర రంగమున వీరవిహార మొనర్చిరి. అట్టి మన నారీమణిని గృహోపకరణముగ భావింపదగునా ? అనేక విషయములలో పురుషునికంటె స్త్రీ యెక్కువని నేను

భావించెదను. మానసికోద్యమమునందును శారీరక బలము నందును స్త్రీ పురుషునికంటె తక్కువ కావచ్చును. కాని సేవ, స్వార్థ త్యాగము, సహిష్ణుత, స్నేహము, ధర్మానురాగము చరిత్ర మహాత్మ్యములందు పురుషునికంటె స్త్రీ మిన్న. స్త్రీ యబల యగుటచే పురుషు డన్యాయమును ద్రోహమును జేయు చుండును.

నాగరిత [illegible] పెంపొందిన కొలదియు పురుషుడు స్త్రీని గౌరవింప మొదలిడెను. క్రమముగా నాతనిలో నున్నత భావ సంపద అభివృద్ధిచెందుటయే అందుకు కారణము. నాగరికజాతిచేజిక్కిన శత్రువును సైతము దయతో నాదరించు చుండ తన జీవన జ్యోతి, జీవన సంగిని, విపత్సహాయిని అర్ధాంగియగు సహధర్మచారిణి తన యధీనయై యున్నప్పుడు భర్తయామెయెడల దయతో ప్రవర్తింపడు? స్త్రీ సమ్మాన గౌరవములే జాతియొక్క నాగరికతను రూపించునని పెక్కురు పండితుల యభిప్రాయము. ఆర్యుల జాతీయౌన్నత్యము పరాకాష్ఠనందినపుడు వారు స్త్రీల నమిత గౌరముగ చూచు చుండెడివారు. ఇందులకు పెక్కు దృష్టాంతములు మనకు భవభూతి నాటకమున ద్యోతకములు. రాముడు సీతను 'దేవి' అని సంబోధించును. ఆమె తన కోర్కెను ప్రకటించి నపుడు రాముడు "అజ్ఞాపయ" యనును. నాగరికులని ప్రసిద్ధి జెందిన ఆంగ్లేయులుగూడ దీని నధిగమింపరైరి. అధిగమింప లేరును. అట్టి ఆర్యజాతిలో జనించిన వారిపుడు 'స్త్రీ యెడ తన కర్తవ్యమును పాలించినను పాలింపకున్నను బాధలేదు'. అన్న భావమునందు యున్నచో అది జాతికి నైచ్య దశయేయని నా నమ్మకము.

రాముని సేనతో లవుడు యుద్ధముచేయు కథను భవభూతి పద్మ పురాణాంతర్గతమగు పాతాళఖండమునుండి గ్రహించెను. యుద్ధ దృశ్యము ప్రదర్శన యోగ్యముగా నుండుటచే భవభూతి విద్యాధరుల సంభాషణముననే విపులీకరించెను. తన కవితా శక్తిని జూపుటకే దీనిని గ్రహించెను. కాని ఇందు యుద్ధముకెట్టి ప్రయోజనములేదు. కాని కవితా దృష్టిలో నిది ఎట్లమూల్యమైనదో ముందు పరిచ్ఛేదమున ప్రదర్శింపబడును.

మనకీ రెండు నాటకముల కథావస్తువులందున్ను విలక్షణమైన సాదృశ్యము గన్పట్టును. రెంటియందును రాజుల ప్రణయ కథలు కలవు. నాయిక లిరువురును అమానుష సంభవలు. రెంటియందును నాయికలు భర్తృపరిత్యక్తలై యలౌకికమగు దైవ శక్తులచే తమ మాతృ స్థానములకు— శకుంతల హేమ కూటమునకును, సీత రసాతలమునకును వెళ్లిరి. వియోగానంతరము నాయిక లిద్దరును సంతానవతులైరి. ఆ పుత్రులే వారి పునస్సమాగమమునకు కారణభూతులైరి ఇట్లు తుదకు నాయిక లిర్వురకు పునస్సంయోగము లభించినది.

కాని రెండింటియందును సాదృశ్యముకంటె వైపరీత్యమే ఎక్కువగ గోచరించును. శకుంతలను జూచిన రాజు కాముకునివలె యున్మత్తుడయ్యెను. కాని ధర్మకర్తవ్య పరాయణుడగు రాముడు సీతనుజూచి ముగ్ధుడయ్యెను. ఒక నాటకమునకు విషయము ప్రణయోద్వేగముకాగా రెండవ దానికి నిరంతర సహవాస జనితమైన గంభీర ప్రణయ భావము వస్తువైనది. ఒకదాన రాజుకొలది దినములకే నాయికను విస్మరించును. రెండవ దానిలో నాయకుని వియోగావస్థలో సతీస్మృతి తీవ్రతర వేదనా రూపమున పూర్ణమైయుండును. ఒక నాయకుడు దక్షిణ నాయకుడు. మరియొకరు భార్యను బరిత్యజించియు నేకపత్నీ వ్రతుడే!

నాయికల విషయమునకూడా చాలా భేదము కలదు. శకుంతల యువతి. సీత యోప్రౌఢ. శకుంతల తాపసి. సీత రాణి. శకుంతలది స్వతంత్ర ప్రవృత్తి. రాజునుజూచిన తోడనే ముగ్ధురాలయ్యెను. పోషకపితరుడగు కణ్వుని యనుమతికైగూడ తాళజాలకపోయెను. కాని సీత ధీర. విశ్వాసిని. ఆమె రాముని యండజేరి తన్ను చరితార్థగా భావించును. శకుంతల గర్వ భూయిష్ఠ. సీతయో భయ విహ్వల. శకుంతల తాపసియేగాని సంసారియే. సీత గృహిణియయ్యు సన్యాసినియే.

సారాంశ మేమన అభిజ్ఞాన శాకుంతలమునందలి నాయికా నాయకులు కాముకులుకాగా, ఉత్తర రామచరిత్ర మందలి నాయికా నాయకులు దివ్యులగు దేవదేవులు.

ప్రతిబింబాలు

శ్రీ రామారావ్

"పెళ్ళి బాగానే జరిగింది కాని, తొందరపాటేమో అనిపిస్తుంది వీడు చేసిన పని. వీడు చేసుకోకపోయినా ఆమె బాధపడేదికాదు. అందర్లో ఒకడు. అనవసరంగా జీవితాన్ని నాశనం చేసుకున్నాడు." తిరుగుతున్న 'ఫ్యాన్' వంక చూస్తూ 'సీరియస్' గా అన్నాడు సుబ్బారావు.

"నీ వాలోచించటం లేదురా, అసలు — ఆమె బాధ పడేదో, కాదో నీకెలా తెలుసు ?" అడిగాడు ప్రసాద్.

"ఆమె మనస్సులో దూరేం చూశానా, నేను మాత్రం— ఆమె గతాన్నిబట్టి—అస లిటువంటి వాళ్లను ఎందర్ని మార్చలేదది. నీకు మాత్రం ఏం తెలుసు ఆమె వాడినంత 'డీప్' గా 'లవ్' జేసిందని—?"

"ఆమెమీద ఉన్నవి పుకార్లేమో. కాస్త 'సోషల్‌గా మూవ్, అయ్యేవాళ్లను ఎందర్ని అనుకోవటంలేదు. ఇక ఆమె మనవాణ్ని అంత 'సిన్సియర్' గా 'లవ్' చేసిందో లేదో తేల్చుకోవాల్సిందివాడు. నీవూ, నేనూ కాదు"—ప్రసాద్.

"నువ్వు నోర్ముయ్యిరా కాసేపు. ఆ డాక్టరిగాడి పెళ్లాం డ్రైవరుతో లేచిపోయిందని విని ఎంత సానుభూతి చూపలేదు నీవు. నిజంగా లేచిపోయిందో లేదో నీవు చూశావా."

"ఇంతెందుకు—నేను కళ్ళారా చూశాను—చెప్తే నమ్ముతారా."—రామారావు అడిగాడు.

"నమ్మదగిందైతే నమ్ముతాం"—ప్రసాద్.

వాడు చూపిందేమిటో, వినాలనిపించింది నాకు.

"చెప్పరా వాడ్తో యేమిటి"—

"ఆ 'కార్సినోమా,' పేషంటు చచ్చిపోయిన రాత్రి గుర్తుందా .... అదేరా .... మొన్న—"

ఇద్దరికి గుర్తు వచ్చింది—నాకు సరిగా గుర్తు రావటం లేదు. అలా అంటే యెక్కడ చెప్పడోఅని అవునవు నన్నాను మిగతా ఇద రితో కలిసి.

"సరిగ్గా ఆ రాత్రి."

రాత్రి మెదిలింది మా కళ్లముందు. తడి పొడిగా అంటే అంటనట్లున్న వెన్నెల వెలుగులో ఆస్పత్రి.

"థియేటర్‌లో పనుండి వెళ్లాను. ఆ ప్రక్కన గది లేదూ—మూలగా అప్పుడు లైటుకూడా లేదా గదిలో—అక్కడ చూశాను ఈమెనీ, శంకరంగాణ్నీ—నా చప్పుడు వినగానే ఏదో పని ఉన్నట్లు మాట్లాడుతూ బయట కొచ్చేసింది—ఇప్పుడు చెప్పండి—చీకట్లో యెవరూ లేనిచోట ఒక మగవాడికీ ఆడదానికీ .... యేముంటుంది,"

"మరీ హాస్పిటల్లోనా నేను నమ్మలేను."—ప్రసాద్.

"చంటిపాపలా మాట్లాడకురా చిట్టీ—ఆ బ్రోకర్ వెధవ హాస్పిటల్‌లో ఎందుకు పచార్లు చేస్తుంటా డంటావు. మనిషిలో నీతి నియమం తప్పినప్పుడు ఎక్కడైనా జరగొచ్చు' —సుబ్బారావ్.

కాస్సేపు నిశ్శబ్దం తర్వాత సుబ్బారావే అన్నాడు.

"ఆ జాఫర్‌గాడితో యెన్నిసార్లు, హైదాబాద్ వెళ్లలేదది..... పెలవుపెట్టి మూడ్రోజులు ఆ పీచు కాంపౌండర్ ఇంట్లో లేదూ .... ? చివరికి వార్డుబాయ్‌కూ్కడా తెలుసు దీని సంగతి."

"అయితే ఆమెను నర్సింగ్ కోర్సునుంచి సస్పెండ్ చేసింది నిజమేనా ?" ఇంతసేపూ మౌనంగా ఉన్న చారిగాడు.

"సస్పెండ్‌చేయరు 'శత పురుషోత్సవం' చేసుకున్నందుకు సన్మానం చేస్తారు"—వ్యంగ్యంగా అన్నాడు సుబ్బారావ్.

"ఇంతకీ మనవాడు ఫూల్—దాని సంగతి హాస్పిటల్ బయట యే రిక్షావాడ్ని కనుకున్నా చెబుతాడు. ఇదో ఆదర్శం అనుకున్నాడు—వాడి ఖర్మ వాడికే తెలిసొస్తుంది" నిశ్చయంగా అన్నాడు రామారావ్.

"సుఖపడకూడదని నమ్మకం మాత్రం ఏమిటి—" ప్రసాద్.

"నేను బల్లగుద్ది చెబుతాను— —నాల్రోజుల్తరవాత వాడేడుస్తాడని ..... కొంచెం ఆగు నీకే తెలుస్తుంది. అది మరో

కడ్నీ లేపుకుపోతే—ఉన్న నాల్గు డబ్బులూ వదిలేస్తే ఉద్రేకం దానంతటదే దిగిపోతుంది—

.... నా బాధంతా అనవసరంగా వాడు 'లైఫ్ స్పోయిల్' చేసుకున్నాడనే—ఓ రెండేళ్లల్లో డాక్టరయ్యేవాడు. ఇప్పుడేం చేస్తాడు. వాళ్ల నాన్న ఒక్క పైస పంపడుకదా—కాస్త కడుపు మండితే ఆదర్శాలన్నీ వదుల్తాయి.''

''వాళ్ల నాన్న పంపడంటావా''—చారి.

''మొన్న రాలేదురా—నెత్తీ, నోరూ కొట్టుకు చెప్పాడు. వీడు వినలేదు. చివరికి విసిగి నీకూ, నాకూ సంబంధం లేదని చెప్పలేదూ ? పాపం మామ్ముందు కూడా కన్నీళ్లు పెట్టాడు.''

''ఇంకేం చదువు—ఆమె సస్పెండ్ అయింది—వీడి చేతిలో పైస లేదు—వదిలిపెడ్తానని మొన్నే చెప్పాడు—యేరా నువ్వే ఇచ్చావటగా వందరూపాయలు''—సుబ్బారావు.

''నీ సపోర్టుకూడా నన్నుమాట—నేనైతే ఒక్క పైస ఇచ్చేవాడ్నికాదు—ఇటువంటి వెధవపనికి—ఆమెకు వీడొక్కడా—పెళ్లికి మాత్రం వీ డొక్కడే దొరికాడు పిచ్చివెధవ— రేపు వాడి ఫ్యామ్లీ యేం కావాలి ?''—రామారావ్.

''అందరూ చేయని పనేదో చేయటం ఆదర్శం అయింది ఈ రోజుల్లో—ముందు వాడికే తెలిసొస్తుంది''—నొక్కి చెప్పాడు సుబ్బారావ్.

టైమ్ చూసుకుంటూ లేచాడు ప్రసాద్—చారీ, రామారావూ ఏదో వాదించుకుంటున్నారు మెల్లగా.

బిల్లు పట్టుకుని బయటకు నడిచాను నేను.

*　　　*　　　*

రూములో ఒంటరిగా మిగిలిపోయాను. మూడు నెల్లుగా కలసి ఉన్నాం ఇద్దరమూ. చివరిదాకా ఒక్కమాట చెప్పలేదు వాడు. ఇంతకాలం కలిసిఉన్నా కనీసం ఒక ముక్కైనా చెప్ప నందుకు బాధ కలుగుతుంది—బహుశా వాడికి తెలుసేమో ఆమె అంటే ఎవరికీ సదభిప్రాయం లేదని. ఆమె ప్రవర్తన మీద కొల్లలుగా ఉన్నాయి కథలు. మే మిద్దరం యెన్ని సార్లు 'డిస్కస్' చేయలే దామెను గురించి. ఆలోచిస్తే గుర్తు వస్తుంది. అనవసరమైన సానుభూతి చూపేవా డామెమీద. అసలు మొదటినుంచీ వాడి ప్రవర్తనే విచిత్రంగా ఉండేది. అందరూ ఏదంటే దానికి వ్యతిరేకంగా మాట్లాడేవాడు. వాడికి జీవితంమీదా బ్రతుకు విధానం మీదా కొన్ని చిత్రమైన నిర్ణయా లుండేవి. ఏమైనా నా ఉద్దేశంలో వాడు చేతులారా జీవితాన్ని నాశనం చేసుకున్నాడు తాత్కాలికోద్రేకంలో—

ఓ స్త్రీ కోసం—మరీ—ఇలాంటిదానికోసం, డాక్టరుగా ఉన్న బంగారంలాంటి భవిష్యత్తునూ తనవాళ్లనూ, వాళ్ల ఆశలనూ, ఉన్న కట్టుబాట్లనూ తెంచుకుని వెళ్లటం ఏ మాద ర్శమో నాకు అర్థంకాదు.

ఏ వ్యక్తీ కేవలం తనకోసం తను బ్రతకడు—తేతని భవిష్యత్తుని ఆశగా చూసే తల్లిదండ్రులూ, ఆసరాగా చేసుకుని పెరగవలసిన సోదరులూ ఉన్నారు. వీడు చేసిన పని ప్రభావం ఆ కుటుంబంమీద తప్పకుండా ఉంటుంది.

పోనీ, ఆమెలో ఏం చూసి ఇంత త్యాగం చేశాడో అర్థం కాదు. వాడికి ఇంతకన్నా అందమైనదీ, సంస్కారం కలదీ, ఎక్కువ ప్రేమించేదీ ఇతని భార్య అయ్యేది.

కొందరు స్త్రీలను చూస్తే భయమేస్తుంది. స్త్రీ అంటే ఇలా ఉండాలా అని అడిగితే చెప్పలేను కాని—ప్రతివాడూ 'ఇలా' ఉన్న అమ్మాయే తన భాగస్వామిని కావాలని కోరు కుంటాడు. ఆమెలో కొన్ని విలువలను ఊహల్లో నిర్ణయించు కుంటాడు.

సిగ్గు లేకపోవటం గొప్ప తప్పు కాకపోయినా, అందం కాదనుకుంటాను నేను. స్త్రీ సున్నితమైన అనుభూతులకు బాహ్యరూపం సిగ్గు. అది ఆమెలో ఏ కోశానా కనిపించదు. దగ్గరగా నుంచుని మాట్లాడ్తూంటే మనిషిమీద పడే ట్లుండేది—నదురూ, బెదురూ లేకుండా.

ఆమె నవ్వితే మరో 'వార్డు' లోకి వినిపించేది. ఎవరేం మాట్లాడినా వికృతమైన అర్థాలు తీసి అపహాస్యం చేసేది. మరణించిన రోగి మంచం ప్రక్కన నుంచుని సరదాగా 'జోక్సు', కట్ చేయటం ఎన్నోసార్లు చూశాను నేను.

ఎండిపోయిన ముసలివాడి వంటిమీద, ప్రక్కనున్నామెతో మాట్లాడ్తూ, 'కేర్‌లెస్' గా 'వీనస్ ఇంజెక్షన్' ఇవ్వటాన్కి పదిరంధ్రాలు పొడవటం చూశాను.

రోగులతో నిర్లక్ష్యంగానూ అసహ్యంగానూ మాట్లా డేది. సినిమాలో రోజా కొడకడితో కనిపించేది.

ఏ మనిషీ అందరి దృష్టిలో 'చవక' కాదు ఏ కారణం లేకుండా.

చివరికి హాస్పిటల్ బయట రిక్షావాడు కూడా చాలా చవకగా వెకిలిగా మాట్లాడేవాడు ఈమెను గురించి.

—అందుకే ఈమెను చేసుకోవటం యవ్వనం విసిరిన గాలానికి అమాయకంగా చిక్కుకోవటం. భవిష్యత్తుని చీకటి చేసుకోవటం. ఆమె వీడిని ప్రేమించికావాలని పెళ్లి చేసుకుం దంటే ఇక్కడ నేనే కాదు, ఎవరూ నమ్మరు.

ఏపని చేసినా దానికి సమర్థనా, దాన్ని అందంగా చూపే ఆదర్శమూ ఉంటాయి.

ప్రతి వ్యక్తీ కుటుంబానికీ తద్వారా సంఘానికీ బాధ్యుడవుతాడు. జరిగిపోయే కాలంలో, సవరించుకున్న అనుభవంతో కొన్ని హద్దు లుంటాయి సంఘంలో—

వీడు చేసిన పని ఆదర్శమూ, ఏదో మార్పులో ముందడుగూ అంటే మార్పు మంచి కావచ్చు, చెడు కావచ్చు. ఇలా ఎదిరించినందుకు అతనికో ప్రత్యేకత ఉండవచ్చు. అది మనిషి ఉన్నతి వైపే ప్రయాణించే ధైర్యం కానవుసరంలేదు.

కాలప్రవాహంలో కొట్టుకుపోవలసిన మనిషి, నలుగురూ నడిచే నిర్ణీత పథంలో ఉన్న కొద్దీ జీవితానికీ అర్థం కలిపించుకోవలసిన మనిషి, ఈ ప్రవాహంలో ఎదురీదితే మునిగి శవమై తేలతాడు.

స్వార్థంతో క్షణికోద్రేకంలో చేసిన వెర్రిపని—ముందు రోజుల్లో తనని తను క్షమించుకోలేక మిగిలిపోయినప్పుడు, భవిష్యత్తు బుద్ధి చెబుతుంది వీడికి.

పోనీ ఆమెతో ఉన్నతమైన ప్రేమ అనుకుంటే—

అది ఆత్మవంచన. యంత్రంలాంటి ఆమె కామానికి చెప్పుకునే మారుపేరు. నాల్రోజుల్లో తెలుసుకుంటాడు—ఎస ఎండమావుల్లో ప్రయాణిస్తున్నాడని—

ఇవి నా, అభిప్రాయాలు.

నన్ను మాట్లాడటానికి కూడా టైము ఇవ్వకుండా 'బెజవాడ వెళ్తున్నాం—రిజిష్టర్ మ్యారేజికి—అని చెప్పి వంద రూపాయలు తీసుకెళ్ళాడు.

ఆ మర్నాడు ఇవే అభిప్రాయాంతో ఉత్తరం రాశాను నేను వాడికి.

*　　*　　*　　*

నేను రాసిన ఉత్తరానికి నాలుగు రోజుల తర్వాత వాడి జవాబు ఇది—

రాజా,

నీ ఉత్తరం 'రిజిస్ట్రారు ఆఫీస్' లో పెళ్లయిన మూడు గంటల తర్వాత చేరింది.

నీ అభిప్రాయాలు నిస్కర్షగా చెప్పినందుకు, మిత్రుడిగా నామీద ఉన్న అభిమానానికీ—సంతోషం.

మళ్లీ నీకు చాలాకాలం వరకూ కన్పించకపోవచ్చు నేను. నా వ్యక్తిగతమైన విషయాలకు, నీకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా—నేను బాగుపడాలని తీవ్రంగా కోరుతున్నందుకూ—నేను మోసపోయానని బాధపడుతున్నందుకూ—విను.

నీవు రాశావు "ఆమెలో ఏం చూసి ప్రేమించావని". ఆమెకోసం నేను ఉజ్వల భవిష్యత్తును వదులుకుని చేసే త్యాగం అర్థరహితమనీ."

—ప్రేమించానని నీవే భావనలో అంటున్నావో అర్థం కావటంలేదు. నిర్దుష్టమైన అర్థం లేనిదే ఆ పదాన్ని నాకు నేను ఆపాదించుకోను.

నాలుగు నెలలుగా, నా కామెతో పరిచయం—క్రమంగా సన్నిహిత మయ్యాము—స్నేహితులుగా తిరిగాము.

ఏ విషయాన్ని 'సీరియస్‌గా' ఎప్పుడూ తీసుకోదామె. ఇది తప్పు, ఇదికాదు— అని నిర్ణయపు హద్దుల్లో ఉండాలనుకోదామె. ఆమె అనుభవాలు ఆమెకు, అవి నేర్పలేదు. జీవితాన్ని తేలిగ్గా తీసుకుని హాయిగా జీవించటం తెలుసామెకు. పసిపిల్లలో అమాయికత, వేదాంతిలో నిర్లిప్తతా ఉన్నా యామెలో—ఈ ఆనందాల్లో దుఃఖాల్లో బాధల్లో .... అన్ని అనుభూతుల్లో ఉన్నట్లు కనబడి వాటి కతీతంగా జీవించటం తెలుసామెకు. ఆమె ఒక పాత్రలా ఈ బ్రతుకు నటించగలదు. ఇవేమీ అంటని మరో వ్యక్తిత్వం ఉంది ఆమెలో—

ఇదే నే కోరింది—పిరికితనం ఎరుగనిది ఆమె. నీవు చాలా రాశావు ఆమెను గురించి. నీవు ఒక కోణం నుంచి చూశావు—నేను మరొకవైపునుంచి. గడవబోయే కాలంలో, నేను మోసపోతే అనుభవంగా తీసుకుంటాను. అంతేకాని మోసపోతానని ఊహించుకుని ఇప్పు డామెను వదులుకోలేను.

నాలుగు నెల్లు ఆమెతో తిరిగాను. ఆమెను వీలైనప్పుడల్లా అనుభవించాను—ఆమె తనకు తానుగా, ఎప్పుడూ నన్నడగలేదు వివాహం చేసుకోమని—ఆమె తనివ్వగలిగినంతా నా కిచ్చింది. —'నీవు నా క్కావాలి. పెళ్లి చేసుకుందాం' అని అడిగినప్పుడు, "భరించగలవా", అంది. ఆమె కాదనలేదు—అవుననలేదు.

ఆమె గతం నీలాగా నాకూ తెలుసు.

గుండెమీద చేయి వేసుకుని చెప్పు—రేపు నీభార్య కాబోయే ఆమె పవిత్రత నీకెలా తెలుసో—పిచ్చిగా నమ్ముతావు. గుడ్డిగా బ్రతుకుతావు. ఆ నమ్మకం వమ్మైనప్పుడు బాధపడతావు. నీ నమ్మకం మీద నీ కంత విశ్వాసం !

ఆమె ఒళ్లో పడుకుని నీ కోసమే ఆమె సృష్టించబడినట్లు కలలు కంటావు.

అవకాశం ధైర్యం ఉంటే నీ వెన్నిసార్లు చెడిపోయే వాడివి కాదు—? ప్రక్కింటి పంతులు భార్యని చూసి, నీ వెన్ని య్యాని కలలు కనలేదు ? ఆమె చూస్తే నీ కోసమే అన్నట్లు ట్టుకునే వాడివికదా ?— నీకో ఆమెకో ధైర్యం ఉంటే నీ నీతి మేమయ్యేది ?

నాకు తెలిసిన, విన్న ఆమె గతం నా కనవుసరం—ఆమెతో టు ఆ చరిత్రనూ స్వీకరించే ధైర్యం ఉంది.

,'నీవు సుఖపడవు అన్నావు.''

ఎందుకో నాకు తెలియదు. మెడిసిన్ చదివి డాక్టర్నైతే ర్థికంగానూ, ఈ సంఘంలో ఉన్నతిలోనూ, ఉండేవాణ్ణి. అదే ఖమైతే మనకన్నా ఆర్థికంగానూ ఉన్నతిలోనూ ఉన్నవాడు ంకా ఎక్కువ సుఖపడాలి. పూటకు రొట్టెలేని వాళ్లు ఆత్మ త్య చేసుకోవాలి.

సుఖం సంతృప్తిలో ఉంది—మనస్సులో ఉంది—అంత ్తిలో లేదు. పెరుగుతున్న ఆశలో చేరవలసిన దశ ఎప్పటి ప్పుడు దూరమవుతూనే ఉంటుంది.

అందుకే నీ వనుకునే సుఖాన్ని ఎప్పటి కప్పుడు నేను ష్టించుకోగలను పరిమితంగా—

''ఇక ఆమెతో నంటావా ?''

ఆమె నాతో ఉండటాన్కి ఇష్టపడింది—ఆమెనుంచి విష్యత్తు ఈవిధంగా ఉండాలని కోరటంలేదు. ఆ అధికారం దు నాకు—

రేపు నీ భార్య ఎవరితోనో లేచిపోదని గ్యారంటీ ఏమిటి. ది ఇలా జరగాలి. జరుగుతుందని భవిష్యత్తుపై ఇంత శ్వాసం ఉంచుకుని ఈరోజు నిన్ను నీవు మోసం చేసుకో ంలో అర్థమేమిటి—?

''ఇదేదో ఆదర్శం అనుకుంటున్నావు''—అని వ్రాశావు వు.

ఏది ఆదర్శమో, ఏది కాదో నాకు తెలియదు. ఏ ఆదర్శా కీ శాశ్వత విలువలేదు—ఒక స్త్రీకి అయిదుగురు భర్తలు నాటి ఆదర్శం—ఇప్పుడు కాదు—

నలుగురూ నడిచే బాటను వ్యతిరేకించటం ఆదర్శమూ దు, నేరమూ కాదు. మేము నడచినట్లే నీవూ నడవాలని ళ్లు శాసించటం తప్పు.

నే చేసిన ఈ పనివల్ల సంఘానికి నష్టమూ లేదు. భమూ లేదు, నీవు భూతద్దంలోంచి చూస్తే తప్పు.

ఆదర్శవాది అనుకున్నా, నేరస్తుణ్ణి అనుకున్నా ం యిష్టం. నా జీవితాన్ని నేను నిర్మించుకోటాన్కి నాకు సర్వాధికారాలున్నాయి. నా త్రోవన నే పోతుంటే మీకేదో కీడు చేస్తున్న ట్లనుకోవటం—పిరికితనం.

ఏదీ శాశ్వతం, మంచీ, చెడూ కాదు. ఈ విలువల్ని వ్యక్తులకు ఆపాదించేప్పుడు మన దృష్టి దోషం చాలా ఉంటుంది.

ఈరోజు హాయిగా ఉన్నాను. బహుశా రేపూ ఉండా లనుకుంటున్నాను. కాకపోతే చేసేది ఏమీ లేదు. జీవించటానికి జీవితం. జీవితం కోసం జీవించను నేను.

—రాధాకృష్ణ.

—ఇది నాకు చేరిన మొదటి ఉత్తరం. అంతా మొండి వాదన. తర్కం చేయటానికి అన్వయించలేం—చాలాసార్లు కొన్ని విలువలను మనం ప్రశ్నించలేము—వాడి మూర్ఖత్వం వాడే తెలుసుకుంటా డనుకున్నాను. కాని, అతన్ని పరిశీలించటం నా కవసరం అనిపించింది. వాడిలా అవుతాడని నేను నిర్ణయించు కున్నందువల్ల అడ్డు మార్గాల్లో ఈ దినం వాడు సుడి గుండంలో పడే ప్రమాదం ఎప్పుడూ ఉంది.

ఫలితాలకోసం ఎదురుచూసే విద్యార్థి రోజూ పేపరు చూసినట్లు వాడి విశేషాలు ఎప్పటి కప్పుడు తెలుసు కుంటున్నాను. ఇంతలో వాడు చేసిన తొందరపనికి తీవ్రంగా పశ్చాత్తాపపడవలసిన ఘటన ఒకటి జరిగింది.

దానికి వాడి జవాబు—

రాజుకు,

నేను చేసిన పనికి తలెత్తుకు తిరగలేక—అమ్మ నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుందని వ్రాశావు. నేను చాలా బాధ పడ్డాను. తెలవగానే వూరు వెళ్లాను. అప్పటికే అంతా అయి పోయింది. నన్ను ఇంటిగుమ్మం తొక్కనీయలేదు. నావల్లే ఇది జరిగిందని ఉమ్మేశారు కొందరు. ప్రతి వాడికీ ఉన్నట్లు నా తల్లిమీదా నాకూ ప్రేమ ఉంది. ఆమె మరణానికి అవి తంగా దుఃఖపడ్డాను. కాని ఆమె మరణానికి కారణం నేను మాత్రం కాదు.

నాకు తెలియని దశలో నన్ను తన అభిరుచులకు అను గుణంగా మార్చవచ్చు. కాని నాకు వ్యక్తిత్వం వచ్చింది.

పక్షి తన గుడ్డును పొదుగుతుంది. గుడ్డు పోతే బాధ పడుతుంది. కాని, తన రెక్కలు రాగానే ఎగిరిపోతుంది పిల్ల.

నీవు నామీద వేసిన అభాండాలకు ఒకటి గుర్తువచ్చింది. చిన్నప్పుడు వివేకానందుడు పాఠం చెబుతూ అనేది అమ్మ.

''మహానుభావుడు అంత చిన్నతనంలోనే అడిగినవాడికి లేదనకుండా—ఇంట్లో దొంగతనంచేసి ఇచ్చాడుట పావులా— పూవు పుట్టగానే పరిమళిస్తుందని.''

ప్రతిబింబాలు

ఓసారి ఒక పావలా వేశాను బిచ్చగాడికి—అమ్మ ఆరోజు కొట్టిన దెబ్బలు ఇంకా జ్ఞాపకం ఉన్నాయి.

ఏం ? నే చేసింది మంచిపని కాదూ ?—నన్నెందుక్కొట్టింది ?

దీనికీ ఒక సమర్థన ఉండవచ్చు.

చేసేది మంచికానీ, చెడు కానీ— ఆమె నన్ను రూపొందించాలనుకున్న విధానానికి అతీతంగా ప్రవర్తిస్తే ఊరుకునేది కాదు.

'కబడ్డీ' ఆడవద్దనేది—కథలు చదివితే చెడిపోతా రనేది—డాక్టర్ తప్ప ఇంకో కోర్సు వద్దనేది.

బహుశా నే నామె ఇష్టప్రకారం నడచివుంటే తను చూపించిన పిల్లను తను కోరిన కట్నానికి పెళ్లిచేసి ఉండేది.

చిన్నప్పుడు నయానా భయానా చెప్పి చేయించేదిచాలా. ఇప్పుడు ఆ అవకాశం లేనందుకు ఏం చేయలేక 'చనిపోయి ఉంటుంది. ఇలా ప్రతి దశలో నన్నూ నా ఊహల్నీ, తన ఇష్టానుగుణంగా మార్చే హక్కు కేవలం కన్నందుకేనా ? నా సుఖం ఆమె కోరుకుంది. నే నీమెతో ఈ స్థితిలో సుఖం గానే ఉన్నానంటే ఎందుకు నమ్మలేదు. ? నీవు సరిగా ఆలోచిస్తే ఆమె మరణానికి కారణం నేను కాదు. నన్ను తను కొన్ని అంతస్థుల్లో ఊహించుకుని మా అబ్బాయి యిలా అవుతాడని నిర్ణయించుకుంది. అమలుజరిపే అధికారం ఆమెలో దాగిన స్వార్థాన్ని తృప్తిపరుస్తుంది.

అన్నీ కూలిపోయాయి.

ఆమె ఎందుకు చనిపోవాలో అర్థంకాదు. ఆమె ఆలోచిస్తే. ఆమెకు ఆలోచించే శక్తి లేనందుకు—ఒకేవిధంగా భవిష్యత్తును ఊహించుకుని, అలా జరగకపోయేసరికి ఇంత ఘోరం తలపెట్టినందుకూ—నేనేం చేయలేను. ఒక మనిషిని మనం ప్రేమించినంత మాత్రాన, నావాడు, అనుకున్నంత మాత్రాన—అతన్నుంచి తము కావల్సినవి కోరుకునే అధికారం లేదు, క్షమించలేని స్వార్థం ఉంటే తప్ప. అందరి తల్లులలో ఆమె ఒకతె—అందరిలిలా ఆశలు పెట్టుకుంది. కాని తీవ్రమైన నిరాశ ఎదురయింది. ధ్గాన్ని తట్టుకుని ఆలోచించే మన స్థైర్యం చాలా మందిలా, ఆమెలో లేదు. దీనికి అమ్మ పెరిగిన వాతావరణం—సంస్కారం—సమకాలీన సంఘం—నామీద వక్రించిన అంచనాలూ ఇవన్నీ కారణం కావచ్చు.

ఇన్ని కారణాలు వంటరిగా ఆమె బ్రతుకుమీద భయం లేదా విరక్తి కల్గించివుంటే—

నేనేం చెయ్యలేని పరిస్థితుల్లో—సానుభూతి తప్ప ఏం చూపగలను నేను? చనిపోయిందంటే తల్లికోసం నేనెంత దుఃఖిస్తున్నానో నీవర్థం చేసుకోలేవు. నాకు జన్మ నిచ్చినందుకు ఆమె కోరుకున్న విధంలో ఆమెకు ఋణం తీర్చలేని నా అశక్తతకూ బాధపడుతున్నా. ఇంతకన్నా ఎక్కువ రాస్తే నన్ను నేను సమర్థించుకోటానికి ప్రయాస పడుతున్నా నంటావు నీవే—

చివరికి ఒకటి చెబుతున్నాను.

ఆమె కావాలని ఆత్మహత్య చేసుకుందని కొంద రన్నారు. దానికి కారణం నన్ను చూపించి—

దొడ్డిలో బావికి పిట్టగోడ లేకపోవటంచేత, చీకట్లో కాలుజారి పడిఉండవచ్చని కొంద రన్నారు. ఏది నమ్మమంటావు—నన్ను అజ్ఞాత హంతకుడిగా చూస్తేనే నీకు తృప్తి ఉంటుంది కదూ—అలాగే కానీ.

నీ,

రాధాకృష్ణ.

కనీసం పై సంఘటనకన్నా పశ్చాత్తాపపడ్తా డనుకున్నాను. 'కాలుజారి పడిపోయిందని, నమ్మి తనను తను సమర్థించుకుంటున్నాడు. హంతకునికీ, దొంగకీ కూడా తాము చేసేపని న్యాయంగానే తోచవచ్చు. తర్కంతో సమర్థించుకోవచ్చు. కాని, మనిషి అయినందుకు, అంతరాంతరాల్లో యెక్కడో తెలుస్తుంది ఏది నిజమో, ఏది కాదో.

తప్పునే సరైందిగానూ, చెడునే మంచిగానూ — మూర్ఖంగా నమ్మేవాళ్లకు ఆ దేముడే నిష్కృతి చూపాలి.

చెప్పలేనంత అసహ్యం కలిగింది వీడిమీద. అందుకే తర్వాత ఉత్తరం వ్రాయలేదు నేను.

మూడు సంవత్సరాలు గడచిపోయాయి. ఉన్నట్లుండి ఒక ఉత్తరం వచ్చింది. వాడి దగ్గర్నుంచి.

రాజా,

నీ దగ్గర్నుంచి ఉత్తరాలు లేవు—ఎందుకో నాకు తెలుసు నిన్ను చూస్తుంటే నాకు జాలివేస్తుంది.

నీవు రచయితవు అంతో-ఇంతో—

ఇది ఒక కథైతే, నాలా చేసినవాడు—తన తప్పును తెల్సుకుని పశ్చాత్తాపపడి ఏ ఆత్మహత్యో చేసుకునేవాడు. ఆమె ఎవరితోనో లేచిపోవటమో, కాకుంటే ఏ ఆశ్రమంలోనో చేరి భగవంతుడి దగ్గర 'నిష్కృతి' కోసం తపస్సు చేయటమో చేసేది.

కాకుంటే,

సంఘపు ఆంక్షల మధ్య, ఒకరిమీద ఒకరు నమ్మకంలేని దొంగల్లా రోజుకు వందసార్లు చస్తూ, బ్రతుకుతూ చివికిన జీవితం గడిపేవారు.

అప్పుడు నా పాత్రమీద సానుభూతి కలిగేది నీకు.

ఇంతదాకా ఎందుకు—

వర్ణాంతర వివాహాలను ఓ ఆదర్శం అనుకుంటారు.

—అలా కథ రాసి ఇద్దరూ హాయిగా ఉన్నట్లు ఎందుకు రాయరో అర్థంకాదు—హాయిగా ఉన్నవాళ్లు లేరా ?

రచయితకు వాళ్లలో 'బలహీనతల్లో' ఉండే నమ్మకం వారి ఆత్మ స్థైర్యం మీద ఉండదు.

దేవదాసే పార్వతితో పారిపోయి—సుఖంగా ఉంటే అంత సానుభూతి ఉండదు ఆ పాత్రమీద.

సంఘంలో ప్రతి మార్పునీ ఆదర్శంగానో, విచిత్రంగానో, తప్పుగానో చూసి—తమ మనస్తత్వాల పరిధిలో వాళ్ల భవిష్యత్తును నిర్ణయించ బూనటం తెలివితక్కువ.

నీవు నా కనేక ఉత్తరాలు వ్రాశావు. ప్రతి ఉత్తరంలో ఇంతో అంతో భయపెడ్తూ—చివరికి నా తల్లి పోయినప్పుడు—నేనే కారణం అని నన్ను సాధ్యమైనంత బాధపెట్టి నా తప్పుని ఒప్పించాలని చూశావు. అందుకే పది పేజీల ఉత్తరం వ్రాశావు నామీద నేరారోపణలతో.

నేను ఆమె చేతిలో మోసపోయి, జీవితంలో ఓడిపోయి నీవు అనుకుని, నా కంటగట్టిన ఆదర్శంలో—పొరపాటుకు పశ్చాత్తాప పడాలని, సానుభూతికీ, జాలికీ ఎదురుచూసే కథలో పాత్రలా—నా వ్యక్తిత్వాన్ని ఊహించుకుని ఆ రోజుకోసం ఎదురు చూశావు.

నిరాశపడ్డావుకదూ ?

ఇన్ని కోట్ల మందిలో, నేనొక చిన్నమనిషిని, నా దోవన నేను బ్రతుకుతానంటే మీ కెందు కంత బాధ చెప్పు ?

—అక్కడ ఉద్యోగం వదిలేశాను, ఆఫీసులో గుమాస్తాగా—చివరకు ఆఫీసరు క్రింద బానిసలా మారవలసి వచ్చినందువల్ల—

తర్వాత చాలా చిక్కులు పడాల్సి వచ్చింది. కొన్ని రోజులు అన్నమే లేదు మా యిద్దరకూ.

చివరకు ఇక్కడకు చేరుకుని బొగ్గు గనిలో కూలీగా పనిచేస్తున్నాను—నాల్గు నెలలనుంచీ—ఆమె 'మిషన్' కుడుతూంది. త్వరలో చిన్న కిళ్లీకొట్టు పెడ్దామనుకుంటున్నాను.

రోజులు హాయిగా గడచిపోతున్నాయి—నీవు ఊహించుకునే కనీస బాధలూ విచారాలూ ఏమీ లేవని రాస్తే బహుశా నీవు నమ్మవు.

మాలో మాకు సంతృప్తి ఉంది. విశ్వాసం ఉంది. పరిమితమైన ఆశతో ఏ క్షణానికి ఆ క్షణం జీవించగలిగే శక్తి ఉంది.

రేపటిమీద నాకు భయంలేదు. ఆలోచన లేదు. ఎదుర్కొనే ధైర్యం ఉందని మాత్రం అనుకుంటున్నాను.

నా జీవితాన్ని నేను స్వేచ్ఛగా నా ఇష్టం వచ్చిన సంతృప్తిలో నిర్మించుకుంటున్నాను—ఇది చాలు నాకు.

మనిషి చేయలేనిది ఏమీ లేదని, నీవూ, నేనూ చదువుకున్నాం—పుస్తకాల్లో.

అల్పత్వం, పిరికితనం లేకపోతే మనిషి ఆత్మవిశ్వాసానికి మరణంలేదు.

చరిత్రలేని (చరిత్ర) ఉంటుంది—ప్రతివాడికీ. దానిని చూసి నాకోసం నేనైనా సంతృప్తిగా జీవించానన్న తృప్తి ఉంటే చాలు నాకు.

నీకు నిరాశ కలిగిస్తే—కోపం తెచ్చుకోకు. వీలైతే—క్షమించు.

—రాధాకృష్ణ.

ఈ ఉత్తరం చూసిన తర్వాత అతనితో నాకున్న అవసరం తీరిపోయినట్లనిపించింది. కొన్ని విలువలను తారుమారు చేసి బ్రతుకుతున్నాడు వాడు—ఏది వాస్తవమో ఏది ప్రతిబింబమో నాకు అర్థంకాలేదు.

తర్వాత వాడికి ఉత్తరం వ్రాయనేలేదు, ఇప్పటివరకూ.



కలగూరగంప :

రాఘవపాండవీయం

శ్రీ శ్రీనివాసపురం నరసింహాచార్యులు

సంస్కృత సాహిత్యమునందును, ఆంధ్రవాఙ్మయమునందును, 'రాఘవ పాండవీయ' మను పేర ఒకే రీతిగా బిలువబడెడి రామాయణ భారత గాథాగర్భితమైన ద్వ్యర్థి కావ్య మొండు గానవచ్చుచున్నది. తెలుగుభాషలో నున్న దానిని క్రీ. శ. 1560 ప్రాంతములయందు పింగళి సూరనామాత్యుడు నిర్మించిన విషయము సర్వ విదితము—నిర్వివాదము. సూరనార్యుని కృతికి సంస్కృత కావ్యము మాతృక కాదనియు, అంతేగాక ఈ రెంటికిని పోలికలు గూడ లేవనియొడి యొక విశేషమును శ్రీ వేదము లక్ష్మీనారాయణ శాస్త్రిగారు 1962 లో వావిళ్ల వారు ప్రచురించిన కళాపూర్ణోదయ గ్రంథ పీఠికలో తెల్పియుండిరి.

సంస్కృతములో నున్న రాఘవ పాండవీయము యొక్క కర్తను, అతని కాలమును గురించిన విషయము వివాదగ్రస్తమై యున్నది. ఈ సంస్కృత కావ్యము క్రీ. శ. దాదాపు 800 సం. ప్రాంతమున 'కవిరాజు' అను వ్యక్తిచే రచియింపబడినదై యుండవచ్చునని కొందరు పరిశోధకులును, మరికొందరీ కావ్యకర్త బెంగాలు లక్ష్మణసేనుని (1119—1199) యాస్థానకవిపంచకములోని వాడనియు ద్వైవిధ్యమైన యభిప్రాయములను వెలిబుచ్చియున్నారు. ఈ రెండవ యభిప్రాయమును ప్రమాణముగ గైకొందమన్నచో లక్ష్మణసేనుని యాస్థానమున 'కవిరాజు' నామధేయుడైన ఒకానొక యాతడు కవియై యుండినట్లు గ్రంథాధారమేదియు గన్పట్టదు. ఒకవేళ యున్నను ఆ యాస్థాన కవులైన ఉమాపతి, గోవర్ధన, శరణ, ధోయి, జయదేవులలో నీ 'కవిరాజు' నెవనినిగా స్వీకరించుట.

చరిత్ర పుటలు దిరుగవేయగా ఈ సం. రా. పాం. రచనా కాలమని పరిశోధకులు నిర్ణయించిన 8 వ శతాబ్ది, ప్రథమ పాదమునాటి సాహిత్య చరిత్రలో తొలుత పేర్కొనదగిన 'కవిరాజ మార్గ' మను నొక కావ్యము పద్యలక్షణ ప్రతిపాదకమైనది కన్నడభాషలో వెలసినట్లు తెలియుచున్నది. ఈ కావ్యమునకు కర్త ఒకటవ రాష్ట్రకూట అమోఘవర్షుడు (814—878). ఇతడును కవిజనపోషకుడైన కవిరాజే. కావున 'కవిరాజు' అనునది మన సంస్కృత కావ్యకర్తకు బిరుదమై యుండ నిజ నామ మేదియో యుండనోపునని యూహించుటకు వీలగుచున్నది. మరియు 8 వ లేక 9 వ శతాబ్దము నాటి కావ్యమునకు కర్తగా చెప్పబడిన కవి పుంగవుడు 12 వ శతాబ్ది నాటి ప్రభువుయొక్క ఆశ్రయములో నుండియుండెననుట పొసగదు. కావ్యనిర్మాణ మొనరించి 'కవిరాజ' బిరుద భూషితులైన సముద్రగుప్త, భోజ, కృష్ణరాయ, రఘునాథ నాయకాది రాజకవులును, ఆయా కాలములందలి కవులలో నగ్రగణ్యులై వెలసి 'కవిరాజు' గా పిలిపించుకొన్నవారును నైన ఈ ఇరువురితెగల 'కవిరాజులు' మన చరిత్రలో కానవచ్చుచున్నారు.

కనుక ఈ సంస్కృత రాఘవ పాండవీయ కర్తయగు చెప్పబడెడి మన 'కవిరాజు' యొక్క కాలాదులు సప్రమాణముగ తెలియజేయగలరని కోరుచు విజ్ఞులయెడ ఈ నా వినయాంజలిని సమర్పించుచున్నాను.

తిక్కన రచనాకాలము

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

1964 సం. ఆగస్టు భారతి సంచికలో శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు నన్నెచోడుని కవిత్వంమీది విమర్శకు సమాధానము వ్రాయుచు, కొన్ని యూహలు ప్రకటించినారు. వాటిలో ఒకటి, రెండు సంశయము లెత్తిచూపుట అవసరమనిపించినది. సంశయ నివృత్తి కావింప వేడుకోలు.

'ఇందులకు ప్రోద్బలముగా రావూరు శాసన. 20 క్రీ. శ. 1247—48 నాటిది అల్ల తిరుకాళదేవుని తమ్ముడు విజయా దిత్యుడని యనుచున్నది (పుటలు 1231—32). ఈ విజయా దిత్యుడే విజయగండ గోపాలుడు ఏల కారాదు ?' (పు. 34)

అట్లెన్నటికి తలంప వీలులేదని కందుకూరు తాలూకా (62) పెంట్రాల శిలాశాసనము శాసించు చున్నది.

'శ్రీ మన్మహా మండలేశ్వర ఇమ్మడిగండ గోపాళ విజయా దిత్య మహారాజులకు రాజ్యాభివృద్ధి .....'(సం. 2. పు 60)

క్రీ. శ. 1260—61 రౌద్రిలోనిది కందుకూరు తాలూకా శాసనము.

ఇక్కడ మరియొక విశేషము కలదు.

'శ్రీ మన్మహా మండలేశ్వర భుజబళ వీర మన్మసిద్దయ చోడ మహారాజులకు రాజ్యాభివృద్ధిగాను....' (సం. 2. పు. 598)

క్రీ. శ. 1259—60 సిద్ధార్థిలోనిది శాసనము. ఇవిన్నీ పై శాసనమున్న గ్రామము—పెంట్రాలలోనిదే. కందుకూరు తాలూకాలోనిదే.

సుందరపాండ్యుని చిదంబర శాసనములో పేర్కొన్న 'వీర గౌడ గోపాల విపిన దావదహన' బిరుదము '(ఇమ్మడి) గండ గోపాళ విజయాదిత్యుని' రణమరణమును సూచించుచున్నదే కాని, మనుమసిద్ధి మరణమును సూచించుట లేదుకద! మనుమసిద్ధికి గండగోపాల బిరుదున్నట్లు శాసనములో లేదు. కాబట్టి, క్రీ. శ. 1260—63 నడుమ ముత్తుకూరు యుద్ధములో చంపబడిన వీరగండ గోపాలుడు ఇమ్మడిగండ గోపాళ విజయాదిత్యు డనిపించు చున్నది. ఇతడు 'ముక్కంటి కాడ్వెట్టి వంశావతారు'డో, కరికాల చోడ వంశావతారుడో స్పష్టముగా తెలియదు.

అయినను, నెల్లూరు చోడవంశములో మొదటిగండ గోపాల తిరుకాళ్తి (తిక్క) దేవరా జున్నట్లే, ఇమ్మడి గండగోపాళ విజయాదిత్య మహారాజున్నట్లూహచేయ వీలున్నది. నిజము తెలియదు. తర్వాత, మన్మగండ గోపాళు డొకడున్నట్లు శాసనాధారము కలదు. ఇతను కాకతీయ (ఇమ్మడి) ప్రతాపరుద్రుని సామంత ప్రభువు. నెల్లూరు చోడవంశజుడు.

ఇప్పుడు మనుమసిద్ధి రాజ్య మెప్పటిదో నిర్ణయము కావలసి యున్నది. ఇది జిజ్ఞాస.

క్రీ. శ. 1284—85 తేది ఆత్మకూరు(25) తాలూకా చిరమన శాసనములో 'పర్ణవంశోద్భవ భారద్వాజ గోత్ర—కాంచీపురాధీశ్వర .... విజయగండ గోపాళ మహారాజ్యమున' మరియొక రాజ్యము స్థాపించినట్లు కలదు. (సం. 1, పు 233–36)

'ఈ విజయాత్మాధీశ్వరుడే విజయగండ గోపాలుడు. ఇంకను ప్రథమాశ్వాసమందు 'విజయమహాన మర్దను డెలమిన్' అనియు పంచమాశ్వాసమున 'విజయమహాన ద్రోహి బాహాసి కుర్విన్' అనియు తిక్కన వ్రాసియుండగా ఇంతటి ఆంధ్ర వాఙ్మయ విద్యారత్నము చదువుకొనక పోవుట ఆశ్చర్యము ! ఇందలి ప్రాయోరు తంజావూరు జిల్లాలో నుండు 'పళ్ళైయూరై' అను ప్రదేశము. నదికాదు. అచ్చట మనుమసిద్ధి విజయము గాంచెను. శత్రువును పట్టుపెట్టుటకు అంత దూరము పోవలసి వచ్చినది. అందుచేతనే 'ద్రవిడోర్వీపతి గర్వ ముండనము' వలసి కూడా వచ్చినది.' (పు. 30).

క్రీ. శ. 1284—85 తేది చిరమన శాసనములో 'విజయగండ గోపాళ రాజ్యమున' (మన్మసిద్ధి మొదలగు) రాజులు యుద్ధముచేసి జయించినట్లు కనబడుచున్నది. శ్రీ శాస్త్రిగారు పరిశోధన ప్రకారము ఇమ్మడి మనుమసిద్ధి క్రీ. శ. 1284—85 ప్రాంతము వరకు సజీవుడై యుండి తిక్కన కావ్యమును కృతి నందియుండవలెననిపించుచున్నది- సత్యమెట్టిదో తెలుప వేడుకోలు..

"గ్రుంకుగట్టు" రూప మున్నదా ?

కొండూరి వీరరాఘవాచార్యులు

బహుశ్రుతులూ, విద్యారత్న బిరుదాంచితులూ అగు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు శ్రీ బహుజనపల్లి సీతారామాచార్య విరచిత శబ్దరత్నాకరమును పరిష్కరించి ఎన్నెన్నో సవరణలు, వివరణలు వ్రాసి, అనుబంధములో ఎన్నో తత్సమ పదములను దేశ్య పదములను క్రొత్తగా చేర్చి ఆంధ్రభాషకు మహోపకారము చేసినారు. వారు అనేక రూపములలో ఆంధ్రభాషకు చేయుచున్న సేవ అమూల్యమైనట్టిది.

శబ్దరత్నాకరము అనుబంధము దేశ్య పదములలో (70 వ పుట) ఇట్లున్నది—

"గ్రుంకుగట్టు. దే. వి. పడమటికొండ. "క. శయ్యక్షంజను కైవడి రేరాజు గ్రుంకు గట్టున కరిగెన్." "వై. ళి. 1:70."

నా యనుభవములో లక్ష్య గ్రంథములయందు క్రుంకుగట్టు, క్రుంకు గుబ్బలి, క్రుంకుడుగట్టు, క్రుంకుమల మున్నగు రూపములే యగపడినవి గానీ, "గ్రుంకుగట్టు" రూప మెక్కడను బొడకట్టలేదు. ఎక్కడలేని అట్టి రూప మున్నచో, అది ద్రుత ప్రకృతికముమీద వచ్చు సరళాదేశ రూపముగాని, ప్రథమ

ుద వచ్చిన గసడదవాదేశ రూపముగాని కావలయునే కాని స్వత ుద్ధమైన రూపము కాదు. అసలు "క్రుంకు" ధాతువుగాని, 'గ్రుంకు" ధాతువు కాదుగదా !

శ్రీ వేంకటరావుగారి వంటి బహు గ్రంథద్రష్టలు ిష్కరించిన గ్రంథములో నుండుటచేత, ఒకవేళ నట్టి రూప ున్నదేమో యని సందేహము కలిగి సూర్యరాయాంధ్ర ఘంటువును జూచితిని. అందు 600 పుటలో ఇట్లున్నది—

"క్రుంకుగట్టు= క్రుంకుడుగట్టు. వి. అస్తపర్వతము, డమటికొండ.

క. ఈవిధమున నయ్యాపు వ
తీ వైభవ మొప్పు మిగుల దృష్టించుచు ని
ద్రావశత శయ్యా కుంజను
కైవడి రేరాజు గ్రుంకు గట్టున కరిగెన్.

వై. జ. 1.110.

వైజయంతీ విలాసము ప్రథమాశ్వాసములో నూట దవ పద్య మిది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో తరువాత ుయాతి చరిత్రములోని మఱొక పద్యము నుదాహరించి—

ఇట్లే క్రుంకు గుబ్బలి, మొ.


సీ. క్రుంకు గుబ్బలి అచ్చ. రా. అయో. 13
సీ. క్రుంకుమల ప్రబంధ 161.
సీ. క్రుంకుమెట్టు యయా. 2.70.
చ. క్రుంకు మెట్ట పారి. 2.32.

సీ. అస్త్రాద్రి పడమటికొండ, క్రుంకు గొండయన నగు.. ం. భా. 2.28." అని వ్రాసినారు.

వావిళ్ల నిఘంటువును చూడగా, 834 వ పుటలో ఇట్లున్నది—

"క్రుంకుగట్టు. ద్వ. వి. (క్రుంకు+గట్టు) అస్తాద్రి, పడమటికొండ" "క. ...... రేరాజు క్రుంకు గట్టున కరిగెన్.' వై. జ. 1'ఆ. 110. య. 5,ఆ. 30. (ఇట్లే క్రుంకు గుబ్బలి, క్రుంకుమల, క్రుంకు మెట్ట, క్రుంకు మెట్టు, క్రుంకు' కొం మొదలగునవి.

ఈ నిఘంటుద్వయమూ, శ్రీ వేంకటరావుగారూ ఇచ్చిన కందపద్యము వైజయంతీ విలాసములోనిదే యని తేటతెల్లముగా నున్నది. "రేరాజు+క్రుంకు గట్టునకు అన్నపుడు "రేరాజు గ్రుంకు గట్టునకు" అని గసడదవా దేశము వచ్చు నవకాశ మున్నది.వావిళ్ల నిఘంటువులో "రేరాజు క్రుంకు గట్టునకు...అని గాదేశమురాని రూపమే చూపబడినది. దీనినిబట్టి చూడగా "క్రుంకుగట్టు" అనియే కాని, "గ్రుంకుగట్టు" అని యుండ వీలులేదు కదా ! "గ్రుంకుగట్టు" రూప ముండవలయునన్న ఇంకొక ప్రయోగము చూపవలసి యుండును. శ్రీ వేంకటరావు గారు ఆంధ్రమునందే కాక, తమిళ, కన్నడ భాషలయందును కృతశ్రమములు గాన, వారిమీద విశ్వాసము పెంపున నేను ఇతర నిఘంటువులను గూడ చూడవలసి వచ్చినది. "ప్రమాదో ధీమతామపి" అన్న సూక్తినిబట్టి శ్రీ రావుగారు ప్రమాద పడినారని నాతలంపు. లేక "గ్రుంకుగట్టు" రూపము గాని, 'క్రుంకు, ధాతువునకు" "గ్రుంకు" రూపాంతరముగాని ఉన్నచో పత్రికాముఖమున ప్రకటించి నా సందేహమును దీర్ప శ్రీ వేంకట రావుగారిని ప్రార్థించుచున్నాను.



లేఖలు

ప్రౌఢ వ్యాకరణము

భారతి సంపాదకులకు,

ఆర్యా !

గత జూలై మాసపు భారతిలో శ్రీమాన్ శ్రీ భాష్యం వేంకటనరసింహ భాష్యకారాచార్య విరచిత తత్త్వబోధినీ వ్యాఖ్యా సహితముగు త్రిలింగలక్షణ శేషము అను ప్రౌఢ వ్యాకరణము శ్రీ వెంపరాల సూర్యనారాయణగారిచేత సమీక్షింపబడినది. సమీక్షాకర్తలు తత్త్వబోధినీ వ్యాఖ్యాకారులగు భాష్యకారుల సహజ సరళ వ్యాఖ్యా విధానమును వారి విద్యా పరిశ్రమమును గుర్తించి బాగుగ చర్చించియున్నారు. వారు కొన్ని సూచన లను చేయు సందర్భమున "మైత్రీ పురస్సరముగఁ దెలుపుట న్యాయమనిపించి సాహసింప నెంచితిని. ఎవ్వరును నన్నన్యథా భావింపరని యనుకొందును. భావింపవలదని ప్రార్థనము కూడను" అని నివేదించుకొనుట వారి విజ్ఞతను, వినయ సంపదను చాటుచున్నది.

ప్రౌఢ వ్యాకరణము ప్రామాణికమైన విశిష్టలక్షణ ములతో గూడిన లక్షణ గ్రంథము. అట్టి దానికి చక్కని తత్త్వబోధిని వంటి వ్యాఖ్యను గూర్చిన ఆచార్యులవారు అభి నందనీయులు. దీనిని సమగ్రముగ తలస్పర్శిగ సమీక్షించుటకు అర్హులైన పండితులను సమర్థతతో నెన్నుకొన్న భారతీ సంపాదకులకు నా హార్దిక ధన్యవాదములు.

ఇందు సమీక్షింపబడిన పలు అంశములలో దంత్య తాలవ్య చకార జకారముల ప్రసక్తి ఒకటి. (చూ. భారతి. పు. 9. పేరా 3.) దానికి సంబంధించిన నా అభిప్రాయమును లేఖామాలమున ప్రకటింప ప్రార్థన.

ఇకారాంతములగు తత్సమ పదముల యందలి ఉపధా చజలు బహువచనము పరమగునపుడు దంత్యములగును. ఉదా :—రోచి—రోచులు, వాజి—వాజులు. మొ. (చూ. బాలవ్యా. సంజ్ఞా. సూ. 10.)

అనగా పై చకార జకారములు ఏకవచనమున తాలవ్య ములుగను, బహువచనమున దంత్యములుగను అగుచున్నవి. వచనమాత్ర భేదముచేత దంత్య తాలవ్యముల వ్యత్యాసము ఇందు గుర్తింపదగిన సంగతి. దీనికి పూరణముగ ప్రౌఢ వ్యాకర్త ఒక్క జకారము మాత్రము శ్లేషలో ఒక అర్థమున తాలవ్యమును మరొక అర్థమున దంత్యమును అగునని —ఘన పాండవీయమందలి "అకట ! పాండురాజ యశ మెన్న వైతి" అను లక్ష్యమును చూపియున్నాడు. (చూ. ప్రౌఢ వ్యా. సంజ్ఞా. సూ. 5.)

ఈ సందర్భమున తత్త్వబోధినీ వ్యాఖ్యాతలు 'ఒక్క జకారమే కాక చకారము గూడ శ్లేషాదులం దిట్లు ఉభయము నగుట విధింపవలసి యున్నది. అట్లు విధింపకపోవుట లోపమే యనదగును" అని సెలవిచ్చియున్నారు. ఇక సమీక్షా కర్తలు "జకారము నుభయ మనుటకే యొక్క లాఘుక ప్రయోగమే యుండుటయు నది వివాదగ్రస్తమగుటయు దెలిసిన తత్త్వ బోధిని చకారమునకు నిట్లే యుభయధర్మము లుండుట కవకాశము కల్పించుటకే కవి ప్రయోగమును జూపకయే నిరాధారముగా నిర్ణయించుట యాశ్చర్యముగా నున్నది." అని వ్రాసియున్నారు. అనగా జకారమునకు వలె చకారము నకును ఉభయధర్మములు (దంత్య తాలవ్యములు) ఉండునట్టి ప్రయోగము ప్రౌఢ వ్యాకర్త కాలమునుండియు గవేషణీయ మనుట స్పష్టము. అట్టి ఒక్క కవి ప్రయోగము నూల మున ఈ సమస్య పరిహరింపబడునని తోచి నివేదించుకొను చున్నాను.

ఇంటిపేరు ననయ్యైనను కవిత్వము వస అని వాసి కెక్కిన చేకూర వేంకటకవి రచితముగు విజయవిలాసము కావ్యమందు అర్జునుని జూచి ఉలూచి రసోచితముగ ప్రసం గించు సందర్భములోనిది.

ఉ. నాయమె నీకు వేల్పడిన నాతి నలంచుట ! యంత్ర
నుత్సవమున్
మాయుఁగఁజేసి మున్ ద్రుపదనందన నేలవె !
యుంగ భూపతా
కాయత యంత్రమత్స్య మిపు డల్లనఁ ద్రెళ్లఁగసేసి
యేయకో
తీయుగఁ బంచదార వెనుతీయుఁగఁ బల్కు ననున్
ద్వితీయగన్. (విజయ. ఆ 1, ప. 156)

ఇందు నాల్గవ పాదమందలి శబ్దాలంకార ప్రవాహములో పంచదార పడి కరగిపోయి యున్నది. కవి ఈ పంచదార శబ్ద మును శ్లేషలో వాడియున్నాడు.

ఉలూచి అర్జునునితో తీయగ పంచదార వెనుతీయగ పలికి నన్ను ద్వితీయగ నేలుకొనుమని వేడుకొనుచున్నది. పంచ దార అను పదమునకు చక్కెర అనియు ద్రౌపది అనియు రెండర్థములు. చక్కెరను మించిన తియ్యని మాటలాడి నన్ను వివాహముకమ్ము అని మొదటి అర్థము. పంచానాం దార

పంచదారః. అనగా అయిదుగురికి భార్య అగు ద్రౌపదిని మించు వన్ను చెట్టపట్టుము అని మరొక అర్థము. కావున పంచదారః శబ్దమందలి చకారము చక్కెర అను అర్థమున శబ్దము దేశ్యము కాన దంత్యము అనియు, ద్రౌపది అను అర్థమున శబ్దము తత్సమము కాన తాలవ్యము అనియు తెలియ వలయును.

సారాంశము :—బాలవ్యాకర్త చ జ ల దంత్య తాలవ్యతల విపరీతాంశములను వచన వ్యత్యయములందు తెల్పెను. ప్రౌఢ వ్యాకర్త ఇం దేకదేశము జకార మొక్కటియు ఒక అర్థమున తాలవ్యమును మరొక అర్థమున దంత్యమును అగుటను రాఘవ పాండవీయ ప్రయోగమును జూపి వివరించెను. కాని, చకారమునకును విధింపకపోవుట లోపము ప్రౌఢవ్యాకర్తయెడ నున్నదనియు శ్లేషకావ్యమునం దిట్లు ఉభయ విధముగా కాన వచ్చుటకు అవకాశము కలదని తత్త్వబోధినీకారులు వ్రాసిరి. చకారమునకు ఇట్లుభయ ధర్మములు గల కవి ప్రయోగమును వ్యాఖ్యాతలు చూపకపోయిరని సమీక్షాకర్తలు తెల్పిరి. ఈ విజయ విలాస ప్రయోగముచే ఈ చర్చకు ఒక అంతు దొరుకుటయే కాక ప్రౌఢవ్యాకరణమునందలి సూత్రమును ''ఒకానొకచో చకార జకారంబు లుభయంబును నగు'' నను రీతిగ సవరింప వలసిన స్థితి యేర్పడినదని నునవి.

(మద్రాసు) తీర్థం శ్రీధరమూర్తి.

తార ప్రయోగము

భారతి సంపాదకులకు,

ఆర్యా,

సూర్యరాయాంధ్ర నిఘంటువునో పేర్కొనని 'తార' ప్రయోగ విశేషము చిక్కినది.

'.... నిజతంత్ర శక్తి వలన నా తారకుం దగిన సూత్రం బులం బన్నియు .....' (రంగరా. 1—107)

పై కస్తూరి రంగకవి ప్రయోగములో తెనుగు నిఘంటు వులలో లేని విశేషార్థమున్నట్లు కనబడుచున్నది.

నా నన్నిచోడకవి చరిత్రలో 'తారకవితను' 'ఎత్తు జిత్తులం గనింపెనగు యుక్తి' కవితయన వీలున్నది. తెనుగులో లేకపోయినను, ఇట్టి నిఘంటు ప్రమాణము హిందీ భాషలో కలదు' అంటిని.

'సబై తారకో తార్=ఉపాయము, యుక్తి.'

యంత్ర మంత్ర వేద తంత్రాదు లన్నిటిలో యుక్తి వాదమే కలదు కాని, భక్తిభావము లేదని హిందీ కవి తాత్పర్యము. ఇట్టి విశిష్టార్థము తెనుగులో కూడ కలదనుటకు పై ప్రయోగము తావిచ్చుచున్నది.

'ఆ తారకుం సూత్రంబు (లం) బన్ని=ఆ యెత్తునకు పై యెత్తు పన్ని, ఆ యుక్తికి పై జిత్తులు పన్ని.'

ఇది యుద్ధ సంబంధమైన ఘట్టములోనిది. కావున ఆ వ్యూహమునకు ప్రతివ్యూహములం బన్నియు అనికూడ చెప్ప వీలున్నది.

'యుక్తివాదములచే—నొప్పారు తార్కికు(ల్).'
(బిల్హ. 1—76)

* * *

'అన్యతార కవితతుల—నాదరించి.' (కుమా. 1—34)
'తారకవి రచిత కృతియును
దారకవి రచిత సుకృతియుఁ దా నడఁగు.'
(కుమా. 10—153)

ఇవి 'తారక—తార్కిక' యుక్తివాదములను సూచించు చున్నవి.

'. .. రామభక్తి గని .
తార్కికు లెల్లను
వీని దొరచిత్తమన.' (వైజ. 1—2)

ఇది 'తార్కిక—భక్తి' వాదము కాబోలు.' 'తారకంబుఁ జూచుదారి' భక్తియోగములో కలదు.

మొత్తముమీద 'తార' శబ్దార్థము నిఘంటువులలో ప్రయోగసహితముగ నిర్ణయము కాలేదనిపించుచున్నది.

యుక్తికవి రచించిన కృతియు, భక్తికవి రచించిన సుకృతియు తమలో తా మణగి—మణగియుండునని 'అన్యతార కవి—తుల్యతార కవి' సూచన శ్లేష.

దీనికి తార్కాణగా కుమారసంభవ భక్తి కథలో కథేతర యుక్తి కాలము గల చంపకమాలా వృత్తము కలదు. జంపెరగడ యుక్తి కాలమును వ్యంజకముచేయగా, వృత్తము కుమారవిజయ కథను వర్ణించుచున్నది. అయినను, యుక్తికవి దీనిని రగడ గర్భిత చంపకమని పేరు పెట్టక, 'చం' పేరు మాత్రమే పెట్టి వంచన—ఎత్తు—జిత్తు—కవకాశమిచ్చి 'నిజమ్మెఱిఁగి' గుర్తింపు డని హెచ్చరిక చేసినట్లు గణిత సమన్వయకాలము తార్కాణించు చున్నది.

చోడకవి శిలాశాసన పురుషాంతర కాల మీ గ్రంథ రగడ కాలముతో సమకాల మగుచున్నది. పురుషాంతరమునకు 25 సంవత్సరములకు బదులు 30 సంవత్సరముల లెక్కను లెక్కించుటకంటె భేదములేదు.

క్రీ. శ. 1087–88 తేదీనాటి నన్నూరుపాడు శిలా శాసనములో నన్నిచోడుని వంశము లేఖక ప్రమాదముచేత మారి పోయినది. శిలాశాసనములలో ఇట్టి దోషములు కలవనుటకు మా వంశవృక్షమును ధూర్చి చెక్కిన శాసన సాక్ష్యము సూ దేవా లయ శిలమీద కూడ కలదు. కాబట్టి, క్రీ. శ. 1087–88 తేదీ శాసనకర్త మనుమని కంటె తాత 'నన్నిచోడు'డు పూర్వు డనుట నిశ్చయము. తారకవి క్రీ. శ. 1054 తేదీ రగడకాలమీ నన్నూరుపాడు పాకనాటి హెూంకారదేవి దానకాలమును బలపరచు చున్నది. అంతేకాదు. పెద్ద చెరుకూరు శాసనమందలి కందు కూరుపాకనాటి చోడవంశ పురుషాంతర కాలమును కూడ సమ న్వయము చేయగలిగి యున్నది.

ఇంతకు 'తార కవి తతి' సంకేతము బోధపడిన కాని, అనుమానగ్రస్తుల సందేహములు నివారణ కావు.

ఎట్లయినను 'తార' శబ్దార్థము పండితులు నిర్ణయించుటకీ ప్రయోగములు చూపబడినవి.

(ఊలవపాడు) డి. వి. కృష్ణారెడ్డి.

యతికి గతిలేక యేమి ?

ఆర్యా,

శ్రీ కనిగిరి కోమండూరి రామానుజాచార్యులు 1964 ఆగష్టు నెల భారతిలో 'యతికి గతియేమి'— అను శీర్షిక క్రింద రామరాజభూషణుని వసుచరిత్ర ప్రథమాశ్వాసము నందలి 110వ పద్యమును వ్రాసి అందు మూడవ పాదమున యతి భంగమైనదనియు "పండితులు విమర్శకులు నది దోషము కాదని తలచిరో' కవికృత దోషము మనకేలయని మానిరో ! తెలియదు. దోషరహితమగు పక్షమున దాని లక్షణమును పండితులు సప్రమాణముగఁ దెలియజేయవలెననియు వ్రాసియున్నారు. నాకుఁ దోచిన సమాధానమును వ్రాయుచున్నాడను.

1926 సం.లో వావిళ్లవారిచేఁ బ్రచురింపబడిన వసుచరిత్ర గ్రంథములో ఆచార్యులు నుడివిన రీతిగనే యున్నది

మ. అమరుం దత్పురిచెంతఁ గాంత కనకాబ్జాలంబ రోలంబ బహు
క్తిమలీ వాహిని సారసారణులు తత్కేదార కోదారస
స్యము ముక్కారును బండఁ జేయ దివి వారల్వీటి
సత్రాన్నభా
గములాసింపగఁ దత్పురాలయనదీ ఖ్యాతిన్ విడంబించుచున్'

పై పద్యమున మూడవ పాదముయొక్క ఆద్యక్షరము 'స్య' యతి స్థానముగల అక్షరము 'ర' కావున, నా రెండక్షరములకు యతి మైత్రి లేనందున 'యతి భంగము' కలిగిన దనుకొనుటకు వీలున్నది. కాని రామరాజభూషణుడు యతి భంగము చేయునా? ప్రమాదవశముననైన చేయునా? 'జగత్ప్రాణనందన కారుణ్య కటాక్ష లబ్ధకవితాధారా సుధా రాశి, సంజ నిత్యైకైక దిన ప్రబంధ ఘటికా సద్యశ్శత గ్రంథకల్పనుడు' గదా రామరాజభూషణుడు. అట్టివాడు, యతి భంగముచేసియున్నాడనుట కెంతమాత్రమవకాశము లేదు. కావున కవికృత దోషము కానేకాదు.

ఇక, ముద్రాపకుల దోషమేయని చెప్పవలసియున్నది. ఇందుల కనేక ఆధారములు కలవు.

"స్యము ముక్కారును బండఁ జేయ దివి వారవ్వీటి సత్రాన్నభా" అని తాళపత్ర గ్రంథమునసుండియుండును. ఇట్లుండి యుండిన పక్షమున యతి సరిపోయినదని చెప్పుటకు సంశయములేదుకదా ! గణ భంగమును కలుగలేదుకదా !

పై పాదమునందలి 'వ్వీ' అను నక్షరమును 'ల్వీ' అని భ్రాంతిపడి ముద్రాపకులు ముద్రించియుందురు. 'దివి వారు అవ్వీటి' అని యున్నప్పుడు సంధిచేయగా వచ్చిన పర స్వరమగు అకారమునకు పాదాదియందున్న 'స్య' అను సంయుక్తాక్షరములోని 'య'కారమునకు యతి చెల్లినదనుట యెంతేని యుక్తముగదా ! కావున నిది ముద్రణా దోషమని చెప్పుట కెంతమాత్రము సంశయములేదు. పండిత లోకమీ దోషమును గమనించియుండక పోవచ్చును. గమనించి యున్నను నే పైన వ్రాసినట్లు భావించి యుండవచ్చును. అంతియేకాని పండితులు విమర్శకులు 'రల్' అని యుండినను దోషము లేదని తలంచినారని చెప్పుటకు వీలులేదు.

పై దోషము ముద్రాపకుల దనుటకు 'ఆంధ్ర మహా భారతమునందు, 1952లో శ్రీ. బులుసు వేంకటరమణయ్య గారిచేఁ బరిష్కరింపబడిన 'పాండురంగ మహాత్మ్యము'నందును గల ముద్రణా దోషములును ఆధారములు కాగలవు.

ఆంధ్ర మహా భారతమున ఆదిపర్వములోని సప్తమాశ్వాసమునందలి 201వ పద్యము.

కం. నీవ ప్రాకృతబలుడవు,
నీ విక్రమమునకు విల్లు నేర్పునకు మహా
దేవ కులోత్తమ మెచ్చితి
నావుడు బార్థుండు గర్ణునకు నిట్లనియెన్.

ఈ పద్యమున 'మహీ దేవకులోత్తమ' అనియుండుటకు బదులు 'మహా దేవకులోత్తమ' అనియున్నది. ఇది ముద్రాపకుల దోషమేకదా !

పాండురంగ మాహాత్మ్యమున

శా. దిగ్వాసుండురుపింఛలాంఛిత శిఖో దీర్ణుండు వర్షాపయో
ముగ్వర్ణుండు నవాంబు జాహితలతా ముక్తాంగదుండున్ సుధా
రిగ్విస్మేరముఖుండనంగశత జిద్రూపాధి కుండ గ్రభూ
వాగ్వర్గోద్వహ భూమి శ్రీవిభుడు శ్రీవత్సాంక వక్షుండునై. ద్వి.ఆ. 47.ప.

ఏ తత్పద్య చతుర్ధ పాదమునందు పూర్వ ముద్రణలలో 'వాగ్గర్వోద్వహ' అని కలదు. ఇది యెవ్వరి దోషము ! ముద్రాపకులదే కదా ! ఇట్టి వెన్నేనియుఁ గలవు. వసుచరిత్రమున గూడనంతే. ఒకచో యతి భంగమైన వేరొకచో ప్రాస భంగము.

"యతికి గతి యేమి' అని లేఖకులడుగుటకు బదులు యతిచ్యుతిని సవరించి లేఖను ప్రకటించియుండిన బాగుగ నుండెడిది.

(ఆదోని) జె. దక్షిణామూర్తి

శ్రీ మాడభూషి వెంకటాచార్యులు

శ్రీ పైడిమర్రి వెంకట సత్యనారాయణమూర్తి

ఒక జాతిగాని ఒక దేశంగాని గొప్పదవటానికి దాని సాహిత్యమే ఆధారం. ఆద్యంతాలు లేని యీ కాలచక్రంలో ఎందరెందరో మేధావులు భావితరాలవారికి మార్గదర్శకమైన మహత్తర సాహిత్య ప్రక్రియల నెన్నింటినో సృష్టించి, ఈ జగన్నాటకరంగాన్ని దేదీప్యమానంచేసే సానలుతీరిన సాహితీ రత్నాలతో అలంకరించి, ఆ కాంతి పుంజాలలో తమ విజ్ఞాన తేజస్సును విలీనం చేశారు. అటువంటి లోకకల్యాణ మూర్తులలో సాహితీ స్రష్టలలో .... శ్రీ మాడభూషి వేంకటాచార్యులొకరు.

ఈ మహనీయుడి ఐహికయాత్ర 1835 లో ఆరంభమై అరవైయేళ్లపాటు సాగింది. ఈయన విద్వత్‌శిఖామణి శ్రీ నరసింహాచార్యుల తనయుడు. కృష్ణా మండలంలో నూజివీడు సంస్థానాధిపతుల ప్రాపు సంపాదించి, అసాధారణ ప్రతిభాశాలియై ఏకసంథాగ్రాహిగా, ఆశుకవితాష్టావధాన శతావధాన ధౌరేయుడుగా అభినవ పండితరాయలుగా ప్రసిద్ధి వహించాడు. అంతేకాదు—ఈయన తర్క వ్యాకరణ మీమాంసా జ్యోతిష శాస్త్ర కూలంకష మనీషా విశేషుడు, ప్రాకృత వైకృత శౌరసేనీ మాగధీ పైశాచీ ప్రముఖ భాషా వ్యాకరణ పరిజ్ఞాన చణుడు, ఆంధ్ర గీర్వాణోభయభాషా ప్రబంధరచనా విచక్షణుడు' సమధిక సంగీత సాహిత్య సర్వస్వుడు, శతలేఖినీ పద్య సంధాన ధురంధరుడు, అష్ట ముఖాష్ట భాషా వ్యస్తాక్షరీ విద్యానవద్యుడు, ఏకకాల ప్రదర్శితాష్టవిధాష్టావధాన ప్రకారుడు, పఠన మాత్ర పరిగృహీత అనులోమ ప్రతిలోమాది బహు విచిత్ర ప్రకార పఠిత ఆంధ్ర గీర్వాణ వృత్త ప్రబంధుడుగా' సంస్తవనీయుడైనాడు. 16 వ శతాబ్దంలో భట్టుమూర్తి శతలేఖినీ పద్య సంధాన ధౌరేయుడుగా ప్రశంసింపబడినాడు. ఆయన తర్వాత ఈ మహాకవి గంటకు నూరు పద్యములు చెప్పిన సమర్థుడని పలువురు సమకాలికుల ప్రశంస లందుకున్నాడు.

ఏ యార్య పండితరాయాభిదానం బ
　　భినవ పూర్వంబయి యొనరు నెవని
ఏ వైష్ణవమణి యష్టావధానాదిక
　　విద్యలచే జాల వెలుగు సభల
ఏ కవిశేఖరుండా కల్పముగను వి
　　ద్వాన్ బిరుదంబు దాఁదగ గడించె
ఏ పండితోత్తము డేపున శతలేఖి
　　నీ పద్య సంధాన నిపుణతగనె

. . . .

. . . అట్టి శ్రీ మాడభూషి వంశాబ్ధి విధుడు
వేంకటాచార్య వర్యుడు . . . . .

అని అనంతాచార్యులుగారు పేర్కొన్నారు.

తా నంతకుముం దెన్నడూ చదవని, వినని పద్యాలనుగాని, గీతాలనుగాని ఏ భాషలోనైనా సరే యితరు లెవరు చదివినా తాను వింటే చాలు వెంటనే అప్పజెప్పగల ఏకసంథాగ్రాహిత్వము ఈయనకు జన్మతః వచ్చిన ప్రజ్ఞ. ఈయన జీవితకాలంలోని కొన్ని సంఘటనలు ఏతత్ప్రతిభా నిదర్శకంగా ఉన్నాయి.

ఈయన పసప్రాకం అనంతాచార్యులుగారి యింట్లో ఉండగా ఒకనాడు ఒక విద్వాంసుడు వచ్చి తాను వ్రాసినవని కొన్ని శ్లోకాలు చదివి అర్థ స్వారస్యం వివరిస్తూ ఉండగా ప్రక్కనే వింటూఉన్న వేంకటాచార్యులుగారు పది శ్లోకాల తర్వాత— ఆ శ్లోకాలు తాను చిన్నప్పుడు తన తండ్రివల్ల విన్నవేననీ— పూర్వకవి యెవడో వ్రాసిన శ్లోకాలు అనంతాచార్యుడు ఎరుగడు

గ్దా అని ఆక్మీయముగా చదవటం ఏం ధర్మమనీ బెదిరించే సరికి, ఆ పండితుడు రోషంతో "నీకు ఆ శ్లోకాలు వస్తే చదువు చూద్దాం. రచయితనైన నన్నే ఇలా ప్రతిఘటిస్తావేం ? నువెవ్వరయ్యా ?" అని నిర్లక్ష్యంగా మాట్లాడగానే వేంకటాచార్యులుగారు ఆ శ్లోకాలన్నీ ఏకసంథాగ్రహణంవల్ల అప్ప జెప్పారట. అప్పుడా పండితుడు అనూనపడి క్షమాపణ వేడు కొన్నాడట. ఈ సంగతి అనంతాచార్యులే తమకు స్వయంగా చెప్పినట్లు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసినారు.

అలాగే నూజివీడు జమీందార్లకు సంబంధించిన ఒక దావాలో ఈయన సాక్ష్యం చెబుతూ న్యాయాధికారితో తాను విన్నది విన్నట్లు చెబుతానని చాలా పెద్ద వాఙ్మూలం ఇచ్చేసరికి ఆ న్యాయాధిపతి "ఇన్ని సంగతులు జ్ఞాపకం ఉండటం అసంభవం. ఇది నేను నమ్మలే" నని అనగా శ్రీ ఆచార్యులుగారు ఆయనకు నమ్మిక కలిగేందుకు తన వాఙ్మూలం యావత్తూ మరల ఏమీ పొల్లపోకుండా చెప్పిరట. అలాగే ప్రతిపక్షంవారి న్యాయవాదులు నెలరోజులు జరిగిన ఆ విచారణలో తనను అడిగిన ప్రశ్నలే మరల అడుగుతూ Cross examine చేస్తూఉంటే (అడ్డు ప్రశ్నలు వేస్తూఉంటే) ఈయనకు కోపం వచ్చి వారు ఆయా ప్రశ్నలు ఎప్పుడెప్పుడు అడిగారో వాటికి లోగడ తాను ఏ సమాధానం ఇచ్చాడో సాకల్యంగా అప్పజెప్పగా అందరూ విస్తుపోయారనీ, ఈయన సాక్ష్యంవల్ల న్యాయం జరిగిందనీ ప్రతీతి. ప్రముఖ పండితులు సభచేసి, ప్రభుత్వ పక్షాన ఈయనకు బహుమతి పతకం ఇచ్చారని దీవి నరసింహాచార్యులుగారు తమ 'కవి ప్రశంస' లో పేర్కొన్నారు. ఇంతటి ధారణాశక్తి కలవాడు గనుకనే ఈయన అష్టావధాన శతావధానాలు అవలీలగా చేయగలిగాడు. తర్వాతి కాలంలో ఈ అవధాన పీఠ మధిష్ఠించిన శ్రీ తిరుపతి, వేంకటకవుల ప్రశంసలు అందుకున్నాడు. ఇంతేగాక ఈయన శబ్దగ్రహణ సామర్థ్యం కూడా కలవాడు. ఒక గదిలో వంద పాత్రలు పెట్టి గది బయటకు ఈయనకు వినబడేటట్లు ఒక సాధనంతో వాటిమీద వర్సగా ఒకసారి కొట్టి, తర్వాత ఏ పాత్రమీద దెబ్బకొట్టినా ఆ పాత్రకు క్రమసంఖ్యను చెప్పేవాడట. పురాణపురుషుడు దశరథ మహారాజు, చరిత్రప్రసిద్ధుడు పృథ్వీరాజు నేర్చిన శబ్దవేధి విద్యకు ఇది సాటి రాగలదేమో.

ఇక శ్రీ వేంకటాచార్యులవారి అవధాన విశేషాలు కొన్ని పరిశీలిద్దాం. నూజివీడు సంస్థానానికి చెందిన ఆగిరిపల్లిలో 1872 ఫిబ్రవరి 21 వ తేదీన అప్పటి సంస్థానాధిపతులు శ్రీ రాజా నారయ్యప్పారావు బహద్దరువారు ఒక విద్వన్మహాసభను ఏర్పాటుచేశారు. ఆ సభకు పిఠాపురం రాజా శ్రీ రావు వేంకట మహీపతి గంగాధర రామారావు బహద్దరు, నరసరావుపేట జమీందారు శ్రీ రాజా మల్రాజు కొండలరావు బహద్దరు మొదలగు ప్రముఖ సాహితీప్రియులు ఎందరో వచ్చారు. శ్రీ వేంకటాచార్యుల ప్రతిభను గూర్చి విన్న పిఠాపురం రాజావారు ఈయనకు గల శతలేఖినీ పద్య సంధాన సామర్థ్యాన్ని పరీక్షించారట. ఆనాడు శ్రీ వేంకటాచార్యులుగారు పృచ్ఛకుల కోరికల ననుసరించి ఆశువుగా చెప్పిన శ్లోకాలు, పద్యాలు ఎంతో మనోహరంగా ఉన్నాయి. వాటిలో కొన్ని :

సరస్వతీ వర్ణన :

శాలినీ వృత్తం : వందే వాణీం వల్లకీ యుక్త పాణిమ్
సూరి వ్రాత ప్రస్తుత స్వోద్గుణాళీం
సారోదార స్ఫూర్తి విక్రాంతి యుక్తిం
సంధ్యా స్వాదీం పర్ణ్య చారిత్రయుక్తాం.

ఆగిరిపల్లిలోని శోభనాచలస్వామిని గూర్చి :

మందాక్రాంత వృత్తం :

శ్రీమత్యద్రౌ శుభమణిఖనౌ శోభనాఖ్యాన కేస్మిన్
లక్ష్మ్యా సంధ్యా లలితవపుషా లోక గుప్త్యై వసంతమ్
సారం తత్త్వం సదుపనిషదాం శ్రీ నృసింహాఖ్య మీ శం
భక్త్యా నిత్యం పరమ మమృతం శ్రీ నృసింహం నమామి

వీరాంజనేయ వర్ణన :

మాలినీ వృత్తం :

సకల దివిజలోక స్ఫాలనో దగ్రమూర్తిన్
ప్రకట సమర శౌర్య ప్రాభవోద్భా సహాసున్
సుకర గుణ కలాపున్ శుద్ధ విజ్ఞాన దీపున్
వికట రిపు హరున్ సేవింతు వీరాంజనేయున్.

రాజా రంగయ్యప్పారావు బహద్దరు వారిని గూర్చి :

కవిరాజ విరాజితము :

వితత నిజోజ్జ్వల దక్షిణ సద్భుజ
పీఠసమాస్థిత భూ రమణీ
ప్రతత జయానక భాంకృతి భేదిత
వైరి వరగ్రహ గోళఘృణీ
ప్రతి మహిపాల సభా కవిరాజ వి
రాజిత భవ్యగుణా భరణీ
రతిపతి రమ్య శరీర.విశోభిత
రంగ మహీప నృపాలమణీ.

ఈరీతిగా సాగిపోయింది ఆనాటి ఆశుకవితా ప్రదర్శనం. ఆశుకవిత, అవధానాలలోను, కావ్యాలలోను ఈయన వాడుకలో విరివిగా లేని వృత్తాలను వాడేవాడు. ఎన్నో కృతులు, కీర్తనల్ని

శ్రీ మాడభూషి వేంకటాచార్యులు

కూడా ఈయన అవధానాలలో ఉండేవి. వీటికి తోడు ఆచార్యుల వారికి గల సంగీత శాస్త్ర పరిజ్ఞానం, గాన మాధుర్యం ఆయా కవితా ప్రదర్శనాలను రక్తి కట్టించినవట.

మరునాడు అక్కడే అష్టభాషా వ్యస్తాక్షరితో కూడిన అవధాన విద్యను ఈయన విజయవంతంగా ప్రదర్శించారు. పిఠాపురం రాజా శ్రీ గంగాధర రామారావుగారు సకలకళా శాస్త్ర వేత్త అయిన జగన్నాథ పండితరాయలకు గల ధారణాశక్తి ఈయనకు కలదని ప్రశంసిస్తూ ఈయనకు **'అభినవ పండిత రాయ'** బిరుదు నొసంగి ఆదరించిరట. ఈయన 1879 లో పిఠాపురంలో కూడా అవధానం చేసిరి. ఈ రీతిగా ఎన్నో ఆస్థానాలలో తన కవితా సామర్థ్యాన్ని వెల్లడిస్తూ ఎన్నో సన్మానములనందినా రీయన. నూజివీడులో తిరుమల బుక్కపట్నం రాఘవాచార్యులు, పిఠాపురాస్థాన పండితులు దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రులవారు, దమ్మన శాస్త్రులవారు ఈ అభినవ పండితరాయల ఎదుట అవధానాలు చేసి మెప్పు పొందారు. ఈ తీరున అవధాన విద్య ఆంధ్రదేశంలో వ్యాప్తి చెందటానికి కృషిచేసిన మహనీయు లీయన. తర్వాత తిరుపతి వేంకటకవుల కాలంలో ఇది మరింత పరిపుష్టమై, మహత్తర ప్రతిభా సమన్వితమై అలరారింది.

ఈయన ప్రబంధకర్తగా కూడ ప్రసిద్ధి చెందినారు. భరతాభ్యుదయం ఈయన రచించిన ప్రౌఢ ప్రబంధం. పుష్పబాణ విలాసం, హంస సందేశం—మరి రెండు ఖండకావ్యాలు. వీటిలో హంస సందేశం వేదాంత దేశిక విరచిత సంస్కృత కావ్యానికి అనువాదం.

భారతంలోని శకుంతలోపాఖ్యాన కథావస్తువే భారతాభ్యుదయానికి మూలం. ఇది శృంగార ప్రబంధం. పూర్వ ప్రబంధ రచనాశిల్పానికి మెలుగులు పెట్టిన రచనా ప్రక్రియ ఇందులో గోచరిస్తుంది. కల్పనలు కూడా నూత్న తేజస్సుతో అలరారుతూ ఉంటాయి.

దుష్యంతుడి సభాస్థలికి నారదుడు వస్తాడు. దుష్యంతుడు అతిథి మర్యాదలు జరిపించి, ఆ మహర్షి ఏయే ప్రాంతాలు పర్యటించి వచ్చెనో తెలుపమని వేడుకుంటాడు. అప్పుడు కవి ఆంధ్రదేశస్థ పుణ్యక్షేత్రాలను నారదుడు సందర్శించినట్లుగా వర్ణించి తనకు గల స్వరాష్ట్రాభిమానాన్ని వ్యక్తంచేశాడు.

శాలినీ వృత్తం : దర్శం దర్శం మంగళాద్రిం శుభాద్రిం
శ్రీ భద్రాద్రిం సింహశైలం క్రమేణ
తత్ర ద్భూభృత్సం స్థితార్చాశ్చ విష్ణో
రానందాబ్ధౌ మగ్న వానస్మి భూయః.

తెలుగు ప్రబంధంలో సంస్కృత శ్లోకాలు పొప్పించటం ఇందులో గల విశిష్టత.

హరి గతి రగడలో చేసిన వసంతబుతు వర్ణన మను చరిత్రను తలపిస్తుంది.

అంత వసంతము కాంతారాంతములం దొగి నంతట
నెంతయు మించెను
సంతసమొందగ కలకంఠంబులు సహకార కదంబ
మిగిరించెను
వింతగ వింతగ వనభూరుహముల విరివిగ సిరిబంతుల్మ
పుష్పించెను
చెంతల నించులు లేని విరహిరతి చింతల వంతల చివికి
కృశించెను.
తేటుల దాటులు నీటులు మీరగ తేట ప్రసూన
రసంబుల నానెను
పూటకి పూటకి విరహుల నేయగ మారుడు పువ్వుల
ములుకుల బూనెను
రాగము లొప్పగ సుద్గాతలు కడు రమ్యంబుగ సామం
బుల గుప్పిరి
ఆగక హోతలు యేయజామహే యనుచును యా
జుష బుక్కుల జెప్పిరి.
మదన రతిశ్రమ భవ వఘర్మకముల మలయానిల
తస్కరుడు హరించెను
అది యెఱింగి ఫణి కశనంబగునటు లతనికిం జైత్రిక
నృపతి విధించెను.

—శ్రవణానందకరమైన ఇట్టి శబ్దగుంఫన ఈయన రచనలకు వన్నె తెచ్చింది.

కణ్వాశ్రమంలో భరతుడికి విప్రాంగనలచేత జోల పాడించాడీ కవి. ఆ జోలపాటకు శకుంతలోపాఖ్యానమే యుతివృత్తమవటం ఎంతో మురిపెంగా ఉంది.

జోజో నృపకుమార జోజో సుకుమార
జో జయంత వసంత సుందరాకార .... జోజో
పట్టుమునా కౌశికుడు బ్రహ్మర్షికాగ
జింతించి దృఢతపము సేయుంగ సాగ
నంత దానికి విఘ్న మమరించి రాగ
నింతి మేనక నంపె నింద్రుండు వేగ.
మలయానిల వసంత మన్మథులతోడ
జెలియ విహరించె గౌశికు దుండునాడ

అల మునియు జూచి కామార్తిచే వేడ
నలివేణి గనజాలచె ననుమతిని కూడ—

—ఇలా కథ మొదలుపెట్టి . . . . . .

. . . .
కంతు నిందిర వెలెను కనియె సుఖలీల
సంతోషమున నిన్ను నవరించి డోల
బంతి తీరిచి మేము పాడితిమి జోల—అని పాట

ముగించారు. ఇలాగే ఒక్కొక్క సన్నివేశంలో ఒక్కొక్క నూత్న కల్పనా నైపుణ్యాన్ని ప్రదర్శించాడీ కవి. దుష్యంతుడిచే తిరస్కరింపబడిన శకుంతల ఆ నిండు సభలో సనాథయయ్యు అనాథయై హరిసంకీర్తన చేసిన సందర్భంలోని దండకం పారాయణ యోగ్యంగా ఉంది.

గద్య రచనలో కూడా ఈయన సిద్ధహస్తుడనటానికి దుష్యంతుని గూర్చిన వర్ణన మనకు ప్రత్యక్ష ప్రమాణం.

"చండ కరాఖండల ఖండపరశు చిత్రప్రద దోర్దండ సముద్దండ పరాక్రమాక్రాంత సమస్త శాత్రవ చక్రప్రదత్త మత్తకరి నృత్తకరీ తుంగ తురంగ మాతంగ శతాంగా ద్యుపాయన పరిపూర్ణ ప్రఘాణ కరాళుండును, తారాచల తారాధిప తారామల హీరాయత హారాయుత సీరాయుధమారాయుధ నారదముని పారద హరిశారద సితనీరద నవశార కుసుమవార సునాసీరవనీ సౌరధునీ క్షీరధి నీహార మహోవార తిరస్కారి మహోదార రుచిస్ఫార యశస్సుధాలిప్త భూనభోంతరాళుండును, దైనందిన దాన ధారా ప్రక్షాళిత సకల సుకవి జన దుర్దమ దారిద్ర్య కర్దమజాలుండును, విమలతర నిజ విజ్ఞాన సాక్షాత్కృత దేవదేవ ప్రసాదాసాదిత నిఖిల కల్యాణ విశాలుండును—అగు దుష్యంత మహీపాలుండు..."

ఈ వర్ణన ఎంత హృద్యంగా ఉన్నది !

మదనమోహన చరిత్ర అనే వచన గ్రంథం, వాసున నాటకం, అశ్వఘోషుడి చరిత్ర ఇతివృత్తంగాగల 'ప్రభా నాటకం', బృహద్వైద్య రత్నాకరం అనే వైద్య గ్రంథం—ఈయన ఇతర రచనలు. రామావధూటీ తారావళి, ఆనంద గజపతి శతకం—కూడా ఈ కవి కృతములే.

ఆశువుగా చెప్పినా, అవధానంలో పృచ్ఛకుల కోరికల ననుసరించి చెప్పినా, తీరికగా కావ్యరచన చేసినా మాధురీగుణ సమంచితమై, శబ్దార్థ చిత్రీ సమన్వితమై, రసపరిపుష్టమై అలరారినదీ కవితల్లజుని రచన.

సకల సాహితీ శాఖల పెంపొందించి, ఆంధ్రలోకమున అవధాన యుగకర్తగా అసమాన ప్రజ్ఞాధురీణుడుగా అభినవ పండిత రాయలుగా శాశ్వత యశస్సును సముపార్జించి కాలగర్భంలో కలిసిపోయిన శ్రీ వెంకటాచార్యుల ప్రతిభను వెలికి తెచ్చుటయే నాయీ ప్రయత్న లక్ష్యము.



గ్రంథ విమర్శలు

శ్రీనాథుని కవిత్వతత్త్వసమీక్ష

శ్రీనాథుని కవిత్వతత్త్వము. రచయిత శ్రీ కుందూరి ఈశ్వరదత్తు. ప్రకటన స్థానము—ప్రాప్తి స్థానము—ఆంధ్ర సారస్వత పరిషత్తు— హైదరాబాదు, వెల రు. 3.50

ఇది ఉత్తమ జాతికిచెందిన పరిశోధన గ్రంథము. దీనిని రచించిన శ్రీ ఈశ్వరదత్తుగారు, కృతిభర్తలైన కీ. శే. ఆంధ్ర చరిత్ర చతురానన చిలుకూరి వీరభద్రరావుగారికి మేనల్లురు. వీరు మువ్వురున్నూ మేనమామ పోలికగలవారై చిరకాలమునుండి చరిత్ర పరిశోధనము గావించుచు, జీర్ణ విజయనగరచరిత్రము ప్రాచీనాంధ్ర చారిత్రకభూగోళము అను నుత్తమ గ్రంథములు రెండింటిని వెలుగులోనికి దెచ్చి యున్నారు. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథాగారములోని గ్రంథములు పరికించుటలో 25 సంవత్సరములనుండి వీరు నాకు సహాధ్యాయులు. వీరి విమర్శన విధానమే విషయమున నైనను సముచిత రీతిని కొనసాగుచుండును. నూతనాంశము నేదైన తెలుపదలచిననాడే వీరు కలమెత్తువారు. నడవాటు గలవారు. ఈ వరకు పెద్దలు వ్రాసిన వ్రాతలు చూచి, వాని లోని యభిమతానభిమతములను సహేతుకముగా ఔను కాదు అనగల ధీరతగలవారు. ఆంధ్రసారస్వత పరిషత్తువారి ప్రోత్సాహౌదార్యములతో, మిత్రుల యనురోధముతో వెలువరించిన ఈ శ్రీనాథుని కవిత్వతత్త్వములో శ్రీనాథుని వ్యక్తిత్వముతో పాటు శ్రీ ఈశ్వరదత్తుగారి వ్యక్తిత్వముకూడ పొడగట్టుచునే యున్నది.

పీఠిక, క్రీడాభిరామకర్తృత్వ ప్రశంస, అను రెండు ప్రకరణములను వారు పేరు పెట్టి ప్రకటించిన 30 ప్రకరణములకు జోడించిన మొత్తము 32 ప్రకరణములుగల దీ గ్రంథము. వక్రోక్తియే కావ్య జీవితము—అని తెలిపిన కుంతకుని వక్రోక్తి సిద్ధాంత భేదములు శ్రీనాథుని రచనలన్నిటిలో పలు తావులందును గాన వచ్చుచున్నదని నిరూపించుట వీరి ఈ రచనకంతటికి ప్రధాన లక్ష్యము. భీమేశ్వర పురాణములో హరచూడా హరిణాంక వక్రతయు, గాలాంతస్ఫురచ్చండి కాపరు షోద్గాఢపయోధరస్థన తటీ పర్యంత కాఠిన్యమున్, పరసత్వంబును సంధనించినని సత్కావ్యములనం జెల్లునని శ్రీనాథుడు తెలిపినదానికి, వక్రోక్తి నిబంధనమే ఈతని రచనకు మూలమనియు, ఇతర కావ్య సామగ్రియంతయు దీనిలో యంతర్భవించుననియు నిరూపించుటకు శ్రీ దత్తుగారిందు యత్నముగావించియున్నారు.

కావుననే, ప్రకరణములు 2, 3, 10 మొ. 19 వరకు గల పదింటిలో, 28, 29 లలో శ్రీనాథుని ప్రబంధములన్నిటి లోను వక్రోక్తి సమన్వయమును నిరూపించుటకే యత్నించి యున్నారు. ధ్వని మార్గానుయాయులు వ్యంగ్యమును కావ్య జీవితముగా భావించినట్లు, కుంతకుడు వక్రోక్తిని కావ్య జీవితమునుగా భావించి, ఇతర కావ్యప్రధానాంగములనందంతర్భవింప జేయుచు వచ్చినాడు. ఆలంకారికులలో గొందరీ విధముగ నే ఒక విషయమును ప్రధానముగ గ్రహించి, పుడు మిగిలినవాని నందంతర్భవింప జేసి నిరూపించినవారు మహిమభట్టారులు గలరు. ఎంతటి శాస్త్ర పాండిత్యముగల కవియైనను తరువాతి తరువాతి కాలములలోని వాడు, ప్రత్యేకముగ ఒక యాలంకారిక సిద్ధాంతమును నిరూపించుటకే తన రచననంతను సాగించి యుండెనని నిరూపింప జాలము. పై భీమేశ్వర పురాణ పద్యమునందే 'హరచూడా హరిణాంక వక్రతయున్,' అని సముచ్చయార్థక శబ్దమును గూర్చుటచే అతని రచనకదియే తత్త్వమని చెప్ప జాలము కదా !

దత్తుగారు కుంతకుడు 'వక్రోక్తి జీవితము'లో నిరూపించిన వక్రోక్తి భేదములకు సంబంధించిన మూల శ్లోకములనుదాహరించుచు వానికి తమ యూహ కొలది వివరణము సాగించుచు, వాని క్రింద శ్రీనాథుని ప్రబంధములోని పద్యములనిచ్చుచు, లక్షణ సమన్వయము సాగించుచు వచ్చినారీ గ్రంథములో. అది ప్రశస్తమైన మార్గమే. కాని ఇట్టి తావులందు నిరూపించిన విషయవస్తువులు లక్షణలక్ష్యములు రెండును మరికొంత విశేష వివరణమునపేక్షించుచున్నవి. ఏమన, అలంకార శాస్త్ర గ్రంథములలో కుంతకుని వక్రోక్తి జీవిత విషయము లవగత్యము చేసుకొనుటకు పాఠకునకు అలంకారశాస్త్ర సిద్ధాంతములతో గొంత విశేష పరిచయమేర్పడి యుండవలెను. లేకుండిన నది సుబోధముగాదు. ఆ లక్షణ స్వరూపము మనసునకు వచ్చినానుగాని లక్ష్యమున దానికి సమన్వయమెట్లో? బోధపడదు. పండ్రెండవ ప్రకరణము— పదపూర్వార్ధరూఢి వక్రత సమన్వయములోని వివరణ మిట్లు క్రింది విధముగా నుండినది.

> "యత్ర రూఢేర సంభావ్య ధర్మాధ్యారోపగర్భతా
> సద్ధర్మాతిశయారోప గర్భత్వంవా ప్రతీయతే
> లోకోత్తర తిరస్కార శ్లాఘ్యోత్కర్షాభిధిత్సయా
> వాచ్యస్యసోచ్యతే కాపి రూఢివైచిత్ర్య వక్రతా.

ఈ క్రింది యుదాహరణములు జరికింపుడు :

> శ్రీ భీమనాయక శివనామధేయంబు
> జింతింప నేర్చిన జిహ్వ జిహ్వ..........
>
> ఇత్యాది సీసపద్య. భీమేశ్వరపురాణము
>
> 2— ఆ 198. సీ. ప.

అతిథి కడు నల్పుఁడైన నత్యధికుఁడైన
నింటికేతేరఁ బ్రియమందు నెవ్వఁడేని
వాని గౌరవమది గౌరవంబుగాని
కాదు గౌరవహాకార గౌరవంబు

కాశీ. 1—98

సీసపద్య చరణములలోని కడపటి పదములఁ కూర్పును జూడుఁడు— శబ్దాలంకారములలో నిది లాటానుప్రాసమని యలంకారజ్ఞులు చెప్పుదురు. కాని శ్రీనాథుని రూఢి శబ్ద ప్రయోగ వైచిత్రిని జూపుట కింతకన్న మిన్నయగు నుదాహరణము కానరాదు.''

ఇచట నుదాహృతమైన శ్లోకముల కర్థమును స్పష్టముగా వివరించి ఉదాహృతములైన పద్యములలోని పదములకు రూఢ్యర్థ వాచ్యార్థములను వివరించి లక్షణ సమన్వయము చేసి యుండిన బాగుండెడిది.

పదుమూఁడవ ప్రకరణములో 'లింగ వక్రత' యను శీర్షకము క్రింద నుదాహరించిన పద్యములలో (57—58 పుటలు) 'తటీ' యను శబ్దము మూడు లింగములుగలది కావున స్త్రీలింగముగ బ్రయోగించుటచే నది లింగ వక్రత కుదాహరణమగుట సమంజసము. కాని అక్కడనే ఉదాహరించిన— భీమే. పు. 1—39లోని కల్లోలినీ శబ్దము, హర విలాసము 7—114 లోని 'శాత కుంభ నలినీ....... కల్లోలినీ' శబ్దము లాయర్థములలో నితర లింగములందు ప్రయుక్తములుగావు. గనుక నట్టి సత్ప్రయోగములుగల శబ్దములు లింగ వక్రత కుదాహరణములు గానేరవనిపించును. మొత్తముమీద శ్రీనాథుడు తన రచనలో స్త్రీలింగ పద ప్రయోగమును బహుళముగఁ జేయుచుండుననుట మాత్రము తథ్యము. ఆ విషయమును దత్తుగారును దెలిపియేయున్నారు.

ఆఱవ ప్రకరణము 'నాకవిత్వంబు నిజము కర్ణాట భాష' అను శీర్షకము క్రింద— పల్నాటి వీర చరిత్ర పీఠికలో శ్రీ అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు వ్రాసిన సిద్ధాంతమును, దాని పైఖండన రూపముగ శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు, శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు, శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు, శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు, శ్రీ చాగంటి శేషయ్యగారును వెలువరించిన అభిప్రాయములు దెలిపి, దత్తుగారు 28— 31 పుటలలో తమ యభిమతమును నీ క్రింది విధముగాఁ దెలిపియున్నారు.

"కాబట్టి శ్రీనాథుఁ డీ చరణములో కర్ణాటభాష యనగా ద్రావిడాంధ్ర భాషలని దేశభాషా విభాగమునఁ గల్గు నర్థమునఁ గాక 'ఆంధ్రదేశాంతర్భాగమైన కర్ +నాట=కర్ణాట, అనగా ప్రాగ్దక్షిణ ప్రాగుదీచీ భాగమగు ఆంధ్రదేశమునే సూచించి యుండెనని తోచుచున్నది............ ఇక్కడ కర్ణాటక భాషా పదమునకు ఆంధ్రమండలాంతర్గత విషయభేద స్ఫురిత భాషా విన్యాసమేనని నా తలఁపు'' అని యన్నారు.

ఈ విషయమున శ్రీ దత్తుగారు ఇతర పరిశోధకులలోఁ దమ కభిమతమైన వారివారి యభిప్రాయములు దెలిపి తుదికు తమ నిర్ణయము నేర్పరచియున్నారు. కాని 'కర్' అను శబ్దమునకు దత్తుగారూహించిన యర్థము స్ఫురించుట యేసంప్రదాయమునుబట్టియో వివరింపవలసియున్నది. మరియునిది భీమేశ్వర పురాణములోని పద్యము గావున దీనినిగూడ వక్రోక్తి విభాగములలో నేదియో యొక కక్ష్యక్రింద జమకట్టి, కర్ణాట శబ్దమునకు యౌగికార్థాను సంధానమున సమన్వయముచేసి చూపించుట యుక్తమేమో? అటులైన తన్నవహేళన చేయు వారిని కవ్వించుట కనినమాటయని తెలుపవచ్చునుగదా !

ఇరువదియవ ప్రకరణములో శ్రీనాథుని మతము వీర శైవము అని తెలిపినారు. హరవిలాసములో 'శిరాలా! వీర శైవవ్రతా' వీరశైవ సమయ వ్యాపార పారీణ......'' 'వీర మహేశ్వరుగేహారంబు' వీర మాహేశ్వరాచారుగనకఁ పార (నైషధము) ఈ శబ్దములాతని రచనలోఁ గానవచ్చుటచే శ్రీనాథుని మతము వీరశైవమని వారి నిరూపణము. హర విలాసములో ప్రకరణ వశమున విష్ణు స్మృతియు విశేషముగఁ గలదు. అంత మాత్రమున అతని మతము వైష్ణవమనఁ దగునా? శైవములో ఆరాధ్య శైవము బసవేశ్వర శైవము అనునవి సుప్రసిద్ధములు. ఇకనీ వీరశైవ మెప్పుడవతరించినదో ఎరుగఁ రాకున్నది. మహేశ్వర భక్తులలో వీరత్వమును జూపించువారిని వీర మాహేశ్వరులని వీరశైవులని యనవలయునేమో? అతని మతము ద్వైతముగాక వీరశైవమే అయిపచో 'అధ్వర్యు శాఖాధీతి నిష్ణాతు'నని హర విలాసమునఁ దెలిపియుండుటచే, వైదిక కర్మ సంబంధ సంబద్ధమైన ఆరాధ్యశైవము కావలెను. అతఁడా మతమునకుఁ జెందిన వాఁడనని తెలుపుకొనలేదు. దానికి వీరశైవమను వ్యవహారముండినట్లును తెలియరాదు.

ఇక శ్రీనాథుఁడ ద్వైతికాఁడనుటకు శివరాత్రి మాహాత్మ్యములో సర్వధాపతితుఁడు కానున్న సుకుమారు ఛండాలాంగనతోఁ గవయఁ గూడఁ దలఁచి నపుడుఁ తాను చేయు దుష్కృత్యమును సమర్థించుకొనునప్పుడాతనిచేఁ బలికించిన మాట లివి : దీనిలో నద్వైత మత సిద్ధాంతము నాటఁ డవహేళనముచేయును. పతితుఁడైనవాని మనోగత భావముల కది నిదర్శకముకాని, కవిచిత్త వృత్తి వర్తనముల కది నిదర్శనము కానేరదు. అట్లయినచో వరూథిని ప్రవరునకుఁ దెలిపించిన వేదాంతము పెద్దనగారి కభిమతమనవలసి వచ్చును.

క్రీడాభిరామముతో శ్రీనాథునకేపాటియు సంబంధము లేదనుటకు దత్తుగారు ప్రధానముగ రెండు విషయములను దెలిపియున్నారు. అందొకటి శ్రీనాథుని కాలమునాటికి క్రీడాభిరామ కృతికర్తయైన వల్లభామాత్యుఁడు వినుకొండను వదలి మోపూరు చేరియుండుట. రెండవది శ్రీనాథుని ఇతర ప్రబంధములలోగల వక్రోక్తి ప్రాధాన్యము, తత్పురస్కృతమైన శయ్యా సౌభాగ్యమేపాటియు వల్లభరాయని రచనలోఁ గానరాకుండుటయును. శ్రీనాథుఁడు విజయనగర యాత్ర సాగిం

గ్రంథ విమర్శలు

చూటకుఁ బయసమైనవాఁడు, వల్లభామాత్యుఁడు వినుకొండలో లేఁడని యూహించుటకుఁ గారణము, ఆ నాఁటికి వినుకొండ ప్రాంతము పెదకోమటి వేమారెడ్డి పాలనములో నుండెనని యూహించుట క్రీడాభిరామములోని పద్యమునుబట్టి యీఁడు గ్రామ గ్రామ గ్రాసములతో గూడిన, కర్నూలు మండలమునకు జెందిన మోపూరున కానాటి కాఁడు పాలకుడై యుండెనని ఊహించుటయును.

కాని క్రీడాభిరామములో నుండిన వంశక్రమమును యథాతథముగా గ్రహించినచో, మోపూరున కేపాలెగాడు గానోయుండెనని కొనిన యాతఁడు, వల్లభామాత్యునకు తండ్రి యగు తిప్పనగాని ఈతఁడు గాడు. మఱియు క్రీడాభిరామములో యుండిన ఈ క్రింది పద్యములోని

నటులింది దోర సముద్రము
నిటులింది యోర్గల్లు కవిది వినుకొండ మహా
పుట భేదన మీ త్రితయము........క్రీడా..293.

అను విషయమునుబట్టి వల్లభరాయుఁడు వినుకొండలో లేఁడని యనుకొనఁ దగదుగదా! మఱియు కృతికర్త వంశవర్ణనము మొదలుగ ప్రేమాభిరామ ప్రశంసయునంతవరకునుండిన పద్యములలో వక్రోక్తిభేదముల నెన్నటినో సమన్వయింప వచ్చునుగదా! ఇందు వక్రోక్తి యే పాటియు లేదు గనుక యిది శ్రీనాథుని రచన కాఁ జాలదనుట ఎట్లు? మఱియొక్కమాట— శ్రీనాథుని చాటువులుగా ప్రసిద్ధికెక్కిన పద్యములందు చేరుటనుబట్టి శ్రీనాథునకీ రచనతో నేదో కొంత సంబంధ ముండవలయుననియే అనిపించును.

దత్తుగారీ సంకలనములో శ్రీనాథుని కవిత్వ తత్త్వముచే ప్రధానముగ నిరూపింపఁ దలచియు, క్రీడాభిరామ కర్తృత్వ ప్రశంసను ముద్రణమును ముగించునాటికే సంసిద్ధము చేసినను, ప్రసక్తాను ప్రసక్తముగ తమకు సహజమయిన చారిత్రిక విషయ విమర్శనమునిందు పొందుపరచినారు. ఆ ప్రస్తావనములో విజయనగర రాజులయు రాజమహేంద్రవర రాజన్యులయు పాలనకాలముల నిచ్చియున్నారు. దానిలో కాటయ వేమారెడ్డి పాలనము తరువాత పాలకులుగానుండినారనిన 1. కుమార గిరిరెడ్డి. 2. అల్లాడరెడ్డి. 3. కొమరగిరిరెడ్డి. 4.అనపోతారెడ్డి, అను వీరు రాజ్య పాలకులుగా నుండినట్లు నిరూపించు నిదర్శనములు లేవు. ఆయా సంవత్సరములలో వారి నామములుగల శాసనములుండినంత మాత్రమున వారు పాలకులుగానుండిన ఊహించుట సంభావ్యముగాదు. ఇతరాధారము లేపియు లేక ఆ కాలములోని శాసనములలో వారి నామములు గానవచ్చినంతటనే వారు పాలకులుగా నుండినట్లూహించుట, ఆ యూహలను సిద్ధాంతములను చేయుట చరిత్రకారులలో చాలమందికి పరిపాటియైనది. ఇట్టి నిర్ణయము నిశ్చిత చరిత్ర కాదేమో సహృదయులు పరికింతురుగాక!

శ్రీనాథుని కృతులలో బరమ ప్రసిద్ధమైన ఆంధ్ర నైషధ కావ్యమునకు శృంగార నైషధమను నామమేర్పడుటకుఁ గల హేతువులను 23వ ప్రకరణములో నిరూపించి యున్నారు. కాని వారు నిరూపించిన హేతువులనుబట్టి శ్రీనాథుని రచనకు శృంగార నైషధమను పేరుండినట్లు తెల్లమగుటలేదు. ఆ ఘట్టమును మరికొంత వివరించిన బాగుండెడిది. 25వ ప్రకరణములో మూలానుసరణము అను శీర్షిక క్రింద శ్రీనాథుని కృతులలోని కొన్ని ఘట్టములలో మూలానుసరణ మెట్లు సాగినదో వివరించుచు వచ్చి, వేమ భూపాలుల చరిత్ర సమన్వయమును నిరూపించి, మయూరుని సూర్యశతకములోని శ్లోకములేయే తావులందు ఎట్టి ఇ నూదిలమైనవో తెలుపుట బాగుగ సాగినది.

26వ ప్రకరణమున శివరాత్రి మాహాత్మ్యమునుగూర్చి వారు గూర్చి పెట్టిన యంశములు చాల సరసముగ నుండినవి. మూలానుసరణమున సాగిన రచనా విధానమును కొంత విపులముగాఁ దెలిపినారు. ఈ రవిమర్శకుల దృష్టిలో నొకపాటిదిగా నుండిన ఈ శ్రీనాథుని రచనలో నుత్తమ ప్రబంధ లక్షణములు గలవని నిరూపించుటలో విశేష శ్రద్ధ చూపించినారు.

మొత్తముఁ శ్రీ ఈశ్వరదత్తుగారీ కవిత్వ తత్త్వ నిరూపణములో శ్రీనాథునకు సంబంధించిన నూతనాంశము లెన్నియో తెలిపియున్నారు. వారు శ్రమించినదోనిరూపించి ఈ శ్రీనాథుని కవిత్వ తత్త్వములో ప్రధానమయిన వక్రోక్తి సమన్వయ పద్ధతి నితరులుకూడఁ జేపట్టి కృషిచేయఁ దలచిన నాఁడీ రచన పథ ప్రదర్శకము కాఁగలదనుట తథ్యము.

ఇట్టి ప్రసిద్ధ కవుల కవిత్వ తత్త్వమునుగూర్చి సమర్థులగు వ్యక్తులచే రచన గావింపఁ జేసి, రచయితల కృషిని వెలుగులోనికిఁ దెచ్చుచు ఆంధ్ర భాషాభివృద్ధికై యమూల్యమైన సేవచేయుచున్న ఆంధ్ర సారస్వత పరిషత్తువారి సౌజన్యమెంతయుఁ ప్రశంసనీయము. ఆంధ్రసారస్వత రంగమున విమర్శ పథమును బట్టి పోవువారికీ విమర్శ గ్రంథము మార్గదర్శకము కాగలదని నా యాకాంక్ష.

—చిలుకూరి పాపయ్యశాస్త్రి.

శతక సప్తకమ్

సంస్కృతానువాదము : అనువాదకులు : తి. గు. వరదాచార్య:, ఎమ్. ఏ. ఆనర్సు. ప్రకాశకులు : ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీ, హైదరాబాదు. క్రౌను 1/8, పేజీలు: 142. వెల : రు. 1.50 పై.

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీవారు ప్రచురించిన ఉత్తమ గ్రంథములలో ఇది యొకటి. ఆంధ్ర శతక వాఙ్మయము అపారమైనది. అందులో కవుల స్వాతంత్ర్యము, ఆత్మీయత గోచరించును. దాని రుచి ఆంధ్రేతరులకు సంస్కృత భాషలో చూపుటకు చేసిన ప్రయత్న మిది.

ఈ సంపుటములో ఏడు శతకము లున్నవి. భక్తిభావమును ఆర్తిని హృదయంగమముగా ప్రదర్శించుటలో దాశరథి

శతకము, శ్రీ కాళహస్తీశ్వర శతకము, నీతులకు వేమన శతక మును అగ్రగణ్యములు. వాని నెన్నుకొనుటలో అభిప్రాయభేద ముండదు. నరసింహ శతకమునందు అనువాదకులకు నామ పక్షపాత మున్నట్లు తోచును. వారి తల్లిదండ్రులు, మాతా మహులు, పుత్ర పౌత్రులు, కళాశాల, ముగ్గురు గురువులు నృసింహ నామధేయులే. గుణ పక్షపాతముచే గూడ అది ఎన్నదగినదే. కృష్ణశతకము అంతటిది కాకున్నను బహుళ ప్రచారము కన్నది. నీతిశతకములలో సుమతి భాస్కర శతకములు వేమన శతకము తర్వాత ఎక్కువ పేరు కలవి. ఇంకను శతకాను వాదములు రానున్నవి కనుక ఆంధ్ర నాయక శతకము, సర్వే శ్వర శతకము వంటివి చేర్చలేదేమని ప్రశ్నించుట ఉచితము కాదు. రాష్ట్రాంతరులను ఆకట్టుటకు గ్రంథాదిలో సుమతి శతకము కాక దాశరథి శతకమో, శ్రీ కాళహస్తీశ్వర శతకమో ముద్రించిన బాగుండెడిది.

దాశరథీ శతకములో సంస్కృతమయములైన మొదటి ఎనిమిది పద్యాలు యథామూలముగ చంపకోత్పలములలో ఉంచి తక్కినవి శార్దూలములలో అనువదించినారు. శ్రీ కాళహస్తీశ్వర శతకమూ, భాస్కర శతకమూ అంతా శార్దూలములలో ఉన్నను సుమతి, వేమన శతకములు అనుష్టుప్పులలో అనువదించిరి. నృసింహ శతకములో సంస్కృతమయమైన నాలుగు సీసములు యథామూలముగా ఉంచి తక్కినవి ఒక్కొక్క సీసమును మూడు ఉపజాతులలో వ్రాసిరి. సంస్కృతమయమైన పద్య ములు యథామూలముగా ఉంచి నక్షత్రచిహ్నములు వేసినారు.

అనువాదకులు విద్వాంసులుగా, అధ్యాపకులుగా ఆంధ్ర దేశములో సుప్రసిద్ధులు. ఈ అనువాదములవల్ల వారు విద్య త్కవులుగా గూడ యావద్భారతమునందు ప్రశస్తి పొందుదురనుటకు కూడ సందేహములేదు.

అనువాదములన్నియు నిర్దుష్టముగా, మనోహరముగా నున్నవి. మూలార్థమేమాత్రము బీరు పోనీయకుండ తెప్పిం చుటకే కాక, వీలైనతావులందెల్ల మూలశబ్దములను గూడ అనువాదములోని కెక్కించినారు. ఆంధ్రకవుల సంస్కృతాభి మానము వారి కిందులో సహకరించినది. తామే ఎక్కువ సంస్కృత భాషాభిమానము కలవారమను అపోహలో నున్న ఔత్తరాహులకు ముఖ్యముగా, ఆంధ్రకవుల కెంత సంస్కృత భాషాభిమాన మున్నదో ఈ అనువాదములు ప్రకటించిన కను విప్పుగా నుండగలవు. మూల మింత శ్రద్ధగా అనుసరించినను మూలములోని ప్రాణము తరుగలేదు. సంస్కృతభాషా జీవమును పోసికొన్నవి. అనువాదములు స్వతంత్ర రచనల వలెనే ప్రౌఢ మనోజ్ఞముగా నున్నవి. సంస్కృతపు పలుకుబడి అనువాదకులకు వాచో విధేయము. ఇటి గ్రంథములు గీర్వాణ భాష నిత్యజీవము గల భాష యని నిరూపింపగలవు. దుష్కర మగు కృతిని సాధించినందులకు అనువాదకులను అభివాదన పురస్సరముగా అభినందించుచున్నాము.

అనువాదకులు తాము శ్రీవైష్ణవులైనను ఈశ్వర భక్తుడైన ధూర్జటి శతకమును భేదముచేయక సుష్ఠుగా రచించి తమ సమబుద్ధి సహృదయత ప్రదర్శించినారు. ఒక్క అనువాద శ్లోకము నుదాహరింతుము :

> యాతా కాం శ్రుతి మధ్యగీష్ట ? భుజగోఽపాఠీచ
> శాస్త్రం నుకిం ?
> కాం విద్యాం గజ ఆదితాథ ? శబరోఽభ్యస్థచ్చ మంత్రం
> నుకమ్ ?
> బోధోత్పత్తి నిదానతాం జనయ స్యాయాన్త్య ధీతాని న
> త్వ త్పాదార్చన రాగితా విరహిణః శ్రీ కాళహస్తీశ్వర.

అనువాదకులు తా మవలంబించిన మూల గ్రంథప్రతి ఏదో సూచించి యుండవలసినది. శ్రీ కాళహస్తీశ్వర శతకాను వాదమున, శ్రీ గుంటూరి వీరరాఘవశాస్త్రి సంపాదించిన 'శతకరత్నాకరము' నవలంబించినట్లు తోచును. రెండిటిలోను 116 పద్యము లున్నవి. శ్రీ కా. నాగేశ్వరరాయలవారు సంపా దించిన 'శతకమంజరి' లో 141 పద్యము లున్నవి. 'శతక రత్నాకరము' లోని దాశరథి శతకములో 101 పద్యము లున్నవి. అనువాదములో 102 కలవు. 'శతకమంజరి' లో 114 ఉన్నవి. శ్రీ రెంటాలవారి 'శతకరత్నావళి' లో 103 ఉన్నవి. ఇక్కన శతకములకును ఇట్లే భేదము లున్నవి. ఏ మూల పాఠము గ్రహించినది, అట్లు గ్రహించుటకు కారణములు తెలుపుట, అధికారిక ప్రచురణలకు అవశ్యాచరణీయమైన మర్యాద కదా !

ఈ గ్రంథము ముఖ్యముగా నాంధ్రేతరుల కుద్దేశించి నది గనుక, వారికి సులభగ్రాహ్యములు కాని ఆంధ్ర స్థానీయ విషయములు ఆచారాదులు క్లుప్తముగా అథస్సూచికలోనైన వివరించుట అవసరము. శ్రీ, కాలము, హస్తి ఆలింగమును అర్చించి సాయుజ్యము నందుటచే శ్రీ కాళహస్తీశ్వరుడను పేరు వచ్చినదనియు, తిన్నడను శబరుడు కూడ ఇక్కడ సాయుజ్య మందెననియు తెలియనివారికి, పైన మే ముదాహరించిన శ్లోకములోని విశేష మవగాహనము కాదుగదా ! మూల గ్రంథ పద్యములు యథాతథముగా ఉంచినపట్ల ఆంధ్రభాషలోని యతి విశిష్టత చెప్పియుండవలసినది—లేనిచో యతిభంగమని తోపవచ్చును.

శ్రీ లక్ష్మణశాస్త్రిగారి ఉపోద్ఘాతము కూడ కొద్దిలో ముగించినారు.

ఎందువల్లనో గాని ప్రకటనకర్తలు తమ ప్రచురణలలో అవలంభించుచున్న ఉదారత దీని విషయములో చూపినట్లు తోచదు. తెల్లని కాగితమే, అచ్చుతప్పులు కూడ తక్కువే. కాని చూడగానే నోట్సు పుస్తక మనిపించుచున్నది కానీ, ఉద్గ్రంథ మనిపించుటలేదు. తెలుగు కవిత్వపు మాధుర్యముతో పాటు ఆంధ్రదేశములోని విద్వత్కవుల గీర్వాణ రచన ఎంత ప్రౌఢరమ్యముగా నుండునో, యావద్భారతభూమికే కాక భారతే తర భూములలోని సంస్కృత కోవిదులకును గూడ ప్రద ర్శించు మహదవకాశ మీ యుత్తమ గ్రంథము ప్రసాదించు చున్నదని వారు గుర్తించుకొనవలసినది. ఇంకా మంచి కాగిత

ముఖమీద, గట్టి అట్టలతో, అందమైన జాకెట్టు వగైరాలతో మంచి చిత్రకారుల సహాయముతో విపులమైన పరిణామములో సర్వాంగసుందరముగా ప్రకటించియుండవలసినది. ఎక్కువ పెద్దచూపుతో చూడవలసిన ఈ గ్రంథము నింత చిన్నచూపుతో ప్రచురించుట న్యాయముకాదు. ఈ గ్రంథ ప్రతులు ఆంధ్రేతరుల కందించుటకు ముందు, ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడెమీవారు ప్రద్యాదులకు వెనుకాడక, మా సూచనలు ఆదరించి పునర్ముద్రణ చేసిననే కాని ఈ గ్రంథము ఉద్దిష్ట ప్రయోజనము సాధింపలేదని మా దృఢ విశ్వాసము ! వెల ఎక్కువ పెట్టవచ్చును. ఎంతెంత ఖరీదు పెట్టి నను మీరూ, మన గ్రంథాలయాలూ ఇతరుల గ్రంథాలు కొని తెప్పించి చదువుటలేదు !

శ్రీమద్భగవద్గీతా శంకరభాష్య తత్త్వబోధిని

చతుర్థకుసుమమ్ అధ్యాయములు: 13, 14, 15లు.

గ్రంథకర్త : శ్రీ బులుసు అప్పన్నశాస్త్రిగారు. ప్రాప్తి స్థానము : గ్రంథకర్త, భట్నవిల్లి, అమలాపురం తాలూకా, తూ. గో. జిల్లా. డెమ్మీ 1/4—పేజీలు: 426. వెల : 6.00లు.

ఈ గ్రంథము మొదటి మూడు సంపుటములు లోగడనే వెలువడినవి. వానిని భారతిలో ఇతఃపూర్వము సమీక్షించియుంటిమి. పూర్వ ప్రకటితమైన మూడు సంపుటముల పద్ధతిలోనే ఈ సంపుటమును నడిచినది. మొదటి రెండు సంపుటములలో గీతాశ్లోకములకు అకారాద్యనుక్రమణిక చేర్చిరి. అటి అనుక్రమణిక ఈ సంపుటములో గూడ నుండుట ప్రమోదావహము.

బహుమంది వదాన్య శేఖరుల పుష్కల ద్రవ్య సాహాయ్యముతో ఈ సంపుటములు వెలువడుచున్నవి. అందువలన గ్రంథకర్తలు ఇంతపెద్ద సంపుటములను చక్కని క్యాలికో బైండుతో స్వల్ప మూల్యమునకు పాఠకుల కీయగలుగుచున్నారు. వా రందులకు అభినందనీయులే. కాని, ఈ ఉద్గ్రంథమును చూచినప్పుడు మమ్ము రెండే లోపములు బాధించుచున్నవి.

గ్రంథకర్తలు నేటి యాంధ్రదేశములోని పండితులలో నిస్సందేహముగ సగ్రగణ్యులలోనివారు. వారి గీతా వ్యాఖ్యానములో పూర్వ వ్యాఖ్యాతల అనువాదములు చేయుటతో తృప్తి పడక, ఈ మధ్యకాలములో వచ్చిన కువ్యాఖ్యానములను ఖండింప పూనుకొనరేమి ? ఆసనికి పూనుకున్నప్పుడే వారి పరిశ్రమకు శాశ్వత ప్రతిష్ఠ చేకూరగలదు. ఇది మా మొదటి బాధ !

మా రెండవబాధ అందులోని తప్పులను గూర్చి. ఆ తప్పులలో ఆంధ్రభాషా విషయములో ప్రాథమిక దోషములు ప్రతి పుటలోను కొట్టవచ్చునట్లున్నవి. ఆంధ్రభాష విషయము నేటి కాలమున సమస్తము అవ్యవస్థితముగా నున్నందున, అట్టివాని నొక విధముగా సరిపెట్టుకొనవచ్చును. కాని, సహింపరానివి కుప్పలుగా నున్న అచ్చు తప్పులు ! అట మీద వేసిన గ్రంథ నామములోనే చివరి 'ని' లోపించినది. అనుక్రమణిక ఆద్యంతములు సరిచూడగా 'సర్వస్య చాహం హృది 15—15—1087' అని ఉన్నది. పేజీ 1086 ఉండవలె.

పే. 1058 పం. 10—1 చే" వ్యాఖ్యానింపబడిన తీరున నిట్టి సమూల సంసార వృక్షమును ఎవడు తెలిసి కొనునో వాడు వేదార్థమును తెలిసికొననివాడు" అని యున్నది. 'వేదార్థ విదిత్యర్థః' అను భాష్య పంక్తికి ఆంధ్రీకరణము. ఇది విపరీతార్థము నిచ్చు అచ్చు తప్పు ! అక్కడనే 1057, 1048 పేజీలు రెండుమారులు పడినవి. బైండింగు లోపముకాదు. రెండవసారి వచ్చిన 1057, 1058 నిజముగా 1059, 1060 పేజీలు. కాబట్టి అక్కడినుండి గ్రంథాంతము వరకు పేజీల సంఖ్య తప్పన్నమాటే. అచ్చు తప్పుల విషయములో పై ఉదాహరణములు మచ్చులు మాత్రమే. స్వరలోపము, అక్షరోచ్చారణ దోషము ఎట్టివో, ముద్రణలో స్ఖాలిత్యములును అట్టివే యని విద్వాంసులకు వేరుగా మనవి చేయవలెనా ?

—నోరి నరసింహశాస్త్రి.

అనుబంధాలు

(సామాజిక నవల. రచన : 'సుదర్శన'. ప్రకాశకులు: విశ్వవాణి పబ్లిషర్సు, విజయవాడ. మూల్యం : రు. 5. 00: పేజీలు : 282.)

దేశ పటాల్లో నైసర్గిక స్థితి గతులను తెలిపే పటం ఎలాంటిదో, నవలల్లో సామాజిక నవల అలాంటిది. నిమ్నోన్నతాలను నదీ నదాలను సారవంతమైన మైదానాలను, ఎడారి భూములను యథా తథంగా చిత్రించ గలిగి నప్పుడే నైసర్గిక పటానికి విలువ, పరిగణన లభిస్తున్నాయి. నుద్దైతే ఈ నైసర్గిక పటాలను గీయడం మాత్రం విద్యార్థుల దగ్గర నుంచీ, సిద్ధహస్తులైన భౌగోళిక శాస్త్రజ్ఞుల దాకా అందరూ చేస్తూనే వున్నారు. ఈ వాస్తవం సామాజిక నవలా నిర్మాణానికైనా వర్తించనిది గాదు.. భగవంతుని విశ్వరూప సాక్షాత్కారం ఎంత దుర్లభమో, సమాజ స్వరూప సాక్షాత్కారమూ అంతే దుర్లభం. దానికి ధ్యానం, యోగం, జ్ఞానం లాంటి వెంత అవసరమో, దీనికి ఆలోచన, పరిశీలన, అనుభవం లాంటివి అంతే అవసరం. ఈ అధికారాలన్నింటినీ సంపాదించి నిర్మొగమాటంగా సత్యాన్ని ఎక్కాణించడానికి జరిగే ప్రయత్నం ఎక్కడైనా కనిపిస్తే సాహిత్యాభిమానుల కెంతైనా సంతృప్తి కలుగుతుంది. అలాంటి సంతృప్తిని కలిగించే నవలే 'అనుబంధాలు'.

ఆధునిక మానవ సమాజం ఓ పెద్ద కట్టడం లాంటిదైతే అందులోని ప్రతి గదినీ తాళాలు వేడదీసి తెరిచి చూపే పూనిక ఈనవలలో కనిపిస్తుంది. ఆర్థిక సమస్యద్వారా పల్లెల్లో కుటుంబాలు కృంగి పోతున్నాయి. ఒక్కగానొక్క కొడుకు వేద మూర్తిని ఉన్నత విద్యాభ్యాసం కోసం పట్టణానికి

షంపించకపోతే, బసవన్న కొండలో గోపాలస్వామి కుటుంబానికి ఈ ఆర్థిక సమస్య దాపురించి వుండేది గాదు. చేసిన బాకీ తీర్చడానికి కుమారుడు పెద్ద కట్నంతో పెళ్లి చేసుకోడమే గత్యంతరమని భావించే తండ్రినిగానీ, కట్నాలాశించి జీవితాన్ని అమ్ముకోడం హేయమని భావించే కుమారుణ్ణి గానీ తప్పు బట్ట మనంలేము. తండ్రికీ కుమారుడికీ మధ్యనైతే అనుబంధాలున్నాయి కానీ అవసరాలకు ఆదర్శాలకు మధ్య అవెక్కడున్నాయి? ఆ యిరుసుకు ఈచక్రానికీ మధ్య కందెన వేయలేక పోవడంవల్ల బండికి కలిగిన ముప్పుకు వేదమూర్తి ఎంతవరకు బాధ్యుడు? రైతుకు భూమి కన్నతల్లి లాంటిది. తనను చదివించిన పుణ్యానికి ప్రతిఫలంగా భూమిని అన్యాక్రాంతం చేయ వలసి వచ్చి దుఃఖంలోనే చనిపోయిన తండ్రి కోసం పట్టభద్రుడైన కుమారుడు యింత కన్నీటిని మాత్రమే వదల గలిగాడు. కానీ తల్లికీ బిడ్డకూ మధ్య నున్న ప్రేమానుబంధాన్ని మాత్రం అతడు ఆలస్యంగానైనా ఒప్పుకోక తప్పలేదు. నవలలో చిట్ట చివర —

వేదమూర్తి విమలతో అన్నాడు. "చూశావా, మానాన్న గారి మాటే నెగ్గింది చివరకు. నీ డబ్బుతో మా పొలం మాకు దక్కింది. మనిషికీ నేలకూ ఏమిటో ఈ అనుబంధం?'

"వ్యక్తికీ వ్యక్తికీ వుండే అనుబంధము వంటిదే అను కోవాలి" అన్నదామె.

ఇలా తండ్రికీ బిడ్డకూ, భూమికీ రైతుకూ మధ్యనున్న అనుబంధాల్లోనుంచీ 'సృష్టి' నందుకున్న ఈ నవల, సమాజంలో ఇంకా రకరకాలైన అనుబంధాల్లోనుంచీ 'స్థితి' ని సాధిస్తుంది. ముఖ్యమైనది వైవాహికానుబంధం. కాచి వేచి యువతీ యువకులు ఒకరి నొకరు బాగా అర్థం చేసుకున్న తర్వాత జరిగే పెళ్లిళ్లు చాలా అరుదు. బాంధవ్యాలు, కట్నాలు తాత్కాలిక వ్యామోహాలు మొదలైనవే ఈనాడు వివాహ సంబంధాలను కుదురుస్తున్నాయి. తప్పటడుగుల మూలంగా నెలకొన్న వైవాహికానుబంధాలవల్ల జీవితంలోనుంచీ సుఖము శాంతి లుప్తమౌతున్నాయి. ఏవో అడ్డంకు లెదురైనా ఆదర్శాన్ని విడ వాడుకోని చిత్త ప్రవృత్తివల్లనే కుటుంబ జీవితం ఆనందపదం కాగలదని విమలా వేదమూర్తుల, సీతాలక్ష్మి సుందరరావుల వివాహాలు సూచిస్తాయి.

ఏ సమస్యను తీసుకున్నా దానిని అట్టడుగునుంచీ పరిశీలించే ఆకాంక్ష ఈ నవలలో ద్యోతకమౌతుంది. బాహ్యశక్తుల ఒత్తిడి మూలంగా కళాశాలల్లో గురు శిష్యుల మధ్యసత్సంబంధాలు నెలకొనడంలేదు. అధ్యాపకులు తాము చేయని తప్పుల కోసం తమ విద్యార్థుల ఎదుట క్షమాపణ చెప్పుకోవలసిన అవస్థకు గురికావడం హృదయవిదారకమైన విషయం. ఇలాంటి విద్యా వ్యవస్థలో విద్యా ప్రమాణాలు ఎలా పెరగగలవో దురూహ్యం. కాలేజీ కమిటీల అవకతవక విధానాల దగ్గరి నుంచీ, నాటకాలు, లవ్ లెటర్లు, ఆడపిల్లల హాస్టల్లో వార్డను గారి ప్రవర్తనదాకా ప్రత్యంశాన్ని సమగ్రంగా చిత్రించి కలుషితమై పోతున్న కళాశాల వాతావరణాన్ని కళకు కట్టినట్టుగా ప్రదర్శించడంలో ఈ నవల కృతకృత్యత నందుకో గలిగిందని అసందిగ్ధంగా ఒప్పుకోవచ్చు.

నవలలో ఒక పాత్ర చెబుతుంది—"ఆవేశగ్రస్తమైన మనస్సు బానిస వంటిది. అందువల్ల మేధస్సు యధార్థానికి అనుగుణంగా ఆలోచించలేక శక్తి విహీనమై పోతుంది"— నిజమే. ఆలోచన దీపకళిక వంటిది. సంయమనంతో గూడిన ఆలోచన గాజు కుప్పెలోని కదలని దీపం వంటిది. దాని వెలుగులో వస్తువుల స్వరూపం వాటివాటి క్రీనీడలతోసహా స్పష్టంగా గోచరమౌతుంది. ఆవేశానికీ, తొట్రుబాటుకూ అతీతమైన ఆత్మసంయమనం ఈ రచనలో ఆద్యంతమూ కనిపిస్తుంది.

'అనుబంధాలు' మంచి సామాజిక నవల.

—ఎం. ఆర్.

ఉ ద య కి ర ణా లు
(కవితా సంకలనము)

ప్రచురణ: యువజన కవితా మండలి. అల్లూరు. (వయా) చందోలు. గుంటూరు జిల్లా. వెల. రూపాయి ఇరవైయ్యైదు నయాపైసలు.

యాభైముగ్గురు యువరచయితల రచనలతో నున్న సంకలన గ్రంథమిది. ఇందులో ప్రసిద్ధికి రావలసిన వారే కాని వచ్చినవారెవరును లేరు. అందరును గేయములను వ్రాసినవారే. ఒక్క శ్రీ వీరయ్య చౌదరిగారుమాత్రము సీసపద్యములను వ్రాసిరి. గ్రంథమును ప్రకటించిన యువజన కవితా మండలి తన "ఒక్క మాట" అనుపేర వ్రాసిన ఉపోద్ఘాతమువంటిది గూడ గేయ రూపముననే ఉన్నది. గేయరూపముననుండుటయనగా వరుసగా క్రిందికి వ్రాసికొని పోబడియుండుటయని యర్థము.

ఆంధ్ర వాఙ్మయమున నీ కాలమున గేయరచన విరివియైనది. గేయములను గేయములుగాను, కవిత్వముగాను వ్రాసెడి వారొక అరడజనుకంటె అధికముగా లేరు. మిగిలిన వారందరును పంక్తులను పొట్టిచేసి క్రిందికి పేర్చువారే. ఈ కోవకు చెందిన రచయితలు కొందరు గ్రంథమున అధిక భాగము నాక్రమించి యున్నారు. స్వతంత్రమైన యూహాబలము గాని, సమర్థమైన శబ్ద గ్రహణ శక్తిగాని, విశిష్టమైన వాక్యనిర్మాణ దక్షత గాని, విస్పష్టమైన ప్రయోజనాపేక్ష గాని ఇందలి యువక కవులలో చాలమందియందు కానరాదు. వ్రాయుట తప్పనిసరి కాగా మొక్కుబడి తీర్చుకొనుటకు వ్రాసినట్లున్న విందలి యధిక గేయములు.

ఒకరిద్దరు యెంకిపాటల ననుకరించుటకు వాటుబడం మరియొకరిద్దరు శ్రీ శ్రీ రచనల ననుసరించి వ్రాయుటకు యత్నించిరి. మరియు కొందరు వచన గేయములని కొందరు క్రొత్త పేరు పెట్టి వ్రాయుచున్న వ్రాతల ననుసరించిరి. ఇంకను కొందరు వట్టి ప్రగల్భములను కవిత్వమని వెలయించిరి. ఇందలి రచయితలలో కొద్దిపాటి చమత్కారము, కొద్ది పాటి ఊహాశక్తి గల రచయిత లిద్దరు ముగ్గురున్నారు. వీరందరును యువ రచ

యితలు గనుక భవిష్యత్తులో బాగుగా వ్రాయగలుగుటకు, పరమేశ్వరుడను గ్రహించినచో భయము లేదు.

"మనసులా పెనవైచు కొన్నవి
తనువులే ఇక ఒకటి కావలె" (పుట. 16)

"చూచినంతనె వలపు
తోచింది నెచ్చెలీ!
కలుసు కొన్నామంటె
ఛాయ వస్తుంది" (పుట. 23)

ఈ రకపుటూహలను యువ రచయితలు ఎంత త్వరగా ఊహించుట మానుకొన్న అంత మంచిది.

ఈ గ్రంథము మొత్తమునకు మకుటముగా కనిపించే రచన "మేమొక తరగతి వాళ్లం". దీనిని రచించినది పాలంకి అంబరీషుడుగారు. మధ్య తరగతి జనుల దైనందిన జీవిత రహస్యమిందు పరమ చమత్కారముతో చెప్పబడినది. విషయమెంత వాస్తవమో దానిని రచయిత అంత జాగ్రత్తగా మేలచుకొని చమత్కారమును కల్పించి ఈ మొత్తము సంపుటమునకు కవిత వాసన కొట్టించినాడు.

"మేమొక ప్రత్యేక తరగతివాళ్లం
మంచిగా మర్యాదగా కనబడేవాళ్లం ,
స్వల్ప అల్ప వేతనాలు, నిరుద్యోగం,
అధిక ధరలు, అనారోగ్యాలు,
పన్నులు, నిర్బంధ పొదుపులు భరించేవాళ్లం
హత్యాపరాధ పరిశోధక, శృంగార
హాలివుడ్ మార్కు అర్ధనగ్న సినిమా—ప్రేమకథను
హాయిగ చూసి—చదివి తక్కిన గొడవలు మరచేవాళ్లం
కాయ కష్టాన్ని, లేమిని
కానియిచ్చగించని వాళ్లం
కలిమినే సదా కాంక్షించే వాళ్లం
మంచికీ—చెడుకీ
కలిమికీ—లేమికీ
మధ్య తరగతి వాళ్లం
మేమొక ప్రత్యేక తరగతి వాళ్లం
మర్యాదగా మంచిగా కనబడే వాళ్లం (పుట. 42)

ఇక మిగిలిన రచనలన్నియు సామాన్య ధర్మము కలవియే. యువ రచయితలను ప్రోత్సహించుటలో **వారి** రచనలను ముద్రింపించుట యొకటి. ఆ పని చేసినందుకు అల్వాలు "యువజన కవితామండలి" వారిని అభినందింప వలయును. యువ రచయితలు తమ్ము తాము కవులుగా పెంచుకొనుటకు ప్రత్యేక బుద్ధితో కృషి చేయవలయును. రచయితలందరును క్రొత్తవారు గనుక, ఇప్పుడిప్పుడే రంగములోకి ప్రవేశించుచున్నారు గనుక తీసిక్కొన వలసిన జాగ్రత్తలు తీసికొనుట మంచిది.

పరమహంస భాగవతము

రచయిత: శిరోమణి శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి. ప్రతులకు: గ్రంథకర్త, 44. జీరా, సికింద్రాబాదు. వెల: రెండు రూపాయల యాభై పైసలు.

యోగీశ్వరేశ్వరులైన శ్రీ రామకృష్ణ పరమహంసుల లీలా మానుష విగ్రహము తోడి చిత్రకథా విశేషములను శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారు "పరమహంస భాగవత" మను పేర తెనుగున పద్యమయముగ సర్చి వెలువరించిరి. శ్రీ శాస్త్రిగారు వ్యాకరణాలంకార శాస్త్ర పండితులు. ఆ విషయమున వారి గ్రంథములకెంత ప్రచార ప్రామాణ్యములున్నవో వారికినీ అంత కీర్తి ప్రతిష్ఠలున్నవి. అట్టి శాస్త్ర గ్రంథములతో పాటు శ్రీ శాస్త్రిగారు సంస్కృతాంధ్రములయందు మరి కొన్ని గ్రంథములను గద్య రూపమునకు వెలయించిరి. శ్రీ శాస్త్రిగారిని కవులలోకంటే శాస్త్రవిద్వాంసులలో ముఖ్యముగా పరిగణింపవలయును. అదియే గౌరవము.

శ్రీ రామకృష్ణ పరమహంసుల వారి దివ్య చారిత్రమును శ్రీ చిరంతనానందస్వాముల వారు ప్రకటించిరి. దాని నాధారముగా తీసికొని తామీ 'భాగవతము' ను రచించినట్లు శ్రీ శాస్త్రిగారు పేర్కొనిరి. మరియు తదాధార గ్రంథమునుండి "కావ్యానుకూలములగు ఘట్టములను మాత్రమే గ్రహించి" దీనిని రచించినట్లును చెప్పుకొనిరి.

ఇట్టి ఇతివృత్తములను గ్రహించి కావ్యరచన చేయుట అంతసులభము కాదు. ఇందెంతసేపు చేసినను పద్యరచన విషయమున కవి తన శక్తిసామర్థ్యముల ప్రదర్శనముచేయుటకే వీలున్నది కాని రసభావనైరంతర్యమును పరిపోషించుటకు వీలు లేదు. ఇట్టి వానియందు రసభావములున్న వనగా నవి యద్భుత రూపములు. అద్భుత విషయ నిరూపణము సర్వ సహృదయ సంవాదము కాజాలదు. శృంగారము, వీరము, కరుణము— ఇవి మానవుల హృదయముల నావరించి యున్నంతగా మిగిలినవి లేవు. కనుకనే కావ్య నాటక వాఙ్మయమంతయు నాయా రసభావముల నాశ్రయించుకొని యున్నది. అలంకార శాస్త్ర నిరూపణమును తన్ముఖముగనే జరిగినది.

శ్రీ పరమహంసభాగవతము కావ్యము మాట అటుంచినచో పరమోదాత్తమైన భగవద్విషయ గ్రంథము. శ్రీ రామకృష్ణ పరమహంస భగవంతుడు. భగవద్భక్తుడు. ఎట్లయినను పరమపురుషుని మానుష తనువుతోడి చారిత్రము భాగవతమే యగును. శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారు ఒక భాగవత గ్రంథమునెంత యభినివేశముతోడను, ఎంత విస్పష్టముగను, ఎంత ప్రబోధాత్మకముగను, వ్రాయవలయునో అట్లు వ్రాసిరి. ఏతాద్గ్రచనకు శ్రీ శాస్త్రిగారికున్న ముఖ్యముగా పేర్కొనదగిన, యోగ్యతతోడి వెసులుబాటేమనగా తెలుగు పద్య నిర్మాణము విషయమున గల తెప్పయైన చేయి తిరిగిన తనము. ఇది మన ప్రాచీనకవులయందు కొట్టవచ్చి నట్లు కన్పించెడు లక్షణములలో నొకటి. "పల్లేరు పై బండి నడక' వలె పద్యమును నడింపిచు శక్తిని శ్రీ శాస్త్రి

గారు పెంపొందించుకొన్నంతగా నాధునికులలో చాలమంది పెంపొందించుకొనలేరు.

శ్రీ రామకృష్ణుని జన్మాదికము మొదలుకొని, భగవత్సమ్ముఖాభిముఖముగా సాగిన ఆయన లీలాజీవితయాత్రావిశేషములను వర్ణించుచు, ఆయన పరమపదము నందుకొన్నంతవరకుగల కథావిశేషములను శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారిందు సంధించిరి. శ్రీ రామకృష్ణుల పేరెత్తగనే వివేకానందులనివార్యముగ వత్తురు. ఈ గ్రంథమున వారి ప్రసక్తియు సముచితముగా తేబడి నిర్వహింపబడినది. మొత్తము మీద ఈ గ్రంథమున శ్రీ శాస్త్రిగారు సాధించిన 'సాఫీదనము' ఎట్టిదనగా శ్రీ అనంతకృష్ణ శర్మగారి మాటలలో "ఇందలి పద్యములను రెండవతూరి చదువుకోవలసిన సందర్భము ఎప్పుడో కాని కలుగ" నట్టిది. ఇందుకు గ్రంథమంతయు నుదాహరణమే.

కం. మరి కొన్నిటిఁ దీర్థంబులఁ
బరికించి యతండు తిరిగి వచ్చెను జగదీ
శ్వరియగు కాళీ దేవిని
దరిసింపఁగ శిశువు చనదు తల్లిని బోలెన్.


పుట. 81.

గీ. పయనముగ, నేగొ యద్దంకి వచ్చి యాగు,
నగముదన్యోగి వెనుకకుఁ జను నలందు
తొందరించిన కొండదియు దూర దూర
సొరుగు వాంఛితమైన లక్ష్యంపు సిద్ధి.

పుట. 114.

ఈ విధముగా నెన్ని పద్యములనైన నుదాహరింప వచ్చును. ఈ గ్రంథమున శ్రీ శాస్త్రిగారు వ్యవహార స్థలము లయిన కొన్ని శబ్దములనుపయోగించిరి. అమాంతముగ (115) బల్లగుద్దు కేటికి (97) నుయ్యి దియ్య (53) పై సొవండ్లపొడి (51) రమారమిగ (44) వడ్డించె (కొట్టినమాట) (33) సుత రాము (18) ఇత్యాదులు. 'రతి' యన్న శబ్దము తెనుగున కోరిక ఆసక్తి అన్న యర్థములందు కంటె మరొకయర్థమున రూఢముగా నున్నది. శ్రీ శాస్త్రిగారు "దానధర్మంబులందుఁ జంద్రమణిదేవి రతి పెరిగె" (3) "ఈశ్వరార్చనఁ గొనియె నెంతేని రతిని (12) ఇత్యాదిగా ప్రయోగించిరి. "సకల శాస్త్రంబులను ద్రావఁ జాలు దీక్ష" (13) "నేత్రములం గప్పి యెటో చరింతువు" (61) ఇత్యాదులింకొక విధముగా సంతరింపబడినచో నింకను బాగుండెడిది. "వారలో నరేంద్రుఁ డామ్యం, డంతె వివేకానదపూర్వకానందుడన్" (100) ఇట్టివి చమత్కారముల క్రింద లెక్క. వివేకానందులను గూర్చి వ్రాయుచో (పుట 101) "నిలసారము సంసారము" "మౌనినాథ! కుటుంబజంబాల పటలమగ్న" అను నన్నయగారి భారత పద్యము, పెద్దన్నగారి మనుచరిత్రలోని పద్యముల నుట్టంకించి "గీ. అని గృహస్థాశ్రమమ్ము దూషణమొనర్చు నయ్యెంయు పురాణ సూక్తుల నాలకించి" అని శ్రీ శాస్త్రిగారు వ్రాసిరి. భారతమును పురాణము క్రిందజమ కట్టుకొన్నను మనుచరిత్రనట్లు చేయుటకు వీలులేదు. ప్రాచీన సూక్తులని సర్దుకొన్నచో సరిపోవును. ఇట్టివాటికేమిగాని మొత్తము మీద శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారి కృషి ప్రశంసింపదగినది. ధారాళమైన పద్యరచన గలిగిన ఈ పరమహంస భాగవతము అక్షరాస్యులకెల్లను పఠనయోగ్యమై యున్నది. ఒక మహానుభావుని దివ్య చరిత్రనింత సరళ సుందరముగా తెనుగున సంతరించి పెట్టిన శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారు అభినందనీయులు.

—క్షేమేంద్ర.



Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1
Editor: S. Sambhu Prasad.